

'పారదర్శకతతో పథకాలు అమలు చేస్తే చిట్టచివరి వ్యక్తికి కూడా సంక్షేమం అందుతుంది'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 227

మంగళవారం 7-11-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



పుట్టిన బిడ్డ సురక్షితంగా, ఆరోగ్యంగా ఉండాలని తల్లితో పాటు ఆ కుటుంబం కూడా తపిస్తుంటుంది. అయితే, ఈ విషయంలో సరైన అవగాహన ఉండటం లేదనేది వైద్యుల మాట.

ఎందుకంటే, ఇప్పటికీ భారతదేశంలో నవజాత శిశు మరణాల రేటు ఆందోళనకరంగానే ఉంది. యూరప్‌లో 1990ల మొదట్లో శిశు మరణాల రేటును తగ్గించడానికి చర్యలు తీసుకోవడంలో, అవగాహన కల్పించేందుకు నవంబర్ 7ను శిశు రక్షణ దినోత్సవంగా జరుపుకోవాలని నిర్ణయించాయి. ఆ తర్వాత అమెరికా, మిగతా దేశాలు కూడా ఈరోజు శిశు రక్షణ దినోత్సవాన్ని జరుపుకుంటున్నాయి. నవజాత శిశువులలో రోగనిరోధక శక్తిని పెంపొందించడానికి, శిశు మరణాల రేటును తగ్గించడానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలో అవగాహన కల్పించడమే దీని ముఖ్య ఉద్దేశ్యం. ఈ విషయంలో నిపుణుల అభిప్రాయాలు తీసుకోవడం తప్పనిసరి.

శిశువు రక్షణ అందరి బాధ్యత

భవిష్యత్తును దృష్టిలో పెట్టుకోవాలి



ప్రెగ్నెన్సీ అని తెలియగానే కాబోయే తల్లితోపాటు, ఆ కటుంబం కూడా జాగ్రత్త పడాలి. మన దగ్గర రక్తహీనత సమస్య, పోషకాహార లేమి ఎక్కువ. దీనివల్ల బేబీ గ్రోత్ మందగిస్తుంది. గర్భిణుల్లో హైపో థైరాయిడ్ సమస్య ఎక్కువ చూస్తున్నాం. ఐరన్ లోపం, రసాయనాల ఆహారం తీసుకోవడం వల్ల ఇలా జరుగుతుంటుంది. తల్లి ఆరోగ్యం సరిగాలేకపోతే లోపల బేబీ శరీర, మానసిక ఎదుగుదల పైన ప్రభావం చూపుతుంది. బీపీ, షుగర్.. వంటి సమస్యలు ఉన్నప్పుడు వాటికి తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రెగ్నెన్సీ ప్లాన్ చేసుకునేవారు ముందునుంచే వైద్యులు చెప్పిన టైమ్‌కి వ్యాక్సిన్లు తీసుకోవడం వల్ల వైరల్ ఇన్ఫెక్షన్లను నివారించవచ్చు. తల్లి మానసిక ఆరోగ్యం కూడా బాగుండాలి. అందుకు, సైకలాజికల్ కౌన్సెలింగ్ కూడా తీసుకోవడం ముఖ్యం. వైద్యులు చెప్పిన సూచనలు పాటించాల్సి ఉంటుంది. లేకపోతే కుటుంబం అంతా భవిష్యత్తులో రాబోయే సమస్యలను కూడా ఎదుర్కోవాల్సి ఉంటుంది.

– **డాక్టర్ శిరీషా రెడ్డి,** గైనకాలజిస్ట్, తార్నాక, హైదరాబాద్

ప్రమాదాలను ముందే పసిగట్టాలి



నెలలు నిండకుండా పుట్టడం, బరువు తక్కువుండి పుట్టడం, ఇన్ఫెక్షన్స్, పోషకాహార లోపం వల్ల శిశు మరణాలు ఎక్కువగా సంభవిస్తుంటాయి. ఏడాదిలోపు పిల్లలను నవజాత శిశువులు అంటారు. ఈ సమయంలో సులువుగా ఇన్ఫెక్షన్స్ సోకుతుంటాయి. అందుకే, వీరిని చాలా జాగ్రత్తగా చూసుకోవడం అవసరం. ఏడాదిలోపు వచ్చే ఆరోగ్య సమస్యలను నివారించగలిగితే ఆ తర్వాత వచ్చే సమస్యలను సులువుగా అధిగమించవచ్చు. మొదటి ఆరు నెలలు తల్లిపాలు మాత్రమే పట్టడం అవసరం, ఆరోగ్యం కూడా. ఆ తర్వాత వారికి ఇచ్చే పోషకాహారం చాలా ముఖ్యం. దీంతోపాటు వ్యాక్సినేషన్ చేయించడం ముఖ్యం. ఎందుకంటే, నిమోనియా, డయేరియా వల్ల మరణాలు ఎక్కువ. అందుకే, ప్రభుత్వం కూడా డయేరియా, న్యూమోనియా.. వ్యాక్సినేషన్ జాబితాలో చేర్చింది. పిల్లల వైద్యనిపుణుల పర్యవేక్షణ చాలా అవసరం. కొన్ని గ్రామీణ ప్రాంతాల వారికి ఈ సౌకర్యం అందుబాటులో లేకపోవచ్చు. కానీ, రెగ్యులర్ హెల్త్ చెకప్ అనేది ముఖ్యం అని తెలుసుకోవాలి. ఇక నవజాత శిశువులకు దెబ్బలు తగిలే అవకాశం కూడా ఉంది. మంచంపై నుంచి కింద పడటం వంటివి. చిన్న దెబ్బలు కూడా పెద్దవి కావచ్చు. మదర్ పోస్ట్ ప్యాటర్న్ డిప్రెషన్‌లో ఉన్నప్పుడు బిడ్డను చూసుకునేవారుండరు. ఇలాంటప్పుడు కూడా శిశువు సంరక్షణ ప్రమాదంలో పడుతుంది. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకుని కుటుంబం జాగ్రత్త వహించాలి.

– **ప్రియాంకరెడ్డి,** పిడియాట్రిషియన్, మాదాపూర్, హైదరాబాద్

ఒకరి ద్వారా మరొకరికి సూచనలు



మేం గర్భిణులపై ఎక్కువ ఫోకస్ పెడుతుంటాం. ఎందుకంటే, వారి ఆరోగ్యం బాగుంటేనే పుట్టబోయే బిడ్డ బాగుంటుంది. ఆరోగ్యం, పౌష్టికాహారంతో పాటు ఇంటి నుంచి ఆసుపత్రికి వెళ్లేవరకు ఎలా చూసుకోవాలో ఆమెకే కాదు, ఇంటిల్లిపాదికీ కౌన్సెలింగ్ ఇస్తాం. ఎంత చెప్పినా వినిపించుకోని వారు కొందరుంటారు. అయినా వారిని వదలకుండా తల్లి అయిన వారితో కౌన్సెలింగ్ ఇప్పిస్తాం. చార్ట్ ప్రకారం వాళ్లు తీసుకోవాల్సిన పోషకాహారం, మందులు కూడా అంగన్‌వాడీ నుంచి ఇస్తుంటాం. చంటిపిల్లల విషయంలో మేం తగు జాగ్రత్తలు చెప్పడంతో పాటు, ఏ సమయానికి వ్యాక్సిన్లు వేయించాలి, ఎలా చూసుకోవాలి అనే విషయాల పైన తల్లులకు ఒకరి ద్వారా మరొకరు సూచనలు చేసుకునేలా కౌన్సెలింగ్ చేస్తుంటాం. దీనివల్ల నవజాత శిశు మరణాల రేటు తగ్గడమే కాకుండా శిశువులు ఆరోగ్యంగా పెరిగేందుకు దోహదం చేస్తుంది.

– **వెంకటరమణ,** అంగన్‌వాడీ టీచర్, ఖాసింపేట, సూర్యాపేట జిల్లా

బ్యూటి ప్స్



● బీట్ రూట్ తొక్కలు, కమలా తొక్కలను నీడలో ఆరబెట్టాలి. పెళపెళ విరిగేలా తొక్కలు ఎండిన తరువాత మెత్తగా పొడిచేయాలి. రెండు టేబుల్ స్పూన్ల ఈ పొడిలో రోజ్‌వాటర్ వేసి పేస్టులా కలపాలి. ఈ పేస్టుని ముఖానికి రాసి ఐదు నిమిషాలపాటు మర్దన చేయాలి. తరువాత పదిహేను నిమిషాలు ఆరనిచ్చి, చల్లటి నీటితో కడిగేయాలి. వారానికి రెండు మూడుసార్లు ఈ ప్యాక్ వేసుకోవడం వల్ల ముఖం కాంతిమంతంగా మెరుస్తుంది. ఈప్యాక్‌తో వచ్చే గ్లో ఎక్కువ రోజులు ముఖాన్ని అందంగా ఉంచుతుంది.

సక్సెస్ స్టోరీ

వాడేసిన ప్లాస్టిక్‌తో వండర్స్

మనింట్లో చాలా ప్లాస్టిక్ కవర్స్ పోగవుతాయి. వాటిని చెత్తలో పడేస్తాము. అవి ఎప్పటికీ మట్టిలో కలవక అలాగే కాలుష్యాన్ని కలిగిస్తూ ఉంటాయి. కాని ఈ ప్లాస్టిక్ కవర్లనే రాజిబెన్ దారాలుగా చేసి బ్యాగులు అల్లుతుంది. బుట్టలు చేస్తుంది. పర్సులు చేస్తుంది. డోర్‌మ్యాట్లు సరేసరి. అందుకే ఆమెకు చాలా గుర్తింపు వచ్చింది. ఆమె వల్ల ఎందరికో ఉపాధి కలుగుతోంది. కొత్త ఆలోచన చేసిన వారే విజేతలు.



● రీసైకిల్ ప్లాస్టిక్ బ్యాగ్‌తో రాజీ బెన్

గుజరాత్ కచ్ ప్రాంతంలోని కోటి అనే చిన్న పల్లెలో ఏమీ చదువుకోని అమ్మాయి – రాజీ బెన్ పెరిగి పెద్దదయ్యి లండన్ వెళ్లి అక్కడ పెద్దవాళ్లతో తాను చేసిన కృషిని వివరించింది. ఆమె తన జీవితంలో ఇంత పెద్ద ప్రయాణం చేసి, గుర్తింపు పొందేలా చేసింది ఏమిటో తెలుసా?

వృథా ప్లాసిక్. వాడేసిన ప్లాస్టిక్

రోడ్ల మీద, ఇళ్ల డస్ట్‌బిన్‌లలో, చెత్త కుప్పల మీద అందరూ ప్లాస్టిక్ కవర్లను, రేపర్లను పారేస్తారు. వాటిని ఏం చేయాలో ఎవరికీ ఏమీ తోచదు. అవి తొందరగా మట్టిలో కలిసిపోవు. కాని రాజిబెన్ వాటిని ఉపయోగంలోకి తెచ్చింది. వాటిని సేకరించి, కట్ చేసి పీలికలుగా మార్చి, కలిపి నేసి అందమైన వస్తువులు తయారు చేసింది. బ్యాగులు, సంచులు, పర్సులు... వాటి మన్నిక కూడా ఎక్కువ.

ఎలా చేస్తారు?

వాడేసిన ప్లాస్టిక్ క్యారీబ్యాగ్స్‌ను సేకరించి సర్ఫ్ నీళ్లతో కడుగుతారు. ఆ తర్వాత వాటిలోని మలినాలు పోవడానికి వేడి నీళ్లలో నానబెడతారు. తర్వాత రెండు రోజులు ఎండలో ఆరబెడతారు. ప్లాస్టిక్ మందంగా ఉంటే అర ఇంచ్ వెడల్పు రిబ్బన్‌లుగా; పలుచగా ఉంటే ముప్పావు ఇంచ్ రిబ్బన్‌లుగా కట్ చేస్తారు. ఈ ముక్కలను నాణ్యమైన జిగురుతో అంటించి పొడవైన ఉండగా మారుస్తారు. అంటే మగ్గం మీద నేయడానికి దారం బదులు ఈ ప్లాస్టిక్ ఉండనే ఉపయోగిస్తారు. ఈ ప్లాస్టిక్ దారాలతో నేస్తే దళసరి వస్త్రం తయారవుతుంది. దానిని కట్ చేసుకుని రకరకాల వస్తువులుగా చేతి నైపుణ్యంతో తీర్చిదిద్దుతారు. హ్యాండ్ బ్యాగ్‌లు, కూరగాయల బ్యాగ్‌లు, ఫోన్ బాక్సులు, పర్సులు.. ఇవన్నీ చాలా అందంగా ఉంటాయి. మన్నికతో ఉంటాయి.

ఎలా వచ్చింది ఐడియా?

రాజి బెన్ నేత కుటుంబంలో పుట్టింది. అయితే తండ్రికి నేత మీద విసుగుపుట్టి వ్యవసాయం చేసేవాడు. అదీగాక ఆడపిల్లలు మగ్గం మీద కూచోవడం నిషిద్ధం. కాని రాజి బెన్‌కి మగ్గం మీద పని చేయాలని 12 ఏళ్ల వయసు నుంచే ఉండేది. అందుకని మేనమామ కొడుకు దగ్గర





● పాలిథీన్ కవర్లు శుద్ధి చేస్తూ...

రహస్యంగా మగ్గం పని నేర్చుకుంది. 14 ఏళ్లు వచ్చేసరికి మగ్గం పనిలో ఎక్స్‌పర్ట్‌గా మారింది. అయితే ఆమెకు పుట్టింటిలో కాని మెట్టినింటిలో గాని మగ్గం మీద కూచునే అవకాశమే రాలేదు. ఏడేళ్ల కాపురం చేశాక భర్త హటాత్తుగా మరణించడంతో రాజి బెన్ ఇంటి నుంచి బయటకు అడుగు పెట్టాల్సి వచ్చింది ముగ్గురు పిల్లల కోసం. కచ్‌లో ఒక ఎన్.జి.ఓ ఉంటే అక్కడ మగ్గం పని ఖాళీ ఉందని తెలిస్తే వెళ్లి చేరింది. అందమైన వస్త్రాలు అల్లి వాటిని ఆకర్షణీయమైన వస్తువులుగా తీర్చిదిద్దే స్థానిక కళలో ఆమె ప్రావీణ్యం చూసి అందరూ ఆశ్చర్యపోయేవారు. ఎన్.జి.ఓ వారు ఆమె చేసిన ఉత్పత్తులతో ఎగ్జిబిషన్ సేల్ నిర్వహించేవారు. 2012లో జరిగిన ఎగ్జిబిషన్‌లో ఒక విదేశీ డిజైనర్ ప్లాస్టిక్‌ను రీసైకిల్ చేసి తయారు చేసిన బ్యాగ్‌ను చూపించి 'ఇలాంటిది తయారు చేయగలవా?' అని అడిగాడు. అది ఎలా తయారయ్యిందో అర్థమయ్యాక రాజి బెన్‌కు నాలుగు రోజులు కూడా పట్టలేదు అలాంటి బ్యాగులు తయారు చేయడానికి. ఆ డిజైనర్ వాటిని చూసి సంతృప్తిగా కొనుక్కుని వెళ్లాడు. మరికొన్ని బ్యాగులు జనం క్షణాల్లో ఎగరేసుకుపోయారు. అప్పటి నుంచి వేస్ట్ ప్లాస్టిక్ నుంచి రాజి బెన్ హస్తకళా ఉత్పత్తులను తయారు చేస్తోంది.

స్వచ్ఛ్ సుజల్ శక్తి సమ్మాన్

రాజి బెన్ ఖ్యాతి ఎంత దూరం వెళ్లిందంటే అమృత మహోత్సవం సందర్భంగా 'స్వచ్ఛ్ సుజల్ శక్తి సమ్మాన్' పురస్కారం ఆమెకు ప్రకటించారు. అలాగే యూరప్ దేశాల నుంచి ఆమె ఉత్పత్తులకు ఆర్డర్లు వస్తున్నాయి. 'ప్లాస్టిక్ పీడ విరగడ అవ్వాలంటే దానిని ఎన్ని విధాలుగా రీసైకిల్ చేయవచ్చో అన్ని విధాలుగా చేయాలి. రాజి బెన్ కొత్త తరాన్ని తనతో కలుపుకుంటే ఆమె ఉత్పత్తులు చాలా దూరం వెళ్లడమే కాక పర్యావరణానికి మేలు కూడా జరుగుతుంది' అని విదేశీ ఎంట్రప్రెన్యూర్లు అంటున్నారు. రాజి బెన్ ప్రస్తుతం 90 మంది మహిళలకు ఉపాధి కల్పిస్తోంది. 2018 నుంచి సొంత సంస్థ పెట్టుకోవడంతో దాని టర్నోవర్ ఇప్పుడు సంవత్సరానికి 10 లక్షలు దాటిపోయింది.

ఆమె గెలుపు గాథ మరింత విస్తరించాలని కావాలని కోరుకుందాం.

సాగుబడి

విశాఖ కార్తె: నవంబర్ 7 నుంచి

● ఎయిరోపోనిక్స్ పద్ధతిలో కుంకుమ పువ్వు సాగు చేస్తున్న ఉద్యోగిని శైలజారెడ్డి
● ఇంట్లోని ఒక గదిలో 10 డిగ్రీల ఉష్ణోగ్రత, గాలిలో తేమ 80% ఉండేలా ప్రత్యేక ఏర్పాట్లు

ఇంటిపంటగా కుంకుమ పువ్వు!

కశ్మీర్‌లోని చల్లని ప్రదేశాల్లోనే సహజంగా ఆరుబయట పొలాల్లో కుంకుమ పువ్వు పండుతుంది. అయితే, కృత్రిమ శీతల వాతావరణం సృష్టించిన గదుల్లో కూడా ఈ పంటను పండిస్తున్నారు. నీలిరంగులో ఉండే పూలకు మధ్యలో ఈ ఎర్రటి దారాల్లాంటి కేసరాలు ఉంటాయి. వాటిని సేకరించి జాగ్రత్తగా నీడన ఎండబెట్టి భద్రపరిచి వాడుకోవచ్చు లేదా విక్రయించవచ్చు. గుంటూరు జిల్లా తాడేపల్లిలో ఉద్యోగం చేస్తున్న కె. శైలజారెడ్డి తన ఇంట్లోనే ఒక గదిలో కుంకుమ పువ్వును ఇంటిపంటగా పండిస్తున్నారు.

అత్యంత ఖరీదైన సుగంధ ద్రవ్యం కుంకుమ పువ్వు. రోగనిరోధక శక్తిని, ఆరోగ్యాన్ని అందించే యాంటీ ఆక్సిడెంట్లు ఇందులో పుష్కలంగా ఉన్నాయి. గర్భవతులు కుంకుమ పువ్వు కలిపిన పాలు తాగుతుంటారు. స్వీట్లు, ఖీర్, బిర్యానీ, ఫ్రూట్ సలాడ్లలో దీన్ని వాడుతుంటారు. శ్రీఅన్నమయ్య జిల్లా మదనపల్లిలో శ్రీనిధి అనే యువతి కుంకుమ పువ్వు సాగు చేస్తున్న వీడియోలు యూట్యూబ్‌లో చూసి స్ఫూర్తి పొందిన శైలజారెడ్డి తన ఇంట్లోనే కుంకుమ పువ్వు సాగు చేపట్టారు. ఇండియా మార్ట్ ద్వారా కుంకుమ పువ్వు విత్తనాలను కశ్మీర్ నుంచి తెప్పించారు. ప్రస్తుతం అక్కడ రైతులకు, విత్తనాలను సేకరించి అమ్మే వారికి మధ్య వివాదం రావడంతో ప్రభుత్వ అనుమతితోనే విత్తనాలు కొనుగోలు చేయాల్సి వస్తోందని శైలజారెడ్డి తెలిపారు.

రూ. 4 లక్షల పెట్టుబడి

శైలజారెడ్డి తన మూడు బెడ్ రూమ్‌లతో కూడిన ఇంట్లోనే.. 12×12 అడుగుల విస్తీర్ణం ఉన్న ఒక గదిలో ఇనుప ర్యాక్‌లలో ఫైబర్ టబ్‌లు, కృత్రిమ వెల్తురు సదుపాయాలను సమకూర్చి కుంకుమ పువ్వు పండిస్తున్నారు. విత్తనాలకు, ఈ ఏర్పాట్లకు రూ. 4 లక్షల వరకూ పెట్టుబడి పెట్టారు. చల్లని వాతావరణం కుంకుమ పువ్వు సాగుకు అనువైనది. మనం గదిలో కృత్రిమ శీతల వాతావరణాన్ని కల్పించి నిశ్చింతగా సాగు చేయవచ్చని శైలజారెడ్డి 'సాక్షి'కి తెలిపారు. గదిలో రాత్రిపూట ఉష్ణోగ్రత 10 డిగ్రీల సెల్సియస్ ఉండాలి. గాలిలో తేమ శాతం 80% ఉండాలి. ఇందుకోసం గదిలో చిల్లింగ్ యంత్రాన్ని, హ్యూమిడిఫయర్‌ను ఏర్పాటు చేశారు. కృత్రిమ కాంతితో కూడిన తగుమాత్రపు వేడి కోసం గదిలో 20 వరకూ గ్రోలైట్లు ఏర్పాటు చేశారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ ఈ లైట్లు వెలిగిస్తే సరిపోతుంది. పూత దశలో తప్ప ఇతర కాలాల్లో గది పగటి ఉష్ణోగ్రత 16–17 డిగ్రీల వరకు ఉండొచ్చు.

ఎయిరోపోనిక్స్ పద్ధతిలో కుంకుమ పువ్వును సాగు చేస్తున్న శైలజారెడ్డి ఇటీవలే తొలి పంట తీశారు. ఇప్పటి వరకూ 1441 పువ్వులు పూస్తే అందులో నుంచి 10 గ్రాముల కుంకుమ పువ్వు కేసరాల దిగుబడి వచ్చింది. గ్రాము రూ. ఏడు వందల చొప్పున ఆరు గ్రాములను అమ్మారు. మిగిలిన కుంకుమ పువ్వును తనతోపాటు పనిచేసే వారికి కొంచెం కొంచెం బహూకరించాలని నిర్ణయించుకున్నట్లు శైలజారెడ్డి చెప్పారు. తాను గతంలో ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసి కొనుగోలు చేసిన కుంకుమపువ్వును ఇప్పుడు తాను పండించిన కుంకుమ పువ్వుతో పోల్చి పరిశీలించినప్పుడు, అది కల్తీది అని స్పష్టంగా అర్థమైందన్నారు.



● కుంకుమ పూల సాగు గదిలో శైలజారెడ్డి



● గ్రోలైట్ల వెలుగులో కుంకుమ పూల సాగు

ఇంటి పంట



● వాడకానికి సిద్ధమైన కుంకుమ పువ్వు

ఎయిరోపోనిక్స్..?

కుంకుమ పువ్వు విత్తన దుంపలను ట్రేలలో పోసిన మట్టి మిశ్రమం (మట్టి 50%, ఇసుక 40%, వర్మీ కంపోస్టు పది మట్టి%)లో నాటుకొని పెంచుకోవచ్చు. మట్టి లేకుండా ఎయిరోపోనిక్స్ పద్ధతిలో కూడా సాగు చేయొచ్చు. అంటే.. విత్తన దుంపలను ట్రేలో పక్క పక్కనే పెడితే సరిపోతుంది. మట్టిలో గాని, నీటిలో గాని వాటిని పెట్టాల్సిన పని లేదు. గాలిలో తేమ 80%తో పాటు చల్లని వాతావరణం ఉంటుంది కాబట్టి ఆ తేమతోనే మొక్క పెరిగి, 30–45 రోజుల్లో పూత వస్తుంది. వేరే పోషణ ఏమీ అవసరం లేదు. 7 గ్రాముల కన్నా ఎక్కువ బరువు ఉన్న విత్తన దుంపలు వాడితేనే ఆ సీజన్‌లో పూలు వస్తాయి. ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే.. ఏరోపోనిక్స్ పద్ధతిలో పెంచే దుంపలను కూడా పూత కాలం పూర్తయిన తర్వాత మట్టి మిశ్రమంలో విధిగా నాటుకోవాల్సిందే. నవంబర్– డిసెంబర్‌లో మట్టి మిశ్రమంలో నాటుకోవాలని శైలజారెడ్డి వివరించారు. వారం/పది రోజులకోసారి నీటిని కొంచెం పిచికారీ చేస్తే సరిపోతుంది. నానో యూరియా లేదా ఎన్‌పికెను నెలకోసారి పిచికారీ చేస్తే చాలు. ప్రతి దుంపకు అనుబంధంగా మూడు, నాలుగు దుంపలు పుట్టుకొస్తాయి. ఏప్రిల్ నెల నుంచి జూన్ వరకు దుంపలు నిద్రావస్థలో ఉంటాయి. ఆ దశలో వాటికి ఆహారం, కాంతి, చల్లని వాతావరణం, గాలిలో 80% తేమ అవసరం లేదు. కుంకుమ పువ్వు దుంపలను జూలైలో మట్టిలో నుంచి తీసి 7 గ్రాములు అంతకన్నా ఎక్కువ బరువు ఉన్న పిల్ల దుంపలను వేరు చేసి, తిరిగి మట్టి మిశ్రమంలో నాటుకొని కుంకుమ పువ్వు సాగు చేయవచ్చు. లేదా విత్తన దుంపలను ట్రేలలో పెట్టుకొని ఏరోపోనిక్స్ పద్ధతిలో సాగు చేసుకోవచ్చు. అప్పటి నుంచి మళ్లీ నిద్రావస్థ వరకు నిరంతరాయంగా 8 నెలలు శీతల వాతావరణం ఉండేలా చూసుకుంటూ సాగు చేయాల్సి ఉంటుందని శైలజారెడ్డి వివరించారు.

– **దాళా రమేష్ బాబు,** సాక్షి, బ్యూరో ఇన్‌చార్జ్, గుంటూరు

మొదటి ఏడాదే పెట్టుబడి!

ఇంట్లోనే ఒక గదిలో కుంకుమ పువ్వు సాగు చేయడానికి తగిన వ్యవస్థను ఏర్పాటు చేసుకోవడానికి మొదటి సంవత్సరమే పెట్టుబడి అవసరమవుతుంది. రెండో సంవత్సరం నుంచి విత్తన ఖర్చు ఉండదు. నాలుగైదు సంవత్సరాల్లో పెట్టుబడి తిరిగి రావడంతో పాటు ఆదాయం కూడా వస్తుంది. పెద్ద మొత్తంలో సాగు చేస్తే ఉపయోగం ఉంటుంది. కుంకుమ పువ్వు సాగును ఇంటిపంటగా ప్రోత్సహిస్తే మంచి ఫలితాలు రావడం ఖాయం. నాణ్యమైన కుంకుమ పువ్వును మనమే పండించుకోవచ్చు. ఈ అనుభవాలను ఇతరులకు పంచాలని 'శాన్వి శాఫ్రన్ ఫార్మ్స్' పేరిట యూట్యూబ్ ఛానల్‌ను ఏర్పాటు చేశాను.

– కె. శైలజారెడ్డి, కుంకుమ పువ్వు సాగుదారు, తాడేపల్లి, గుంటూరు జిల్లా. మొబైల్: 94912 33492. (సా. 7 గం. తర్వాత ఫోన్ చేయొచ్చు) www.youtube.com/@ShanviSaffronFarms

ఒకేసారి 3 పంటలు..!



● డ్రమ్‌సీడర్‌తో విత్తనాలు వేస్తున్న ట్రాక్టర్

బహుళ పంటలను ఒకేసారి విత్తుకునేందుకు అన్ని విధాలుగా రైతుకు ఉపయోగకరమైన వినూత్న పరికరం (డ్రమ్‌సీడర్)ను రూపొందించిన పార్వతీపురం మన్యం జిల్లా పార్వతీపురానికి చెందిన గ్రామీణ ఆవిష్కర్త దమరసింగి బాబూరావుకు భారత ప్రభుత్వం పేటెంట్ మంజూరు చేసింది. తొలుత ఇనుముతో తయారు చేసిన ఈ పరికరంపై పేటెంట్‌కు 2015లోనే ఆయన దరఖాస్తు చేయగా, ఇటీవలే పేటెంట్ సర్టిఫికెట్ అందింది. తదనంతరం మరింత తేలిగ్గా ఉండాలన్న లక్ష్యంతో స్టెయిన్‌లెస్ స్టీల్‌తో తక్కువ బరువుతో ఉండేలా, ఎక్కువ కాలం మన్నిక ఉండేలా బాబూరావు దీన్ని మెరుగుపరిచారు. 2 ఎం.ఎం. సైజు నుంచి 16 ఎం.ఎం. సైజు వరకు ఎంత సైజు ఉన్న ఏ పంట విత్తనాలనైనా స్వయంగా రైతే స్వల్ప మార్పులు చేసుకోవటానికి, వరుసల మధ్య దూరాన్ని కూడా అనుకూలంగా సులువుగా మార్చుకోవటానికి ఈ డ్రమ్‌సీడర్ అనువుగా ఉంది. పత్తి, పెసలు, కందులు వంటి మూడు పంటలను ఒకేసారి విత్తుకోవడానికి ఈ ఆధునిక డ్రమ్‌సీడర్ ఉపయోగపడుతుండటం విశేషం. అన్ని రకాల చిరుధాన్యాలు, నువ్వులు, వేరుశనగ, బఠాణీ, గోధుమ, వరి, పెసర, మినుము, పుల్ల శనగ, పెద్ద బఠాణీ, పెద్ద వేరుశనగలను సైతం దీనితో విత్తుకోవచ్చు. దీనికి ఏడు సీడ్ బాక్సులు అమర్చారు.



● బాబూరావు







రైతులే మార్పులు చేసుకోవచ్చు

2.5 అడుగులు (30 అంగుళాల) ఎత్తున ఇరువైపులా చక్రాలను అమర్చటం, 6 అంగుళాల వెడల్పు గల చక్రాలను అమర్చటంతో దీన్ని ఉపయోగించటం సులువు. పెద్ద చక్రాలను ఏర్పాటు చేయటం, పంటను బట్టి విత్తనం సైజును బట్టి, వరుసల మధ్య దూరాన్ని బట్టి మార్పులు చేసుకోవడానికి చక్రాలను ఇప్పి మార్పులు చేయాల్సిన అవసరం లేకుండా రెండు స్క్రూలు ఇప్పితే చాలు అవసరమైన మార్పులు మెకానిక్ అవసరం లేకుండా రైతే స్వయంగా చేసుకోవచ్చని, అందుకే ఈ డ్రమ్‌సీడర్ తక్కువ కాలంలోనే రైతుల ఆదరణ పొందిందని బాబూరావు 'సాక్షి'తో చెప్పారు.

నాలుగు వేరియంట్లు

ఎకనామిక్ మల్టీపర్పస్ అగ్రికల్చర్ ఇంప్లిమెంట్ అని పిలుస్తున్నారు. ఇందులో నాలుగు వేరియంట్లను బాబూరావు రైతులకు అందుబాటులోకి తెచ్చారు. పొలంలో యంత్రాలు అవసరం లేకుండా ఇద్దరు మనుషులు సులువుగా లాగుతూ విత్తనాలు వేసుకునే విధంగా, జోడెడ్లకు కట్టి లాక్కెళ్లేలా, ట్రాక్టర్‌కు వెనుక బిగించే విధంగా, 6.5 హెచ్‌పి హోండా ఇంజన్‌తో అనుసంధానం చేసి ఒక మనిషి నడిపే విధంగా స్టెయిన్‌లెస్ స్టీల్‌తో డ్రమ్‌సీడర్లను ఆయన రూపొందించారు. వేరియంట్‌ను బట్టి దాని ధర, బరువు ఆధారపడి ఉంటుంది. మనుషులు లక్కెళ్లే దాని బరువు 25 కిలోలు ఉంటుంది. ట్రాక్టర్‌కు అనుసంధానం చేసేది 80 కిలోల బరువు ఉంటుంది. 'ఆంగ్రూ' పోషణ్ ఇంక్యుబేషన్ సెంటర్ బాబూరావుకు రూ. 4 లక్షల గ్రాంటు ఇవ్వటం విశేషం. పల్లెసృజన తోడ్పాటుతో రాష్ట్రపతి భవన్‌లోని ఇన్నోవేషన్ ఫెస్టివల్‌తో పాటు అనేక మేళాల్లో బాబూరావు (94409 40025) ఈ డ్రమ్‌సీడర్‌ను ప్రదర్శించి ప్రశంసలు అందుకున్నారు.

ప్రకృతి సేద్యంపై ఎన్‌ఐపిహెచ్‌ఎం సర్టిఫికెట్ కోర్సు

ప్రకృతి/సేంద్రియ వ్యవసాయం చేపట్టదలచిన/ చేపట్టిన కనీసం ఇంటర్ చదివిన యువతకు శిక్షణ ఇచ్చేందుకు కేంద్ర వ్యవసాయ, రైతుల సంక్షేమ శాఖకు అనుబంధ సంస్థ, హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని జాతీయ మొక్కల ఆరోగ్య యాజమాన్య సంస్థ (ఎన్‌ఐపిహెచ్‌ఎం) సర్టిఫికెట్ కోర్సు నిర్వహించనుంది. 'ప్రకృతి/సేంద్రియ వ్యవసాయంలో మొక్కల ఆరోగ్య యాజమాన్యం' పేరుతో వచ్చే డిసెంబర్ నుంచి 3 నెలల సర్టిఫికెట్ కోర్సులో శిక్షణ ఇస్తారు. కోర్సు కాలపరిమితి డిసెంబర్ 6 నుంచి 2014 మార్చి 13 వరకు. యువతీ యువకులకు శిక్షణ ఇవ్వటం ద్వారా గ్రామస్థాయిలో మాస్టర్ ట్రైనర్లను తయారు చేయటం ఈ సర్టిఫికెట్ కోర్సు లక్ష్యం. తరగతి గదిలో పాఠాలతో పాటు పొలంలో పని చేస్తూ నేర్చుకునే పద్ధతులు కూడా ఈ కోర్సులో భాగం చేశారు. ఇంటర్ పూర్తి చేసిన లేదా వ్యవసాయ పాలిటెక్నిక్ పూర్తి చేసిన 18 ఏళ్లు నిండిన గ్రామీణ యువతకు ఈ కోర్సు అభ్యర్థుల ఎంపికలో ప్రాధాన్యం ఇస్తారు. కోర్సు ఫీజు రూ. 7,500. ఎన్‌ఐపిహెచ్‌ఎంలో ఉండి శిక్షణ పొందే రోజుల్లో ఉచిత వసతి కల్పిస్తారు. భోజన ఖర్చులు అభ్యర్థులే భరించాల్సి ఉంటుంది. కోర్సు డైరెక్టర్‌గా డా. ఒ.పి. శర్మ వ్యవహరిస్తున్నారు. ఇతర వివరాలకు కోర్సు కోఆర్డినేటర్ డా. కె. దామోదరాచారి (95426 38020)ని సంప్రదించవచ్చు. నవంబర్ 20లోగా ఫీజు చెల్లించి, దరఖాస్తులు పంపాలి.

డిసెంబర్ 22 నుంచి ఏపీ పుష్ప ప్రదర్శన

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి నాలుగో పుష్ప ప్రదర్శన, అమ్మకం కార్యక్రమాన్ని డిసెంబర్ 22 నుంచి 27 వరకు జరగనుంది. విజయవాడలోని (పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్డు) సిద్ధార్థ హోటల్ మేనేజ్‌మెంట్ కాలేజి గ్రౌండ్‌లో జరుగుతుంది. వివరాలకు.. 93935 77018.


'సంపద పంపిణీ సక్రమంగా జరిగితే
అట్టడుగు వర్గాలకు చేరుతుంది.
అప్పుడే వారి కొనుగోలు శక్తి పెరుగుతుంది'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 227

మంగళవారం 7-11-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ఇజ్రాయెల్ గుప్పిట్లో గాజా

రెండు ముక్కలుగా గాజా స్ట్రిప్. పదివేలు దాటిన మృతుల సంఖ్య -6లో



నేడు ఛత్తీస్‌గఢ్‌లో తొలి దశ

20 అసెంబ్లీ స్థానాలకు పోలింగ్. 60 వేల సిబ్బందితో భారీ బందోబస్తు -8లో

ఆ గోస మళ్లీ కావాల్నా?

50 ఏళ్ల తెలంగాణ బాధలకు కాంగ్రెస్ పార్టీయే కారణం

దేవరకద్ర, గద్వాల, మక్తల్, నారాయణపేట సభల్లో సీఎం కేసీఆర్



నారాయణపేట సభలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్

నాడు తెలంగాణను ఏపీలో కలిపి ప్రాజెక్టులను రద్దు చేసింది

- నదులు పారే పాలమూరుకు గంజి కేంద్రాల గతి పట్టించింది
- 2004లోనే తెలంగాణ ఇస్తామని చెప్పి మోసం చేసింది
- ఉద్యమం ఎగిసి, వందల మంది పిల్లలు చనిపోతే తప్పదని ప్రత్యేక రాష్ట్రం ఇచ్చింది
- పచ్చబడ్డ రాష్ట్రాన్ని మరోసారి ఖతం పట్టించేందుకు కుట్ర
- నేను చెప్పేవన్నీ నిజం కాకపోతే మమ్మల్ని ఓడించండి
- అభ్యర్థులతోపాటు వారి వెనుక ఉన్న పార్టీలు, వాటి చరిత్రను చూడాలని పిలుపు.... హెలికాప్టర్‌లో సాంకేతిక సమస్యతో ఆలస్యంగా కార్యక్రమాలు
- నారాయణపేట నుంచి రోడ్డు మార్గాన హైదరాబాద్‌కు..

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: తెలంగాణ ప్రజల 50 ఏళ్ల గోసకు కారణం కాంగ్రెస్ పార్టీయేనని.. సమైక్య పాలకులు ఉన్న తెలంగాణను ఊడగొట్టి ఆంధ్రప్రదేశ్‌లో కలిపి మన ప్రాజెక్టులను రద్దు చేశారని బీఆర్‌ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు మండిపడ్డారు. నదులు పారే పాలమూరు జిల్లాకు గంజి కేంద్రాల గతి పట్టించినది కాంగ్రెస్ పార్టీయేనని విమర్శించారు. 2004లో తెలంగాణ ఇస్తామని చెప్పి కాంగ్రెస్ మోసం చేసిందని.. మొండి పట్టుదలతో 14 ఏళ్ల పోరాటాలు చేస్తే,

మిగతా 2వ పేజీలో ▶

16 మందితో కాంగ్రెస్ మూడో జాబితా

- కామారెడ్డి నుంచి రేవంత్‌రెడ్డి, చెన్నూరు నుంచి వివేక్
- షబ్బీర్ అలీ, సురేశ్ షెట్కార్, ఏనుగు రవీందర్‌రెడ్డి, నీలం మధుకూ చాన్స్
- రెండు స్థానాల్లో అభ్యర్థులను మార్చిన అధిష్టానం

13లో

కొత్తగూడెం సీటు.. రెండు ఎమ్మెల్సీలు

- కాంగ్రెస్, సీపీఐ మధ్య పొత్తు ఖరారు
- టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ప్రకటన
- సీపీఐ నేతలతో మఖ్దూం భవన్‌లో భేటీ
- సీపీఎంతో చర్చలు కొనసాగుతున్నాయని వెల్లడి... 8న కూనంనేని నామినేషన్

- వివరాలు 12లో

మున్ముందు మంచి అవకాశాలు



- కొడంగల్‌లో పీసీసీ చీఫ్ రేవంత్ వ్యాఖ్యలు
- మీ ఆశీర్వాదంతోనే నేను ఈ స్థాయికి చేరుకున్నా..
- సోనియా మనకు మంచి అవకాశాలు ఇస్తున్నారు... కొడంగల్ ప్రజలకు ఇప్పుడు గొప్ప అవకాశం వచ్చింది
- కాంగ్రెస్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు

- వివరాలు 13లో

నేడే మోదీ బీసీ గర్జన సభ



- హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో సాయంత్రం 5.30కు కార్యక్రమం... బీజేపీ తరఫున బీసీ సీఎం అభ్యర్థిని ప్రకటిస్తారనే అంచనాలు
- ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ, ఎస్టీల రిజర్వేషన్ల పెంపుపైనా ప్రకటన చేసే అవకాశం
- గంటన్నర సేపట్లోనే ముగియనున్న ప్రధాని పర్యటన

12లో

61 సీట్లపైనే గెలుస్తాం



- మాది బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లాగా 119 చోట్లా బలమున్న సెటిల్డ్ పార్టీ కాదు
- మాకు జనసేన అవసరం ఉంది... అందుకే ఆ పార్టీతో పొత్తు
- బీఆర్‌ఎస్–బీజేపీ ఒకటేనంటే గజ్వేల్‌లో నేను ఎందుకు పోటీ చేస్తా?
- మీట్ ది ప్రెస్‌లో బీజేపీ నేత ఈటల రాజేందర్

- వివరాలు 3లో

ఎమ్మెల్యేగా ఒక్క చాన్స్ ఇవ్వండి

- కరీంనగర్ ప్రజలకు ఎంపీ బండి సంజయ్ విజ్ఞప్తి
- బీజేపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు



- అవినీతి, అక్రమాల ఆరోపణలు లేకుండా నిజాయితీగా పోరు సాగిస్తున్నానని బీజేపీ కరీంనగర్ ఎమ్మెల్యే అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ తెలిపారు. నిండు మనసుతో తనను ఆశీర్వదించాలని.. అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలను ఆయన కోరారు. సోమవారం మధ్యాహ్నం ఎమ్మెల్యే అభ్యర్థిగా బండి సంజయ్ రెండు సెట్ల నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు.

3లో

క్లుప్తంగా...

సంజయ్, రాజాసింగ్ దొందూదొందే..

రాష్ట్ర మంత్రి గంగుల కమలాకర్



కరీంనగర్: కరీంనగర్ ఎంపీ బండి సంజయ్, గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ దొందూదొందేనని, విద్వేషపూరిత ప్రసంగాలతో యువతను రెచ్చగొట్టడం, లబ్ధిపొందడం వారికి వెన్నతో పెట్టిన విద్య అని మంత్రి, కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి గంగుల కమలాకర్ మండిపడ్డారు. సోమవారం ఇక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంజయ్ నామినేషన్ కార్యక్రమం సందర్భంగా రాజాసింగ్ చేసిన వ్యాఖ్యలు అహంకారపూరితమైనవని ధ్వజమెత్తారు. ల్యాండ్, సాండ్, గ్రానైట్ మాఫియా, భూకబ్జాదారుడని తనపై చేసిన ఆరోపణలు అరిగిపోయిన రికార్డులని, వారి మాటలను ఎవరూ నమ్మే పరిస్థితి లేదని గంగుల స్పష్టం చేశారు. సంజయ్, రాజాసింగ్ ప్రజాప్రతినిధులుగా గెలిచి చేసిందేమీ లేక పోవడంతో ఓట్ల కోసం బీఆర్ఎస్, ఎంఐఎంలను తిడుతూ, కుల, మతాల పేరిట విద్వేషపూరిత వ్యాఖ్యలు చేస్తూ ప్రజల మధ్య అగాథాన్ని సృష్టిస్తున్నారని ఆరోపించారు. కాలం చెల్లిన మాటలు, అరిగిపోయిన రికార్డులతో ప్రజలను మళ్లీ, మళ్లీ మోసం చేయాలనుకుంటున్న వీరిద్దరికీ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తప్పదని అన్నారు.

80 సీట్లతో మళ్లీ బీఆర్ఎస్..



సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో 80 సీట్లలో గెలుపొంది, మూడోసారి కేసీఆర్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడం ఖాయమని తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ చెప్పారు. ఇదే అంశాన్ని పలు ప్రముఖ సంస్థల సర్వేలు వెల్లడిస్తున్నాయని సోమవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. సంక్షేమంలో, అభివృద్ధిలో దేశంలోనే ప్రథమ స్థానంలో దూసుకుపోతున్న రాష్ట్రం తెలంగాణ అని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎంత ప్రచారం చేసుకున్నా.. ప్రజలను మభ్యపెట్టాలని చూసినా ఎన్నికల్లో పరాభవం తప్పదని దామోదర్ పేర్కొన్నారు.

11న రాష్ట్రస్థాయి గిరిజన ఆత్మగౌరవ సభ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర స్థాయి గిరిజన ఆత్మగౌర వ సభను ఈనెల 11న శామీర్‌పేట్‌లోని ఎస్ఎస్ఆర్ పుష్ప కన్వెన్షన్ సెంటర్‌లో మధ్యాహ్నం రెండు గంటలకు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర గిరిజన సంక్షేమ మంత్రి సత్యవతి రాథోడ్ వెల్లడించా రు. సోమవారం తెలంగాణ భవన్‌లో ఆమె మీ డియా సమావేశంలో మాట్లాడారు. గిరిజన బిడ్డలను ఆదుకున్నది బీఆర్ఎస్ ప్రభుత్వమే అని, గత ప్రభుత్వాలు వారిని ఓటు బ్యాంకుగానే చూశాయని, ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్ర గిరిజనులకు అండగా నిలిచారని చెప్పారు.

ఇదండీ జగత్



తుది జాబితా కోసం చూస్తున్నాడట!



సోమవారం దేవరకద్రలో ప్రజాఆశీర్వాద సభకు హాజరైన ప్రజలు



మక్తల్ సభకు భారీగా హాజరైన మహిళలు

ఆ గోస మళ్లీ కావాల్నా?

▶ మొదటి పేజీ తరువాయి

వందలాది మంది పిల్లలు చనిపోతే తప్పని పరిస్థితిలో తెలంగాణ ఇచ్చిందని చెప్పారు. కాంగ్రెస్ వస్తే మళ్లీ కరెంటు, నీళ్ల సమస్యలు, దోపిడీ, కమీషన్ల రాజ్యం వస్తుందని.. అలాంటి పాలన మళ్లీ కావాలా అని ప్రశ్నించారు. అభ్యర్థులతోపాటు వారి వెనుక ఉన్న పార్టీలు, వాటి చరిత్రను చూసి ఓటు వేయాలని పిలుపునిచ్చారు. ఉమ్మడి పాలమూరులోని దేవరకద్ర, గద్వాల, మక్తల్, నారాయణపేట నియోజకవర్గ కేంద్రాల్లో సోమవారం నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభల్లో సీఎం కేసీఆర్ మాట్లాడారు. వివరాలు ఆయన మాటల్లోనే..

''పిడికెడు మందితో తెలంగాణ అంతా తిరిగి అందరినీ చైతన్యవంతం చేశాం. 2004లో తెలంగాణ ఇస్తామని చెప్పి కాంగ్రెస్ మోసం చేసింది. నాన్చివేత ధోరణితో టీఆర్ఎస్‌ను ముంచేందుకు ప్రయత్నించింది. మొండి పట్టుదలతో 14 ఏళ్ల పోరాటాల తర్వాత.. నేను ఆమరణ దీక్ష చేస్తే తట్టుకోలేక దిగొచ్చి తెలంగాణ ప్రకటన చేశారు. మళ్లీ వెనుకకు పోవడంతో వందలాది మంది పిల్లలు చనిపోయారు. తప్పని పరిస్థితిలో కాంగ్రెస్ తెలంగాణ ఇచ్చింది. పచ్చబడ్డ రాష్ట్రాన్ని మరోసారి ఖతం పట్టించాలని కుట్రలు చేస్తున్నారు. నేను చెప్పేవన్నీ నిజం కాకపోతే మమ్మల్ని ఓడించండి. మేం అబద్ధాలు చెప్పం.. చెప్పే అవసరం మాకు లేదు.

కాంగ్రెస్ వాళ్లు ఏ గతి పట్టించారో అందరికీ తెలుసు

ఒకప్పుడు పాలమూరు జిల్లా పాలుగారిన జిల్లా. సమైక్య రాష్ట్రంలో ఈ జిల్లాకు ఏ గతి పట్టించారో అందరికీ తెలుసు. పాలమూరును సర్వనాశనం చేసిన పార్టీ కాంగ్రెస్. ఉన్న తెలంగాణను ఊడగొట్టి ఆంధ్రప్రదేశ్‌లో కలిపి సమైక్య పాలకులు మన ప్రాజెక్టులను రద్దు చేశారు. ఒక్క ప్రాజెక్టు కావాలని ఏ కాంగ్రెస్ నాయకుడూ నోరు తెరిచి అడగలేదు. బచావత్ ట్రిబ్యునల్ 1974లో నది నీళ్ల పంపకం చేస్తే.. పాలమూరుకు నీళ్ల గురించి ఏ నాయకుడూ అడగలేదు. ఈ ప్రాంతం ఏపీలో కలవకపోయి ఉంటే బాగుపడేదని బచావత్ ట్రిబ్యునల్ రికార్డుల్లోనే రాసి ఉంది. పాలమూరుకు జరుగుతున్న అన్యాయాన్ని ట్రిబ్యునల్ గమనించి అప్పట్లో జూరాలకు 17 టీఎంసీలు మంజూరు చేసింది. ఎవరూ పట్టించుకోకపోతే.. తెలంగాణ ప్రాంతవాసి అంజయ్య ముఖ్యమంత్రి అయ్యాక శంకుస్థాపన చేశారు. అయినా కర్ణాటకకు నష్టపరిహారం చెల్లించకుండా నిర్లక్ష్యం చేశారు. 2001లో గులాబీ జెండా ఎగిరాకే అడుగు ముందుకుపడింది. నాటి ముఖ్యమంత్రులు జిల్లాను దత్తత తీసుకున్నామంటూ పునాది రాళ్లు వేసిపోయారే తప్ప ఎవరూ కళ్లెదు నీళ్లు తెచ్చివ్వలేదు. ఇప్పుడు పాలమూరు ఎలా అయిందో ప్రజలు గమనించాలి. ఇక్కడి మంత్రులు, ఎమ్మెల్యేలు పట్టుబట్టి నెట్టెంపాడు, భీమా, కల్వకుర్తి పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయించారు. కోయిల్‌సాగర్ లిఫ్ట్‌నూ పూర్తి చేసుకున్నాం. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం కాల్వలను పూర్తిచేసి చెరువుల్లో నీళ్లు నింపుతాం.

గద్వాలలో తడబడిన కేసీఆర్

కేసీఆర్ గద్వాలలో తన ప్రసంగం సందర్భంగా తడబడ్డారు. ''ఎన్నికలు వస్తాయి, పోతాయి. మూడు పార్టీల నుంచి ముగ్గురు ఉంటారు. అభ్యర్థుల గుణం చూడాలి. ముఖ్యంగా వారి వెనుక ఉన్న పార్టీలను చూడాలి. బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి వెనుక బీఆర్ఎస్ ఉంది. కాంగ్రెస్ అభ్యర్థి వెనుక కాంగ్రెస్ ఉంటది''అని చెప్తూ.. 'బీజేపీ వెనుక బీఆర్ఎస్ ఉంటది'అన్నారు. వెంటనే సవరించుకుని 'బీజేపీ అభ్యర్థి వెనుక బీజేపీ ఉంటది'అంటూ ప్రసంగం కొనసాగించారు.

నారాయణపేటలో ఉర్దూలో ప్రసంగం

సీఎం కేసీఆర్ నారాయణపేట సభలో ప్రసంగించిన సందర్భంగా చివరిలో ముస్లింలను ఉద్దేశించి ఉర్దూలో మాట్లాడారు. ''గత పదేళ్లలో ఒక్క కర్ఫ్యూ లేదు. తెలంగాణ సెక్యులర్ రాష్ట్రంగా ఉండాలన్నదే బీఆర్ఎస్ ప్రభుత్వ లక్ష్యం. కేసీఆర్ బతికున్నంత కాలం సెక్యులర్‌గానే ఉంటది. తెలంగాణ ఆవిర్భావానికి ముందు పదేళ్ల కాంగ్రెస్ పాలనలో మైనార్టీల సంక్షేమానికి రూ.900 కోట్లు ఖర్చు చేస్తే.. మా ప్రభుత్వం ఈ తొమ్మిదేళ్లలో రూ.12 వేల కోట్లు ఖర్చు చేసింది''అని చెప్పారు.

మరో ఉద్యమం వస్తదేమో..

వాల్మీకి బోయలను ఎస్టీల్లో చేర్చాలని నాలుగు సార్లు అసెంబ్లీలో తీర్మానం చేసి పంపినా కేంద్రం స్పందిస్తలేదు. మరో ఉద్యమం వస్తదేమో. సమైక్య రాష్ట్రంలో మొదటి సీఎం నీలం సంజీవరెడ్డి వాల్మీకి బోయలను ఆంధ్ర ప్రాంతంలో ఎస్టీల్లో పెట్టి, ఇక్కడ బీసీల్లో పెట్టింది నిజం కాదా? ఆయన కాంగ్రెస్ ముఖ్యమంత్రి కాదా? ఆనాటి మంత్రి రఘువీరారెడ్డి పాలమూరుకు వస్తే.. మంగళహారతులు పట్టి మరీ నీళ్లు తీసుకుపొమ్మని ఎవరు చెప్పారో అందరికీ తెలుసు.

బాగా ఆలోచించి ఓటేయాలి

రైతుల కష్టాలు నాకు తెలుసు. అందుకే వ్యవసాయానికి ఉచితంగా 24 గంటల కరెంటు ఇస్తున్నాం. రైతు బంధు దుబారా అని పీసీసీ మాజీ అధ్యక్షుడు ఉత్తమ్ అంటే.. మూడు గంటల కరెంటు చాలని పీసీసీ చీఫ్ రేవంత్ రైతులపై విషం చిమ్ముతున్నారు. ఎన్నికలు వస్తుంటాయి, పోతుంటాయి. రాష్ట్రానికి, సమాజానికి ఎవరుంటే మేలు జరుగుతుందో ప్రజలు విచక్షణతో ఆలోచించి ఓటు వేయాలి.

హెలికాప్టర్‌లో సమస్యతో సభలు ఆలస్యం

మర్కూక్ (గజ్వేల్): సోమవారం సీఎం కేసీఆర్ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పర్యటనకు బయలుదేరిన హెలికాప్టర్‌లో సాంకేతిక సమస్య తలెత్తింది. సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలోని తన వ్యవసాయ క్షేత్రం నుంచి హెలికాప్టర్ బయల్దేరిన కాసేపటికే అందులో సాంకేతిక సమస్య తలెత్తినట్టు పైలట్ గుర్తించారు. వెంటనే వెనక్కి తిప్పి వ్యవసాయ క్షేత్రంలోని హెలిప్యాడ్ వద్ద ల్యాండింగ్ చేశారు. సీఎం కేసీఆర్ ప్రచార సభలకు వెళ్లాల్సిన నేపథ్యంలో అధికారులు మరో హెలికాప్టర్‌ను తెప్పించారు. కేసీఆర్ అందులో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పర్యటనకు వెళ్లారు.

తిరిగి రోడ్డు మార్గంలో హైదరాబాద్‌కు..

షెడ్యూల్ ప్రకారం మధ్యాహ్నం 1.30 గంటలకు కేసీఆర్ దేవరకద్ర సభకు రావాల్సి ఉండగా.. హెలికాప్టర్ సమస్య వల్ల 3.35 గంటలకు చేరుకున్నారు. అక్కడ ప్రజలను ఉద్దేశించి 12 నిమిషాలు ప్రసంగించారు. అక్కడి నుంచి గద్వాలకు చేరుకుని 15 నిమిషాలు, మక్తల్‌లో ఎనిమిది నిమిషాలు ప్రసంగించారు. చివరగా నారాయణపేటలో 29 నిమిషాలు మాట్లాడారు. సాయంత్రం 6.45 గంటల సమయంలో ప్రత్యేక బస్సులో రోడ్డుమార్గంలో హైదరాబాద్‌కు చేరుకున్నారు.



మరమ్మతులతో నిలిచిన హెలికాప్టర్. మరో హెలికాప్టర్‌లో బయలుదేరిన సీఎం

ఎన్నికలొచ్చినప్పుడే బీసీలపై ప్రేమ

- బీసీ వ్యక్తిని రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి ఎందుకు తొలగించారు
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విసుర్లు



నిజామాబాద్/నాగారం: ఎన్నికలు రాగానే బీసీలపై కాంగ్రెస్, బీజేపీలు ప్రేమ చూపిస్తున్నాయని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. సోమవారం నిజామాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న బీసీ వ్యక్తిని ఎందుకు తొలగించారో ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణకు వచ్చే ముందు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బీసీ అధ్యక్షుడిని తొలగించి కొత్తగా బీసీని ముఖ్యమంత్రి చేస్తామంటున్నారని ఎద్దేవా చేశారు. జనగణన చేయకుండా అడ్డుకున్నది కాంగ్రెస్ పార్టీనే అని కవిత విమర్శించారు. అధికారంలో ఉండగా కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయని కాంగ్రెస్ పార్టీ, ఇప్పుడు బీసీ డిక్లరేషన్ చేస్తే చేసిన పాపాలు తొలగిపోవని వ్యాఖ్యానించారు. రాజ్యసభలో మహిళా బిల్లును ఆమోదించిన సమయంలో ఓబీసీ మహిళలకు కోటా కల్పించలేమని కూడా కాంగ్రెస్ పార్టీ స్పష్టం చేసిన విషయాన్ని కవిత గుర్తుచేశారు. సమగ్ర కుటుంబ సర్వే ద్వారా రాష్ట్ర ప్రజల స్థితిగతులు తెలుసుకొని సీఎం కేసీఆర్ అన్ని వర్గాలకు అవసరమైన పనులు చేస్తున్నారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం బీసీల ప్రభుత్వమని, సీఎం కేసీఆర్‌కు ఎన్నికలు కాదు, భావితరాల భవిష్యత్తే ముఖ్యమని తెలిపారు. బ్యాక్‌లాగ్ పోస్టులు ఎందుకు భర్తీ చేయడం లేదు, ఓబీసీ రిజర్వేషన్లను ఎందుకు సక్రమంగా అమలు చేయడం లేదని కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. ఒక పార్టీ అధ్యక్షుడు, జాతీయ నాయకుడైన సీఎం కేసీఆర్ రకరకాల వ్యూహాలతో రెండు చోట్ల పోటీ చేస్తుంటే, పులిని చూసి నక్క వాత పెట్టుకున్నట్లు రేవంత్‌రెడ్డి, ఈటల రాజేందర్ కూడా రెండు చోట్ల పోటీ చేస్తున్నారని ఎద్దేవాచేశారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పొన్నాల లక్ష్మయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఏళ్లుగా అధికారంలో ఉండి బీసీలకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. అనంతరం బోధన్‌లో జరిగిన 'బీసీ కుల సంఘాల గర్జన' సభలో కవిత, పొన్నాల పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు ఎందుకు ఓటెయ్యాలి?

మంత్రి హరీశ్‌రావు

సాక్షి, హైదరాబాద్: వెనుకబడిన తరగతులను విస్మరిస్తున్న కాంగ్రెస్ పార్టీ తీరును ప్రజలు గమనించాలని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ ముదిరాజ్ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ నగేశ్ ముదిరాజ్ సోమవారం తెలంగాణ భవన్‌లో మంత్రి హరీశ్‌రావు సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి తెలంగాణ ద్రోహి అని, కాంగ్రెస్ పార్టీకి ఎందుకు ఓటు వేయాలని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చేందుకు కాంగ్రెస్ నాయకులు గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని, అయినా కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ మూడోసారి అధికారంలోకి వస్తుందని అన్నారు. కాంగ్రెస్‌కు మళ్లీ అధికారం ఇస్తే తెలంగాణ ఆగమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో మౌలిక వసతుల అభివృద్ధితో పాటు ఫ్లైఓవర్లు, రేడియల్ రోడ్లను బీఆర్ఎస్ ప్రభుత్వం మెరుగుపరిచిందన్నారు. రజనీకాంత్ వంటి సినీ నటులు హైదరాబాద్ అభివృద్ధి బాగుందని చెప్తున్నా ఇక్కడి గజనీలకు మాత్రం అర్థం కావడంలేదన్నారు. రాష్ట్రంలోని ఒక్కో సమస్యను సీఎం కేసీఆర్ క్రమంగా పరిష్కరిస్తున్న నేపథ్యంలో ప్రజలు రిస్క్ తీసుకోవద్దని హరీశ్ అన్నారు. తెలంగాణలో ప్రతీ గ్రామంలో ధాన్యం రాశులు కనిపిస్తున్నాయని, కళ్లకు కనిపించే అభివృద్ధిని చూసి ఓటు వేయాలని అన్నారు. ముదిరాజ్ సామాజికవర్గం సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందన్నారు. మత్స్యకార సొసైటీల్లో కొత్త సభ్యులను చేర్చుకోవడంతో పాటు గ్రామాల్లో చెరువులపై ముదిరాజ్‌లకే హక్కులు కల్పించామని మంత్రి తెలిపారు. ఎవరెన్ని ట్రిక్కులు చేసినా బీఆర్ఎస్ హ్యాట్రిక్ సాధిస్తుందన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే ముఠా గోపాల్, మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సోమవారం నగేశ్ ముదిరాజ్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి హరీశ్‌రావు

మునుగోడులో బీఆర్ఎస్‌కు షాక్

- పార్టీకి పలువురు ప్రజాప్రతినిధులు, నేతల రాజీనామా
- ఎమ్మెల్యే నిరంకుశ విధానాలు నచ్చకే పార్టీని వీడుతున్నట్లు వెల్లడి

నల్లగొండ: నల్లగొండ జిల్లా మునుగోడు నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు ఆ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు మూకుమ్మడిగా ప్రకటించారు. మునుగోడు ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి నిరంకుశ విధానాలు నచ్చక పార్టీని వీడుతున్నట్లు వారు వెల్లడించారు. సోమవారం నల్లగొండలో మునుగోడు జెడ్పీటీసీ నారబోయిన స్వరూపా రవి ఇంట్లో ఏర్పాటు చేసిన విలేకరులతో సమావేశంలో వారు తమ రాజీనామాలను ప్రకటించారు. పార్టీని వీడుతున్న వారిలో చౌటుప్పల్ మున్సిపల్ చైర్మన్, తెలంగాణ మున్సిపల్ చాంబర్స్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, నాంపల్లి జెడ్పీటీసీ సభ్యుడు వెలుగోటి వెంకటేశ్వర్‌రెడ్డి, మునుగోడు జెడ్పీటీసీ సభ్యురాలు నారబోయిన స్వరూపా రవి, నారాయణపురం ఎంపీపీ గుత్తా ఉమ, నాంపల్లి వైస్ ఎంపీపీ పానుగంటి రజనితో పాటు పలువురు ఎంపీటీసీలు, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యులు ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రజాప్రతినిధులపై గౌరవంలేకుండా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. సొంత పార్టీ వ్యక్తులపైనే అవిశ్వాస తీ ర్మానాలు పెట్టించారని ఆరోపించారు. కేసీఆర్, కేటీఆర్‌తో పాటు జిల్లా మంత్రి జగదీశ్‌రెడ్డి చెబితే ఉప ఎన్నికలో కూసుకుంట్ల గెలుపునకు కృషి చేశామని.. కానీ, ఆయనలో మాత్రం ఇంకా మార్పు రాలేదన్నారు. ఎమ్మెల్యే వైఖరితో తాము సొంత పార్టీలోనే అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నామన్నారు. ఎమ్మెల్యే కూసుకుంట్ల ఈ ఎన్నికల్లో ఏ విధంగా గెలుస్తారో చూస్తామన్నారు. పార్టీకి రాజీనామా చేస్తున్నందుకు బాధగా ఉన్నా.. భవిష్యత్ కోసం తప్పడం లేదని, కార్యకర్తలు అర్థం చేసుకుని తమకు సహకరించాలని కోరారు. తామంతా చర్చించుకుని భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని చెప్పారు.



సమావేశంలో మాట్లాడుతున్న మునుగోడు నాయకులు, ప్రజాప్రతినిధులు

పోలింగ్ కేంద్రాల వద్ద | స్థానిక పోలీసులొద్దు

ఈసీ పరిశీలకుల బృందం ఆదేశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని వివిధ పోలీసు స్టేషన్లలో పనిచేస్తున్న పోలీసులను ఆయా పోలీసు స్టేషన్ల పరిధిలోని పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు విధుల్లో నియమించరాదని కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) ప్రత్యేకంగా నియమించిన అధికారుల బృందం ఆదేశించింది. పోలింగ్ కేంద్రాల వద్ద విధులు నిర్వర్తించే పోలీసులు చేయాల్సిన పనులు, చేయకూడని పనులతోఒక జాబితా రూపొందించి వారికి అందజేయాలని రాష్ట్ర పోలీస్ నోడల్ అధికారులకు సూచించింది.

రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈఓ) కార్యాలయంలో సోమవారం వాణిజ్య పన్నులు, ఎక్సైజ్, రాష్ట్ర పోలీస్ శాఖల నోడల్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో.. ఈసీ పరిశీలకులుగా వచ్చిన రిటైర్డు ఐఏఎస్ అధికారి అజయ్ వి.నాయక్, రిటైర్డు ఐపీఎస్ అధికారి దీపక్ మిశ్రా, ప్రత్యేక వ్యయ పరిశీలకుడు, రిటైర్డు ఐఆర్ఎస్ అధికారి బాలకృష్ణన్ మాట్లాడారు. రాజకీయ కార్యక్రమాలను వీడియోలు తీయడంపై అన్ని వీడియో నిఘా బృందాలకు శిక్షణ ఇవ్వాలని, మొబైల్ ఫోన్‌తో కాకుండా కచ్చితంగా కెమెరాలతోనే చిత్రీకరించాలని సూచించారు. ఓటర్ల నమోదుకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను ఈ నెల 10లోగా పరిష్కరించాలని స్పష్టం చేశారు. ఏదైనా పోలింగ్ కేంద్రాల బయట వీడియోగ్రఫీ అవసరమని భావిస్తే, ఆ మేరకు జాబితాను జిల్లా అధికారులు సిద్ధం చేయాలని, ఈ కెమెరాల ఫుటేజీని పోలీసు కంట్రోల్ రూమ్‌లతో అనుసంధానించాలని చెప్పారు.

ప్రతికూల వార్తలపై అప్రమత్తం

పోలింగ్ రోజు న్యూస్ ఛానళ్లపై నిరంతర పర్యవేక్షణ ఉంచాలని, ఏదైనా ప్రతికూల వార్త ప్రసారమైతే నోడల్ అధికారి వెంటనే వాస్తవ వివరాలను తెలుసుకోవడంతో పాటు, సంబంధిత ఛానళ్లకు తెలియజేసి వాస్తవ సమాచారం ప్రసారం అయ్యేలా చూడాలని సూచించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు వారి సామర్థ్యం మేరకు పని చేయాలని డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ అజయ్ బాదూ ఆదేశించారు. ఈసీ డైరెక్టర్ (వ్యయం) పంకజ్ శ్రీవాస్తవ్, సీఈఓ వికాస్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్‌కు రేపటితో గడువు ముగింపు!

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర శాసనసభ సాధారణ ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కోసం 'ఫారం-12డీ'దరఖాస్తులను సమర్పించేందుకు ఈ నెల 8తో గడువు ముగియనుంది. ఎన్నికలతో సంబంధం లేని 13 రకాల అత్యవసర సేవల్లో నిమగ్నమై ఉండే ఓటర్లకు సైతం తొలిసారిగా పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని కల్పించాలని కేంద్ర ఎన్నికల సంఘం గత నెల 10న ఆదేశాలు జారీ చేసింది. ఇంకా దరఖాస్తు చేసుకోని వారు బుధవారంలోగా ఫారం-12డీ దరఖాస్తును స్థానిక నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారికి సమర్పించాల్సి ఉంటుంది. ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైన తర్వాత 5 రోజుల్లోగా ఫారం-12డీ దరఖాస్తులను సమర్పించాలని నిబంధనలు పేర్కొంటున్నాయి. 13 రకాల అత్యవసర సేవల్లో నిమగ్నమై ఉండే ఓటర్ల నుంచి ఫారం-12డీ దరఖాస్తుల స్వీకరణకు ప్రతి జిల్లాలో నోడల్ అధికారిని నియమించాలని ఆదేశించినట్టు డిప్యూటీ సీఈఓ సత్యవాణి 'సాక్షి'కి తెలిపారు. అత్యవసర సేవల్లోని ఓటర్లు తమ నోడల్ అధికారి ద్వారా నియోజకవర్గ రిటర్నింగ్ అధికారికి 8లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కోహ్లీలా కేసీఆర్ సెంచరీ!

మూడోసారి ముఖ్యమంత్రి అవడం ఖాయం

- సిరిసిల్ల, వేములవాడ, ఎల్లారెడ్డిపేట సభల్లో కేటీఆర్
- మోదీ, రాహుల్‌కు కొరకరాని కొయ్యలా కేసీఆర్
- ఢిల్లీకి వస్తాడని ఆయన్ను ఇక్కడే ఖతం చేయాలని చూస్తున్నారు
- మన సినిమా బ్లాక్ బస్టర్ అవడం తథ్యం

సిరిసిల్ల: క్రికెట్‌లో విరాట్ కోహ్లీ లాగా రాష్ట్రంలో కేసీఆర్ సెంచరీ కొట్టి మూడోసారి ముఖ్యమంత్రి అవుతారని రాష్ట్ర మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావు ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణలో కేసీఆర్ మళ్లీ సీఎం అయితే ఊరుకోడు.. మహారాష్ట్రలో అడుగు పెడతాడు, కర్ణాటకలో అడుగు పెడతాడు.. తర్వాత ఢిల్లీలో గులాబీ జెండా పాతాలని చూస్తాడని రాహుల్‌గాంధీ, నరేంద్రమోదీ భయపడుతున్నారని పేర్కొన్నారు. కేసీఆర్ వాళ్లిద్దరికీ కొరకరాని కొయ్యలా అయ్యాడని అన్నారు. కేసీఆర్ ఢిల్లీకొస్తే తమ కొంప మునుగుతుందని ఇక్కడే ఖతం చేయాలని చూస్తున్నారన్నారు. తెలంగాణలో ఇస్తున్నట్లుగా 24 గంటల కరెంట్ దేశమంతా ఇవ్వాలని, దేశమంతా రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి అమలు చేయాలని, జిల్లాకో మెడికల్ కాలేజీ, నాణ్యమైన విద్యనందించే గురుకులాలను ఏర్పాటు చేయాలని కేసీఆర్ చూస్తున్నారని వివరించారు. సోమవారం రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ, ఎల్లారెడ్డిపేటల్లో జరిగిన యువ సమ్మేళనం సభల్లో మంత్రి మాట్లాడారు.



యువసమ్మేళనం సభలో నాయకులతో కలిసి స్టెప్పులేస్తున్న మంత్రి కేటీఆర్

తెలంగాణ సినిమాకు అన్నీ కేసీఆరే

తెలంగాణలో కాంగ్రెస్‌కు, బీజేపీలకు లోకల్ లీడర్లు లేక.. కర్ణాటక, ఢిల్లీ, గుజరాత్‌ల నుంచి దిగుమతి చేసుకుంటున్నారని కేటీఆర్ ఎద్దేవా చేశారు. కానీ తెలంగాణ సినిమాకు కథ, స్క్రీన్‌ప్లే, డైరెక్షన్.. అన్నీ కేసీఆరేనని, మన సినిమా బ్లాక్ బస్టర్ అవుతుందని మంత్రి పేర్కొన్నారు. 'అదే ప్రతిపక్షాలకు కన్నడ ప్రొడ్యూసర్, ఢిల్లీ డైరెక్టర్, యాక్టర్ పకోడు.. వాళ్లది డిజాస్టర్'అని అన్నారు. ఆ రెండు పార్టీలు ఢిల్లీలో ఉస్కో అంటే.. ఇక్కడ డిస్కో అంటారని ఎద్దేవా చేశారు. తెలంగాణలో కేసీఆర్‌ను ఎవరూ ఓడించలేరని ధీమా వ్యక్తం చేశారు.

11సార్లు చాన్సిస్తే ఏం చేశారు?

ఢిల్లీ నాయకులు తెలంగాణ విషయంలో ఏనాడూ మర్యాదగా ప్రవర్తించలేదని మంత్రి అన్నారు. పోరాటాలు, త్యాగాలు, కేసీఆర్ ఉద్యమాలతోనే తెలంగాణ వచ్చిందని చెప్పారు. ఒక్క చాన్స్ అంటున్న కాంగ్రెస్ పార్టీకి 11 సార్లు అవకాశం ఇస్తే.. ఏం చేసిందని ప్రశ్నించారు. రైతుబంధు, రైతుబీమా, 24 గంటల కరెంట్ ఎందుకు ఇయ్యలేదని నిలదీశారు. ఆ పుర్రెలేని రాహుల్‌గాంధీకి మేడిగడ్డ ప్రాజెక్టుపై వచ్చిన పర్రె (పగులు) కూడా తెలియదని విమర్శించారు. తాము రాజకీయ హిందువులం కాదని, నిజమైన హిందువులమని స్పష్టం చేశారు.

స్టెప్పులేసి జోష్ పెంచిన కేటీఆర్

ఎల్లారెడ్డిపేట యువ సమ్మేళనం వేదికపై కేటీఆర్ స్టెప్పులేశారు. ఎన్నికల పాట 'దేఖ్‌లేంగే..'కు యువ నాయకులతో కలిసి నృత్యం చేసి వారిలో ఉత్సాహం నింపారు. సభికులు కేరింతలు కొడుతూ వారు కూడా స్టెప్పులేయడంతో ఆ ప్రాంతం మార్మోగింది. స్థానిక నాయకులను పేరుపేరునా పిలిచిన మంత్రి వారిలో జోష్ నింపారు. వేములవాడ సభలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బి.వినోద్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ, వేములవాడ బీఆర్ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

జాబ్ కేలండర్ ప్రకటించే బాధ్యత నాది

రాబోయే రోజుల్లో యువతతో మమేకమవుతామని, జాబ్ కేలండర్‌ను ప్రకటించే బాధ్యతను తాను తీసుకుంటానని కేటీఆర్ ప్రకటించారు. జిల్లాకో నైపుణ్య శిక్షణ కేంద్రం, నియోజకవర్గానికో స్కిల్ సెంటర్ ఏర్పాటు చేసి పరిశ్రమలను ప్రోత్సహిస్తానని, స్వయం ఉపాధిని పెంచుతానని అన్నారు. తెలంగాణను దాచి దాచి దయ్యాల పాలు చేయొద్దని, ఎవరి చేతిలో ఉంటే తెలంగాణ పచ్చగా ఉంటుందో ఆలోచించాలని కోరారు.

క్లుప్తంగా...

బీఆర్ఎస్‌ది అవినీతి, లీకేజీల ప్రభుత్వం

- పసుపుబోర్డు ఏర్పాటుకు రాష్ట్రం సహకరించడం లేదు
- గోవా సీఎం ప్రమోద్ సావంత్



సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్‌ది అవినీతి, లీకేజీ, కమీషన్, మత విద్వేషాల ప్రభుత్వమని గోవా సీఎం ప్రమోద్ సావంత్ ఆరోపించారు. 'అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ వాళ్లు గెలిస్తే బీఆర్ఎస్‌లోకి వెళ్తారు. బీఆర్ఎస్ నుంచి గెలిచినవాళ్లు కాంగ్రెస్‌లోకి వెళ్తారు. రెండు పార్టీలు ఒకటే'అని విమర్శించారు. సోమవారం ఇక్కడ ఆయన మీడియాతో మాట్లాడుతూ అమలుకు నోచుకోని హామీలతో మోసం చేసిన సీఎం కేసీఆర్‌ను తెలంగాణ ప్రజలు నమ్మవద్దని కోరారు. అసెంబ్లీ ఎన్నికల్లో కమలం పువ్వు గుర్తుకు ఓటువేసి బీజేపీని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. డబుల్ ఇంజిన్ సర్కారుతో ప్రయోజనాలను గోవా, యూపీ, గుజరాత్, మధ్యప్రదేశ్ వంటి బీజేపీ పాలిత రాష్ట్రాలే నిదర్శనమన్నారు. దేశంలోనే ఎక్కడా అమలు చేయని పథకాలు, కార్యక్రమాలను గోవాలో అమలు చేస్తున్నామని చెప్పారు. తెలంగాణలో పసుపుబోర్డు ఏర్పాటుకు కేంద్రం అనుమతి ఇచ్చిందని గుర్తు చేశారు. ఈ బోర్డును ఎక్కడ ఏర్పాటు చేస్తున్నారో ఇప్పటిదాకా చెప్పలేదు కదా అని ఓ విలేకరి ప్రశ్నించగా, కేంద్రం ఈ నిర్ణయం తీసుకున్నా రాష్ట్ర ప్రభుత్వ సహకారం, మద్దతు లేనందున ఇది ముందుకు సాగడం లేదని గోవా సీఎం బదులిచ్చారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎంలను ఒక బంధం కలిపి ఉంచిందని, వీరంతా తోడుదొంగలని సావంత్ మరో ప్రశ్నకు జవాబిచ్చారు.

సీఎం రేసులో ఉన్నందునే సంజయ్‌ను తప్పించారేమో?

- బీజేపీ నేత, మధ్యప్రదేశ్ ఇన్‌చార్జి మురళీధర్‌రావు



సాక్షి, హైదరాబాద్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి నుంచి బండి సంజయ్‌ను మారుస్తున్నట్లు ఆయనకు కూడా తెలియదని బీజేపీ నేత, బీజేపీ మధ్యప్రదేశ్ ఇన్‌చార్జి పి.మురళీధర్‌రావు అన్నారు. అలాగే కొత్తఅధ్యక్షుడిగా తనను నియమిస్తారని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డికి కూడా తెలియదన్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉంటే ఒకవేళ ముఖ్యమంత్రి అభ్యర్థి కావాల్సి వస్తే అది అడ్డంకి అవుతుందని నాయకత్వం భావించి ఉండొచ్చునని వ్యాఖ్యానించారు. తెలంగాణలో అధికారంలోకి వస్తే బీసీ నేతను సీఎం చేస్తామని జాతీయ నాయకత్వం ప్రకటించినందున.. ఎక్కువ సీట్లు గెలుచుకుంటే ఎవరిని సీఎం చేయాలనేది అధిష్టానమే నిర్ణయిస్తుందని వెల్లడించారు. సోమవారం చార్జి షీట్స్ కమిటీ చైర్మన్‌గా బీఆర్ఎస్ సర్కార్‌పై ఇతర నేతలతో కలిసి చార్జిషీట్ విడుదల చేశాక మురళీధర్‌రావు మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. 'బండి సంజయ్ సీఎం రేస్‌లో ఉన్నారు కాబట్టే అధ్యక్ష పదవి నుంచి తొలగించారు. సీఎం రేస్‌లో కిషన్‌రెడ్డి లేరు. కాబట్టే ఆయనకి అధ్యక్ష బాధ్యతలు'అని మురళీధర్‌రావు అన్నారు. బీజేపీ ఎన్ని సీట్లు గెలుస్తుందనేది చెప్పలేం కానీ, అధికారంలోకి వస్తుందని మాత్రం చెప్పగలమన్నారు. పార్టీని వీడాక రాజగోపాల్‌రెడ్డిపై బీజేపీ నేతలు ఎందుకు విమర్శలు చేయడం లేదంటూ ఒక విలేకరి ప్రశ్నించగా.. బీజేపీలోకి మళ్లీ ఆయన వచ్చినా రావొచ్చునంటూ మురళీధర్‌రావు నవ్వుతూ సమాధానమిచ్చారు.

ఎమ్మెల్యేగా ఒక్క చాన్స్ ఇవ్వండి

కరీంనగర్ ప్రజలకు ఎంపీ బండి సంజయ్ విజ్ఞప్తి ● బీజేపీ అభ్యర్థిగా రెండు సెట్ల నామినేషన్ దాఖలు

కరీంనగర్ టౌన్: అవినీతి, అక్రమాల ఆరోపణలు లేకుండా నిజాయితీగా పోరు సాగిస్తున్నానని బీజేపీ కరీంనగర్ ఎమ్మెల్యే అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ తెలిపారు. నిండు మనసుతో తనను ఆశీర్వదించాలని.. అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రజలను ఆయన కోరారు. సోమవారం మధ్యాహ్నం వేదపండితులు నిర్ణయించిన ముహూర్తానికి ఎమ్మెల్యే అభ్యర్థిగా బండి సంజయ్ రెండు సెట్ల నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి సీహెచ్ విఠల్, మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిళ్ల రమేశ్, సోదరుడు బండి సంపత్, కిరణ్‌సింగ్‌తో కలసి కరీంనగర్ కలెక్టరేట్‌లోకి కారు నడుపుకుంటూ వెళ్లిన సంజయ్.. ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్యేగా తనను గెలిపిస్తే అవినీతికి, అక్రమాలకు తావులేకుండా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. ఇప్పటివరకు ప్రజలు అన్ని పార్టీలకు ఎమ్మెల్యేలుగా అవకాశం ఇచ్చారని, ఈసారి తనకు ఒక్క చాన్స్ ఇవ్వాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం రూ. వేల కోట్లు ఇస్తున్నా ఇక్కడి సిట్టింగ్ ఎమ్మెల్యే దారిమళ్లించారని ఆరోపించారు. పేదలకు ఒక్క కొత్త రేషన్ కార్డు ఇవ్వలేదని, ఇళ్లు మంజూరు చేసినా పేదలకు ఇవ్వలేదని ఆరోపించారు. ఒకట్రెండు పథకాలు అమలు చేసి అదేదో గొప్ప పని చేసినట్లు భూతద్దంలో చూపుతున్నారని ఎద్దేవా చేశారు. కరీంనగర్‌లో ప్రశాంతమైన వాతావరణం ఉందా? అని ప్రశ్నించారు. కమీషన్లు ముట్టజెబితే తప్ప పనులు అయ్యే పరిస్థితి లేదని ఆయన ఆరోపించారు. ఇక్కడ కల్వకుంట్ల రాజ్యాంగం అమలవుతోందని విమర్శించారు. బీఆర్ఎస్, ఎంఐఎం కలిసి శాంతిభద్రతలకు తూట్లు పొడుస్తున్నాయని ఆరోపించారు. కరీంనగర్‌లో ప్రశాంత వాతావరణం ఉండాలన్నా, అభివృద్ధి పథంలో దూసుకుపోవాలన్నా, అవినీతికి తావులేని పాలన కావాలన్నా బీజేపీని గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తిచేశారు.



నామినేషన్ వేసిన అనంతరం జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న బండి సంజయ్, రాజాసింగ్

డబ్బు వైపా లేక ధర్మం వైపా ప్రజలు తేల్చుకోవాలి: రాజాసింగ్


కరీంనగర్ ప్రజలు ధర్మం కోసం నిరంతరం పోరాడుతున్న బండి సంజయ్ పక్షాన ఉంటారో లేక అవినీతి, అక్రమాలతో రూ.వేల కోట్లు సంపాదించి ఓటుకు రూ. 20 వేలు పంచేందుకు సిద్ధమైన బీఆర్ఎస్ అభ్యర్థి పక్షాన ఉంటారో తేల్చుకోవాలని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ వ్యాఖ్యానించారు. కరీంనగర్‌లో సంజయ్ పోటీ చేస్తున్నారని తెలియగానే గంగుల కమలాకర్ దారుస్సలాం వెళ్లి ఎంఐఎం అధినేతకు సలాం చేశారని... అయినా సంజయ్ గెలుపును ఎవరూ అడ్డుకోలేరన్నారు. ట్రిపుల్ తలాక్ తెచ్చి ముస్లిం మహిళలు గర్వపడేలా చేసింది బీజేపీయేనని మైనారిటీలు గుర్తించాలన్నారు.

బండి సంజయ్‌పై 35 కేసులు..

సాక్షిప్రతినిధి, కరీంనగర్: కరీంనగర్ బీజేపీ అసెంబ్లీ అభ్యర్థి బండి సంజయ్ సోమ వారం ఎన్నికల సంఘానికి సమర్పించిన అఫిడవిట్‌లో తనపై పలు సందర్భాల్లో 35 కేసులు (గత అసెంబ్లీలో కేవలం 5 కేసులు) ఉన్నాయని పేర్కొన్నారు. అవన్నీ విచారణ దశలోనే ఉన్నాయన్నారు. సంజయ్, ఆయన కుటుంబ సభ్యుల పేరిట ఎలాంటి భూములు, గృహాలు లేకపోవడం గమనార్హం. మొత్తంమీద సంజయ్ దంపతుల ఆస్తుల విలువ రూ.79.51 లక్షలు మాత్రమే. ఇక తనకు రూ.5.44 లక్షల రుణాలు, తన భార్యకు రూ.12.40 లక్షల రుణాలు ఉన్నాయని ఆయన అఫిడవిట్‌లో పొందుపరిచారు.

61 సీట్లపైనే గెలుస్తాం

- మాది బీఆర్ఎస్, కాంగ్రెస్‌లాగా 119 చోట్లా బలమున్న సెటిల్డ్ పార్టీ కాదు
- మాకు జనసేన అవసరం ఉంది... అందుకే ఆ పార్టీతో పొత్తు
- బీఆర్ఎస్–బీజేపీ ఒకటేనంటే గజ్వేల్‌లో నేను ఎందుకు పోటీ చేస్తా?
- మీట్ ది ప్రెస్‌లో బీజేపీ నేత ఈటల రాజేందర్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటుకు అవసరమైన 61 సీట్ల కన్నా ఎక్కువ మెజారిటీని బీజేపీ గెలుచుకుంటుందని రాష్ట్ర బీజేపీ ఎన్నికల కార్యనిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ ధీమా వ్యక్తం చేశారు. అయితే బీఆర్ఎస్, కాంగ్రెస్ తరహాలో 119 నియోజకవర్గాల్లోనూ బలంగా ఉన్న 'సెటిల్డ్' పార్టీ బీజేపీ కాదన్నారు. టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లోని దేశోద్ధారక భవన్‌లో ఈటలతో మీట్ ది ప్రెస్ కార్యక్రమం జరిగింది. టీయూడబ్ల్యూజే రాష్ట్రప్రధాన కార్యదర్శి విరాహత్ అలీ, ఐజేయూ ప్రధాన కార్యదర్శి వై. నరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఈటల రాష్ట్రంలో బీజేపీకి ఉన్న అనుకూలాంశాలను, కేసీఆర్ ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను వివరించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే...

మూలమైన అంశాలు మూలకు..

తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనకు మూలమైన నీళ్లు, నిధులు, నియామకాలు అనే అంశాలను బీఆర్ఎస్ ప్రభుత్వం విస్మరించింది. అన్ని పనులు ఆపి నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల ఒనగూరిన ప్రయోజనం లేకపోగా ప్రాజెక్టు పునాదులే కదిలాయి. మేడిగడ్డ, అన్నారం బ్యారేజీల లీకేజీలతో మొత్తం ప్రాజెక్టు మనుగడే ప్రశ్నార్థకమైంది. కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక అప్పటి వరకు ఉన్న రూ. 74 వేల కోట్ల అప్పును రూ. 5.5 లక్షల కోట్లు చేశారు. ఉద్యోగులకు జీతాలు, పెన్షన్లు ఇచ్చే పరిస్థితి లేదు. 17 పోటీ పరీక్షలు నిర్వహిస్తే అన్నీ లీక్ అయ్యాయి. దళితులకు మూడెకరాల భూమి, దళితబంధు, డబుల్ బెడ్రూం ఇళ్లు, వడ్డీలేని రుణాలు, రుణమాఫీలన్నీ అటకెక్కాయి. పేదలకు భూములు ఇవ్వకపోగా ఎన్నో ఏళ్ల కింద దళితులకు ఇచ్చిన ప్రభుత్వ, దేవాలయ భూములు సేకరిస్తున్నారు. గజ్వేల్‌లో 30 వేల కుటుంబాలు రోడ్డునపడ్డాయి. వారంతా కేసీఆర్ బాధితుల సంఘానికి నన్ను అధ్యక్షుడిగా చేసుకున్నారు.

హంగ్‌వస్తే కాంగ్రెస్–బీఆర్ఎస్ ఒకటవుతాయి

బీఆర్ఎస్‌తో బీజేపీ జట్టు కట్టిందని.. ఆ రెండు పార్టీలు ఒకటేనని మాపై ఒక వదంతి పుట్టించారు. రెండు పార్టీలు ఒకటి అయితే నేను గజ్వేల్‌లో కేసీఆర్‌పై ఎందుకు పోటీ చేస్తా? టీఆర్ఎస్ గతంలో కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకుంది తప్ప బీజేపీతో ఎప్పుడూ పొత్తులేదు. ఒకవేళ రాష్ట్రంలో హంగ్ ఏర్పడితే కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒకటవుతాయి తప్ప కాంగ్రెస్, బీజేపీ కలుస్తాయా? 2014లో కాంగ్రెస్ ఎమ్మెల్సీలంతా మూకుమ్మడిగా బీఆర్ఎస్‌లో చేరారు. 2018లో 19 మందిని గెలిపిస్తే 13 మంది శాసనసభ్యులు కేసీఆర్ పంచన చేరారు. బీజేపీ మాత్రమే కేసీఆర్‌ను నివారించగలదు. మోదీ పాలనలో స్కాం లేదు. దేశ ఆత్మగౌరవం పెరిగింది.

సెటిల్డ్ పార్టీ కాదు బీజేపీ..

రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో బీజేపీ స్ట్రాంగ్‌గా లేదు. జనసేనతో మాకు అవసరం ఉంది కాబట్టే పొత్తు పెట్టుకున్నాం. 8 సీట్లలో ఆ పార్టీ పోటీ చేస్తుంది. బీఆర్ఎస్, కాంగ్రెస్ తరహాలో 'సెటిల్డ్' పార్టీ కాదు. అందుకే నాయకులు వస్తుంటారు... పోతుంటారు. బలంగా ఉన్నామని చెప్పుకుంటున్న పార్టీలు ఎందుకు నాయకులను చేర్చుకుంటున్నాయి? కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, జీహెచ్ఎంసీలలో బీజేపీ సంపూర్ణంగా బలంగా ఉంది. ఖమ్మం, నల్లగొండ వంటి జిల్లాల్లో కొంత మేరకే ప్రభావం చూపుతాం. మహబూబ్‌నగర్, వరంగల్, మెదక్ మొదలైన మిగతా జిల్లాల్లోనూ బలం పెరిగింది. ఈ లెక్కన ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన 61 సీట్లకన్నా ఎక్కువే సాధిస్తాం.

బీసీని ముఖ్యమంత్రి చేస్తామన్న బీజేపీ

బీఆర్ఎస్ ఉన్నంతకాలం కేసీఆర్ కుటుంబమే ముఖ్యమంత్రి పదవి చేపడుతుంది. 1947 నుంచి ఇప్పటివరకు తెలుగునాట బీసీ సీఎం లేరు. జనాభాలో 52 శాతం ఉన్నా పరిపాలన అందని ద్రాక్షే. అందుకే బీజేపీ బీసీ బిడ్డను సీఎం చేస్తా అని ప్రకటిస్తే.. రాహుల్ గాంధీ విమర్శిస్తున్నారు. దేశంలో బీసీలకు అవకాశాలు కల్పించిందే బీజేపీ. కేంద్ర కేబినెట్‌లో 27 మంది బీసీ మంత్రులు ఉన్నారు. నేడో రేపో బీసీ మంత్రిత్వ శాఖను కూడా ఏర్పాటు చేయబోతున్నారు.

ఎన్నికల ప్రచార రథాలను ప్రారంభించిన కిషన్‌రెడ్డి



ప్రచార వాహనాలను ప్రారంభిస్తున్న కిషన్‌రెడ్డి, తరుణ్‌ఛుగ్, కె.లక్ష్మణ్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో ప్రచారంకోసం తెలంగాణ బీజేపీ ఆధ్వర్యంలో రూపొందించిన ఎన్నికల ప్రచార రథాలను కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి.. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి తరుణ్‌ఛుగ్, పార్లమెంటరీ బోర్డు సభ్యుడు కె.లక్ష్మణ్‌లతో కలిసి ప్రారంభించారు. సోమవారం ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో డిజిటల్ ఎల్ఈడీ స్క్రీన్, ఇతర ప్రచార వ్యవస్థలతో తయారుచేసిన ఐదు ప్రచార వాహనాలకు కిషన్‌రెడ్డి, ఇతర నేతలు పూజలు నిర్వహించారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలతో పాటు, ఆయా రంగాల వారీగా సీఎం కేసీఆర్ పాలన వైఫల్యాలను ఎండగడుతూ ప్రచారం నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా దృశ్య ప్రధానంగా రైతులు, యువత, మహిళలు, విద్యార్థులు ఇలా పలు అంశాలపై రికార్డు చేసిన స్కిట్లను రథాల ద్వారా ప్రచారం చేయనున్నారు. నగరంలోని ప్రధాన కూడళ్లలో వీటి ద్వారా ప్రచారాన్ని నిర్వహించనున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు మార్పుకోరుకుంటున్నారని చెప్పారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ డీఎన్ఏ వేరు కాదని, కాంగ్రెస్ వంశపారంపర్య రాజకీయాలుచేస్తే, బీఆర్ఎస్ కుటుంబ, వారసత్వ రాజకీయాలు నెరుపుతోందని లక్ష్మణ్ ఆరోపించారు.



శత్రువు లాగా ఉండకపోవడమే అత్యుత్తమ ప్రతీకారం.
- మార్కస్ అరేలియస్

సాక్షి
మంగళవారం, 7 నవంబర్ 2023

శరణార్థులపై పాక్ పంజా

నిన్నటి వరకూ ఎత్తుకుని ముద్దాడినవారు హఠాత్తుగా విసిరికొడితే...? ఇప్పుడు పాకిస్తాన్‌లో తలదాచుకుంటున్న అఫ్గానిస్తాన్ శరణార్థులు ఇలాంటి దుఃస్థితిలోనే పడ్డారు. ఇజ్రాయెల్ గడ్డపై హమాస్ దాడుల పర్యవసానంగా దాదాపు నెలరోజుల నుంచి గాజా స్ట్రిప్‌లో మారణహోమం సాగుతోంది. నిరాయుధ పౌరులు వేలాదిమంది పిట్టల్లా నేలరాలుతున్నారు. ఈ పరిణామాలపై అరబ్బు ప్రపంచం భగ్గుమంటోంది. కానీ ఈమూల ప్రాణాలు అరచేతపట్టుకుని వచ్చిన శరణార్థులను బలవంతంగా వెనక్కి పంపించటానికి పాకిస్తాన్ ప్రయత్నిస్తోంది. వారిని నరకకూపంలోకి నెట్టడం అన్యాయమని అనేకులు నచ్చజెబుతున్నా, తీవ్ర పర్యవసానాలుంటాయని తాలిబన్‌లు బెదిరిస్తున్నా పాక్ పాలకులు లక్ష్యపెట్టడం లేదు. చట్టవిరుద్ధంగా వుంటున్న 17 లక్షలమంది శరణార్థుల్లో సోమవారం నాటికి లక్షా 70 వేలమందిని పంపించామని పాక్ ప్రకటించింది. శరణార్థుల సమస్య పూర్తిగా పాకిస్తాన్ స్వయంకృతం. నిన్నటివరకూ తన మిత్రులైన తాలిబన్‌లతో వైరం తెచ్చుకుని, పెరుగుతున్న నేరాలకూ, అధోగతిలో వున్న దేశ ఆర్థికవ్యవస్థకూ అఫ్గాన్ శరణార్థులను కారణంగా చూపి వదుల్చుకోవాలని చూడటం పాకిస్తాన్ సైన్యం కపటనీతికి అద్దం పడుతుంది. 80వ దశకంలో అఫ్గాన్‌పై సోవియెట్ యూనియన్ సైన్యం దురాక్రమణకు దిగినప్పుడు అమెరికా అండతో అఫ్గాన్‌కు అండగా నిలిచినట్టు నటించింది పాకిస్తానే. ఆ వంకన వచ్చిపడిన నిధులు అన్నివిధాలా అక్కరకొచ్చాయి. సోవియెట్ దళాలు నిష్క్రమించాక తాలిబన్‌ల ఏలుబడి మొదలైనప్పుడు వారితో చెట్టపట్టాలేసుకుని వారి అరాచకాలకు అండదండలందించింది, వారిని ఉసిగొల్పి మన దేశాన్ని చికాకుపరిచింది కూడా పాకిస్తానే. 2001లో తమ దేశంపై ఉగ్రదాడి జరిగాక అమెరికా ఆగ్రహించి అఫ్గాన్‌పై దండయాత్రకు దిగింది. తాలిబన్‌లను తొలగించి తమ అనుకూలురను ప్రతిష్ఠించింది. అనంతరకాలంలో పరిమిత ప్రాంతాల్లోనైనా అంతో ఇంతో సాధారణ పరిస్థితులుండేవి. మహిళలు చదువుకోవటానికి, వృత్తి ఉద్యోగాలు చేసుకోవటానికి వీలుండేది. మన దేశం, మరికొన్ని దేశాలు అఫ్గాన్‌లో అనేక అభివృద్ధి ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టాయి. ఇదంతా పాకిస్తాన్‌కు కంటగింపైంది. అఫ్గాన్‌లో తమ హవా సాగటం లేదన్న దుగ్ధతో పాకిస్తాన్ అక్కడ ఏదోవిధంగా పాలకులను చికాకుపరిచేది. చివరకు అమెరికాలో ట్రంప్ హయాం వచ్చాక చడీచప్పుడూ లేకుండా తాలిబన్‌ల తరఫున ఆయనతో రాయబారాలు జరిపి, వారు పూర్తిగా మారిపోయారని నమ్మబలికింది. ఆ తర్వాతే అమెరికా మంచి తాలిబన్‌లు, చెడ్డ తాలిబన్‌లు అంటూ వర్గీకరించి అఫ్గాన్ నుంచి నిష్క్రమించేందుకు దారులు వెదుక్కొంది. ఈ క్రమం అంతటా పాకిస్తాన్ ఆడిన ప్రమాదకర క్రీడ అడుగడుగునా కనబడుతూనే వుంది. తీరా రెండేళ్లక్రితం తాలిబన్‌ల పాలన మొదలయ్యాక ఇద్దరికీ చెడింది. పాక్ సైన్యం చేతుల్లో కీలుబొమ్మలు కావటానికి తాలిబన్‌లు ససేమిరా అనటం, తమ సహజ వనరులను పాక్ పెట్టుబడిదారులకు దోచిపెట్టడానికి అంగీకరించకపోవటం సైన్యానికి ఆగ్రహం కలిగించింది. శరణార్థులను వెనక్కు పంపటంలోని ఆంతర్యం అదే.

ఐక్యరాజ్యసమితి లెక్కల ప్రకారం పాకిస్తాన్‌లోని అఫ్గాన్ శరణార్థుల సంఖ్య 13 లక్షలు. మరో 8 లక్షల 80 వేలమంది చట్టబద్ధంగా అక్కడుంటున్నారు. వీరిలో 2021లో మళ్లీ తాలిబన్‌లు అధికారం చేజిక్కించుకున్నాక ప్రాణభయంతో వచ్చినవారు దాదాపు 6 లక్షలమంది. వీరుగాక 1980 ప్రాంతంలో సోవియెట్ దురాక్రమణ సమయంలో వచ్చిన 3 లక్షలమంది శరణార్థులున్నారు. కానీ పాక్ సైన్యం లెక్కలు వేరేలా వున్నాయి. 17 లక్షలమంది శరణార్థులు అక్రమంగా వుంటున్నారని అది చెబుతోంది. ఎవరి లెక్కలు ఏమైనా శరణార్థుల్లో అనేకులు దశాబ్దాలుగా ఉపాధి వెదుక్కొని ఇస్లామాబాద్ మొదలుకొని కరాచీ వరకూ అనేక నగరాల్లో స్థిరపడి అక్కడే తమకంటూ గూడు ఏర్పర్చుకున్నారు. ఆ సమాజంలో భాగమయ్యారు. వారి పిల్లలు చదువుకుంటున్నారు. ఉపాధి వెదుక్కున్నారు. కొందరు ఆస్తులు కూడబెట్టుకున్నారు. కానీ హఠాత్తుగా పాకిస్తాన్ సైన్యం పోలీసులు, సైన్యం విరుచుకుపడి వారి అధికారిక పత్రాలు స్వాధీనం చేసుకుని పొమ్మంటే ఏమైపోవాలి? తనకు అనుకూలంగా వున్నప్పుడు సమస్యను చక్కగా వినియోగించుకుని, తాలిబన్‌లతో తకరారు తలెత్తాక ఇన్ని లక్షలమందిని కట్టుబట్టలతో గెంటేయాలని చూడటం ఏం న్యాయం? ఇప్పుడు దేశవ్యాప్తంగావున్న అఫ్గాన్ శరణార్థులను సరిహద్దుల్లోని తోర్ఖాం ప్రాంతానికి తరలించి నరకాన్ని తలపించే గుడారాల్లో కుక్కుతోంది. కొందరిని బలూచిస్తాన్ వైపున్న చమన్‌వైపు తరలిస్తోంది. ఒకపక్క అమానవీయంగా ఇన్ని లక్షలమందిని నరక కూపంలోకి నెడుతూ స్వచ్ఛందంగా పోతున్నారని సైన్యం తప్పుడు ప్రచారం చేస్తోంది. 1950 ప్రాంతం తర్వాత దేశంనుంచి ఇంత పెద్దయెత్తున జనం తరలిపోవటం ఇదే ప్రథమమని పాకిస్తాన్ మీడియా చెబుతోంది.

ఉగ్రవాదం విషయంలో పాక్ అనుసరిస్తున్న ద్వంద్వ వైఖరే దేశంలో ఆత్మాహుతి దాడులు, ఇతర నేరాలు పెరగటానికి కారణం. తాము మద్దతుగా నిలిచిన తాలిబాన్‌లే అడ్డం తిరగటంతో సైన్యానికి దిక్కుతోచటం లేదు. దానికితోడు దేశంలో పౌర ప్రభుత్వంతో పొసగటం లేదు. ఇమ్రాన్‌ను ప్రధాని పదవి నుంచి దించినా అంతా అనుకున్నట్టు జరగలేదు. త్వరలో ఎన్నికలు ముంచుకొస్తున్నాయి. దేశం దివాలా తీసింది. ఈ పరిస్థితుల్లో సకల క్లేశాలకూ శరణార్థులను బాధ్యులుగా చూపి, బలిపశువుల్ని చేయటం దుర్మార్గం. అంతర్జాతీయ చట్టాలను గౌరవించి శరణార్థుల విషయంలో కనీస మానవీయత ప్రదర్శించటం అవసరమని పాక్ సైన్యమూ, పాలకులూ గుర్తించాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయణం, శరదృతువు, ఆశ్వయుజ మాసం, తిథి: బ.దశమి పూర్తి (24గంటలు), నక్షత్రం: మఖ సా.4.43 వరకు, తదుపరి పుబ్బ, వర్జ్యం: రా.1.35 నుండి 3.21 వరకు, దుర్ముహూర్తం: ఉ.8.20 నుడి 9.06 వరకు తదుపరి రా.10.27 నుండి 11.19 వరకు, అమృతఘడియలు: ప.2.05 నుండి 3.52 వరకు.

సూర్యోదయం : 6.04
సూర్యాస్తమయం: 5.24
రాహుకాలం : ప.3.00 నుండి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుండి 10.30 వరకు

భూమి సామూహిక ఆస్తి

అభిప్రాయం



దొంతి నరసింహా రెడ్డి

భూమి ఒక ప్రకృతి వనరు. అందరికీ తెలిసిన ఈ నిజాన్ని సాధారణంగా విస్మరిస్తాం. ఇది గుర్తు పెట్టుకుంటే మన దృక్పథంలో మార్పు వస్తుంది. కాగా, భూమిని ఒక వ్యాపార వస్తువుగా మార్చేశాం. నీటిని, నీటి వనరులను ప్రైవేటీకరణ చేస్తే బాధపడేవాళ్ళు భూమిని ప్రైవేటీకరిస్తే పట్టించుకోవడం లేదు. ఆక్స్‌ఫామ్ సంస్థ నివేదిక ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా 250 కోట్ల మంది ప్రజలు సమాజ భూములపై ఆధారపడి జీవిస్తున్నారు. భూమిని ఒక ఉమ్మడి ఆస్తిగా నిర్వహించడం చాలా అవసరం. ఎంత చిన్న కమతం అయినా స్థానిక ప్రజల ఆహార అవసరాలను తీరుస్తూ, ఉత్పాదకతను పెంచుతూ, కుటుంబ ఆదాయాన్ని రెట్టింపు చేయగలదు. జనాభా పెరుగుతున్నందున ప్రపంచ ఆహార ఉత్పత్తిని పెంచడానికి ఇది కీలక వ్యూహం.

ఒకప్పుడు భూమి అమ్మడం అంటే రైతు ప్రాణాలు పోయినంతగా బాధపడేవాడు. ఇప్పుడు సుఖంగా జీవించటానికి భూమి అమ్ముకోవడం అలవాటు అయిపోయింది. కానీ అమ్ముకున్నాక చితికిపోయిన కుటుంబాలు ఎన్నో! భూమి అమ్ముకుంటేనే నీకు బంగారం లాంటి జీవనం అనే పరిస్థితిని ప్రభుత్వం కల్పిస్తున్నది. భూమి ధర ఎకరానికి రూ.20 కోట్లు ఇప్పిస్తానని 2014లోనే వాగ్దానం చేశారు తెలంగాణా ముఖ్యమంత్రి. భూమి రేటు పెరిగినప్పుడల్లా తన ఘనతగా చెప్పుకుంటున్నారు. ఇటీవల, ఆయన కుమారుడు కూడా కామారెడ్డిలో 2023 ఎన్నికలలో కేసీఆర్ గెలిస్తే భూముల ధర 20 రెట్లు పెరుగుతుందని ఆశ పెడుతున్నారు. ఇది చాలా విచిత్రమైన రాజకీయం.

భూమి అంగడి సరుకా?

భూమిని ఒక వస్తువుగా, జీవం లేని ఆస్తిగా గత మూడు దశాబ్దాలుగా పరిగణిస్తున్నారు. రియల్ ఎస్టేట్ రంగం వృద్ధికి భూమిని ప్రధాన పెట్టుబడిగా మార్చారు. భూమి ఒక జీవం ఉన్న ప్రకృతి వనరు. మొత్తం పుడమి మీద నేల రకరకాలుగా స్థానిక పర్యావరణాన్ని బట్టి ఉంటుంది. నేల, నీరు, ఇతర ప్రకృతి వనరుల మధ్య దగ్గర సంబంధం ఉంటుంది. రకరకాల నేలలు భూమి మీద కనపడుతాయి. నీరు, మొక్కలు, చెట్లు, పశు పక్ష్యాదులు, క్రిమి కీటకాలు, బ్యాక్టీరియా, ఇత్యాది అన్ని రకాల జీవాలు ఈ వైవిధ్యం కలిగిన నేలల మీద జీవిస్తాయి. గుట్టలు, కొండలు, రాళ్లు, రప్పలు, మైదానాలు, లోయలు, ఇసుక వగైరా కూడా ఈ భూమి లక్షణాలను ప్రకటిస్తాయి. భూమి లేనిదే నీరు లేదు. నేలను బట్టి చెట్లు, మొక్కలు ఉంటాయి. పచ్చదనం నేలలను సంరక్షిస్తుంది. వైవిధ్యభరితమైన నేలలు, దాని మీద ఆధారపడిన ప్రకృతిని మరిచి భూమిని ఒక అంగడి సరుకుగా మార్చినాము.

బ్రిటిష్ వారి భూ పరిపాలనలో భూమి ఒక వైవిధ్యభరితమైన ప్రకృతి వనరు అనే స్పృహ తక్కువ. స్వతంత్ర భారత దేశంలో మన సంస్కృతికి భిన్నంగా అదే కొనసాగించినాము. ప్రత్యేక తెలంగాణా రాష్ట్రంలో ఈ పాశ్చాత్య భూ పరిపాలన వ్యవస్థ ఇంకొక మెట్టు దిగజారింది. భూ వినియోగం రాసుకునే నియమం పూర్తిగా ఎత్తివేసి అన్ని రకాల భూములను ఒకే గాటన కడుతున్న వైనం చూస్తున్నాము. నేల ఏదైనా, ప్రస్తుతం భూ వినియోగం ఏదైనా కూడా రికార్డులలో రాయరు. కొండలు, గుట్టలు, చెల్కలు, ర్యాగడి, కంచెలు, పంట పొలాలు, చెరువులు, ఏవైనా వినియోగం రాయరు. కేవలం అమ్మకాలు, కొనుగోళ్ళ ద్వారా ఆదాయం పొందడమే ప్రభుత్వ లక్ష్యం. ప్రభుత్వ వైఖరి వల్ల రాష్ట్ర వ్యాప్తంగా భూమి ధర పెరిగింది. పక్కన ఆంధ్ర ప్రదేశ్‌తో పోల్చి ఈ విధంగా మనం ఆంధ్రోళ్ల మీద విజయం సాధించినాము అంటారు ప్రభుత్వ పెద్దలు. భూమి ధరలు పెరిగితే ఆంధ్రోళ్లకు నొప్పి ఉండదు. మనకు ఉంటుంది. భూమి లేని కుటుంబాలు ఎక్కువగా ఉన్న తెలంగాణా రాష్ట్రంలో ఈ సంఖ్య పెంచడానికి కంకణం కట్టుకున్నట్లుంది. ఈ ధరల వల్ల కొత్తగా భూమి కొనుక్కునే స్థోమత 90 శాతం తెలంగాణా జనాభాకు లేదు. ముస్ముందు సొంత ఇల్లు కలగానే మిగులుతుంది. భూమి ఆహార ఉత్పత్తి నుంచి వ్యాపారానికి మళ్ళుతుంది. తెలంగాణాలో ఆహార ఉత్పత్తి కుంటుపడుతుంది. ఆహార దిగుమతులు పెరుగుతాయి. ధరలు పెరుగుతాయి. అందరికి అన్ని రకాల పోషక ఆహారం దొరకదు. గ్రామీణ ఉపాధి ఇంకా తగ్గుతుంది.



దశాబ్దాల క్రితం భూముల సర్వే జరిగింది. అందులో ఎన్ని లోపాలు ఉన్నాయో తెలవదు. భూముల సర్వే జరపకుండా, తాత్సారం చేస్తూ తెలంగాణా ప్రభుత్వం భూమి యాజమాన్యంలో మార్పులు చేస్తున్నది. సమగ్ర భూముల సర్వే చేయాలని భూ చట్టాల నిపుణులు కోరుతున్నారు. ఈ సర్వేలో భూమి లక్షణాలు (నేల స్వభావం వగైరా), వినియోగం కూడా కలగల్పితే సంపూర్ణ సమాచారం వస్తుంది. రైతుల దగ్గర ఉన్న ఒకే ఒక్క ఆధారం వారి సొంత పాసు పుస్తకం. జమాబంది పద్ధతి ద్వారా, రైతుల దగ్గరి పాసు పుస్తకాల ద్వారా భూయాజమాన్య సమస్యలు పరిష్కరించవచ్చు. అన్ని రకాల భూ రికార్డులకు చట్టబద్ధత కల్పిస్తూ, ఆర్వోఆర్ చట్టం సవరించాలి.

ఇంకా తెల్లదొరల దృక్పథమేనా?

మార్పు రావాల్సింది భూ పరిపాలన విషయంలో మాత్రమే కాదు. భూమి పట్ల ప్రభుత్వానికి, ప్రజలకు ఎటువంటి దృక్పథం ఉండాలి అనేది కూడా ముఖ్యం. టొరెన్స్ పద్ధతి వలసవాదులు, తాము ఆక్రమించిన భూముల మీద హక్కులు పొందడానికి తెచ్చింది. ఆస్ట్రేలియాలో, అమెరికాలో, ఇంకా వేరే దేశాలలో ఈ పద్ధతిని ప్రాంతీయులు, ఆదివాసీల సంప్రదాయ హక్కులను హరించటానికి తెల్లదొరలు రూపొందించారు. బ్రిటిష్ పాలకులు మన దేశంలో తమ భూ పరిపాలన అమలు చేయటానికి రూపొందించిన రెవిన్యూ విధానాన్ని స్వతంత్ర భారతదేశం మార్చలేదు. ప్రైవేటీకరణ, భూముల ఏకీకరణ అంతర్గత లక్ష్యాలుగా ఉన్న టొరెన్స్ పద్ధతిలోనే భూరికార్డుల నిర్వహణ ఉండడానికి ప్రపంచ బ్యాంకు మన దేశానికి నిధులు, శిక్షణ, ప్రాజెక్టులు ఇచ్చింది. 'ధరణి' ఈ ఆలోచన స్రవంతి నుంచి వచ్చిందే.

సంప్రదాయ హక్కుల విధానంలో భూమి ఉపయోగంలో వ్యక్తి కన్నా సమాజానికి అవకాశం ఉంటుంది. దీనికి అనేక ఉదాహరణలు ఉన్నాయి. శిఖం భూమి, చెట్టుకు పట్టాలు, పోడు వ్యవసాయం, చెరువు యాజమాన్యం, వగైరా. చెరువులో శిఖం భూమిలో పేదలకు ఆరుతడి పంటలు వేసుకునే అవకాశం సమాజం కల్పించింది. నదిలో, వాగులో కూడా ఈ తరహా ఆహార ఉత్పత్తికి సమాజం నుంచి అనుమతి ఉన్నది. చెట్టు పట్టాలు కూడా ఈ కోవలో నుంచి వచ్చినవే. గ్రామంలో ఒక చెరువులో నీటి నిలువ బట్టి, ఋతువులను బట్టి ఒక్కొక్క సామాజిక వర్గానికి హక్కులు కల్పించారు. సమాజానికి భూమి హక్కులు, వ్యక్తులకు కాకుండా, సామూహిక యాజమాన్యాన్ని సూచిస్తుంది. భూమి ఒక ఉమ్మడి ఆస్తిగా నిర్వహించడం చాలా అవసరం. సహజ వనరుల స్థిరమైన నిర్వహణ, సంస్థాగత రుణాలకు, వివిధరకాల కార్యకలాపాల కోసం కమ్యూనిటీ భూమి హక్కులను పొందడం చాలా కీలకం.

ఆక్స్‌ఫామ్ సంస్థ నివేదిక ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా 250 కోట్ల మంది ప్రజలు సంప్రదాయ, సమాజ భూములపై ఆధారపడి జీవిస్తున్నారు. సమష్టిగా ఉపయోగించబడే లేదా నిర్వహించబడే ఈ భూములు ప్రపంచంలో 50 శాతం కంటే ఎక్కువగా ఉన్నాయి. అయితే, ఈ భూములను శతాబ్దాలుగా పరిరక్షిస్తున్న ఆదివాసులు, మూల వాసులు, స్థానిక ప్రజలు, వారి సంఘాల చేతులలో ఆధునిక చట్టాల చట్రంలో ఐదవ వంతు మాత్రమే కలిగి ఉన్నారు. సాంస్కృతిక వైవిధ్యాన్ని పరిరక్షించడంలో, పేదరికం, ఆకలిని ఎదుర్కోవడంలో భూమిపై స్థానికులకు పూర్తి చట్టపరమైన యాజమాన్యం పోషించే పాత్ర ఎంత కీలకమైనది అని నిరూపించే అధ్యయనాలు ఉన్నాయి. అందరికీ భూమి అందుబాటులో ఉండడం చాలా అవసరం. సామాజిక (కమ్యూనిటీ) భూమి హక్కులను గుర్తించడంలో వైఫల్యం వల్ల స్థానిక ప్రజల మానవ హక్కులను అణగదొక్కడమే కాకుండా ఆహార భద్రతను సాధించడంలో, వాతావరణ మార్పులతో పోరాడే మానవాళి సామర్థ్యాన్ని కూడా తగ్గిస్తుంది. ఎంత చిన్న కమతం అయినా స్థానిక ప్రజల ఆహార అవసరాలను తీరుస్తూ, ఉత్పాదకతను పెంచుతూ, కుటుంబ ఆదాయాన్ని రెట్టింపు చేయగలదు. జనాభా పెరుగుతున్నందున ప్రపంచ ఆహార ఉత్పత్తిని పెంచడానికి ఇది కీలక వ్యూహం.

వ్యాసకర్త విధాన విశ్లేషకులు | 90102 05742

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

సూచన



ఇన్‌హేలర్లు వాడే పేషెంట్లు, వాటిని వాడిన తర్వాత నోటిని శుభ్రం చేసుకోవడం మరిచిపోవద్దు. అది 'ఓరల్ థ్రష్' (నోట్లో వచ్చే ఫంగల్ ఇన్ఫెక్షన్) రాకుండా నిరోధించగలదు.

– జోయీతా, ఫిజీషియన్

రాజకీయాలను మార్చేది...



పాకిస్తాన్ నుంచి ఎంత దారుణంగా అఫ్గాన్ శరణార్థులు బయటికి నెట్టబడుతున్నారు అన్నది... పాక్‌–అఫ్గాన్ సంబంధాలకు మాత్రమే నిర్ణయాత్మక క్షణం కాదు. మొత్తంగా డ్యూరాండ్ రేఖకు అటూ ఇటూ ఉన్న పష్తూన్ రాజకీయాలకు కూడా.

– తిలక్ దేవేశర్, పాక్ అంశాల రచయిత

అవునా?



జో బైడెన్ కంటే డోనాల్డ్ ట్రంప్ మరింత మానసికంగా చురుకైనవాడనీ, ప్రపంచానికి శాంతి సుస్థిరతలను తేగలడనీ అమెరికన్లు భావిస్తున్నట్టు 'న్యూయార్క్ టైమ్స్', 'సీబీఎస్ న్యూస్' నిర్వహించిన పోల్స్ సూచిస్తున్నాయి. చెప్పాలంటే... నాకైతే ఏం చెప్పాలో అర్థం కావట్లేదు.

– మెహిదీ హసన్, టీవీ షో హోస్ట్

ఇంటిని నిరసిస్తారు



ఆంగ్ల ప్రపంచంలోని విశ్వవిద్యాలయాల ప్రధాన లక్ష్యాల్లో ఒకటి ఏమిటంటే, తర్వాతి తరపు తోలుబొమ్మల్ని తీర్చిదిద్దడం. తమ సొంత సంస్కృతిని నీచంగా చూసేలా, తమ సొంత మనుషుల్ని విలువలేనివారిగా జమకట్టేలా ఈ తోలుబొమ్మలకు శిక్షణ ఇస్తారు. దీనిద్వారా భవిష్యత్ పాలకుల నుంచి జీవితకాల ప్రాపకం సంపాదిస్తారు.

– సూర్య కానేగావ్‌కర్, కాలమిస్ట్

సంపూర్ణ విజయం



భారత మహిళల హాకీ జట్టు డిఫెండింగ్ ఛాంపియన్ జపాన్‌ను 4–0 స్కోరుతో ఓడించి ఆసియన్ ఛాంపియన్స్ ట్రోఫీని గెలుచుకుంది. మనం ఆడిన ఏడింటిలో అన్ని మ్యాచులనూ మన అమ్మాయిలు గెలిచి టూర్నమెంటు మొత్తంలో తమ పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించారు. గొప్ప యుగారంభానికి సిద్ధం.

– రాహుల్ రవీంద్రన్, నటుడు

ముందే వెలుగులు



తైవాన్ నుంచి ముందస్తుగా దీపావళి శుభాకాంక్షలు. దీపావళి వేడుకలు గొప్పగా మొదలయ్యాయి. తైవాన్‌లో దీపావళి టపాకాయాలను కాలుస్తుంటే చూడటం ఉద్వేగభరితంగా అనిపించింది. (ఇండియా తైపేయి అసోసియేషన్ నవంబర్ 5న వేడుకలు జరిపింది.)

– సనా హష్మీ, ఫెలో

అవి రానట్టేనా?



ప్రపంచ ఆకలి సూచీలో ఇండియా 125 దేశాల్లో 111వ స్థానంలో ఉంది (అక్టోబర్ 13, 2023). ఇండియా ఆ ర్యాంకును తిరస్కరించింది. ఇప్పుడు ప్రధానేమో 'ఆకలితో జనాలు నిద్రపోకూడదని' పీఎంజీకేఏవై(ప్రధాన్ మంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన)ని మరో ఐదేళ్లపాటు కొనసాగించాలని నిర్ణయించారు. పదేళ్ల 'అచ్ఛే దిన్' (మంచి రోజులు) తర్వాత ఇదా పరిస్థితి?

– కపిల్ సిబాల్, రాజ్యసభ సభ్యుడు

ఇన్ బాక్స్

మాదిగల కల నిజమవుతుందా?

2004లో సుప్రీంకోర్టులో కొట్టివేయబడ్డ ఆంధ్రప్రదేశ్ (ఉమ్మడి) ఎస్సీల వర్గీకరణ అంశంపై తమ తీర్పును పునఃపరిశీలన చేసుకోవాలి అని భావిస్తున్నట్టూ, దీనిపై 7 లేదా అంతకంటే ఎక్కువ మంది సభ్యుల ధర్మాసనం ఏర్పాటు చేయాలి అని ప్రధాన న్యాయమూర్తిని కోరింది తీర్పు వెలువరించిన ధర్మాసనం.

75 ఏళ్ళ స్వతంత్ర దేశంలో 8 లక్షల ఆదాయం ఉన్న అగ్ర వర్ణ పేదలకు రిజర్వేషన్లు అందాయి. దేశ స్థాయిలో బీసీల వర్గీకరణకు మార్గం సుగమం అవుతోంది. కేంద్రం దీనిపై కమిషన్ వేసి కసరత్తు చేస్తోంది. మైనారిటీలకు రిజర్వేషన్లు లభిస్తున్నాయి. కానీ ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల విషయంలో ఎటువంటి మార్పూ లేదు. రాజకీయ పార్టీలలో అందరి మద్దతు ఉన్న వర్గీకరణ ఎందుకు కావడం లేదో, అది కోరుకునే సామాన్య ప్రజానీకానికి అర్థం కాదు.

ప్రజా ఉద్యమం నుండి రాజకీయ పరిష్కారం దాకా, చివరికి కోర్ట్ మెట్ల దాకా ఎక్కింది మాదిగ దండోరా! కానీ ఈ దేశంలో న్యాయం మామూలు లేట్ కాదు, ఓ జీవిత కాలం లేట్. ఇది వర్గీకరణ నేపథ్యం. ఇటీవల తెలంగాణ పర్యటనలో ప్రధాని నరేంద్ర మోదీని కృష్ణ మాదిగ కలిశారు. 2013 లోక్‌సభ ఎన్నికల సందర్భంగా వర్గీకరణ పట్ల సానుకూలంగా స్పందించారు మోదీ. కానీ చర్యలు శూన్యం. ఇప్పుడు 2023లో అంటే ఓ దశాబ్దం తరువాత మళ్లీ కలిశారు. ఇప్పటికైనా ఈ సమస్యకు ప్రధాని చొరవ చూపాలని మాదిగ సమాజం కోరుకుంటోంది. తెలంగాణఎన్నికల ప్రచారంలో భాగంగా మోదీ రాష్ట్రానికి రానున్నారు. నవంబర్ 11న సికింద్రాబాద్ పెరేడ్ గ్రౌండ్‌లో మాదిగల 'విశ్వరూప మహాసభ'కు హాజరుకానున్నారు. దేశ ప్రధానే సభకు వస్తుండటంతో ఇకనైనా సమస్య పరిష్కారం అవుతుందని మాదిగ సమాజం ఆశగా ఎదురు చూస్తోంది. మోదీ మాదిగల కోరిక నెరవేరుస్తారో లేదో కొద్ది రోజుల్లో తేలనుంది.

– పచ్చల రాజేష్, పీహెచ్‌డీ స్కాలర్
(నవంబర్ 11న సికింద్రాబాద్‌లో మాదిగల విశ్వరూప మహాసభ)

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

యువత చొరవ చూపాలి...

అభిప్రాయం



డా॥ నూకల విజయలక్ష్మి

భారతదేశానికి గొప్ప సంపద యువత. అధిక యువశక్తి ఉన్న దేశమైనా భారత్ ఇంకా అభివృద్ధి చెందుతున్న దేశంగానే ఉండిపోయింది. అందుకు కారణం యువతను పూర్తిగా ఉపయోగించుకోలేక పోవడమే. యువశక్తిని ఉపయోగించుకోకపోవడం వల్ల నిరుద్యోగం రోజు రోజుకూ పెరిగిపోతోంది. అంతేకాదు, అనుత్పాదక, అసాంఘిక కార్యకలాపాల్లోకి యువత జారుకుంటున్నారు. యువత మాదక ద్రవ్యాలకు అలవాటు పడడం, టెర్రరిజం వైపు ఆకర్షితులు అవ్వడం, మొబైల్ ఫోన్, సోషల్ మీడియాకు బానిసలుగా మారడం వంటి వాటినీ చూడవచ్చు. కెరీర్‌ను నిర్మించుకొనేందుకు కావలసిన సలహా సంప్రదింపులూ, మార్గదర్శకత్వం, ఆర్థిక వెన్నుదన్నులకు సంబంధించిన సమాచారం అందించే వ్యవస్థ అందరికీ అందుబాటులో ఉంటే పరిస్థితి మరో విధంగా ఉంటుంది.

స్వయం ఉపాధికి సంబంధించిన అనేక ప్రభుత్వ పథకాల గురించిన సమాచారం యువతను చేరడం లేదు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాలు అనే తేడా లేకుండా ఇరు రంగాలలోని అవకాశాలను యువత ఒడిసి పట్టుకోవాలి. అనేక స్వచ్ఛంద సేవాసంస్థలూ దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఇటువంటి సంస్థల్లోని అవకాశాలనూ వినియోగించుకోవాలి. ఉదాహరణకు 'టీచ్ ఫర్ ఇండియా' అనే స్వచ్ఛంద సేవా సంస్థ పిల్లలకు బోధించడంలో ఆసక్తి ఉన్న యువతకు రెండు సంవత్సరాల ఫెలోషిప్‌ను అందిస్తోంది. కళాశాల గ్రాడ్యుయేట్లు, పని చేసే నిపుణులను... తక్కువ ఆదాయ పాఠశాలల్లో రెండు సంవత్సరాల పాటు పూర్తి సమయం ఉపాధ్యాయులుగా సేవ చేయడానికి ఇది నియ మిస్తుంది. ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలి. ఎంపికయ్యి రెండేళ్ల పని చేసిన తర్వాత ఇంకా పై చదువులు చదువుకోవాలనుకుంటే వారికి విదేశాలలో కానీ, మన దేశంలో కానీ మంచి పేరున్న విశ్వవిద్యాలయాలలో ప్రాధాన్యం లభిస్తుంది. ఈ అనుభవంతో యువత ఒక మంచి భవిష్యత్తును ఏర్పరచుకునే అవకాశం ఏర్పడుతుంది.



భారత ప్రభుత్వం నేటి యువతరానికి 'స్కిల్ డెవలప్మెంట్ నైపుణ్యాభివృద్ధి కేంద్రాల'ను ఏర్పాటు చేస్తోంది. దీని ద్వారా విజ్ఞాన, ఆర్థిక, పారిశ్రామిక, సేవా రంగాలలో యువతను నైపుణ్యవంతులుగా తీర్చిదిద్దేందుకు అవకాశం కల్పిస్తోంది. దానిని యువత ఉపయోగించుకుంటే వారి జీవితానికి తగిన భరోసా ఏర్పడుతుంది.

జాగృతి సేవా సంస్థాన్ అనే ఎన్‌జీఓ 'జాగృతి యాత్ర' ద్వారా యువతను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతోంది. ఇప్పటికే దేశ విదేశాలకు చెందిన వేలాదిమంది యువత ఈ 8,000 కిలోమీటర్ల రైలు ప్రయాణంలో 14 రోజుల పాటు పాల్గొని తమ జీవితాలను మార్చుకొన్నారు. ఈ యాత్ర ముఖ్య ఉద్దేశం యువతను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడం.

'సిటిజన్స్ ఫర్ అకౌంటబుల్ గవర్నెన్స్' (సీఏజీ) విద్యా, వృత్తిపరమైన ప్రత్యేక అవకాశాలు కల్పిస్తోంది. ఈ సంస్థ ద్వారా డిజిటల్, ఆన్ గ్రౌండ్ రాజకీయ ప్రచారాన్నీ రూపొందించి, ప్రచారం చేయడానికీ యువతరాన్ని ఉపయోగించుకొంటున్నారు. ఇక్కడ పనిచేసిన అనుభవంతో గవర్నమెంట్‌కు సంబంధించిన వివిధ రకాల ప్రాజెక్టులలో పనిచేయడానికి అవకాశం లభించవచ్చు.

ఇటువంటి సంస్థలు దేశంలో ఎన్నో ఉన్నాయి. ఇలా ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉన్న విద్యా, ఉపాధి అవకాశాల సమాచారం అందించగలిగితే యువతకు ఎంతో మేలు జరుగుతుంది. ఇప్పుడు సమాచారమే కీలకమైన అంశమనేది మరువరాదు.

వ్యాసకర్త తెలుగు అధ్యాపకురాలు
vepa.vijayalakshmi@gmail.com

అన్నీ కావాలంటే...

జ్యోతిర్మయం

'విద్యార్థీ చేత్ త్యజేత్ నిద్రాం, అర్థార్థీ చేత్ త్యజేత్ సుఖమ్' అని ఒక లోకోక్తి. విద్య కావాలని కోరుకొనేవాడు నిద్రనూ, ధనం సంపాదించాలని కోరుకొనేవాడు సుఖాన్నీ వదులుకోవాలనేది దీని భావం. ఇది లోకానుభవం కూడా. విద్యార్జన మీద ఆసక్తి కలవాళ్లు రాత్రులు చాలా పొద్దు పొయ్యేదాకా చదువుతూ ఉంటారు. అలాగే ధనం సంపాదించాలని కోరుకొనేవాడు ఇతర విషయాలన్నీ పక్కనపెట్టి, అనుక్షణం ధనార్జన మీదే దృష్టి ఉంచాలి.

వీళ్ళు ఎందుకింత కష్టపడతారు, ఎందుకిలా నిద్రనూ, సుఖాలనూ త్యాగం చేస్తారు అంటే సమాధానం ఒకటే. లౌకికమైన లబ్ధిని దేన్ని పొందాలన్నా, దాని కోసం మరొక దాన్ని వదులుకోవాల్సిందే. ఇల్లూ వాకిలీ, పిల్లా పాపా కావాలనుకొంటే, ఏ బాధ్యతలూ బరువులూ బాదరబందీలూ లేని స్వేచ్ఛా జీవితం వదులుకోక తప్పదు. వస్తువేదయినా కావాలంటే, దానికోసం కష్టించి సంపాదించుకొన్న ధనం ధార పోయాలి. అతిగా తినాలనుకొంటే, ఆరోగ్యాన్ని వదులుకోవాలి. ఆరోగ్యంగా ఉండాలంటే, జిహ్వా చాపల్యాన్ని వదులుకోవాలి. పేరు, ప్రసిద్ధి సంపాదిస్తే, అనామకులకుండే మామూలు సౌఖ్యాలు అనుభవించేందుకు ఉండదు. అసామాన్యుడు కావాలంటే, సామాన్యతలో ఉండే ఎన్నో సదుపాయాలు కోల్పోక తప్పదు.

మరి, అన్నీ కావాలనుకొన్నవాడు ఏం చేసేట్టు? జ్ఞానులు ఇందుకు కనుక్కొన్న మార్గం ఒక్కటే అనే వారు ఈ మధ్యనే పరమపదించిన దిగంబర జైనముని తరుణ సాగరులు. ఒకటి కావాలంటే మరొకటి వదిలేయక తప్పదు కనక అన్నీ కావాలంటే అన్నీ వదిలేయడమే! ప్రాపంచిక విషయాలలో ఆసక్తి (సంగం) ఎంతగా త్యజిస్తే, అంత సంపూర్ణమైన ఆనందం లభిస్తుంది. సంగత్యాగి అనుభవించే ఆనందం సార్వభౌముడికి కూడా ఉండదు. కనుక అసలయిన ఆనందం కోరే వాడికి సర్వసంగ త్యాగం చేయగలిగిన గురువులే ఎక్కువ ఉపయోగకరమయిన ఆదర్శం. అన్నీ ఉన్నా అనుక్షణం అసంతృప్తితో, ఆందోళనలతో కాలం దొర్లించే సమ్రాట్టులు కారు. ఫలానాది కావాలనే తీవ్ర తపన లేకుండా కర్తవ్యాలు చేసుకొంటూ జీవితం నడిపేవాడికి, ఒకటి పొందలేదన్న చింత ఉండదు, మరొకటి వదులుకోవలసి వచ్చిందన్న వంతా ఉండదు!

– ఎం. మారుతి శాస్త్రి

యాదాద్రీశుడి సన్నిధిలో త్రిపుర గవర్నర్

యాదగిరిగుట్ట/సాక్షి, యాదాద్రి: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామిని త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి సోమవారం కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ఉత్తర రాజగోపురం వద్ద గవర్నర్‌కు ఆలయ ఆచార్యులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్టా అలంకారమూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. గవర్నర్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులకు అర్చకులు వేద ఆశీర్వచనం చేయగా ఈఓ గీతారెడ్డి లడ్డూ ప్రసాదం అందజేశారు. అనంతరం ఇంద్రసేనారెడ్డి భువనగిరిలోని రహదారి బంగ్లాలో విలేకరులతో మాట్లాడుతూ, భువనగిరితో 1980 నుంచి తనకు అనుబంధం ఉందన్నారు. గవర్నర్ హోదాలో భువనగిరి రాగానే ఆత్మీయులను కలసినట్లుందన్నారు. కాగా, త్రిపురలో శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం నిర్మించి భక్తులకు దర్శనం కల్పించేలా చర్యలు తీసుకోవాలని యాదాద్రి ఆలయ ఈఓ గీతారెడ్డిని కోరినట్లు ఆయన చెప్పారు.


త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డికి పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతున్న ఆచార్యులు

యాదాద్రిలో 14 నుంచి కార్తీక పూజలు

యాదగిరిగుట్ట: కార్తీకమాసం సందర్భంగా ఈనెల 14వ తేదీ నుంచి డిసెంబర్ 12వ తేదీ వరకు యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో పూజలు, వ్రతాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నట్లు ఆలయ ఈవో గీతారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సత్యనారాయణస్వామి వ్రత మండపంలో రోజూ ఆరు బ్యాచ్‌లుగా వ్రత పూజలు ఉంటాయని వివరించారు. మొదటి బ్యాచ్ ఉదయం 6.30 గంటల నుంచి 7.30 గంటల వరకు, రెండో బ్యాచ్ ఉదయం 8.30 గంటల నుంచి 9.30 గంటల వరకు, మూడో బ్యాచ్ 10.30 గంటల నుంచి 11.30 గంటల వరకు నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 1.30 గంట వరకు నాలుగో బ్యాచ్, 2.30 గంటల నుంచి 3.30 గంటల వరకు అయిదో బ్యాచ్, సాయంత్రం 4.30 గంటల నుంచి 5.30 గంటల వరకు ఆరో బ్యాచ్ వ్రత పూజలకు ఏర్పాట్లు చేయనున్నట్లు వెల్లడించారు. పాతగుట్ట శ్రీపూర్వగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలోనూ రోజూ ఐదు బ్యాచ్‌లుగా వ్రత పూజలు ఉంటాయని వెల్లడించారు.

'బూదాటి'కి డి.లిట్



సాక్షి, హైదరాబాద్: బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం తెలుగు శాఖాధ్యక్షుడు ఆచార్య బూదాటి వెంకటేశ్వర్లుకు అదే విశ్వవిద్యాలయం డి.లిట్ పట్టాను ప్రదానం చేసింది. ఆయన 'తెలుగు సాహిత్యంలో పాత్రల సృజనాత్మక ప్రక్రియ - ఒక అధ్యయనం' అంశంపై సిద్ధాంత వ్యాసం రాసి బెనారస్ హిందూ విశ్వవిద్యాలయానికి సమర్పించారు. ఈ మేరకు విశ్వవిద్యాలయం అక్టోబర్ 30న బూదాటికి డి.లిట్ పట్టాను ప్రదానం చేసింది.

'ఎస్సీ వర్గీకరణ చేస్తే బీజేపీకి కర్ణాటక గతే'



సాక్షి, హైదరాబాద్: ఎస్సీ వర్గీకరణ అంశాన్ని లేవనెత్తితే బీజేపీకి కర్ణాటక గతే పడుతుందని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య సోమవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఈనెల 11న మాదిగల విశ్వరూప బహిరంగ సభకు ప్రధాని మోదీ హాజరు కానున్నారనే సమాచారం ఉందని, ఈ సభలో ఎస్సీ వర్గీకరణ చేస్తామని ఎలాంటి హామీ ఇచ్చినా మాలలంతా తీవ్రంగా ప్రతిఘటిస్తారన్నారు. ఎస్సీ వర్గీకరణ అంశం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించినదని, ప్రత్యేక తెలంగాణ ఏర్పాటుతోనే ఎస్సీ వర్గీకరణ అంశం ముగిసిందన్నారు. ప్రస్తుతం తెలంగాణలో మాల మాదిగలు అన్ని రంగాల్లో సమానంగా ఉన్నారని, తెలంగాణలో ఆర్థిక, సామాజిక, విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో మాలలకంటే మాదిగలే ముందున్నారన్నారు. ఈ నెల 11న ఇందిరా పార్కు వద్ద మాలల యుద్ధ భేరి బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు చెన్నయ్య తెలిపారు.

మార్పుతో మేలు జరిగేనా?

జేఈఈ మెయిన్స్‌లో గణనీయమైన మార్పులు

సిలబస్ తగ్గించిన ఎన్‌టీఏ.. రాసేవారి సంఖ్య పెంపే లక్ష్యం

సాక్షి, హైదరాబాద్: ఈసారి జరిగే జేఈఈ మెయిన్స్‌లో గణనీయమైన మార్పులు తెచ్చారు. ఫిజిక్స్, మేథ్స్, కెమిస్ట్రీ సబ్జెక్టుల్లో కొన్ని టాపిక్స్ ఎత్తేశారు. ఈ పరిణామంపై సర్వత్రా చర్చ జరుగుతోంది. జనవరిలో జరిగే జేఈఈ మెయిన్స్‌కు ఇప్పటికే విద్యార్థులు సన్నద్ధమయ్యారు. ఈ దశలో సిలబస్ మార్పులను ఎన్‌టీఏ ప్రకటించడంతో ఇది రాష్ట్ర విద్యార్థులపై కొంత ప్రభావం చూపే అవకాశం కనిపిస్తోంది. ఎందుకంటే సిలబస్ నుంచి తొలగించిన టాపిక్స్‌కు కూడా విద్యార్థులు ప్రిపేరయ్యారు. ఇప్పుడు వాటిని తప్పించడంతో మిగిలిన టాపిక్స్‌లో పోటీ తీవ్రంగా ఉండే వీలుంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర సిలబస్‌తో ఇంటర్ చేసే వాళ్లు మరికొంత శిక్షణ తీసుకోవాల్సి ఉంటుందని... అలాగే వారంతా ఏప్రిల్‌లో జరిగే రెండో దశ మెయిన్స్‌కు హాజరు కావడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

విద్యార్థుల సంఖ్య పెరిగేనా?

సిలబస్ తగ్గించడంతో ఈసారి మెయిన్స్ రాసేవారి సంఖ్య పెరుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. దీంతో కటాఫ్ మార్కుల విషయంలోనూ కొన్ని మార్పులు ఉండొచ్చని చెబుతున్నారు. వాస్తవానికి జేఈఈ రాసేవారి సంఖ్య కొన్నేళ్లుగా తగ్గుతోంది. 2014లో



దేశవ్యాప్తంగా జేఈఈ మెయిన్స్ రాసినవారి సంఖ్య 12.90 లక్షలుకాగా 2022లో ఈ సంఖ్య 9.05 లక్షలకు తగ్గింది. వాస్తవానికి రాష్ట్రం నుంచి 2014లో జేఈఈ రాసిన వారి సంఖ్య 2 లక్షల వరకూ ఉండగా ప్రస్తుతం 1.30 లక్షలకు పడిపోయింది. అదే సమయంలో రాష్ట్ర ఎంసెట్ రాసేవారి సంఖ్య 2018లో 1.47 లక్షలు ఉండగా 2022లో ఇది 1.61 లక్షలకు పెరిగింది. రాష్ట్ర ఎంసెట్ ద్వారా విద్యార్థులు రాష్ట్రంలోని ఇంజనీరింగ్ కాలేజీల్లో సీట్లు పొందుతారు. జేఈఈ మెయిన్స్ ద్వారా ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీల్లో, అడ్వాన్స్‌డ్ ద్వారా ఐఐటీల్లో సీట్లు దక్కించుకుంటారు. సిలబస్ కఠినంగా ఉంటుందని కేంద్ర ప్రభుత్వ సంస్థలు అనుసరించే సిలబస్ చదివితే తప్ప మెయిన్స్ గట్టెక్కలేమనే భావన విద్యార్థుల్లో ఎక్కువవుతోంది. దీంతో చాలా మంది రాష్ట్ర స్థాయిలోని ఎంసెట్‌ను ఎంచుకుంటున్నారు. సిలబస్‌లో మార్పులు తేవడంతో ఈసారి జేఈఈ రాసే వారి సంఖ్య కొంతమేర పెరిగే వీలుందని విద్యారంగ నిపుణులు అంటున్నారు.

మేథ్స్ ఇక కఠినం కానట్టేనా?

కొన్నేళ్లుగా జేఈఈ మెయిన్స్ రాస్తున్న వారు ఎక్కువగా గణితం కష్టంగా ఉందని చెబుతున్నారు. కెమిస్ట్రీ నుంచి ఎక్కువగా స్కోర్ చేస్తున్న అనుభవాలున్నాయి. ఫిజిక్స్ నుంచి వచ్చే ప్రశ్నలు మధ్యస్తంగా ఉంటున్నాయని చెబుతున్నారు. ఇది దక్షిణాది విద్యార్థులకన్నా ఉత్తరాది రాష్ట్రాల విద్యార్థులను కలవరపెడుతోంది. మేథ్స్‌లో దక్షిణాది రాష్ట్రాల విద్యార్థులకు పట్టు ఉంటోంది. కాకపోతే గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు సరైన శిక్షణ అందుకోలేకపోతున్నారు. జేఈఈలో ఇచ్చే గణితంలో సుదీర్ఘ ప్రశ్నలుంటున్నాయి. దీనివల్ల ఎక్కువ సమయం కేటాయించాల్సి వస్తోందని చెబుతున్నారు. మేథ్స్‌లో ట్రిగ్నామెట్రిక్ ఈక్వేషన్స్, హైట్స్ అండ్ డిస్టెన్సెస్, ప్రిన్సిపుల్ ఆఫ్ మేథమెటికల్ ఇండక్షన్ వంటి టాపిక్స్ వచ్చే అవకాశం లేదని ఎన్‌టీఏ తెలిపింది. దీనివల్ల తేలికగానే జేఈఈ మెయిన్స్ ఉంటుందని నిపుణులు అంటున్నారు.

ఎంబీబీఎస్ రుసుముల చెల్లింపు పరిశీలిస్తాం

ప్రైవేటు యాజమాన్యాల పిటిషన్ విచారణకు స్వీకరించిన సుప్రీంకోర్టు

సాక్షి, న్యూఢిల్లీ: ఎంబీబీఎస్ విద్యార్థులు చెల్లిస్తున్న రుసుములను పరిశీలిస్తామని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. కోర్సు సమయం నాలుగున్నరేళ్లు కాబట్టి అంతే కాలానికి ఫీజు వసూలు చేయాలన్న హైకోర్టు ఆదేశాలను సవాల్ చేస్తూ తెలంగాణ ప్రైవేటు వైద్య, దంత కళాశాలల యాజమాన్యాలు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. అల్లంకి రమేష్ అసోసియేట్స్ దాఖలు చేసిన ఈ పిటిషన్ గతంలో జస్టిస్ ఇందిరా బెనర్జీ, జస్టిస్ సంజీవ్‌ఖన్నాలతో కూడిన ధర్మాసనం ముందుకు రాగా హైకోర్టు ఆదేశాలపై స్టే విధించి, నోటీసులు జారీ చేశారు. సోమవారం ఇదే పిటిషన్ జస్టిస్ సంజీవ్‌ఖన్నా, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టితో కూడిన ధర్మాసనం ముందుకొచ్చింది. యాజమాన్యాల తరఫు సీనియర్ న్యాయవాది ఎస్.నిరంజన్ రెడ్డి వాదనలు వినిపిస్తూ.. కోర్సు ఫీజు రూ.4.5 లక్షలైతే.. ఆ మొత్తాన్ని ఐదు విద్యా సంవత్సరాల్లో వసూలు చేస్తున్నామని తెలిపారు. ఇతర రాష్ట్రాల్లో వసూ లు విధానం ఎలా ఉందని ధర్మాసనం ప్రశ్నించగా.. అన్ని రాష్ట్రాలో ఇదే తరహాలో వసూలు చేస్తున్నారన్నారు. తెలంగాణ హైకోర్టు తప్పుగా అర్థం చేసుకొని నాలుగున్నరేళ్లకు ఫీజు ఎంతయితే అంతే వసూలు చేయాలని ఆదేశాలు ఇచ్చిందన్నారు. పిటిషనర్‌తో ఏకీభవించిన ధర్మాసనం పిటిషన్ విచారణకు స్వీకరిస్తున్నామని తెలిపింది.

క్లుప్తంగా...

పంజాబ్ 'ఆప్' ఎమ్మెల్యే జశ్వంత్ గజన్ మాజ్రా అరెస్టు!

చండీగఢ్: పంజాబ్‌లో అధికార ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) ఎమ్మెల్యే జశ్వంత్ గజన్ మాజ్రాను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అధికారులు సోమవారం అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. అయితే, దీనిపై ఈడీ అధికారులు స్పందించలేదు. ఎమ్మెల్యే జశ్వంత్ గజన్ మాజ్రా పలు కేసుల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. నకిలీ పత్రాలతో బ్యాంకుల నుంచి రూ.40 కోట్ల మేర రుణాలు తీసుకొని, తిరిగి చెల్లించకుండా మోసగించినట్లు ఆయనపై ఆరోపణలు వచ్చాయి. ఈ వ్యవహారానికి సంబంధించి సీబీఐ గత ఏడాది మే నెలలో ఎమ్మెల్యే నివాసాల్లో సోదాలు నిర్వహించింది. బ్యాంకుల నుంచి రుణాల వ్యవహారంలో మనీ లాండరింగ్ సైతం జరిగినట్లు ఈడీ గుర్తించింది. గత ఏడాది సెప్టెంబర్‌లో ఎమ్మెల్యే నివాసాల్లో సోదాలు జరిపింది. రూ.32 లక్షల నగదు, మొబైల్ ఫోన్లు, కంప్యూటర్ హార్డ్ డిస్కులు స్వాధీనం చేసుకుంది. మనీ లాండరింగ్ కేసు దర్యాప్తులో భాగంగా ఎమ్మెల్యే జశ్వంత్ గజన్ మాజ్రాను ఈడీ అధికారులు అరెస్టు చేసినట్లు సమాచారం.

ఉక్రెయిన్‌లో రష్యా క్షిపణి దాడి

19 మంది ఉక్రెయిన్ జవాన్లు మృతి

కీవ్: ఉక్రెయిన్‌లో సైనిక అవార్డుల ప్రదానోత్సవం జరుగుతుండగా రష్యా సైన్యం క్షిపణిని ప్రయోగించింది. ఈ ఘటనలో 19 మంది ఉక్రెయిన్ సైనికులు మరణించారు. ఉక్రెయిన్‌లోని జపొరిజాజియాలో శుక్రవారం ఈ సంఘటన జరిగింది. రష్యా క్షిపణి దాడిలో 19 మంది తమ జవాన్లు మరణించినట్లు ఉక్రెయిన్ సోమవారం ధ్రువీకరించింది. వీరంతా 128వ మౌంటెయిన్–అసాల్ట్ బ్రిగేడ్‌కు చెందినవారు. రష్యా క్షిపణి దాడిని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తీవ్రంగా ఖండించారు.

అమెరికాలో బాలలపైకి దుండగుడి కాల్పులు

సిన్సినాటి: అమెరికాలోని సిన్సినాటిలో ఓ సాయుధ దుండగుడు జరిపిన తుపాకీ కాల్పుల్లో 11 ఏళ్ల బాలుడు, ఒక మహిళ ప్రాణాలు కోల్పోగా మరో నలుగురు బాలలు గాయపడ్డారు. కారులో వచ్చిన దుండగుడు యథేచ్ఛగా 22 రౌండ్లు కాల్చినట్లు పోలీసు అధికారి టెర్రీ తెలిపారు. ఆ వెంటనే దుండగుడు ఘటనా స్థలి నుంచి మాయమ య్యాడన్నా రు. ఇదంతా క్షణాల్లో జరిగిపోయిందన్నారు. బుల్లెట్లు తగిలి 53 ఏళ్ల మహిళ, 11 ఏళ్ల బాలుడు ఘట నాస్థలిలోనే ప్రాణాలు కోల్పోగా, 12, 13, 15 ఏళ్ల ముగ్గురు బాలురు, 15 ఏళ్ల బాలిక గాయపడ్డారని తెలిపారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉందని ఆమె వివరించారు.

నేపాల్‌లో మరోసారి భూకంపం

కఠ్మాండు/న్యూఢిల్లీ: నేపాల్ ప్రజలను మరోసారి భూకంపం భయపెట్టింది. శుక్రవారం భూకంపం సంభవించిన పశ్చిమ నేపాల్‌లోని జజర్‌కోట్ పరిసర ప్రాంతాల్లో సోమవారం సాయంత్రం 4.31 గంటల సమయంలో భూమి కంపించింది. ఆ తర్వాత 4.40 సమయంలో 4.5 తీవ్రతతో మళ్లీ ప్రకంపనలు నమోదయ్యాయి. తాజా భూకంప కేంద్రం జజర్‌కోట్ జిల్లాలోని రమిదండాలో ఉందని, దీని తీవ్రత రిక్టర్ స్కేలుపై 5.8గా నమోదైందని అధికారులు తెలిపారు. దీని ప్రభావంతో రాజధాని కఠ్మాండులోనూ భూ ప్రకంపనలు చోటుచేసుకు న్నాయి. దీంతో ప్రజలు భయభ్రాంతులకు లోనయ్యారు. తాజా భూకంపంతో వాటిల్లిన నష్టం వివరాలు తెలియాల్సి ఉంది. కాగా, రిక్టర్ స్కేలుపై 6.4 తీవ్రతతో గత శుక్రవారం సంభవించిన భూకంపంలో మృతుల సంఖ్య 157కు చేరుకుంది.

క్లాస్ రూంలోకొచ్చి విద్యార్థినిని కరిచిన వీధి కుక్క

పాలక్కాడ్: వీధి కుక్క ఒకటి తరగతిలోకి ప్రవేశించి ఆరో తరగతి విద్యార్థినిని కరిచి గాయపరిచింది. ఈ ఘటన కేరళలోని పాలక్కాడ్ జిల్లా మన్నార్‌క్కాడ్‌లో చోటుచేసు కుంది. ఆ విద్యార్థిని ఉదయం 10.30 గంటల సమయంలో క్లాస్ రూంలోకి ప్రవేశించింది. ఆ వెనుకే వచ్చిన కుక్క ఆమెను కరిచింది. అప్పుడే వచ్చిన టీచర్, తోటి విద్యార్థుల కేకలతో పారిపోయింది. ఊళ్లో పిచ్చి కుక్క సంచరిస్తోందనే వార్తలతో తన కుమార్తెను కారులో తీసుకువచ్చి స్వయంగా దిగబెట్టి వెళ్లానని ఆమె తండ్రి మీడియాకు చెప్పారు. తమ ఇల్లు దగ్గర్లోనే ఉందని, ఆమె రోజూ నడిచే స్కూలుకు వస్తుందని అన్నారు. సకాలంలో క్లాస్ టీచర్ రావడంతో తన కుమార్తెకు పెద్ద ప్రమాదం తప్పిందని చెప్పారు. అదే కుక్క బారిన మరికొందరు కూడా పడ్డారన్నారు.

మాజీ డ్రైవరే హంతకుడు

బనశంకరి: బెంగళూరు నగరంలో సంచలనం సృష్టించిన గనులు, భూవిజ్ఞాన శాఖ డిప్యూటీ డైరెక్టర్ కేఎస్ ప్రతిమ (40) హత్య కేసులో నిందితుణ్ని పోలీసులు అరెస్టు చేశారు. చామరాజనగర జిల్లా మహదేశ్వరబెట్టలో దాగిన అతన్ని బెంగళూరు సుబ్రమణ్యపుర పోలీసులు గాలించి నిర్బంధించారు. ఉద్యోగం నుంచి తీసేశారనే ద్వేషంతో ఆమె మాజీ కారుడ్రైవరు కిరణ్ ఈ హత్యకు పాల్పడినట్లు నగర పోలీస్ కమిషనర్ బి.దయానంద సోమవారం తెలిపారు. కిరణ్ (32) స్వస్థలం బెంగళూరు కోణనకుంటె. కొన్ని సంవత్సరాలుగా ప్రతిమ ఆఫీస్ కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కొన్నిరోజుల కిందట ఒక యాక్సిడెంట్ చేయడంతో పాటు అక్రమ గనులపై దాడుల సమాచారం ముందుగానే గనుల యజమానులకు లీక్ చేసేవాడు. దీంతో ప్రతిమ అతడిని 10 రోజుల కిందటే ఉద్యోగం నుంచి తీసేయించారు.

ఇజ్రాయెల్ గుప్పిట్లో గాజా



గాజా స్ట్రిప్ సరిహద్దుల వెంట దూసుకెళ్తున్న ఇజ్రాయెల్ రాకెట్లు



ఖాన్ యూనిస్‌లోని భవన శిథిలాల్లో బాధితుల కోసం అన్వేషిస్తున్న ఓ పాలస్తీనా వాసి ఉద్వేగం



ఖాన్ యూనిస్‌లో శిథిలాల నుంచి చిన్నారి మృతదేహాన్ని వెలికి తీస్తున్న స్థానికులు



రఫాలో శిథిలాల మధ్య చిన్నారులు

రెండు ముక్కలుగా గాజా స్ట్రిప్

- అర్ధరాత్రి నుంచి ఉదయం దాకా దాడులు
- మిగిలిన ప్రాంతాలతో తెగిపోయిన ఉత్తర గాజా సంబంధాలు
- గాజా సిటీ దిశగా ఇజ్రాయెల్ సైన్యం
- 10,000 దాటిన మృతుల సంఖ్య

గాజా స్ట్రిప్: హమాస్ మిలిటెంట్ల భరతం పట్టడమే లక్ష్యంగా ఇజ్రాయెల్ సైన్యం ఉత్తర గాజాను పూర్తిగా చుట్టుముట్టింది. గాజా స్ట్రిప్‌లోని ఇతర ప్రాంతాలతో ఉత్తర గాజాకు సంబంధాలు తెగిపోయాయి. ఉత్తర గాజా మొత్తం దిగ్బంధంలో చిక్కుకుంది. గాజా స్ట్రిప్‌ను రెండు ముక్కలుగా విభజించామని ఇజ్రాయెల్ సైన్యం వెల్లడించింది. ఉత్తర గాజా ఇప్పుడు తమగుప్పిట్లో ఉందని పేర్కొంది. యుద్ధంలో ఇది చాలా ముఖ్యమైన దశ అని, ఇకపై కీలక దాడులు చేయబోతున్నామని తెలియజేసింది. గాజా సిటీలోకి అడుగుపెట్టడానికి ఇజ్రాయెల్ సేనలు ముందుకు కదులుతున్నాయి. సైన్యం ఆదివారం అర్ధరాత్రి నుంచి ఉత్తర గాజాపై నిప్పుల వాన కురిపించింది. వైమానిక దాడులు ఉధృతం చేసింది. 450 లక్ష్యాలను ఛేదించామని, మిలిటెంట్ల స్థావరాలను, సొరంగాలను ధ్వంసం చేశామని ఇజ్రాయెల్ సైన్యం ప్రకటించింది. సీనియర్ మిలిటెంట్ జమాల్ మూసా హతమయ్యాడని వివరించింది. హమాస్ కాంపౌండ్ ఒకటి తమ అధీనంలోకి వచ్చిందని పేర్కొంది. మిలిటెంట్లకు సమీపంలోనే ఉన్నామని, అతిత్వరలో వారిపై మూకుమ్మడి దాడి ప్రారంభిస్తామని ఇజ్రాయెల్ సైన్యం అధికార ప్రతినిధి లెఫ్టినెంట్ కల్నల్ రిచర్డ్ హెచ్ట్ వెల్లడించారు. హమాస్‌కు గాజా సిటీ ప్రధానమైన స్థావరం. మిలిటెంట్లు ఇక్కడ పటిష్టమైన సొరంగాల వ్యవస్థను నిర్మించుకున్నారు. పెద్ద సంఖ్యలో ఆయుధ నిల్వలను సిద్ధం చేసుకున్నారు. గాజా సిటీ వీధుల్లో ఇజ్రాయెల్ సైనికులతో ముఖాముఖి తలపడేందుకు వారు సిద్ధమవుతున్నట్లు స్థానిక మీడియా తెలియజేసింది.

ఒక్క రాత్రి 200 మంది బలి!

గాజాపై ఆదివారం రాత్రి నుంచి ఉదయం వరకూ ఇజ్రాయెల్ వైమానిక దాడుల్లో దాదాపు 200 మంది మరణించారని గాజా సిటీలోని అల్–షిఫా హాస్పిటల్ డైరెక్టర్ చెప్పారు. పెద్ద సంఖ్యలో మృతదేహాలు తమ ఆసుపత్రికి చేరుకున్నాయని తెలిపారు. చాలామంది క్షతగాత్రులు చికిత్స కోసం చేరారని వెల్లడించారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందన్నారు.

కాల్పుల విరమణకు ససేమిరా

గాజాపై దాడులకు విరామం ఇవ్వాలని, పాలస్తీనియన్లకు మరింత మానవతా సాయం అందేలా చర్యలు తీసుకోవాలంటూ మిత్రదేశం అమెరికా చేసిన సూచనను ఇజ్రాయెల్ లెక్కచేయడం లేదు. కాల్పుల విరమణ పాటించాలంటూ జోర్డాన్, ఈజిప్టు తదితర అరబ్ దేశాలు పదేపదే విజ్ఞప్తి చేస్తున్నా పట్టించుకోవడం లేదు. హమాస్ చెరలో ఉన్న 240 మంది బందీలను విడుదల చేసే వరకూ గాజాపై దాడులు ఆపే ప్రసక్తే లేదని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహూ తేల్చిచెప్పారు. గాజాలో సంక్షోభం మరింత ముదిరే పరిస్థితి కనిపిస్తుండడంతో అరబ్ దేశాలు ఆందోళన చెందుతున్నాయి. జోర్డాన్ సైనిక రవాణా విమానం సోమవారం ఉత్తర గాజాల్లో క్షతగాత్రులకు, రోగులకు అవసరమైన ఔషధాలు, వైద్య పరికరాలను జార విడిచింది. మరోవైపు ఇజ్రాయెల్–లెబనాన్ సరిహద్దుల్లో ఘర్షణలు ఆగడం లేదు. ఇరాన్ అండదండలున్న హెజ్బొల్లా మిలిటెంట్లు ఇజ్రాయెల్‌పై దాడులు సాగిస్తూనే ఉన్నారు. ఈ దాడులను ఇజ్రాయెల్ సైన్యం తిప్పికొడుతోంది. ఆదివారం రాత్రి ఇజ్రాయెల్ దాడుల్లో దక్షిణ లెబనాన్‌లో నలుగురు పౌరులు మరణించారు.

10,022 మంది పాలస్తీనియన్లు మృతి

ఇజ్రాయెల్–హమాస్ మిలిటెంట్ల మధ్య యుద్ధం మొదలై నెల రోజులవుతోంది. ప్రాణనష్టం నానాటికీ పెరిగిపోతోంది. గాజాలో మృతుల సంఖ్య 10 వేలు దాటింది. ఇజ్రాయెల్ సైన్యం భూతల, వైమానిక దాడుల్లో ఇప్పటివరకు 10,022 మంది పాలస్తీనియన్లు మరణించారని గాజా ఆరోగ్య శాఖ సోమవారం ప్రకటించింది. మృతుల్లో 4,100 మంది చిన్నారులు, 2,600 మంది మహిళలు ఉన్నారని తెలియజేసింది. వైమానిక దాడుల్లోనే ఎక్కువ మంది చనిపోయినట్లు తెలుస్తోంది. ఇజ్రాయెల్ భూభాగం వైపు హమాస్ మిలిటెంట్లు ప్రయోగించిన రాకెట్లలో 500కుపైగా రాకెట్లు గాజాలోనే కూలిపోయాయని, వాటివల్ల పెద్ద సంఖ్యలో పాలస్తీనియన్లు మరణించారని ఇజ్రాయెల్ సైన్యం చెబుతోంది. డేర్ అల్–బాలహ్ పట్టణంలో సోమవారం ఉదయం ఓ ఆసుపత్రి సమీపంలోనే 66 మృతదేహాలను సామూహికంగా ఖననం చేశారు.

ముగిసిన ఆంటోనీ బ్లింకెన్ పర్యటన

అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ మధ్యప్రాచ్యంలో పర్యటన ముగించుకొని స్వదేశానికి పయనమయ్యారు. ఆయన సోమవారం తుర్కియే రాజధాని అంకారాలో ఆ దేశ విదేశాంగ మంత్రి హకన్ ఫిదాన్‌తో సమావేశమయ్యారు. అమెరికాకు బయలుదేరే ముందు మీడియాతో మాట్లాడారు. గాజాలో సంక్షోభాన్ని నివారించే ప్రక్రియ పురోగతిలో ఉందని చెప్పారు. గాజాపై దాడులకు విరామం ఇవ్వాలని ఇజ్రాయెల్‌కు మరోసారి సూచించారు. ఇజ్రాయెల్–హమాస్ సంఘర్షణకు తెరదించడం, బందీలను విడిపించడంతోపాటు గాజాలోని పాలస్తీనియన్లకు మానవతా సాయం అందేలా చర్యలు తీసుకొనే లక్ష్యంతో మధ్య ప్రాచ్యం చేరుకున్న బ్లింకెన్ పాక్షికంగానే విజయం సాధించారు.

మధ్యప్రాచ్యం చేరుకున్న అమెరికా జలాంతర్గామి

ఇజ్రాయెల్–హమాస్ మధ్య ఘర్షణ మరింత ఉధృతంగా మారుతున్న నేపథ్యంలో అమెరికా తన గైడెడ్ మిస్సైల్ జలాంతర్గామిని మధ్యప్రాచ్యానికి పంపించింది. ఓహాయో క్లాస్ సబ్‌మెరైన్ తనకు కేటాయించిన ప్రాంతంలో అడుగుపెట్టిందని అమెరికా సెంట్రల్ కమాండ్ ప్రకటించింది. ఈజిప్టు రాజధాని కైరోకు ఈశాన్య దిక్కున సూయెజ్ కెనాల్‌లో జలాంతర్గామి ఉన్న ఫొటోను సోషల్ మీడియాలో పోస్టు చేసింది. తమ గైడెడ్ మిస్సైల్ జలాంతర్గాముల ఎక్కడ మకాం వేశాయన్నది అమెరికా సైన్యం ఇలా బహిరంగంగా ప్రకటించడం అత్యంత అరుదు. తమ మిత్రదేశమైన ఇజ్రాయెల్ జోలికి ఎవరూ రావొద్దన్న హెచ్చరికలు జారీ చేయడానికే అమెరికా తన జలాంతర్గామిని మధ్యప్రాచ్యానికి తరలించినట్లు తెలుస్తోంది.

మంత్రులూ... అవేం మాటలు?

తమిళ మంత్రుల తీరుపై మద్రాస్ హైకోర్టు • 'సనాతన ధర్మ నిర్మూలన'వ్యాఖ్యలపై ఆగ్రహం

చెన్నై: అధికారంలో ఉన్నవారిలో సమాజంలో చీలిక తెచ్చే వ్యాఖ్యలు చేసే ధోరణి ప్రబలుతోందంటూ మద్రాస్ హైకోర్టు ఆందోళన వెలిబుచ్చింది. ఇలాంటి వ్యాఖ్యలు సమాజంపై చూపే ప్రతికూల ప్రభావం తాలూకు ప్రమాదాన్ని దృష్టిలో ఉంచుకోవాలని హితవు పలికింది. సనాతన ధర్మాన్ని నిర్మూలించాలంటూ తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్ సెప్టెంబర్‌లో చేసిన వ్యాఖ్యలు దుమారం రేపడం తెలిసిందే. 'సనాతన ధర్మ నిర్మూలన'పేరిట జరిగిన ఆ సభలో ఆయన చేసిన ఈ వ్యాఖ్యలకు అందులో పాల్గొన్న అధికార డీఎంకేకు చెందిన పలువురు ఇతర మంత్రులు కూడా మద్దతు పలికారు. ఈ ధోరణిపై హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఇలాంటి ప్రతికూల వ్యాఖ్యలకు దిగే బదులు డ్రగ్స్, అవినీతి, అంటరానితనం తదితర పెడ ధోరణుల నిర్మూలనపై దృష్టి పెడితే మంచిదని వారికి సూచించింది. సదరు మంత్రులపై ఇంకా చర్యలెందుకు తీసుకోలేదంటూ పోలీసులకు తలంటింది. మంత్రుల వ్యాఖ్యలకు పోటీగా ద్రవిడ సిద్ధాంత నిర్మూలన సదస్సుకు అనుమతించేలా పోలీసులను ఆదేశించాలంటూ దాఖలైన పిటిషన్‌ను న్యాయమూర్తి జస్టిస్ జి.జయచంద్రన్ కొట్టేశారు. ఈ సందర్భంగా ఆయన పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ''సనాతన ధర్మ నిర్మూలన సభను ఉదాహరిస్తూ, అందుకు పోటీగా సభ పెట్టుకునేందుకు పిటిషనర్ అనుమతి కోరుతున్నారు. సనాతన ధర్మాన్ని నిర్మూలించాలంటూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసిన మంత్రులు తదితరులపై అప్పుడే చర్యలు తీసుకుని ఉంటే ఈ పరిస్థితే వచ్చేది కాదు కదా! పిటిషనర్ విజ్ఞప్తికి అంగీకరించడమంటే సమాజంలో మరింత చీలిక తేవడమే కాదా?''అని ప్రశ్నించారు. మంత్రుల తీరుపైనా ఈ సందర్భంగా న్యాయమూర్తి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ''రాజ్యాంగ స్ఫూర్తిని నిలబెడతామంటూ చేసిన ప్రమాణాలకు విరుద్ధంగా అధికారంలో ఉన్న కొందరు ప్రవర్తిస్తున్న తీరుతో ప్రజలు ఇప్పటికే విసిగిపోయి ఉన్నారు. ఇలాంటి సమావేశాలకు అనుమతినిచ్చి వారికి శాంతిని మరింత కరువు చేయమంటారా?''అన్నారు.

నా వ్యాఖ్యలకు కట్టుబడ్డా: ఉదయనిధి

చెన్నై: సనాతన ధర్మంపై తాను చేసిన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నట్టు తమిళనాడు యువజన సంక్షేమ మంత్రి, సీఎం స్టాలిన్ కుమారుడు ఉదయనిధి స్టాలిన్ పునరుద్ఘాటించారు. ఈ అంశంపై న్యాయ వివాదం తలెత్తినా ఎదుర్కొనేందుకు సిద్ధమన్నారు. 'సనాతన ధర్మం కరోనా, మలేరియా, డెంగీ వంటిది. అది సామాజిక న్యాయానికి వ్యతిరేకం. దాన్ని నిర్మూలించాలి' అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్త దుమారానికి దారితీయడం తెలిసిందే. అణగారిన, పీడిత వర్గాల తరఫున తనలా మాట్లాడానని ఆయన సోమవారం చెప్పుకొచ్చారు. అంబేడ్కర్, పెరియార్ రామస్వామి నాయకర్ వంటి గొప్ప నేతలు కూడా గతంలో ఇలాంటి వ్యాఖ్యలు చేశారన్నారు.



సోమవారం ఉత్తరాఖండ్‌లోని కేదార్‌నాథ్‌లో ఆదిగురు శంకరాచార్య 'సమాధి స్థల్'ను దర్శించుకున్న కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ

సుప్రీంకోర్టుకు ముగ్గురు కొత్త జడ్జీలు

న్యూఢిల్లీ: ముగ్గురు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులు సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా పదోన్నతి పొందనున్నారు. సీజేఐ జస్టిస్ డీ వై చంద్రచూడ్ సారథ్యంలోని సుప్రీంకోర్టు కొలీజియం సోమవారం కేంద్రానికి ఈ మేరకు సిఫార్సు చేసింది. ఈ జాబితాలో ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సతీశ్ చంద్ర శర్మ, రాజస్తాన్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అగస్టిన్ జార్జ్ మసీహ్, గౌహతి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సందీప్ మెహతా ఉన్నారు. ప్రతిభ, సామర్థ్యం, నిజాయితీ, విశ్వసనీయత, నేపథ్యం తదితరాలను జాగ్రత్తగా మదింపు చేసిన అనంతరం సుప్రీం న్యాయమూర్తులుగా వారి పేర్లను సిఫార్సు చేసినట్లు కొలీజియం తెలిపింది. వారి నియామకాలకు కేంద్రం ఆమోదం తెలిపితే సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్య 34కు పెరుగుతుంది. న్యాయమూర్తులపై పెరుగుతున్న విపరీతమైన పని భారం దృష్ట్యా సుప్రీంకోర్టులో ఎప్పుడూ ఒక్క ఖాళీ కూడా ఉండకుండా చూడాల్సిన అవసరం ఉందని కొలీజియం అభిప్రాయపడింది.

2024 అధ్యక్ష ఎన్నికల బరిలో పుతిన్

మాస్కో: రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్(71) 2030 వరకు పదవిలో కొనసాగేందుకు నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ఆమేరకు వచ్చే ఏడాది మార్చిలో జరిగే అధ్యక్ష ఎన్నికల్లో మరోసారి బరిలోకి దిగాలనుకుంటున్నట్లు చెబుతున్నారు. ఇటీవలి కాలంలో ఎన్నడూలేని విధంగా అత్యంత ప్రమాదకరమైన కాలంలో రష్యాను నడిపించాలని ఆయన భావిస్తున్నట్లు అక్కడి మీడియా అంటోంది. దీనిపై తుది నిర్ణయమైపోయిందని, ఇందుకు తగ్గట్లుగా పుతిన్ మద్దతుదారులు ఏర్పాట్లు చేస్తున్నట్లు కూడా సమాచారం. త్వరలోనే దీనిపై అధికారికంగా ప్రకటన వెలువడుతుందని భావిస్తున్నారు. ఎన్నికల్లో ఆయనను ఢీకొట్టే ప్రత్యర్థులెవరూ లేరని పరిశీలకులు అంటున్నారు.

సీఐసీ చీఫ్ కమిషనర్‌గా హీరాలాల్ సమారియా

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర సమాచార కమిషన్ (సెంట్రల్ చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషన్) ప్రధాన కమిషనర్‌గా హీరాలాల్ సమారియా బాధ్యతలు స్వీకరించారు. సోమవారం రాష్ట్రపతి భవన్‌లో ద్రౌపదీ ముర్ము సమక్షంలో హీరాలాల్ ప్రమాణ స్వీకారం చేశారు. వైకే సిన్హా పదవీ కాలం అక్టోబర్ 3న ముగియడంతో.. సమాచార కమిషన్ నియామకాలను చేపట్టాలంటూ కేంద్రానికి ఇటీవల సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో రాజస్తాన్‌కు చెందిన హీరాలాల్ సమారియాను సీఐసీ చీఫ్ కమిషనర్‌గా రెండేళ్ల కాలానికి గాను కేంద్రం నియమించింది. ఈ పదవిని దళిత వర్గానికి చెందిన అధికారి చేపట్టడం ఇదే మొదటిసారి. 1985వ బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి హీరాలాల్ సమారియా గతంలో కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ కార్యదర్శిగా ఉన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో పలు విభాగాల్లో కూడా ఆయన సేవలందించారు.

భార్యను 17సార్లు కత్తితో పొడిచి, కారుతో తొక్కించి..

కేరళ వాసికి జీవిత ఖైదు విధించిన అమెరికా కోర్టు

వాషింగ్టన్: భార్యను దారుణంగా చంపిన కేరళ వాసికి అమెరికా కోర్టు జీవిత ఖైదు విధించింది. కేరళకు చెందిన ఫిలిప్ మాథ్యూ, మెరిన్ జోయ్(26) అమెరికాలోని ఫ్లోరిడాలో ఉంటున్నారు. జోయ్ ఓ ఆస్పత్రిలో నర్సుగా పనిచేస్తున్నారు. విభేదాల కారణంగా భార్య తనను దూరం పెట్టేందుకు ప్రయత్నిస్తోందని మాథ్యూ అక్కసుతో ఉన్నాడు. 2020లో ఆమె కారును అడ్డగించి, కత్తితో 17సార్లు పొడిచాడు. ఆపై కారుతో ఆమెను తొక్కుకుంటూ తన ఆఫీసుకు వెళ్లిపోయాడు. అక్కడ తన స్నేహితులతో భార్యను కారుతో తొక్కుకుంటూ వచ్చిన విషయాన్ని తెలిపాడు. వారు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని తీవ్రంగా గాయపడిన మెరిన్‌ను ఆస్పత్రికి తీసుకెళ్లారు. భర్త అమానుషత్వంపై అధికారులకు వాంగ్మూలమిచ్చింది. చికిత్స పొందుతూ ఆమె ఆస్పత్రిలోనే చనిపోయింది. దీంతో, పోలీసులు మాథ్యూను అదుపులోకి తీసుకున్నారు.

ఢిల్లీలో మళ్లీ సరి–బేసి విధానం

న్యూఢిల్లీ: ప్రజారోగ్యానికి గొడ్డలిపెట్టులా మారిన కాలుష్యాన్ని కట్టడి చేయడానికి ఢిల్లీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. నగరంలో మళ్లీ సరి–బేసి విధానాన్ని ప్రవేశపెట్టడానికి సిద్ధమవుతోంది. ఈ నెల 13 నుంచి 20వ తేదీ వరకూ సరి–బేసి విధానం అమలు చేయనున్నట్లు ఢిల్లీ పర్యావరణ మంత్రి గోపాల్ రాయ్ సోమవారం ప్రకటించారు. నవంబర్ 20 తర్వాత ఈ విధానాన్ని పొడిగించే అంశంపై అప్పటి పరిస్థితులను బట్టి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. వాయు నాణ్యత తగ్గిపోవడం, కాలుష్యం వల్ల చిన్నపిల్లలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అందుకే 8వ తరగతి వరకూ ఆన్‌లైన్ క్లాసులు నిర్వహించాలని సూచించారు. బోర్డు పరీక్షలకు సిద్ధమయ్యే పది, పన్నెండో తరగతి విద్యార్థులకు మినహాయింపు ఉంటుందన్నారు.

గవర్నర్లు ఆత్మపరిశీలన చేసుకోవాలి

- బిల్లులకు ఆమోదం తెలపడంలో జాప్యం వద్దు
- సుప్రీంకోర్టు ధర్మాసనం సూచన



న్యూఢిల్లీ: రాష్ట్రాల గవర్నర్లు ప్రజల చేత ఎన్నికైన ప్రతినిధులు కాదని, వారు ఆ విషయాన్ని మర్చిపోవద్దని సుప్రీంకోర్టు హితవు పలికింది. రాష్ట్రాల శాసనసభల్లో ఆమోదం పొందిన బిల్లులకు ఉద్దేశపూర్వకంగా అంగీకారం తెలపకపోవడం, విపరీతమైన జాప్యం చేయడం తగదని సూచించింది. గవర్నర్లు ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేసింది. గవర్నర్ భన్వరీలాల్ పురోహిత్ బిల్లులకు అంగీకారం తెలియకుండా ఉద్దేశపూర్వకంగా జాప్యం చేస్తున్నారని ఆక్షేపిస్తూ పంజాబ్ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. రాష్ట్రాల అసెంబ్లీల్లో ఆమోదించిన బిల్లులు అంశంపై సుప్రీంకోర్టు వరకు రాకముందే గవర్నర్లు ఆయా బిల్లులపై చర్యలు తీసుకోవాలని పేర్కొంది. గవర్నర్లు అలా వ్యవహరిస్తే పెండింగ్ బిల్లుల వ్యవహారం పరిష్కారం అవుతుందని అభిప్రాయపడింది. సుప్రీంకోర్టుకు చేరేదాకా వేచి చూడొద్దని తేల్చిచెప్పింది. సుప్రీంకోర్టుకు చేరినప్పుడు మాత్రమే బిల్లులపై చర్యలు తీసుకొనే ధోరణికి ముగింపు పలకాలని వెల్లడించింది. పంజాబ్ గవర్నర్ భన్వరీలాల్ పురోహిత్ ఎన్ని బిల్లులపై చర్యలు తీసుకున్నారో తమకు వివరాలు అందజేయాలని, ఈ నెల 10వ తేదీ నాటికి నివేదిక ఇవ్వాలని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను ధర్మాసనం ఆదేశించింది. అప్పటిదాకా తదుపరి విచారణను వాయిదా వేసింది. పంజాబ్‌లోని ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వానికి, గవర్నర్ భన్వరీలాల్ పురోహిత్‌కు మధ్య విభేదాలు ఉన్నాయి. అసెంబ్లీలో ఆమోదించిన బిల్లులకు గవర్నర్ ఉద్దేశపూర్వకంగానే అంగీకారం తెలపడం లేదని ప్రభుత్వం ఆరోపిస్తోంది.



ఈ ఫొటోల్లో కనిపిస్తున్న రహదారులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సరిహద్దును ఆనుకొని ఉన్న తెలంగాణ జిల్లాల్లోనివే.. ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇటీవల ఏపీలోని రహదారులను, తెలంగాణ రహదారులను పోలుస్తూ.. 'డబుల్ రోడ్డు వచ్చిందంటే అది తెలంగాణ.. సింగిల్ రోడ్డు వచ్చిందంటే అది ఆంధ్రా' అంటూ వ్యాఖ్యానించారు. దీన్ని ఆసరాగా చేసుకుని 'ఈనాడు' తెలంగాణలోని కొన్ని రోడ్లను వేసి ఇక్కడ అద్భుతంగా ఉన్నట్లు.. ఏపీలో రహదారులు అధ్వానంగా ఉన్నాయన్న రీతిలో కథనం ప్రచురించింది. అయితే అవే సరిహద్దు తెలంగాణ జిల్లాల్లో గతుకుల రహదారులు, కల్వర్టులు తెగి వాహనాలు వెళ్లడానికి వీల్లేని రహదారులు అనేక ప్రాంతాల్లో దర్శనం ఇస్తాయి.. దానికి నిదర్శనమే ఈ చిత్రాలు. అయితే ఒక్క రహదారులే కాదు.. ఏపీలో అమలు అవుతున్న సంక్షేమ పథకాలు, నేరుగా లబ్ధిదారులకు అందుతున్న నగదు బదిలీ తదితర అంశాలను కూడా పోల్చి చూడాల్సిన అవసరం ఉందని విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు.



నల్లగొండజిల్లా: పెద్దవూర మండలం పోతునూరు-పులిచర్ల రహదారిపై ఏర్పడిన గుంతలు

సీఎం సారూ.. ఇవి మన రోడ్లే..!

గద్వాల జిల్లా అయిజ మండలం మేడికొండ గ్రామానికి కంకర వేసి వదిలేయడంతో దుమ్ములేపుతున్న దృశ్యం



ఖమ్మం జిల్లా: మధిర పరిధిలోని రాయపట్నం-దేశినేనిపాలెం గ్రామాల మధ్య గుంతలు తేలిన రోడ్డు



కొండమల్లేపల్లి నుంచి నల్లగొండకు వెళ్లే రహదారిపై భారీ గుంతలు



గద్వాల జిల్లా ఉండవెల్లి మండలం భైరాపురం గ్రామ రోడ్డు దుస్థితి



నల్లగొండజిల్లా: పెద్దవూర మండలం పెద్దగూడెం-కొత్తలూరు రహదారిపై ఏర్పడిన గుంతలు



సూర్యాపేట జిల్లా రామాపురం గ్రామం నుంచి ఏపీలోని జగ్గయ్యపేట మండలం బూదవాడ గ్రామానికి వచ్చే రహదారి దుస్థితి

రోడ్డున పడ్డది రామోజీ పరువే..
వివరాలకు క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి
సరిహద్దులో రోడ్లపై 'ఈనాడు' వక్రరాతలు

గొర్రెల కాపరి నర్సింహ



భువనగిరి: యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం కొత్తగూడెం గ్రామానికి చెందిన నర్సింహ 10వ తరగతి వరకు చదువుకున్నాడు. ఆ తర్వాత గొర్రెల కాపరిగా పనిచేస్తూనే సామాజిక అంశాలతో జానపద బాణీలో పాటలు రాసి స్వయంగా పాడి ఆల్బమ్‌లు చేశారు. సామాన్యులకు జరుగుతున్న అన్యాయానికి నిరసనగా, అవినీతి పాలకులకు వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం తీసుకురావడం కోసం రాజకీయంలోకి రావాలని భావించానని, అందుకే భువనగిరి అసెంబ్లీ స్థానానికి ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీచేస్తున్నట్లు నర్సింహ చెప్పుకొచ్చాడు. నర్సింహ సోమవారం గొర్రెల కాపరి వేషధారణలోనే వచ్చి నామినేషన్ వేశారు.





గాడిదపై నామినేషన్ కేంద్రానికి..

నిరుద్యోగి విఫలయత్నం.. అడ్డుకున్న పోలీసులు

అర్ధనగ్నంగా వెళ్లి నామినేషన్ దాఖలు

బాన్సువాడ: నిరుద్యోగులకు ఉద్యోగాలు రాకుండా సీఎం కేసీఆర్ చేస్తున్నారని ఆరోపిస్తూ బాన్సువాడలో ఓ నిరుద్యోగి గాడిదపై వెళ్లి నామినేషన్ వేసేందుకు సిద్ధమవుతుండగా, పోలీసులు అడ్డుకున్నారు. కామారెడ్డి జిల్లా నస్రూల్లాబాద్ మండలం మిర్జాపూర్‌కు చెందిన పుట్ట భాస్కర్ నామినేషన్ కేంద్రానికి గాడిదపై వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకుంటుండగా.. విషయం తెలుసుకున్న బాన్సువాడ సీఐ మహేందర్‌రెడ్డి, సిబ్బంది వెళ్లి అడ్డుకున్నారు. మూగజీవాలను నామినేషన్ కేంద్రానికి తీసుకెళ్లేందుకు అనుమతి లేదని నిలువరించారు. దీంతో షర్ట్ విప్పేసి అర్ధనగ్నంగా వెళ్లి స్వతంత్ర అభ్యర్థిగా భాస్కర్ నామినేషన్ వేశారు.

గాసిప్ టైమ్

రాములమ్మ దారెటో రామక్కా?

ప్రస్తుత ఎన్నికల సీజన్‌లో బాగా ప్రాచుర్యం పొందిన రామక్కా పాటను అన్ని రాజకీయ పార్టీలు ఎవరికి నచ్చినట్లు వారు అన్వయించుకుంటున్నారు. ఈ పాటను ఇప్పుడు ఫైర్‌బ్రాండ్‌గా గుర్తింపు పొందిన ఓ రాజకీయ నాయకురాలికి వర్తించేలా పాడుకుంటున్నారు. ప్రస్తుతానికి అయిష్టంగానే కాషాయ జెండాను మెడలోనే ఉంచుకున్న ఆమె నేడో, రేపో మూడు రంగుల కండువా కప్పుకుంటారనే ప్రచారం కొద్దికాలంగా సాగుతూనే ఉంది. ఇందుకు తగినట్టుగానే ఆమె కూడా కాషాయ పార్టీపై విమర్శల జడివాన కురిపిస్తున్నా.. పార్టీ మార్పు విషయాన్ని గోప్యంగా ఉంచుతున్నారు. అసలు ఇప్పుడున్న పార్టీని వీడుతారా లేదా? మూడురంగుల పార్టీలోకి వస్తారా? రారా? అన్నదానిపై కూడా ఆమె వ్యూహాత్మక మౌనం పాటిస్తున్నారు. అందుకే రామక్క పాటను ఆమెకు అన్వయించుకుంటూ 'రాములమ్మ దారెటో.. రామక్కా.. అలనాటి గ్లామరేది రామక్కా.. అంటూ కొందరు పాడుకుంటున్నారు.

'గ్రీన్' పాలిటిక్స్!

చెట్టంత ఓటు

పంతంగి రాంబాబు

'గులాబీ' పార్టీ అనగానే అందరికీ టక్కున బీఆర్‌ఎస్ పేరు గుర్తొస్తుంది.. ఎర్ర పార్టీలనగానే అందరూ సీపీఐ, సీపీఎం పేర్లు చెబుతారు... మరి గ్రీన్ పార్టీ అంటే ఏం గుర్తొస్తుందని అడిగితే మీరేమంటారు?!! ఇదేం పేరు.. మేం ఎప్పుడూ వినలేదే అని అవాక్కవుతున్నారా? మనం ఇంకా వినలేదేమోగానీ అభివృద్ధి చెందిన దేశాల్లో పదులకొద్దీ పార్టీలు పుట్టుకొచ్చి క్రియాశీల రాజకీయాలు సైతం సాగిస్తున్నాయి! మరి ఆ పార్టీలేంటో తెలుసుకుందాం.

గ్రీన్ పార్టీ అంటే..?..: యూరప్, అమెరికా ఖండాల్లోని పారిశ్రామిక దేశాలు చాలా దశాబ్దాలుగా అతిగా కర్బన ఉద్గారాలను వెలువరిస్తూ పర్యావరణ సమతుల్యతను దెబ్బతీస్తున్నాయి. ఈ నేపథ్యంలో పక్ష ఆధిపత్య రాజకీయాలకే పరిమితం కాకుండా పర్యావరణవాదం, సామాజిక న్యాయం, అహింస తదితర అంశాలపై దృష్టి కేంద్రీకరించేందుకు పుట్టుకొచ్చిన రాజకీయ పార్టీలే గ్రీన్ పార్టీలు. సాధారణంగా ఇవి సోషల్ డెమోక్రటిక్ ఆర్థిక విధానాలను అనుసరిస్తూ వామపక్ష పార్టీలతో జత కడుతూ ఉంటాయి.

రాజకీయాలవైపు అడుగులు..: పర్యావరణ సమస్యలపై ఉద్యమాలు చేపట్టే సంఘాలు, సంస్థలే కాలక్రమంలో గ్రీన్ రాజకీయ పార్టీలుగా మారుతున్నాయి. యూరప్, అమెరికా ఖండాల్లోని సంపన్న దేశాల్లో 1960వ దశకంలో రాడికల్ సోషల్ యాక్టివిస్టులు, ముఖ్యంగా విద్యార్థుల నిరసనోద్యమాలు.. 1970–80 దశకాల్లో అణ్వాయుధ వ్యతిరేక ఉద్యమాల నుంచి తొలినాటి గ్రీన్ పార్టీలు ఆవిర్భవించాయి.

1972లో తొలిసారి ఏర్పాటు..: తొలి రెండు గ్రీన్ పార్టీలు ఆస్ట్రేలియాలో (ద యునైటెడ్ టాస్మేనియా గ్రూప్), న్యూజిలాండ్ (ద వేల్యూస్ పార్టీ) 1972లో ఏర్పాటయ్యాయి. 1973లో యునైటెడ్ కింగ్‌డమ్‌లో పీపుల్ (తర్వాత ద ఎకాలజీ పార్టీగా మారింది) పార్టీ పుట్టింది. 1979లో గ్రీన్ పార్టీ ఆఫ్ జర్మనీ రిజిస్టరైంది. 250 పర్యావరణ సంఘాలను ఏకం చేసి హెర్బర్ట్ గ్రూల్, పెట్రా కెల్లీ ఈ పార్టీని నెలకొల్పారు. 1983లో జాతీయ ఎన్నికల్లో ఈ పార్టీ ప్రతినిధి తొలుత గెలుపొందారు. 1998 నుంచి 2005 వరకు సోషల్ డెమోక్రటిక్ పార్టీతో కలసి సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేసే స్థాయికి ఎదిగింది. 2021 ఎన్నికల్లో అపూర్వమైన రీతిలో 15% ఓట్లు గెల్చుకుంది.

ఉమ్మడి మేనిఫెస్టో..: 1992లో బ్రెజిల్‌లోని రియో డి జెనీరో నగరంలో జరిగిన గ్రీన్ పార్టీల తొలి అంతర్జాతీయ సమావేశం గ్లోబల్ గ్రీన్స్ ప్రకటనను వెలువరించాయి. 'గ్రీన్ పొలిటికల్ పార్టీలకు ప్రజలు ఓట్లు వేసినప్పుడే పర్యావరణ సమస్యలపై ప్రభుత్వాలు సీరియస్‌గా స్పందిస్తున్నాయని అనుభవాలు చెబుతున్నాయ'ని ఈ ప్రకటన పేర్కొంది. ఈ నేపథ్యంలో 2001లో తొలి 'గ్లోబల్ గ్రీన్ పార్టీల కాంగ్రెస్' ఆస్ట్రేలియా రాజధాని కాన్‌బెర్రాలో జరిగింది. 'గ్లోబల్ గ్రీన్స్ చార్టర్'పేరిట పూర్తిస్థాయి ఉమ్మడి మేనిఫెస్టోను ప్రకటించాయి. ఆ తర్వాత 2012లో డకర్‌లో, 2017లో ఇంగ్లండ్‌లోని లివర్‌పూల్‌లో గ్రీన్ పార్టీల కాంగ్రెస్‌లు జరిగాయి. ఈ ఏడాది ఆగస్టులో దక్షిణ కొరియాలో జరిగిన కాంగ్రెస్‌లో గ్లోబల్ గ్రీన్స్ చార్టర్ అప్‌డేట్ చేశారు.

6 మూల సూత్రాలు..: పర్యావరణ పరిజ్ఞానం, సాంఘిక న్యాయం, భాగస్వామ్య ప్రజాస్వామ్యం (పార్టిసిపేటరీ డెమోక్రసీ), అహింస, సుస్థిరత, వైవిధ్యానికి గౌరవం.. ఇవీ గ్లోబల్ గ్రీన్ పార్టీలు మేనిఫెస్టోలో పేర్కొన్న ఆరు మూల సూత్రాలు. 'భూమి జీవ శక్తి, వైవిధ్యం, సౌందర్యం మీద ఆధారపడి మనం జీవిస్తున్నాం. వీటిని అంతరింపజేయకుండా, వీలైతే మెరుగుపరిచి, మన తదుపరి తరానికి అందించడం మన బాధ్యత'అని దీని పీఠికలో తొలి వాక్యం చాటి చెబుతోంది. 'పౌరులందరికీ తమ అభిప్రాయాలను వ్యక్తీకరించే హక్కు ఉన్న ప్రజాస్వామ్యం కోసం కృషి చేస్తాం. వారి జీవితాలను ప్రభావితం చేసే పర్యావరణ, ఆర్థిక, సామాజిక, రాజకీయ నిర్ణయాలలో ప్రత్యక్షంగా పాల్గొనవచ్చు' అని చెబుతోంది.

ప్రపంచవ్యాప్తంగా 87 గ్రీన్ పార్టీలు..: 'గ్లోబల్ గ్రీన్స్'సమాచారం ప్రకారం.. ప్రపంచ వ్యాప్తంగా ఇప్పుడు 87 గ్రీన్ పొలిటికల్ పార్టీలున్నాయి. ఈ పార్టీలన్నీ కలసి 2001లో గ్లోబల్ గ్రీన్స్ పేరిట సమాఖ్యను ఏర్పాటు చేసుకున్నాయి. బ్రస్సెల్స్ కేంద్రంగా పనిచేస్తున్న ఈ సంస్థలో 87 గ్రీన్ రాజకీయ పార్టీలతోపాటు 9 పర్యావరణ సంస్థలు కూడా సభ్యులుగా ఉన్నాయి. 12 మంది సభ్యులుగల స్టీరింగ్ కమిటీకి బాబ్ హాలె, గ్లోరియా పొలాంకో 2020 నుంచి కన్వీనర్లుగా వ్యవహరిస్తున్నారు. ఢిల్లీ కేంద్రంగా సురేశ్ నాటియాల్ 2019లో నెలకొల్పిన 'ఇండియా గ్రీన్స్ పార్టీ'కి కూడా ఈ సమాఖ్యలో సభ్యత్వం ఉంది. గ్లోబల్ గ్రీన్స్‌లోని పార్లమెంటేరియన్ నెట్‌వర్క్‌లో ప్రపంచవ్యాప్తంగా 400 మందికిపైగా గ్రీన్ పార్లమెంటు సభ్యులు ఉన్నారు.

పెరుగుతున్న ఆదరణ..: ప్రధాన స్రవంతి రాజకీయాల్లో ముఖ్యంగా యూరోపియన్ దేశాల్లో గ్రీన్ పార్టీలకు ప్రాధాన్యం పెరుగుతూ వస్తోంది. కీలకమైన పార్లమెంటరీ స్థానాల్లో గెలుపొందటమే కాదు ముఖ్యమైన ప్రభుత్వ పదవులను సైతం చేపడుతుండటం విశేషం. క్లైమెట్ ఛేంజ్ వల్ల పర్యావరణ విపత్తులు గతమెన్నడూ ఎరుగని రీతిలో విరుచుకు పడుతున్న ప్రస్తుత తరుణంలో సంప్రదాయ రాజకీయ పార్టీలకూసాలు కదులుతుండగా గ్రీన్ పార్టీలకు ప్రజల్లో అంతకంతకూ ప్రాధాన్యం పెరుగుతోంది.

జంగ్ తెలంగాణ

అవినీతి.. వైఫల్యాలు

కేసీఆర్ కుటుంబం చేతిలో యావత్ తెలంగాణ బందీ • బీఆర్‌ఎస్ సర్కార్‌పై బీజేపీ చార్జ్‌షీట్

సాక్షి, హైదరాబాద్: తొమ్మిదన్నరేళ్ల పాలనలో అవినీతి, అరాచకాలు, లోటుపాట్లు, వైఫల్యాలు ఇతర అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకే బీఆర్‌ఎస్ సర్కార్‌పై చార్జ్‌షీట్‌ను ప్రకటిస్తున్నట్టు బీజేపీ వెల్లడించింది. దేశంలోనే అవినీతికి, లంచగొండితనానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఒక ఉదాహరణగా మారిందని ధ్వజమెత్తింది. బీఆర్‌ఎస్ ప్రభుత్వం-అవినీతి అనేవి రెండూ పర్యాయ పదాలుగా మారిపోయాయని విమర్శించింది. కాళేశ్వరంలో అవినీతి ఎక్కడుందో చూపాలంటూ సవాళ్లు చేశారని, అయితే నిజం అనేది దాగదు కాబట్టి ఎన్నికలకు ముందు భగవంతుడే పిల్లర్ల కుంగుబాటు ద్వారా దానిని ప్రజల ఎదుట పెట్టాడని తెలిపింది. ఈ మేరకు బీఆర్‌ఎస్ సర్కార్‌పై చార్జ్‌షీట్‌ను సోమవారం బీజేపీ రాష్ట్ర శాఖఅధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, రాష్ట్ర పార్టీ ఎన్నికల ఇన్‌చార్జ్ ప్రకాశ్ జవదేకర్, మేనిఫెస్టోకమిటీ చైర్మన్ పి.మురళీధర్‌రావు, డా.కె.లక్ష్మణ్, యెండల లక్ష్మీనారాయణ, పొంగులేటి సుధాకర్‌రెడ్డి, తేజావత్ రామచంద్రుడు, జయచంద్ర విడుదల చేశారు. దళితులకు దగా, బీసీలకు ద్రోహం, విద్యారంగం ఆగం, వైద్యరంగంలో హామీల బుట్టదాఖలు, నిరుద్యోగులకు మోసం, విశ్వనగరం–విషాదనగరం.. ఇలా 31 అంశాల్లో ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తూ ఈ చార్జ్‌షీట్‌లో బీజేపీ ప్రస్తావించింది.

చార్జ్‌షీట్‌లో ముఖ్యాంశాలు...

బీఆర్‌ఎస్ అవినీతి: 2014లో కేసీఆర్ సీఎం అయ్యాక అవినీతి విలయతాండవం. సీఎంతో సహా మంత్రివర్గ సహచరులు, ఎమ్మెల్యేలు, బీఆర్‌ఎస్ నేతలు అవినీతికి పాల్పడుతున్నారు. ఇసుక మాఫియా, గ్రానైట్ మాఫియా, ల్యాండ్ మాఫియా, డ్రగ్ మాఫియా, లిక్కర్ మాఫియా, కాంట్రాక్ట్ మాఫియా.. వీటన్నింటిలోనూ బీఆర్‌ఎస్ నేతలకు సంబంధాలు.

- మిషన్ భగీరథ అంతా అవినీతికంపే. మిషన్ కాకతీయ పేరుతో రూ. 30 వేల కోట్లలో అధిక సొమ్ము బీఆర్‌ఎస్ నాయకుల జేబులోకి పోయింది.
- కాళేశ్వరం ప్రాజెక్టే అవినీతి కంపు. ప్రాజెక్టును రీడిజైన్ చేసి, అంచనాలు పెంచారు. రూ.40వేల కోట్ల రూపాయల అంచనాను రూ. లక్షా 40 వేల కోట్లకు పెంచి, సీఎం కుటుంబసభ్యులే కాంట్రాక్టర్ల దగ్గర నుంచి ముడుపులు తీసుకున్నారు. మేడిగడ్డ కూలిపోయే స్థితికి రావడం తెలంగాణ ప్రజల రక్తమాంసాలను తాగినట్టుగానే మేం భావిస్తున్నాం.
- సీఎం కూతురికే లిక్కర్ స్కాంతో సంబంధాలున్నాయి.
- ధరణి పోర్టల్ బీఆర్‌ఎస్ నాయకులకు పెద్ద ఆదాయవనరుగా మారింది. చెరువులు, కుంటలు, పార్కులు, దేవాలయ భూములు, అసైన్డ్ భూములు, కాందిశీకుల భూములు... ల్యాండ్ మాఫియాలో బీఆర్‌ఎస్ నిండా మునిగి ఉంది.
- అవినీతికి ఎవరు పాల్పడినా 040–23452933 నంబర్‌కు కాల్ చేయాలని స్వయంగా సీఎం కేసీఆర్ చెప్పారు. కానీ ఆ నంబర్ అసలు మనుగడలోనే లేదు.

రైతులకు మోసం: అప్పుల బాధతో తొమ్మిదిన్నరేళ్లలో 7,800 మంది రైతుల ఆత్మహత్యలు జరిగాయి. ఎరువులు ఉచితంగా పంపిణీ చేస్తామని హామీ ఇచ్చినా బస్తా యూరియా కూడా ఇయ్యలే.

నీటి పారుదల రంగం: ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో లక్ష ఎకరాలకు సాగునీరు అందిస్తామన్నా, ఇంతవరకు కొత్త ఆయకట్టుకు నీరందింది లేదు. పాలమూరు- రంగారెడ్డి లిఫ్టు ఇరిగేషన్ ప్రాజెక్టును ఇంతవరకు పూర్తి చేయలేదు.

దళితులకు దగా: దళితుడిని ముఖ్యమంత్రి చెయ్యలే, భూమి లేని దళితులకు 3 ఎకరాల భూమి ఇస్తానని ఇయ్యలేదు

గిరిజనులు : గిరిజనులకు 12శాతం రిజర్వేషన్లు అమలు చేయలేదు. పోడు భూములు పూర్తిగా ఇవ్వలేదు.

బీసీలకు ద్రోహం: బీసీల సమగ్ర అభివృద్ధికి రూ.25 వేల కోట్లు, బీసీ కార్పొరేషన్‌కు ఏటా వెయ్యికోట్లు కేటాయిస్తామని ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. ఎంబీసీ కుల వర్గీకరణ చేయలేదు.

విద్యారంగం ఆగం: కేజీ నుంచి పీజీ వరకు ఉచిత నిర్బంధ విద్య అమలు హామీని నెరవేర్చలేదు. కంప్యూటర్లు, ఇంటర్నెట్ సౌకర్యాలతో ఈ–లైబ్రరీల నిర్మాణానికి ఇంతవరకు అతీగతి లేకుండా పోయింది. ఏ ఒక్క యూనివర్సిటీలో కూడా బోధనా సిబ్బందిని నియమించలేదు.

మహిళలకు అన్యాయం: డ్వాక్రా మహిళలకు వడ్డీ లేకుండా రూ. 10 లక్షల రుణాలిస్తామని ఇంతవరకు ఇచ్చింది లేదు. మహిళా కమిషన్ ఏర్పాటు చేస్తామని వాగ్దానం చేసి, కాగితాలకే పరిమితమైంది. మహిళలకు రక్షణ లేదు.

నిరుద్యోగులకు మోసం : ఇంటికొక ఉద్యోగం ఇస్తానన్నడు, కనీసం ఊరికొక ఉద్యోగం కూడా ఇయ్యలే. పోలీసుశాఖలో తప్ప ఇతర శాఖలలో నియామకాలే లేవు. టీఎస్‌పీఎస్సీ నోటిఫికేషన్లు తొమ్మిది సంవత్సరాల తర్వాత 2022లో ఇచ్చిండు. కానీ అది కూడా అనేక ఆరోపణలతో రెండు సార్లు రద్దు అయ్యింది. సర్కారు వైఖరితో నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకున్నారు. నిరుద్యోగులకు నెలకు 3016/– భృతి, జాబ్ క్యాలెండర్ ఇవ్వలేదు.

విద్యుత్ రంగం: కొత్తగా 10 థర్మల్ విద్యుత్ కేంద్రాలు ఏర్పాటు చేస్తామని ఒక్కటి కూడా పూర్తి చేయలేదు. వేల రూపాయల బిల్లు వేస్తూ, పేద, మధ్యతరగతి ప్రజలపై భారం వేసి ఆర్థికంగా ఇబ్బందులు చేశారు.

పారిశ్రామిక రంగం: నిజాం షుగర్ ఫ్యాక్టరీ తెరిపించలే. కార్మికులు, రైతులను అన్యాయం చేశారు. కాగజ్‌నగర్ నుంచి మణుగూరు వరకు ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు చేస్తామని గాలిమాటలు చెప్పిండు.


విశ్వనగరం కాదు... విషాద నగరం: మూసీనదిని బ్యూటిఫికేషన్ చేసి, టూరిజం ప్లేస్ గా తీర్చిదిద్దుతామని వాగ్దానం చేసిండు. ఇంతవరకు కార్యరూపం దాల్చలేదు. మూసీ మురికిపోలే, కంపుపోలే. హైదరాబాద్‌లో చెరువుల పునరుద్ధరణ జరగలేదు కానీ కబ్జాలు జరుగుతున్నాయి.

కార్మికులు: కార్మికులకు అన్ని రంగాల్లోనూ తీవ్ర అన్యాయం చేశారు. బయ్యారం ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తానన్న హామీ నెరవేర్చలేదు.

తెలంగాణ ఉద్యమకారులు: అమరవీరుల కుటుంబాలకు ఇళ్లు ఇవ్వలేదు. రూ. 10 లక్షలు ఇవ్వలేదు. ఉద్యమకారులకు గుర్తింపేలేదు, అమరవీరులకు విలువ లేదు. రాష్ట్రం కోసం పోరాడిన వారిని కూడా మోసం చేసిండు.

జర్నలిస్టులు: జర్నలిస్టులకు ఇంటిస్థలాలు ఇవ్వకుండా దగా చేసిండు. జేఎన్‌జే సొసైటీకి 38 ఎకరాల స్థలాన్ని కోర్టు ఉత్తర్వులు వచ్చిన తర్వాత కూడా బదలాయించలేదు.

పరిపాలనాలోపాలు: ప్రజలకు అందుబాటులో లేని సీఎంగా కేసీఆర్ దేశంలోనే నంబర్ 1 స్థానంలో నిలిచిండు. కనీసం ఎమ్మెల్యేలు, మంత్రులు సైతం సీఎంని కలవరు. రాష్ట్ర పాలన మొత్తం కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావు, కవిత, సంతోష్ రావు ఆదేశాల ప్రకారమే నడుస్తోంది. కేసీఆర్ కుటుంబం చేతిలో యావత్ తెలంగాణ బందీ అయ్యింది.



బీఆర్‌ఎస్‌పై బీజేపీ చార్జ్‌షీట్ విడుదల చేసిన ప్రకాశ్ జవదేకర్, కిషన్‌రెడ్డి, మురళీధర్‌రావు, లక్ష్మణ్ తదితరులు

అతివాదం, ఉగ్రవాదం ఊతమిచ్చే కుట్ర

బీజేపీ చార్జ్ షీట్ కమిటీ చైర్మన్ మురళీధర్‌రావు

ప్రజల భద్రతకు ఒకప్పుడు నక్సలైట్ల తీవ్రవాదంతో ఎలాంటి ముప్పు ఉన్నదో, నేడు అతివాదం, ఉగ్రవాదంతో అంతే ప్రమాదం ఉందని బీజేపీ నేత, పార్టీ చార్జ్‌షీట్ కమిటీ చైర్మన్ పి. మురళీధర్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. ఇస్లామిక్ కారిడార్‌ను ఉగ్రవాదం, అతివాదం వైపు మళ్లించేందుకు (ర్యాడికలైజేషన్ ఆఫ్ ఇస్లాం) ప్రయత్నాలు జరుగుతున్నాయని తీవ్ర ఆరోపణలు చేశారు. ఇక్కడ రోహింగ్యాలు, బంగ్లాదేశీయులు అనేక సంఖ్యలో ఉన్నారని, ఈ విషయంలో ఎంఐఎం, బీఆర్‌ఎస్ అలైన్మెంట్ కారణంగా సవాళ్లు ముందుకొస్తున్నాయని ఆరోపించారు. బీఆర్‌ఎస్ పాలనపై బీజేపీ అభియోగపత్రం విడుదల చేసిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. పీఎఫ్ఐతో లింకులు ఇక్కడ బయటపడ్డాయని, ఎన్ఐఏ ఇక్కడకు వచ్చి కొందరిని అరెస్ట్ కూడా చేసిందని తెలిపారు. తెలంగాణ–మద్యం, హైదరాబాద్–డ్రగ్స్ అనేవి పర్యాయపదాలుగా మారిపోయాయని మండిపడ్డారు.

ప్రతి ఒక్కరూ ప్రశాంతంగా ఓటు వేసేలా!

నాగోజు సత్యనారాయణ



రాష్ట్ర అసెంబ్లీకి త్వరలో జరగనున్న ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో జరిపేందుకు పూర్తిస్థాయిలో భద్రత కట్టుదిట్టం చేస్తున్నట్టు టీఎస్ఎస్పీ(తెలంగాణ స్టేట్ స్పెషల్ పోలీస్) బెటాలియన్స్ అడిషనల్ డీజీ, కేంద్ర బలగాల భద్రత విధులకు సంబంధించి రాష్ట్ర నోడల్ అధికారి స్వాతి లక్రా వెల్లడించారు. స్థానిక శాంతిభద్రతల పరిస్థితుల ఆధారంగా సున్నితమైన, సమస్యాత్మకమైన పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టినట్టు తెలిపారు. ఎన్నికల భద్రత విధుల్లో కేంద్ర సాయుధ పోలీస్ బలగాల మోహరింపు, ప్రధాన విధులకు సంబంధించిన అంశాలను 'సాక్షి' ఇంటర్వ్యూలో అడిషనల్ డీజీ స్వాతి లక్రా పంచుకున్నారు.

కేంద్ర సాయుధ పోలీసు బలగాలకు ప్రధానంగా అప్పగించే ఎన్నికల విధులు...?

ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో జరపడంలో అన్ని దశల్లోనూ కేంద్ర సాయుధ పోలీసు బలగాలు స్థానిక పోలీసులకు సహకారంగా ఉంటాయి. ప్రధానంగా వాహన తనిఖీలు, రాష్ట్ర సరిహద్దుల్లోని చెక్‌పోస్టులు, ఇతర కీలక పాయింట్లలో పహారా, పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు..ఓటింగ్ పూర్తయిన తర్వాత ఈవీఎంలను భద్రపరిచే స్ట్రాంగ్ రూంల వద్ద కీలకమైన భద్రత విధులు కేంద్ర సాయుధ పోలీసు బలగాలకు అప్పగిస్తాం.

ఎన్నికల విధుల్లో కేంద్ర బలగాల మోహరింపు ఏ ప్రాతిపదికన ఉంటుంది..?

స్థానికంగా ఎన్ని పోలింగ్‌స్టేషన్లు ఉన్నాయి..అందులో ఎన్ని సమస్యాత్మకమైనవి, సున్నితమైనవి ఉన్నాయన్న నివేదిక ఆధారంగా కేంద్ర బలగాలను పంపుతున్నాం. ప్రస్తుతానికి వంద కంపెనీల కేంద్ర బలగాలు రాష్ట్రవ్యాప్తంగా పంపించాం. స్థానికంగా వాళ్లకు వసతి సదుపాయానికి సంబంధించి కూడా అన్ని ఏర్పాట్లు చేశాం. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో ఉన్న పోలింగ్‌స్టేషన్లు,, గత ఎన్నికల్లో నమోదైన ఘటనల ఆధారంగా సున్నితమైన ప్రాంతాలుగా గుర్తించిన పోలింగ్ కేంద్రాల వద్ద అవసరం మేరకు అదనపు బలగాలను కేటాయిస్తున్నాం. పూర్తి ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు పూర్తి చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం.

కేంద్ర బలగాలతో అన్ని ప్రాంతాల్లో ఫ్లాగ్ మార్చ్‌లు నిర్వహించడానికి కారణం..?

స్థానికంగా యూనిట్ ఆఫీసర్లు కేంద్ర బలగాలతో ఫ్లాగ్ మార్చ్‌లు చేస్తున్నారు. దీని ముఖ్యఉద్దేశం..మీ ప్రాంతంలో భద్రత కోసం పూర్తి సన్నద్ధంగా మేం ఉన్నాం అని పోలీసు నుంచి ప్రజలకు భరోసా ఇవ్వడమే. దీనివల్ల ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకునేలా చేయడం. అదే సమయంలో సంఘ విద్రోహశక్తులకు ఒకింత హెచ్చరిక మాదిరిగా ఈ కవాతులు చేయడం సర్వసాధారణమే.

కేంద్ర సాయుధ పోలీసు బలగాలకు తోడు ఇతర రాష్ట్రాల పోలీసు సిబ్బంది బందోబస్తుకు వస్తారా..?

ఇంకా కొన్ని రాష్ట్రాల్లోనూ ఎన్నికలు ఉన్నందున అందుకు అనుగుణంగా విడతల వారీగా కేంద్ర సాయుధ బలగాల సర్దుబాటు ఉంటుంది. ఒక్కో కంపెనీలో సరాసరిన 80 నుంచి 100 మంది వరకు సిబ్బంది ఉంటారు. ఈ లెక్కన కేంద్ర సాయుధ పోలీస్ బలగాల నుంచే 30 వేల మందికిపైగా ఎన్నికల విధుల్లో ఉంటారు. వీరికి అదనంగా ఎలక్షన్ పది రోజుల ముందు నుంచి పోలింగ్ తేదీన విధుల్లో ఇతర రాష్ట్రాల నుంచి సాయుధ పోలీసు బలగాల సిబ్బందితో పాటు హోంగార్డులు సైతం ఉంటారు.

పూర్తి రక్షణ.. సున్నిత ప్రాంతాలపై ప్రత్యేక ఫోకస్

- 375 కంపెనీల కేంద్ర సాయుధ బలగాలతో బందోబస్తు
- ఇప్పటికే వంద కంపెనీల బలగాలు విధుల్లో ఉన్నాయి
- అవసరం మేరకు పక్క రాష్ట్రాల నుంచి సాయుధ పోలీసుల తరలింపు

టీఎస్ఎస్పీ బెటాలియన్స్ అడిషనల్ డీజీ స్వాతి లక్రా

Interview

2018 ఎన్నికల భద్రత విధుల్లో 279 కంపెనీల కేంద్ర బలగాలే ఉన్నాయి. ఈసారి ఆ సంఖ్య పెరిగిందా..?

గతంలో 279 కంపెనీల కేంద్ర బలగాలు ఉండగా, ఈసారి ఉన్న పరిస్థితుల నేపథ్యంలో మనం ఎక్కువ కంపెనీల కేంద్ర సాయుధ బలగాలు కావాలని ప్రతిపాదనలు పంపించాం. ఈసారి మొత్తం 375 కంపెనీల బలగాలను మనం అడిగాం. ఇప్పటికే 100 కంపెనీలు వచ్చాయి. ఇంకో 275 కంపెనీలు వస్తాయి.

బస్సులకూ... ఎన్నికలకూ

సంబంధమేమిటి?



షుగర్ & పెప్పర్

..:: యాసీన్

''ఆర్టీసీ బస్సులకూ..ఎన్నికలకూ ఎంతో సంబంధముంది. మరీ ముఖ్యంగా బస్సుల్లో రాసి ఉండే సూక్తులు, ఉపదేశాలతో'' ఓ పెద్ద బాంబునే పేల్చాడు మా రాంబాబుగాడు.

''మా మానాన మేము మాడిపోయిన మసాలా దోశె తింటుంటే..నువ్వొచ్చి ఎలక్షన్లకూ, బస్సులకూ ముడిపెడతావా? అలాంటి సంబంధాలకు ఆస్కారమే లేని చోట నువ్వు సృష్టిస్తున్న ఈ రా.కీ.వాహన సంబంధాలేమిటి? ఈ సంగతేమిటో నాకిప్పుడే తెలియాలి. తెలిసితీరాలి'' అంటూ కోప్పడ్డాడు మా బావ.

అప్పుడు మా రాంబాబుగాడు చెప్పిన ఉదంతాలూ, ఉదాహరణలు అపూర్వం, అనిర్వచనీయం, అవిస్మరణీయం.

స్త్రీలను గౌరవించడం మన సంప్రదాయం..వాళ్ల సీట్లలో వాళ్లనే కూర్చోనిద్దాం.

బస్సుల్లో మహిళలుగానీ..ఎన్నికల్లో మహిళలంటే ఇక్కడ జెండర్‌గా తీసుకోకూడదు. స్త్రీలంటేనే చాలా స్పెషల్. అలాంటివారే కీలకమైన కొందరు అభ్యర్థులు కూడా. దేవతల్లో అమ్మవారి లాంటివారే..రాజకీయాల్లో ఈ అయ్యావార్లు!

ప్రస్తుతానికి వాళ్లు మన పార్టీలో లేరు. పక్క పార్టీ నుంచి... ఆల్ ద వే..పార్టీ మారి మరీ రావాలి. అందుకే..ఎన్ని జాబితాలు వెలువడ్డా..ఆయనొచ్చేవరకూ ఆ సీటును మాత్రం ఖాళీగా ఉంచాల్సిందే. ఉదాహరణకు ఓ అభ్యర్థి పేరు రాజగోపాల్‌రెడ్డి, ఆ స్థానం పేరు మునుగోడు. ఇది ఆయనొక్కడికే కాదు..చాలామందికి వర్తిస్తుంది. దాదాపు అన్ని పార్టీలూ అలా ఖాళీల్ని ఉంచి, అభ్యర్థుల రాక కోసం వెయిట్ చేసేవే, చేస్తున్నవే.

ఫుట్‌బోర్డు మీద ప్రయాణం ప్రమాదకరం...

కొందరు నేతలుంటారు. దశాబ్దాలపాటు పార్టీకి సేవలందిస్తారు. జీవితమంతా పార్టీకే ధారబోస్తారు. కీలకమైన ప్రభుత్వ, పార్టీ పదవులు చేపట్టి ఉంటారు. పాపం... తీరా ఎలక్షన్ టైముకు టికెట్ రాదు. కొందరు రాజీనామా చేస్తారు. మరికొందరు చెయ్యరు.

ఇక వీళ్లంతా సీటు దొరకని ప్రయాణికుల్లా ఉంటారు. సీటు దొరకనందుకు అసహనంగా ఉంటారు. ఫుట్‌బోర్డు మీద ప్రయాణికుల్లా కనిపిస్తారు. అప్పుడు పొరుగు పార్టీ అధినేతనో లేదా మరో పార్టీలోని పెద్ద నేతనో కండక్టర్‌లా వస్తాడు. లోనికి రమ్మంటాడు. ఫుట్‌బోర్డు మీద నుంచి బస్సులోకి తీసుకెళ్లినట్టుగా..తమ పార్టీలోకి పట్టుకుపోతాడు. ఒక్కటే తేడా. కండక్టర్ హార్ష్‌గా తిట్టి తీసుకుపోతాడూ... కీలకనేతల్ని గౌరవం నటిస్తూ పట్టుకుపోతారు. డిఫరెన్స్ ఇంతే. ఉదాహరణకు పొన్నాల లక్ష్మయ్య గానీ ఇలాంటివారు ఎందరో నేతలూ!...ఎన్నో పార్టీలూ!!

ఆర్టీసీ ప్రయాణమే సురక్షితం

ఈ నినాదం ఎలక్షన్స్‌కు ఎలా వర్తిస్తుందో చూద్దాం. దీనర్థం ఏమిటంటే..మా పార్టీలోనే మీకు తగిన ప్రాధాన్యముంటుంది. ప్రైవేటు బస్సుల్లాంటి ఇతర పార్టీల్లో మీకంత ప్రయారిటీ ఉండకపోవచ్చు అని సూచించేలాంటిదే ఈ నినాదం.


''అన్నీ నాయకులకేనా, సామాన్యులకేమీ సందేశాలు లేవా?'' అడిగాడు మా బావ.

''ఎందుకు లేవూ... 'లైట్లు ఆర్పి సెల్ఫ్ కొట్టవలెను' అని కూడా రాసి ఉంటుంది. ఇది డ్రైవరుకు సంబంధించిన సూచన. ఓటర్లంతా మామూలు ప్రయాణికుల్లాంటివారు. వాళ్లంతా బస్సెక్కాక..అంటే ఓటేశాక..తమ దారి స్పష్టంగా ఉండటం కోసం డ్రైవర్లలాంటి నేతలంతా బస్సులో దీపాలార్పేసి జనాల బతుకులు చీకటి చేస్తారు.

ఇది నేతలకు ఓ సూక్తి!..జనాలకో హెచ్చరిక!!

'ఎలక్షన్ కింగ్' @ 236

సీఎం కేసీఆర్‌పై తమిళనాడుకు చెందిన పద్మరాజన్ పోటీ • ఇప్పటికే నామినేషన్ దాఖలు



సాక్షి, సిద్దిపేట: ముఖ్యమంత్రి కేసీఆర్‌పై ఎక్కడో తమిళనాడు నుంచి వచ్చిన 'ఎలక్షన్ కింగ్' పద్మరాజన్ పోటీ చేయడం ఏమిటని అనుకుంటున్నారా.. ? అసలు ఎవరీయన అని ఆలోచిస్తున్నారా.. అయితే సదరు పద్మరాజన్ గురించి కాస్త తెలుసుకోవాల్సిందే. తమిళనాడు రాష్ట్రం సేలం జిల్లా మెట్టూరుకు చెందిన పద్మరాజన్ వృత్తిరీత్యా హోమియోపతి వైద్యుడు. ప్రముఖులు ఎక్కడ పోటీ చేస్తే అక్కడికి వెళ్లి ఈయన బరిలో ఉంటుంటారు. దివంగత ఏబీ వాజ్‌పేయి, పీవీ నరసింహారావు, జయలలిత, కరుణానిధిపై కూడా పోటీ చేశారు. ఇక పీఎం నరేంద్రమోదీ మొదలు పలువురు ముఖ్యమంత్రులు, మంత్రులు, కేంద్ర మంత్రులపై సైతం బరిలోకి దిగారు. గల్లీ నుంచి ఢిల్లీ వరకు ఎక్కడ ఎన్నిక జరిగినా ప్రముఖులపై ఆయన పోటీకి దిగేస్తారు. 1988 నుంచి ఇలా పోటీ చేయడం మొదలుపెట్టిన పద్మరాజన్ అలా ఇప్పటి వరకు 236 సార్లు పోటీ చేశారు. కానీ ఇప్పుడు తొలిసారిగా సీఎం కేసీఆర్‌పై పోటీ చేయబోతున్నారు. గజ్వేల్ నియోజకవర్గం నుంచి ఇండిపెండెంట్ అభ్యర్థిగా పద్మరాజన్ ఈ నెల 3న నామినేషన్ వేసి 237వ సారి పోటీకి సై అంటున్నారు.

ఐదుసార్లు రాష్ట్రపతిగా కూడా పోటీ

ఐదుసార్లు రాష్ట్రపతి అభ్యర్థిగా, ఐదుసార్లు ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా, 32 సార్లు లోక్‌సభకు ,72 సార్లు అసెంబ్లీకి, 3 సార్లు ఎమ్మెల్సీకి , ఒకసారి మేయర్ పదవికి, మూడు మార్లు చైర్మన్ పోస్టుకి, ఇంకా అనేక ఇతర ఎన్నికల్లో పోటీ చేశారు.

అత్యంత విఫలమైన అభ్యర్థిగా గిన్నిస్ రికార్డు

ఇప్పటివరకు ఆయన ఏ ఎన్నికలోనూ గెలవలేదు. 35 ఏళ్లగా పోటీ చేస్తున్న ఆయన్ను గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్, లిమ్కా బుక్ ఆఫ్ రికార్డులలో ప్రపంచంలోనే అత్యంత విఫలమైన అభ్యర్థిగా పేర్కొనడం గమనార్హం.

ఇలా ఎందుకు పోటీ చేస్తున్నారంటే..

ఓటమి చెందుతానని తెలిసినప్పటికీ తప్పకుండా బరిలో ఉంటారు. ఎన్నికల్లో పోటీ చేసేందుకు డిపాజిట్‌లు, ఇతర ఖర్చులు మొత్తంగా ఇప్పటి వరకు సుమారు రూ.30 లక్షలు అయినట్టు చెబుతున్నారు. ప్రజాస్వామ్యంలో ఎవరైనా ఎక్కడి నుంచైనా పోటీ చేయవచ్చని ప్రజలకు తెలియజేయడం కోసమే ఇలా పోటీ చేస్తున్నానని డాక్టర్ పద్మరాజన్ చెప్పుకొచ్చారు.



మధ్యప్రదేశ్‌లోని కుక్షిలో ప్రియాంకా గాంధీని సంప్రదాయ రీతిలో ఆహ్వానిస్తున్న మహిళలు



సోమవారం నామినేషన్ వేసేందుకు వెళ్తూ సోదరి విమలా దేవి ఆశీర్వాదం తీసుకుంటున్న రాజస్తాన్ సీఎం అశోక్ గెహ్లోత్



మధ్యప్రదేశ్‌లోని దేవ్‌సర్‌లో ఎన్నికల ప్రచారం సందర్భంగా సంగీత కార్యక్రమంలో పాల్గొన్న సీఎం చౌహాన్

నేడు ఛత్తీస్‌గఢ్‌లో తొలి దశ

- అసెంబ్లీలోని 20 స్థానాలకు పోలింగ్
- మాజీ సీఎం రమణ్‌సింగ్ సహా తేలనున్న పలువురు నేతల భవితవ్యం
- 60 వేల భద్రతా సిబ్బందితో భారీ బందోబస్తు

సాక్షి, న్యూఢిల్లీ: ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికల తొలి దశ పోలింగ్‌కు సిద్ధమైంది. అసెంబ్లీలోని 90 స్థానాలకు గానూ 20 స్థానాలకు మంగళవారం పోలింగ్ జరగనుంది. తొలి దశలో పోలింగ్ జరుగనున్న ఈ 20 స్థానాల్లో తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు బరిలో నిలిచిన 223 మంది అభ్యర్థుల్లో 25 మంది మహిళలున్నారు. తొలిదశలో మొత్తం 5,304 పోలింగ్ కేంద్రాల్లో 40.78 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. మొత్తం 5,304 పోలింగ్ స్టేషన్లకు గాను 25,429 మంది సిబ్బంది విధుల్లో ఉంటారని చీఫ్ ఎలక్టోరల్ అధికారి(సీఈవో) చెప్పారు. పది నియోజకవర్గాల పరిధిలో ఉదయం 7 గంటలకు మొదలై మధ్యాహ్నం 3 గంటల వరకు పోలింగ్ కొనసాగుతుంది. మరో 10 నియోజకవర్గాల్లో ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ ఉంటుందన్నారు. మొదటి విడత పోలింగ్ మావోయిస్టు ప్రభావిత ప్రాంతం బస్తర్‌లోని 12 నియోజకవర్గాల్లో జరగనున్నందున అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. మొత్తం 60 వేల మంది భద్రతా సిబ్బందిని రంగంలోకి దించారు. వీరిలో 40 వేల మంది కేంద్ర సాయుధ రిజర్వు బలగా(సీఏపీఎఫ్)లున్నాయి.

తొలిదశలో బరిలో ఉన్న అభ్యర్థులలో బీజేపీ నుంచి మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ రమణ్‌సింగ్‌తో పాటు ఆయన మంత్రివర్గంలో పనిచేసిన ఐదుగురు మంత్రులు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. అదేవిధంగా, కాంగ్రెస్ పార్టీ నుంచి ప్రస్తుత కేబినెట్‌లోని ముగ్గురు మంత్రులు, ఒక ఎంపీ సహా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు దీపక్ బైజ్‌లు బరిలో ఉన్నారు. తొలిదశలోని 20 స్థానాల్లో ముఖ్యంగా చిత్రకోట్, రాజ్‌నంద్‌గావ్, కవర్ధా, కొండగావ్, కొంటా, కేశ్‌కాల్, నారాయణ్‌పూర్, బిజాపూర్, అంతాగఢ్, దంతెవాడ నియోజకవర్గాలపై ప్రస్తుతం అందరి దృష్టి నెలకొంది. రాజ్‌నంద్‌గావ్ అసెంబ్లీ నియోజకవర్గంలో పోటీ మాజీ సీఎం రమణ్‌సింగ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత గిరీష్ దేవాంగన్‌ల మధ్య నెలకొంది. రాజ్‌నంద్‌గావ్ అసెంబ్లీ సీటు రమణ్ సింగ్‌కు బలమైన కోటగా పరిగణిస్తారు. 2008 నుంచి 2018 వరకు ఈ స్థానం నుంచి గెలుపొందారు. రమణ్‌సింగ్‌కు పోటీగా కాంగ్రెస్ సీనియర్ నేత గిరీష్ దేవాంగన్‌ను ఇక్కడి నుంచి పోటీకి దింపింది. చిత్రకోట్ అసెంబ్లీ స్థానం నుంచి కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు దీపక్ బైజ్ బరిలో ఉన్నారు. బీజేపీ నుంచి వినాయక్ గోపాల్ దీపక్‌కు సవాల్ విసిరారు. కొండగావ్‌లో సిట్టింగ్ ఎమ్మెల్యే మోహన్ మార్కంకు కాంగ్రెస్ మళ్లీ టికెట్ ఇవ్వగా.. రమణ్‌సింగ్ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన లతా ఉసేండిని బీజేపీ రంగంలోకి దింపింది. కవార్ధా అసెంబ్లీ స్థానం నుంచి భూపేశ్ బఘేల్ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న మహమ్మద్ అక్బర్ కాంగ్రెస్ నుంచి బరిలో ఉండగా, అక్బర్‌ను ఓడించేందుకు బీజేపీ విజయ్ శర్మను రంగంలోకి దించింది. ఈ నియోజకవర్గం నుంచి 16 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. కాగా ఒడిశా-తెలంగాణ సరిహద్దులో ఉన్న కొంట అసెంబ్లీ 24 ఏళ్లగా కాంగ్రెస్ పార్టీ అధీనంలో ఉంది. కొంటా నుంచి వరుసగా ఐదు సార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసిన కవాసీ లఖ్మాను కాంగ్రెస్ పోటీకి దింపింది.



జగదల్‌పూర్‌లో పోలింగ్ విధులకు బయలుదేరుతున్న పోలీస్ సిబ్బంది

మిజోరంలో నేడే పోలింగ్

ఐజ్వాల్: మిజోరం అసెంబ్లీకి నేడు జరిగే పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేసినట్లు చీఫ్ ఎలక్టోరల్ అధికారి(సీఈవో) మధూప్ వ్యాస్ చెప్పారు. అసెంబ్లీలోని 40 స్థానాలకు గాను 18 మంది మహిళలు, 27 మంది స్వతంత్రులు సహా 174 మంది అభ్యర్థులు బరిలో ఉన్నట్లు చెప్పారు. మొత్తం 8.57 లక్షల ఓటర్లకుగాను 1,276 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మంగళవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ కొనసాగుతుందన్నారు. 149 పోలింగ్ కేంద్రాలు మారుమూల ప్రాంతాల్లోనూ, మరో 30 కేంద్రాలు, అంతర్రాష్ట్ర, అంతర్జాతీయ సరిహద్దులకు సమీపంలో ఉన్నాయని చెప్పారు. పోలింగ్ నేపథ్యంలో రాష్ట్రంతో ఉన్న మయన్మార్, బంగ్లాదేశ్ సరిహద్దులను మూసివేశారు. వీటితోపాటు రాష్ట్రంతో ఉన్న అస్సాంలోని మూడు జిల్లాలు, మణిపూర్‌లోని రెండు, త్రిపురలోని ఒక జిల్లా సరిహద్దులను మూసివేశారు. భద్రతా విధుల్లో మూడు వేల మంది పోలీసులు, కేంద్ర సాయుధ పోలీసు బలగాల సేవలను వినియోగించుకుంటున్నారు.



మిజోరం రాజధాని ఐజ్వాల్‌లో ఈవీఎంలు, ఇతర సామగ్రిని సరిచూసుకుంటున్న ఎన్నికల సిబ్బంది

ధుంధాడ్‌లో దూకుడెవరిదో!

రాజస్తాన్‌లో రాజకీయంగా కీలక ప్రాంతం

ఇక్కడ పైచేయి సాధించిన పార్టీదే అధికారం

ధుంధాడ్ రాజస్తాన్‌కు అధికార కేంద్రంగా చెప్పుకునే ప్రాంతం. రాష్ట్ర రాజకీయాలకు కూడా ఒకరకంగా ఆయువుపట్టు. పైగా గత మూడు అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఇక్కడ ఎక్కువ సీట్లు సాధించిన పార్టీయే అధికారంలోకి వచ్చింది. అందుకే 32 అసెంబ్లీ స్థానాలున్న ఈ ప్రాంతంపై ఆధిపత్యం కోసం కాంగ్రెస్, బీజేపీ ఈసారి కూడా హోరాహోరీగా తలపడుతున్నాయి. అయితే ధుంధాడ్ ఒక్కోసారి ఒక్కో పార్టీని అందలమెక్కిస్తూ వస్తోంది. ఈసారి ఇక్కడ ఎవరు దూకుడు ప్రదర్శిస్తారన్నది ఆసక్తికరంగా మారింది...

ధుంధాడ్ తూర్పు-మధ్య రాజస్తాన్‌లో ఉన్న ప్రాంతం. తొలుత ఇక్కడ 25 అసెంబ్లీ స్థానాలుండేవి. నియోజకవర్గాల పునర్ వ్యవస్థీకరణ అనంతరం 32కు పెరిగాయి. 2008 అసెంబ్లీ ఎన్నికల్లో ఇక్కడ బీజేపీ 11, కాంగ్రెస్ 13 సీట్లు గెలిచాయి. ఐదు సీట్లలో స్వతంత్రులు, రెండింట్లో బీఎస్పీ నెగ్గగా ఒకటి లోక్‌తాంత్రిక్ సమాజ్‌వాదీ ఖాతాలోకి వెళ్లింది. కానీ 2013లో మాత్రం బీజేపీ ఇక్కడ ఏకంగా 28 స్థానాలను గుప్పిట పట్టి కాంగ్రెస్‌ను కేవలం ఒక్క స్థానానికి పరిమితం చేసింది. నేషనల్ పీపుల్స్ పార్టీ 2, స్వతంత్రులు ఒక సీటు గెలుచుకున్నారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ పరిస్థితి మారింది. కాంగ్రెస్ 20 సీట్లు హస్తగతం చేసుకుంది. బీజేపీ ఆరింటితో సరిపెట్టుకుంది. స్వతంత్రులు కూడా ఆరు సీట్లలో గెలవడం విశేషం. ఇక్కడి పట్టణ ప్రాంతాలు సాంప్రదాయికంగా బీజేపీకి కంచుకోటలంటారు రాజకీయ విశ్లేషకుడు నారాయణ్ బరేథ్. ఇక్కడ ఎక్కువగా ఉండే బ్రాహ్మణ, బనియా సామాజికవర్గాల వాళ్లు బీజేపీని తమ పార్టీగా భావిస్తుండటమే ఇందుకు కారణమన్నారాయన. ధుంధాడ్‌లో పోయినసారి కాంగ్రెస్ ప్రదర్శన బాగున్నా ఈసారి మాత్రం పోటీ హోరాహోరీగా ఉండనుందని జోస్యం చెప్పారు. ''అయితే ఇరు పార్టీలనూ వర్గపోరు కుంగదీస్తోంది. దాన్ని సరి చేసుకుని ప్రచారంలో దూకుడుగా వెళ్లడంతో పాటు అభ్యర్థుల ఎంపికలో జాగ్రత్త పడేవాళ్లదే ఈసారి ధుంధాడ్‌లో పైచేయి''అని అభిప్రాయపడ్డారు.



సీఎం అవకాశం ఇవ్వనందుకు ఈసారి కాంగ్రెస్‌పై బాగా అసంతృప్తితో ఉన్నారు. ధుంధాడ్‌లో చాలా నియోజకవర్గాల్లో గుజ్జర్ల ప్రాబల్యమున్న నేపథ్యంలో ఇది కాంగ్రెస్‌కు ఇబ్బందికరంగానే మారే అవకాశముంది. మీనా, ఎస్సీ సామాజికవర్గాల్లోనూ కాంగ్రెస్‌కు ఆదరణ ఉంది. బ్రాహ్మణ, రాజ్‌పూత్, బనియాలు బీజేపీకి ఎప్పుడూ మద్దతుగా ఉంటూ వస్తున్నారు.

రాచరికపు ప్రభావం...

ధుంధాడ్ ప్రాంతంపై జైపూర్ రాజ వంశీకుల ప్రభావం చాలా ఎక్కువ. స్కూళ్లు, కాలేజీలు వంటి పలు విద్యా సంస్థలు, ఆస్పత్రులు తదితర నిర్మాణాలతో ప్రజల్లో రాజ కుటుంబం మంచి ఇమేజీ తెచ్చుకుంది. 1962 దాకా కాంగ్రెస్ కంచుకోటగా ఉన్న ఈ ప్రాంతంలో స్వతంత్ర పార్టీ ఆవిర్భావంతో కథ మారింది. మహారాణి గాయత్రీ దేవి సారథ్యంలో ఆ పార్టీ ప్రాబల్యం పెరిగింది. ఆ ఇమేజీని సొమ్ము చేసుకునేందుకు బీజేపీ ఈసారి రాజ వంశానికి చెందిన తమ ఎంపీ దియా కుమారిని విద్యాధర్‌నగర్ అసెంబ్లీ స్థానం నుంచి బరిలో దింపింది.

కుల ప్రభావం ఎక్కువ

హీరాలాల్ శాస్త్రి, తికారాం పలివాల్ రూపంలో రాష్ట్రానికి ఇద్దరు ముఖ్యమంత్రులను ఇచ్చిన చరిత్ర ధుంధాడ్ ప్రాంతానిది. ఇక్కడ కుల సమీకరణలు చాలా కీలకంగా ఉంటాయి. పట్టణ ప్రాంతాల్లో బీజేపీకి ఆదరణ ఉండగా గ్రామీణ ప్రాంతాలు కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉంటుంటాయి. కాకపోతే గుజ్జర్లు తమ సామాజిక వర్గానికి చెందిన సచిన్ పైలట్‌కు 2018లో

గత మూడు అసెంబ్లీ ఎన్నికల్లో ధుంధాడ్ ప్రాంతంలో ఫలితాలు...
(మొత్తం స్థానాలు 32)

ఏడాది	2008	2013	2018
బీజేపీ	11	28	6
కాంగ్రెస్	13	1	20
ఇతరులు	8	3	6

(జైపూర్, దౌసా, టోంక్, సవాయ్ మధోపూర్, కరౌలి జిల్లాలు ధుంధాడ్ ప్రాంతం పరిధిలోకి వస్తాయి)



సాక్షి హైదరాబాద్

మంగళవారం । 7 । నవంబర్ । 2023



వాజ్‌పేయి ప్రచారం చేసిన వేళ...



సరిగ్గా 40 ఏళ్ల క్రితం జరిగిన ఎన్నికల్లో అప్పటి బీజేపీ జాతీయ అధ్యక్షుడు, దివంగత ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయి పూర్వ హిమాయత్‌నగర్ నియోజకవర్గంలో భాగమైన అంబర్‌పేటలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. 1983 జనవరిలో జరిగిన ఎన్నికల్లో బీజేపీ తరుపున బి.దామోదర్ అభ్యర్థిగా ఉన్నారు. అంబర్‌పేట మున్సిపల్ కాలనీలో నిర్వహించిన ఎన్నికల సభలో అప్పటి పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండారు దత్తాత్రేయ, స్థానిక నేతలు నందరాజ్‌గౌడ్, చింతల శ్రీనివాస్ ముదిరాజ్‌లు అటల్‌బిహారీ వాజ్‌పేయితో వేదిక పంచుకున్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి దామోదర్ ఓటమి చెందగా టీడీపీ ప్రభంజనంతో ఆ పార్టీ అభ్యర్థి నారాయణరావు గౌడ్ గెలుపొందారు. గెలుపొందిన రెండు రోజులకే నారాయణ్ రావుగౌడ్ ఆకస్మికంగా మృతిచెందారు. తిరిగి జరిగిన ఉపఎన్నికల్లో బీజేపీ తరుపున ఆలె నరేంద్ర బరిలో నిలిచి..సమీప టీడీపీ అభ్యర్థి ఉపేంద్రపై విజయం సాధించారు. – అంబర్‌పేట్

మీ నాయనను యాదికి తెచ్చినవ్ బిడ్డా...



'నేనెవరో గుర్తు పట్టినవా.. అవ్వా...' అంటూ ఖైరతాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి పి.విజయారెడ్డి అడగ్గానే.. 'ఎందుకు గుర్తుకు పట్టలేదు బిడ్డా..నువ్వు జనార్దన్ రెడ్డి బిడ్డవేగా... ఇవన్నీ మీ నాయన బస్తీలే కదమ్మా' అంటూ ఆమె బదులిచ్చింది. సోమవారం విజయారెడ్డి జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్ బస్తీల్లో పర్యటించగా వృద్ధ మహిళలు ఆమెను అక్కున చేర్చుకున్నారు. మీ నాయనను యాదికి తెచ్చావంటూ ఆలింగనం చేసుకున్నారు. వారితో కలిసి విజయారెడ్డి ఆహ్లాదంగా నవ్వుతూ సరదగా ముచ్చటించారు. – ఫిలింనగర్

239 మంది పీఓ, ఏపీఓలకు షోకాజ్ నోటీసులు



సాక్షి, రంగారెడ్డి జిల్లా: ఎన్నికల నిర్వహణ, విధి నిర్వహణ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే సిబ్బందిపై జిల్లా ఎన్నికల అధికారి కన్నెర్ర చేశారు. ఓటర్ల జాబితాలో తప్పిదాలాకు కారణమైన శేరిలింగంపల్లి బీఎల్ఓ, సూపర్ వైజర్లపై ఇప్పటికే సస్పెన్షన్ వేటు వేసిన జిల్లా ఎన్నికల సంఘం..తాజాగా ఇటీవల జిల్లా కేంద్రంలో నిర్వహించిన శిక్షణ తరగతులకు గైర్హాజరైన సుమారు 239 మంది పీఓ, ఏపీఓలకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. కలెక్టరేట్‌లో అక్టోబర్ 31న, నవంబర్ 2న జిల్లా కేంద్రంలో ప్రిసైడింగ్ ఆఫీసర్లు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్లు, అదర్ పోలింగ్ ఆఫీసర్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎంపిక చేసిన పీఓలు, ఏపీఓలకు ముందే సమాచారం ఇచ్చారు. అయినా..సుమారు 239 మంది పీఓ, ఏపీలు గైర్హాజరవడాన్ని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ భారతి హోలికేరి సీరియస్‌గా తీసుకున్నారు. ఈ శిక్షణ తరగతులకు ఎందుకు రాలేదో వివరించాలని కోరుతూ సోమవారం వారికి సంజాయిషీ నోటీసులు జారీ చేశారు. వీరిలో 70 మంది ఉపాధ్యాయులు ఉండగా, మిగతా ఇతర విభాగాల ఉద్యోగులు ఉండటం విశేషం.

నేడు ఎన్టీఆర్ గార్డెన్, లుంబినీ పార్కుల మూసివేత



లక్డీకాపూల్: ప్రధాని మోదీ ఎన్నికల ప్రచార సభలో పాల్గొనేందుకు నగరానికి రానున్న దృష్ట్యా మంగళవారం ఎన్టీఆర్ గార్డెన్, లుంబినీ పార్కులను మూసివేయనున్నట్లు హెచ్ఎండీఏ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధాని సభ జరుగనున్న ఎల్‌బీ స్టేడియానికి చేరుకొనేందుకు రోడ్డు మార్గంలో రద్దీగా ఉండే ఎన్టీఆర్ గార్డెన్, లుంబినీ పార్కులను భద్రత ఏర్పాట్లలో భాగంగా మూసివేయాలని పోలీస్ ఉన్నతాధికారుల సూచనల మేరకు హెచ్ఎండీఏ ఈ నిర్ణయం తీసుకుంది. ఈ మార్గాల్లో ట్రాఫిక్‌నూ మళ్లిస్తారు.

అసద్ ఆగయా



సాక్షి, సిటీబ్యూరో: మజ్లిస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల ప్రచార పర్వంలో దూకుడు పెంచింది. సోమవారం నాలుగు అసెంబ్లీ సెగ్మెంట్లలో మజ్లిస్ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. పార్టీ అధినేత అసదుద్దీన్ ఓవైసీ రంగంలోకి దిగి అసెంబ్లీ అభ్యర్థులను వెంట పెట్టుకొని పాదయాత్రలతో డోర్ టూ డోర్ ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ప్రజలతో కరచాలనం చేస్తూ..పెద్దల దీవెనలు తీసుకుంటూ ప్రచారం సాగిస్తున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పాదయాత్ర..రాత్రి పూట డివిజన్‌స్థాయిలో సభలు నిర్వహిస్తున్నారు. హంగూ ఆర్భాటం లేకుండా సాదాసీదా ప్రచారంతో మజ్లిస్ పార్టీ వ్యూహాత్మక వైఖరిని అవలంబిస్తోంది. ఎన్నికల్లో తమ పనితీరే గుర్తింపు అన్న మంత్రం మజ్లిస్ జపిస్తోంది. మజ్లిస్ రాజకీయ చరిత్రలో ఇప్పటి వరకు ఎన్నికల మేనిఫెస్టో ప్రకటించలేదు. ఎన్నికల కోసం హామీల వర్షం కురిపించలేదు. కానీ, చేసిన అభివృద్ధిని మాత్రం పదే పదే ప్రస్తావించడం మజ్లిస్ సంప్రదాయం.

జూబ్లీహిల్స్, రాజేంద్రనగర్ స్థానాల్లో మజ్లిస్ అభ్యర్థులు ఖరారు



బెల్లి రవియాదవ్ (రాజేంద్రనగర్)



రషీద్ ఫరాజుద్దీన్ (జూబ్లీహిల్స్)

సాక్షి, సిటీబూరో: పాత బస్తీలో ఎదురులేని శక్తిగా ఎదిగిన మజ్లిస్ పార్టీ..జూబ్లీహిల్స్, రాజేంద్రనగర్ అసెంబ్లీ సెగ్మెంట్‌లలోనూ పాగా వేసేందుకు సిద్ధమైంది. గత ఎన్నికల్లో జూబ్లీహిల్స్‌లో మిత్రపక్షమైన బీఆర్ఎస్ అభ్యర్థికి సంపూర్ణ మద్దతు ప్రకటించి సహకరించిన మజ్లిస్ ఈసారి మాత్రం ఎన్నికల్లో పోటీకి అభ్యర్థిని బరిలో దింపింది. ఈమేరకు జూబ్లీహిల్స్ మజ్లిస్ అభ్యర్థిగా షేక్‌పేట కార్పొరేటర్ రషీద్ ఫరాజుద్దీన్, రాజేంద్రనగర్‌కు లంగర్‌హౌస్ మాజీ కార్పొరేటర్ బెల్లి రవి యాదవ్‌ల అభ్యర్థిత్వాలను ఖరారు చేసింది. సోమవారం ఆ పార్టీ అధినేత అసదుద్దీన్ ఓవైసీ వీరి పేర్లను ప్రకటించారు. వరుసగా రెండు పర్యాయాలు కార్పొరేటర్‌గా ఎన్నికైన రషీద్ ఫరాజుద్దీన్ జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడిగానూ వ్యవహరిస్తున్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో సుమారు లక్షా 30 వేలకు పైగా మైనారిటీ ఓటర్లు ఉన్నారు. రాజేంద్రనగర్‌లోనూ గణనీయమైన సంఖ్యలోనే ఉన్నారు. మొత్తంమీద ఈ నియోజకవర్గాల్లో అభ్యర్థి గెలుపు, ఓటములలో మైనార్టీ ఓటర్లు కీలక పాత్ర పోషిస్తారని చెప్పొచ్చు.



ప్రధాని రాక కోసం...

ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం నగరానికి రానున్నారు. ఎల్బీ స్టేడియంలో జరిగే బీసీల ఆత్మగౌరవ సభలో పాల్గొంటారు. ఈ నేపథ్యంలో సోమవారం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, పార్టీ తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి తరుణ్‌చుగ్‌లు ఎల్బీ స్టేడియంలో ఏర్పాట్లు పరిశీలించారు.

జనసమీకరణపైనే దృష్టి

- నేడు ఎల్‌బీ స్టేడియంలో బీజేపీ 'బీసీ ఆత్మగౌరవ' సభ
- హాజరు కానున్న ప్రధాని నరేంద్ర మోదీ
- సభ సక్సెస్‌కు బీజేపీ శ్రేణుల కసరత్తు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: బీజేపీ బీసీ ఆత్మగౌరవ సభకు సర్వం సిద్ధమైంది. మంగళవారం సాయంత్రం 4 గంటలకు ఎల్బీ స్టేడియం వేదికగా నిర్వహించనున్న ఈ సభకు ప్రధాని నరేంద్రమోదీ హాజరు కానున్నారు. ఎన్నికల నేపథ్యంలో ఆ పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ సభను విజయవంతం చేసేందుకు గ్రేటర్ నియోజకవర్గాల నుంచి భారీగా జన సమీకరణకు ఏర్పాట్లు చేసింది. బూత్ ఇన్‌చార్జిలతో పాటు కార్యకర్తలను ఈ సభకు తరలించాలని నిర్ణయించింది. తెలంగాణలో మెజార్టీ అభ్యర్థులు విజయం సాధించి బీజేపీ అధికారంలోకి వస్తే..బీసీ అభ్యర్థిని ముఖ్యమంత్రిగా నియమించనున్నట్లు ఈ సభావేదికగా ప్రధాని ప్రకటించే అవకాశం ఉంది. బీజేపీ ప్రభుత్వం ఇప్పటి వరకు బీసీలకు ఏం చేసింది? భవిష్యత్తులో వారికి ఏం చేయబోతోంది? వంటి అంశాలను ప్రధాని వివరించనున్నారు. బషీర్‌బాగ్ కేంద్రంలోని ఎల్బీ స్టేడియం వేదికగా బీసీ గర్జన సభ నిర్వహిస్తున్న నేపథ్యంలో పోలీసులు ఆ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. మంగళవారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఆంక్షలు కొనసాగుతాయని ప్రకటించారు.

ఆ సీట్లపై ఇంకా వీడని ఉత్కంఠ

ఇదిలా ఉంటే బీజేపీ, కాంగ్రెస్‌లు దాదాపు అన్ని స్థానాలకు అభ్యర్థులను ప్రకటించాయి. ఇప్పటికే ఆయా పార్టీల అభ్యర్థులు ప్రచారంలో దూసుకుపోతున్నారు. అయితే బీజేపీ మాత్రం కీలకమైన స్థానాలకు ఇప్పటికీ అభ్యర్థులను ఖరారు చేయకపోవడం పార్టీ శ్రేణులను ఆందోళనకు గురిచేస్తోంది. గ్రేటర్ పరిధిలోని శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, మల్కాజ్‌గిరి, నాంపల్లి, కంటోన్మెంట్ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించకపోవడంతో ఆయా స్థానాలపై నెలకొన్న ఉత్కంఠ ఇంకా కొనసాగుతూనే ఉంది. జనసేనతో పొత్తు నేపథ్యంలో ఈ సీట్లను పెండింగ్‌లో పెట్టిన విషయం తెలిసింది. అయితే రెండు పార్టీల మధ్య ఇప్పటికే చర్చలు కొలిక్కి వచ్చినప్పటికీ..అభ్యర్థులను ఖరారు చేయలేదు. చాంద్రాయణగుట్ట నియోజకవర్గానికి అభ్యర్థిని ఖరారు చేసినప్పటికీ..ఆయన అనారోగ్య కారణాల రీత్యా పోటీ నుంచి తప్పుకుంటున్నట్లు సమాచారం. ఆ స్థానంలో మరో అభ్యర్థిని ఖరారు చేయాల్సి ఉంది. ఇది కూడా మంగళవారం మధ్యాహ్నం వరకు కొలిక్కి వచ్చే అవకాశం ఉంది.



ష్.. గప్‌చుప్!

పొలిటికల్ గెట్ టు గెదర్స్!

- ఓటర్లతో అభ్యర్థుల ఆత్మీయ సమ్మేళనాలు
- కుల, ఉద్యోగ, వ్యాపార సంఘాలతో మంతనాలు
- గంపగుత్తగా ఓట్లు రాబట్టేందుకు స్కెచ్
- ఫామ్‌హౌస్‌లు, రిసార్ట్‌లలో వీకెండ్ పార్టీలు
- ఈ వ్యూహం అమలులో బీఆర్ఎస్‌దే పైచేయి..



సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్రంలో శాసనసభ ఎన్నికల నేపథ్యంలో ఆయా పార్టీల అభ్యర్థుల గెట్ టు గెదర్ పార్టీలు ఎక్కువైపోయాయి. సామాజిక వర్గాల వారీగా సీట్లను కేటాయించిన రాజకీయ పార్టీలు..ప్రచారంలోనూ ఇదే వ్యూహాన్ని అనుసరిస్తున్నాయి. ప్రతి వర్గం ఓటర్లకు దగ్గరయ్యేందుకు ఆత్మీయ సమ్మేళనాలను నిర్వహిస్తున్నాయి. ఆయా కుల సంఘాల నేతలతో ప్రత్యేకంగా సమావేశమవుతున్నాయి. తాము ఫలానా సామాజిక వర్గం పక్షమేనని ముందస్తుగా తీర్మానాలు సైతం జారీ చేస్తున్నారు.

కాలనీ, సంక్షేమ సంఘాలతో..

పోలింగ్‌కు తక్కువ సమయం ఉండటంతో అభ్యర్థులు ప్రచారంలో వేగం పెంచారు. నియోజకవర్గంలోని ఇంటింటికీ తిరిగి ఓటర్లను ఒడిసిపట్టుకోవాలంటే ఈ తక్కువ సమయంలో అభ్యర్థులకు కష్టమే. దీంతో ఆత్మీయ సమ్మేళనాలు, వీకెండ్ వేడుకలకు అభ్యర్థులు తెరలేపారు. కుల సంఘాలు, వ్యాపార వర్గాలు, వృత్తి పనివారు, శ్రామికులు ఇలా పలు సంఘాల వారితో పాటు బస్తీ, కాలనీ, అపార్ట్‌మెంట్ల అసోసియేషన్ల వారితో ఆత్మీయ సమ్మేళనాలకు ప్లాన్ చేస్తున్నారు. వారందరినీ ఒక్క చోట చేర్చి హామీల వర్షం, వరాల జల్లు కురిపిస్తున్నారు. సంఘం నేతలకు తాయిలాలను ఆఫర్ చేస్తున్నారు. ఆయా సంఘాలను ప్రసన్నం చేసుకోవడం ద్వారా గంపగుత్తగా ఓట్లు దండుకోవచ్చని పార్టీలు లెక్కలేసుకుంటున్నాయి.

ఇతర రాష్ట్రాల ఓటర్లతో తీర్మానాలు..

హైదరాబాద్‌కు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన మార్వాడీలు, గుజరాతీలు, రాజస్థానీలు, కేరళ వాసులతో ఎన్నికల సమయంలో సమావేశాలు నిర్వహించడాన్ని అధికార పార్టీ ఆనవాయితీగా పెట్టుకుంది. ఈసారి కూడా ఇదే వ్యూహాన్ని అమలు చేస్తుంది. అలాగే పలు అసోసియేషన్లు, సంక్షేమ సంఘాలతో భేటీ కావడం, వారి మద్దతు తమకే అంటూ తీర్మానం చేయించుకోవడం లాంటి ట్రిక్కులను ప్రయోగిస్తుంది. పెద్ద పెద్ద సంఘాలు, బిల్డర్స్ అసోసియేషన్లు, హోటల్స్ అసోసియేషన్‌లతో జరిగే భేటీలకు కేటీఆర్, కవిత లాంటి వారు హాజరవుతున్నారు. కాలనీలు, బస్తీలు, గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్‌వాసులు, యువజన సంఘాలతో సమావేశాల నిర్వహణను అభ్యర్థులే చూసుకుంటున్నారు. ఇప్పటిదాకా వారికి చేసిన సేవలు, పథకాల గురించి వివరిస్తూనే... మూడోసారి అధికారంలోకి వస్తే ఏం చేస్తామో చెప్పే ప్రయత్నం చేస్తున్నారు. అయితే ఈ వ్యూహం అమలులో విపక్ష పార్టీలు కాస్త వెనకబడ్డాయనే అంటున్నారు. ఎందుకంటే ఇప్పటిదాకా అభ్యర్థులే ఖరారు కాకపోవడం ఒక అంశం అయితే ఖరారైన చోట ప్రచారంలో దూకుడును ప్రదర్శించలేకపోతున్నారు.

ఫామ్‌హౌస్‌లు, రిసార్ట్‌లలో మంతనాలు

వీకెండ్ వస్తే చాలు శివారు ప్రాంతాల్లోని ఫామ్ హౌస్‌లు, రిసార్ట్‌లు రాజకీయ ఆత్మీయ సమావేశాలలో కిక్కిరిసిపోతున్నాయి. ప్రధానంగా శామీర్‌పేట, కొంపల్లి, మెయినాబాద్, వికారాబాద్, చేవెళ్ల, హయత్‌నగర్ వంటి నగరం చుట్టూ ఫామ్‌హౌస్‌లలో అభ్యర్థులు ఓటర్లతో సమ్మేళనాలు నిర్వహిస్తున్నారు. ఇక్కడి నుంచే ప్రచార వ్యూహాలను రచిస్తున్నారు. సామూహికంగా ఓటర్లను తమ వైపు తిప్పుకునేందుకు ప్రణాళికలు చేస్తున్నారు. అభ్యర్థులకు ముందు నుంచి వెన్నుదన్నుగా నిలిచిన నేతలు, కార్యకర్తలు కీలకవ్యక్తులకు విందులు ఏర్పాటు చేస్తున్నారు. నియోజకవర్గంలో స్థానికులు, కాలనీ సంఘాలతో నేతలతో విస్తృత పరిచయాలున్న వారిని ఇక్కడికి పిలిపించి అన్నీ చూసుకుంటున్నారు. అసంతృప్తితో ఉన్న నాయకులను బుజ్జగింపులు చేసేందుకూ ఫామ్‌హౌస్‌లు, రిసార్ట్‌లలో బస ఏర్పాటు చేయించి మచ్చిక చేసుకుంటున్నారు. ఆయా ఆత్మీయ సమ్మేళనాల ఖర్చు ఎన్నికల సంఘం, పోలీసుల దృష్టి పడకుండా అభ్యర్థులు ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు. ఇతరుల పేర్ల మీద ఫామ్‌హౌస్‌లు, రిసార్ట్‌లను బుక్ చేసి పనులు కానిచ్చేస్తున్నారు.

అందం.. ఆభరణం



అందమైన ఆభరణాల గురించి ఎన్నో కబుర్లు చెబుతూ సందడి చేశారు హీరోయిన్ శృతిహాసన్. హైదరాబాద్‌లో లభించే అద్భుతమైన ముత్యాలు అంటే తనకెంతో ఇష్టమని చెప్పారు. నగరం వేదికగా సోమవారం ఆమె ఇక్కడి పార్క్ హయత్ హోటల్‌లో ఇండియా జ్యువెలరీ షాపింగ్ ఫెస్టివల్–2023 రోడ్ షోను ప్రారంభించారు. ఈ వేడుకకు బ్రాండ్ అంబాసిడర్‌గా కొనసాగుతున్న శృతిహాసన్ మీడియాతో మాట్లాడారు. సినిమాల్లోనూ ఆభరణాల పాత్ర కీలకమేనన్నారు. కథా–కథనంలో ఆ పాత్ర ధరించే ఆభరణాలు ఎన్నో అంశాలను వెల్లడిచేస్తాయన్నారు. అక్టోబర్ 15 నుంచి నవంబర్ 22 వరకు దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న అతిపెద్ద ఉత్సవం ఇండియా జ్యువెలరీ షాపింగ్ ఫెస్టివల్ అని తెలిపారు. – సాక్షి, సిటీబ్యూరో

ఎంఐఎం నుంచి నాలుగు నామినేషన్లు

కాంగ్రెస్ నుంచి కంటోన్మెంట్‌లో వెన్నెల నామినేషన్ దాఖలు

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ జిల్లాలోని 15 అసెంబ్లీ నియోజకవర్గాల్లో సోమవారం 25 మంది నామినేషన్లు దాఖలు చేశారు. వీరిలో కొందరు ఇప్పటికే నామినేషన్లు దాఖలు చేసినా మరో దఫా నామినేషన్లు వేశారు. ఇద్దరు రెండు సెట్ల చొప్పున అందజేశారు. నామినేషన్లు వేసిన ప్రధాన పార్టీల అభ్యర్థుల్లో ఎంఐఎం నుంచి మలక్‌పేటలో అహ్మద్‌బిన్ అబ్దుల్లా బలాలా, నాంపల్లిలో మహ్మద్ మాజిద్ హుస్సేన్, కార్వాన్‌లో కౌసర్ మొహియుద్దీన్, యాకుత్‌పురాలో జాఫర్ హుస్సేన్‌లు నామినేషన్లు వేశారు. బీఆర్ఎస్ నుంచి ముప్పిడి సీతారాంరెడ్డి చాంద్రాయణగుట్టలో, కాంగ్రెస్ నుంచి కంటోన్మెంట్ నియోజకవర్గంలో జీవీ వెన్నెల, బహదూర్‌పురాలో రాజేశ్‌కుమార్ పులిపాటి, చాంద్రాయణగుట్టలో బి.నగేశ్ నామినేషన్లు దాఖలు చేశారు. బీజేపీ నుంచి వై.నరేష్ కూడా బహదూర్‌పురాలో నామినేషన్ దాఖలు చేశారు. గోశామహల్‌లో కళ్యాణి నందేశ్‌కుమార్ (బీఎస్పీ) నామినేషన్ వేశారు. నామినేషన్లు దాఖలు చేసిన వారిలో రిజిస్టర్డ్ పార్టీల అభ్యర్థులు, ఇండిపెండెంట్లు కూడా ఉన్నారు.

ఔను.. వాళ్లిద్దరూ ఒక్కటయ్యారు!



ఉప్పల్ బీఆర్ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి అనూహ్యంగా సోమవారం హబ్సిగూడలోని సిట్టింగ్ ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి నివాసానికి వెళ్లారు. తనకు టికెట్ రాలేదని కొన్నాళ్లుగా భేతి పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉంటుండగా..బండారి ఆయనను కలవడం చర్చనీయాంశంగా మారింది. ఇక భేతి సుభాష్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో బండారికి మద్దతు తెలుపుతానని స్వయంగా ప్రకటించి ఆయనను ఆలింగనం చేసుకున్నారు. వీరి వెంట పార్టీ ఎన్నికల ఇన్‌చార్జి రావుల శ్రీధర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి తదితరులు ఉన్నారు. –హబ్సిగూడ

మరో చాన్స్ ప్లీజ్



ఖైరతాబాద్ నియోజకవర్గంలోని నందినగర్‌లో సోమవారం బీఆర్ఎస్ అభ్యర్థి దానం నాగేందర్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాలనీల్లో ఆయన కార్యకర్తలతో కలిసి పాదయాత్ర నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ మరోసారి తనకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. – బంజారాహిల్స్

యూత్ ఫస్ట్!



- నవయువ ఓటర్లకు ప్రత్యేక కేంద్రాలు
- స్పెషల్ థీమాటిక్ పోలింగ్ స్టేషన్లకు శ్రీకారం
- హైదరాబాద్ జిల్లాలో 15 ఏర్పాటు

సాక్షి, సిటీబ్యూరో: కొత్తగా ఓటు హక్కు పొందిన నవ యువతలో ఎక్కువమంది ఓటు హక్కును వినియోగించుకునేందుకు..ఉత్సాహంగా పోలింగ్ కేంద్రానికి వెళ్లేందుకు నియోజకవర్గానికి ఒకటి చొప్పున ప్రత్యేక పోలింగ్ కేంద్రాల్ని ఏర్పాటు చేయనున్నారు. కొత్త ఓటరుగా నమోదైన వారికి ఉచితంగానే ఎపిక్ కార్డుల్ని వారి ఇళ్లకే పంపిస్తున్న అధికారులు..వారిలో ఎక్కువమంది ఓటు వేసేలా ప్రోత్సహించేందుకు ఈ కేంద్రాల్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేయనున్నారు. వీటిని 'స్పెషల్ థీమాటిక్ పోలింగ్ స్టేషన్లు'గా పిలుస్తున్నారు. కొత్తగా ఓటు హక్కు పొందిన వారి కోసం వీటిని ఏర్పాటు చేస్తారు.

- తొలిసారి ఓటు హక్కు పొందిన యువత పోలింగ్ కేంద్రానికి వెళ్లగానే గందరగోళానికి గురి కాకుండా సాదరంగా ఆహ్వానం పలికేలా రిసెప్షన్ వంటి ఏర్పాట్లు చేయనున్నారు.
- క్యూలో తొలుత ఎవరి వద్దకు వెళ్లాలి, ఓటు ఎలా వేయాలి వంటి అంశాలను రిసెప్షన్‌లోనే వివరిస్తారు. వీటిలో యువ అధికారులే ఉంటారు.
- ఈ కేంద్రం వద్ద యూత్‌ను ఆకర్షించేలా బ్యానర్లు, పోస్టర్లు, ప్రత్యేక అలంకరణలు చేస్తారు.
- ఈ ప్రత్యేక పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు తగిన సెంటర్లను గుర్తించారు.
- హైదరాబాద్ జిల్లాలోని 15 నియోజకవర్గాల్లో ఏ నియోజకవర్గంలోని ఏ సెంటర్‌లో ఈ ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేస్తారో వివరాలిలా ఉన్నాయి.

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రం
ముషీరాబాద్	ఏవీ కాలేజ్, దోమల గూడ
మలక్‌పేట	అకడమిక్ హై పబ్లిక్‌స్కూల్, మూసారాంబాగ్
అంబర్‌పేట	శ్రీవిద్య సెకండరీ స్కూల్, తిలక్‌నగర్
ఖైరతాబాద్	కమ్యూనిటీహాల్, రోడ్‌నెంబర్10, బంజారాహిల్స్
జూబ్లీహిల్స్	హిందూ పబ్లిక్‌స్కూల్, ఏజీఎస్ స్టాఫ్ క్వార్టర్స్, ఎర్రగడ్డ
సనత్‌నగర్	ప్రభుత్వ బాలికల ప్రాథమిక పాఠశాల, న్యూబోయిగూడ
నాంపల్లి	సన్‌రైజ్ హైస్కూల్, మురాద్‌నగర్
కార్వాన్	వాసవీ ఇంజినీరింగ్ కాలేజ్, ఇబ్రహీంబాగ్
గోషామహల్	డా.బీఆర్ అంబేద్కర్ మునిసిపల్ కమ్యూనిటీ హాల్,మంగళ్‌హాట్
చార్మినార్	గవర్నమెంట్ హైస్కూల్, శక్కర్‌గంజ్
చాంద్రాయణగుట్ట	గవర్నమెంట్‌స్కూల్,రాజీవ్‌గాంధీనగర్,బండ్లగూడ
యాకుత్‌పురా	సరస్వతి శిశుమందిర్ హైస్కూల్,సరస్వతినగర్
బహదూర్‌పురా	అన్వర్–ఇ–హాస్మియా స్కూల్, ఫరూఖ్‌నగర్
సికింద్రాబాద్	ఆర్ట్స్ కాలేజ్, ఉస్మానియా విశ్వవిద్యాలయం
కంటోన్మెంట్	గవర్నమెంట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ ఈస్ట్‌మారేడ్‌పల్లి

కాంగ్రెస్‌లో చార్మినార్ సీటుపై ఉత్కంఠ.!

- ఎన్నికల బరిలో దిగేందుకు ఆసక్తి చూపని అలీ మస్కతీ
- ఎటూ తేల్చని సిట్టింగ్ ఎమ్మెల్యే ముంతాజ్ ఖాన్
- బలమైన అభ్యర్థి కోసం కాంగ్రెస్ కసరత్తు

సాక్షి, సిటీబ్యూరో: కాంగ్రెస్ పార్టీలో చార్మినార్ అసెంబ్లీ సీటు ఉత్కంఠ రేపుతోంది. గ్రేటర్ పరిధిలో చార్మినార్ నియోజకవర్గం మినహా మిగిలిన స్థానాలకు అభ్యర్థులు ఖరారయ్యారు. అందులో సగానికి పైగా అభ్యర్థులకు పార్టీ బీ ఫాంలు కూడా అందజేసింది. అయితే చార్మినార్ అసెంబ్లీ స్థానాన్ని మాత్రం పెండింగ్‌లో పెట్టింది. వాస్తవంగా ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన పాతబస్తీకి చెందిన అలీ మస్కతిని చార్మినార్ నుంచి పోటీ చేయాలని సూచించింది. అందుకు మస్కతి పెద్దగా ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. మరోవైపు మజ్లిస్ పార్టీ రిటైర్మెంట్ ప్రకటించడంతో అసంతృప్తితో రగిలిపోతున్న సిట్టింగ్ ఎమ్మెల్యే ముంతాజ్ ఖాన్‌తో సంప్రదింపులు ప్రారంభించింది. కాంగ్రెస్‌లో చేరితే కుటుంబంలో తండ్రీ కొడుకులు ఇద్దరికి చార్మినార్, యాకుత్‌పురా అసెంబ్లీ సీట్లు కేటాయిస్తామని బంపర్ ఆఫర్ ఇచ్చినట్లు సమాచారం. అయితే ముంతాజ్ ఖాన్ నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో మరోసారి ఈ సీటుపై సస్పెన్స్ నెలకొంది. చివరికి ఈ టికెట్ ఎవరికి ఇస్తారోనని పరిశీలకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

పతంగ్ 'గుర్తు'ంచుకోండి



చార్మినార్: ఎన్నికల ప్రచారంలో భాగంగా హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ పాతబస్తీలోని పలు నియోజక వర్గాల్లో ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన పోటీ చేస్తున్న అభ్యర్థి పేరు కూడా చెప్పకుండా పతంగ్ గుర్తుకే మీ ఓటు అంటూ.. అభ్యర్థి ఎవరైనా పతంగ్ గుర్తు ముఖ్యమని స్పష్టంగా చెబుతున్నారు.

అమ్మా.. నీ కాళ్లు మొక్కుతా ఓటెయ్యి..



అంబర్‌పేట నియోకవర్గ బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మాజీ మంత్రి కృష్ణయాదవ్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఓ మహిళ కాళ్లు మొక్కి ఓటు అభ్యర్థిస్తున్న దృశ్యం..



రావి నారాయణరెడ్డి నగర్‌కు చెందిన మహిళలకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న కుత్బుల్లాపూర్ బీజేపీ అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్

హారతులిచ్చి..ఆశీర్వదించి..



పద్మారావునగర్‌లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు హారతితో స్వాగతం పలుకుతున్న మహిళ

ప్రత్యర్థులు ఒక్కటైన వేళ..

రహమత్‌నగర్ : వారిలో ఒకరు మాజీ ఎమ్మెల్యే..మరొకరు సిట్టింగ్ ఎమ్మెల్యే..గత ఎన్నికల్లో వారిరువురు ప్రత్యర్థులు..నేడు ఒకరికి మద్దతుగా మరొకరు ప్రచారం చేశారు. జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మాగంటి గోపీనాథ్, మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి సోమవారం బోరబండ డివిజన్ రాజ్‌నగర్, వినాయకనగర్ బస్తీలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కారు గుర్తుకు ఓటేసి మరోసారి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని అధికారంలోకి తేవాలని కోరారు.



ప్రచారం నిర్వహిస్తున్న మాగంటి, విష్ణువర్ధన్ రెడ్డి



మల్లాపూర్ డివిజన్‌కు చెందిన యువతను కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఉప్పల్ కాంగ్రెస్ అభ్యర్థి మందముల పరమేశ్వర్‌రెడ్డి



కూకట్‌పల్లి ఎస్‌కెఎస్‌ఆర్ గార్డెన్స్‌లో కాంగ్రెస్ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొన్న మహిళా నాయకులకు నమస్కరిస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి బండి రమేష్

మానవీయ విలువలతోనే సామాజికాభివృద్ధి

'జీవన విద్య' శిక్షణ శిబిరంలో ప్రొఫెసర్ శత్రుఘ్న రావట్



సాక్షి, సిటీ బ్యూరో: మానవీయ విలువలతోనే సామాజికాభివృద్ధి సాధ్యమని నగరంలోని ఐఐఐటీలో విశ్వమానవ విలువల విభాగం సమన్వయకర్త ప్రొఫెసర్ డా. శత్రుఘ్న రావట్ అన్నారు. సి.హెచ్.డి.హెచ్.సి. - ఎ.ఎస్.డబ్ల్యూ.ఎ. సంస్థ ఆధ్వర్యంలో ఐఐఐటీలో జరిగిన 'జీవన విద్య' శిక్షణా శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ శిబిరంలో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి అన్ని వయసు, వృత్తులు, వర్గాల వారు పాల్గొన్నారు. మనిషి కుటుంబంలోను, సమాజంలోను సానుకూల సంబంధ బాంధవ్యాలతో ఆనందంగా జీవించడానికి కావలసిన ముఖ్యమైన నైపుణ్యాలపై సులభంగా అర్థమయ్యే రీతిలో వక్తలు వివరించారు. ముఖ్యంగా వ్యక్తిగత జీవితంలో దేని కోసం పాటు పడుతున్నాం? ఎందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం? సంసారంలో, బంధువులతో సంబంధాలను పక్షపాతం లేకుండా లోతుగా అర్థం చేసుకోవాలి? ఇంటా బయటా దైనందినజీవితంలో ఎదురయ్యే సమస్యలపై ఆత్మావలోకనం ద్వారా ఎవరికి వారు సదవగాహనను పెంచుకొని ఈ సమస్యల నుంచి బయటపడటం ఎలా? తద్వారా ఆత్మీయంగా, ఆనందంగా జీవించడం ఎలా? సమాజంలో భాగస్వాములం కావడం, ప్రకృతితో మమేకమై జీవించడం ఎలా? తదితర అనేక అంశాలపై సీహెచ్‌డీహెచ్‌సీ రిసోర్స్ పర్సన్లు శాస్త్రీయ పద్ధతుల్లో సోదహరణంగా వివరించారు. పాల్గొన్న ప్రతి ఒక్కరూ అనేక కీలక అంశాలపై స్పష్టత వచ్చిందని సంతృప్తిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌డీహెచ్‌సీ రిసోర్స్‌పర్సన్లు శివ శంకర్, నరసింహస్వామి, అమ్మ శ్రీనివాస్, గిరిధర్, వాసు అవగాహన కల్పించారు. హరిత, కోమల, దయానంద్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

సీహెచ్‌డీహెచ్‌సీ సంస్థ ప్రతి నెలా ఆన్‌లైన్‌లో, ప్రత్యక్షంగా జీవన విద్య శిక్షణా శిబిరాలను 2018 నుంచి నిర్వహిస్తున్నదని నిర్వాహకులు అమ్మ శ్రీనివాస్ తెలిపారు. ఇప్పటి వరకు దాదాపు 25 వేల మందికి రెండు రాష్ట్రాలలోనే కాక ప్రపంచ వ్యాప్తంగా తెలుగు వారికి ఈ జ్ఞానాన్ని పంచామని, ప్రతి వ్యక్తికి జీవన విజ్ఞానాన్ని అందించడం ద్వారా ఆనందకరమైన సమాజాన్ని నిర్మించడమే తమ ఉద్దేశమని ఆయన తెలిపారు. భోజన ఖర్చులకు మాత్రమే ఫీజు తీసుకుంటూ ఉచితంగా జీవన విద్య జ్ఞానాన్ని పంచుతున్నామన్నారు.

10, 11 తేదీల్లో తెలంగాణ చెస్ టోర్నీ

సాక్షి, హైదరాబాద్: జాతీయ అండర్-13 చెస్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే తెలంగాణ జట్లను ఎంపిక చేసేందుకు ఈనెల 10, 11వ తేదీల్లో తెలంగాణ రాష్ట్ర చెస్ టోర్నీ జరగనుంది. లాల్‌బహదూర్ స్టేడియంలోని యోగా హాల్‌లో ఈ టోర్నీని నిర్వహించనున్నారు. 1-1-2010న లేదా ఆ తర్వాత పుట్టిన వారు మాత్రమే ఈ టోర్నీలో ఆడేందుకు అర్హులు. ఈ టోర్నీలో టాప్-4లో నిలిచిన బాలబాలికలు డిసెంబర్ 4 నుంచి 10 వరకు సికింద్రాబాద్ దక్షిణ మధ్య రైల్వే స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరిగే జాతీయ అండర్-13 చాంపియన్‌షిప్‌లో తెలంగాణ జట్లకు ప్రాతినిధ్యం వహిస్తారు. ఇతర వివరాలకు 7337578899 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని తెలంగాణ రాష్ట్ర చెస్ సంఘం (టీఎస్‌సీఏ) అధ్యక్షుడు కేఎస్ ప్రసాద్ తెలిపారు.

హెచ్‌యూటీ టార్గెట్‌లో పోలీసులు

- భిన్న వర్గాలకు చెందిన నాయకులు సైతం
- దేశంలో అశాంతి సృష్టించడమే ఉగ్రవాదుల లక్ష్యం
- ఆ బృందంలో నగరానికి చెందిన ఓ ప్రొఫెసర్
- చార్జ్‌షీట్‌లో స్పష్టం చేసిన భోపాల్ ఎన్ఐఏ

సాక్షి, హైదరాబాద్: దేశంలో అశాంతి సృష్టించేందుకు హైదరాబాద్, భోపాల్ సహా అనేక నగరాల్లో విధ్వంసానికి కుట్ర పన్నిన హిజ్బ్ ఉత్ తెహ్రీర్ (హెచ్‌యూటీ) ఉగ్రవాదుల టార్గెట్‌లో పోలీసులు కూడా ఉన్నట్లు జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) తేల్చింది. వీరితో పాటు వివిధ వర్గాలకు చెందిన నాయకులను అంతం చేయాలని కుట్ర పన్నినట్లు గుర్తించారు. దీనికోసమే వీరు తుపాకులు కాల్చడంలో శిక్షణ తీసుకున్నట్లు, నిర్మానుష్య ప్రాంతాల్లో ప్రాక్టీసు కూడా చేసినట్లు ఎన్ఐఏ స్పష్టం చేసింది.

ఆ ఉగ్రవాదుల్లో ఆరుగురు ఇక్కడివారే

ఈ ఏడాది మే-జూన్ నెలల్లో మధ్యప్రదేశ్ ఏటీఎస్ అధికారులు అరెస్టు చేసిన 17 మంది హెచ్‌యూటీ ఉగ్రవాదుల్లో ఆరుగురు నగరానికి చెందిన వారు ఉన్నారు. ఈ ముష్కరులపై భోపాల్ ఎన్ఐఏ యూనిట్ శనివారం అక్కడి కోర్టులో అభియోగపత్రాలు దాఖలు చేసింది. ఈ మేరకు తాజాగా ప్రకటన విడుదల చేసింది. ఈ టెర్రర్ మాడ్యుల్ సిటీ వింగ్‌లో నగరంలోని ఓ కళాశాలలో హెచ్ఓడీగా పని చేసిన ఫార్మాస్యూటికల్ బయోకెమిస్ట్రీ ప్రొఫెసర్ మహ్మద్ సలీం కీలకమని నిర్ధారించారు. గోల్కొండలోని ఓ ప్రార్థన స్థలంలో సలీంకు దినసరి కూలీ మహ్మద్ హమీద్‌తో పరిచయమైంది. ఇతడిని ఉగ్రవాద బాట పట్టించిన సలీం మరికొందరిని తన మాడ్యుల్‌లో చేర్చుకోవాలని భావించాడు. ఈ విషయం హమీద్‌కు చెప్పగా... అతడు తన చిన్ననాటి స్నేహితుడైన జవహర్‌నగర్‌కు చెందిన మహ్మద్ సల్మాన్‌ను తీసుకువచ్చి పరిచయం చేశాడు. వీరితో పాటు మొత్తం ఐదుగురితో సలీం మాడ్యుల్ ఏర్పాటు చేశాడు. ఈ ముష్కరులను పట్టుకోవడానికి మధ్యప్రదేశ్ ఏటీఎస్, రాష్ట్ర నిఘా వర్గాలు నగరంలోని వివిధ ప్రాంతాలతో పాటు భోపాల్‌లోనూ ఏకకాల దాడులు చేశాయి. ఫలితంగా అక్కడ 11 మంది, నగరంలోని గోల్కొండ, హఫీజ్‌బాబానగర్, జగద్గిరిగుట్టల్లో సలీం, హమీద్ సహా ఐదుగురు చిక్కారు.

పరారీలో ఉన్న సల్మాన్‌నూ పట్టుకున్న ఎన్ఐఏ

జవహర్‌నగర్‌లోని శివాజీనగర్‌కు చెందిన మహ్మద్ సల్మాన్ పోలీసులు దాడి చేసే సమయంలో ఇంటి నుంచి పాల ప్యాకెట్ల కోసం బయటకు వెళ్లాడు. పోలీసులు వచ్చిన విషయం తెలిసిన సల్మాన్ పక్కింటి వాళ్లు అతడికి ఫోన్ చేసి చెప్పారు. దీంతో తన ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి పరారయ్యాడు. ఇంట్లో సోదాలు చేసిన అధికారులు ఎలక్ట్రానిక్ పరికరాలు, పెన్‌డ్రైవ్‌లు, కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్నారు. అప్పటి నుంచి పరారీలో ఉన్న సల్మాన్ కోసం ముమ్మరంగా గాలించిన ఎన్ఐఏ రాజేంద్రనగర్ ప్రాంతంలో అతన్ని పట్టుకుంది. శనివారం ఎన్ఐఏ అభియోగపత్రాలు దాఖలు చేసిన 17 మంది ఉగ్రవాదుల్లో హైదరాబాద్‌కు చెందిన, ఇక్కడ అరెస్టు అయిన సలీం, రెహ్మాన్, అబ్బాస్ అలీ, జునైద్, సల్మాన్, హమీద్ ఉన్నారు.

కాంగ్రెస్ కార్యకర్తల బాహాబాహీ

కూకట్‌పల్లి: కాంగ్రెస్ కార్యకర్తలు పరస్పర దాడులకు పాల్పడిన సంఘటన సోమవారం కూకట్‌పల్లిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. సోమవారం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం ఎస్‌కెఎస్‌ఆర్ గార్డెన్స్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా కూకట్‌పల్లి ఎమ్మెల్యే అభ్యర్థి బండి రమేష్ ప్రసంగిస్తుండగా, అదే సమయంలో భోజనాల వద్ద బాలాజీనగర్, బోయినపల్లి డివిజన్ కార్యకర్తల మధ్య లైన్‌లో నిలుచునే విషయమై గొడవ చోటు చేసుకుంది. దీంతో వారు పరస్పర దాడులకు దిగడంతో కొందరికి గాయాలయ్యాయి.



కొట్టుకుంటున్న కాంగ్రెస్ కార్యకర్తలు, గాయపడిన కార్యకర్త

అమరులను ఆదుకోకపోతే అన్ని నియోజకవర్గాల్లో పోటీ



సమావేశంలో మాట్లాడుతున్న రఘుమారెడ్డి ..

పంజగుట్ట: కల్వకుంట్ల కుటుంబాన్ని ఓడించిన తర్వాతే అమరవీరుల కుటుంబాలు దీపావళి జరుపుకుంటాయని తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఎం.రఘుమారెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌కు బుద్ధిచెప్పే శక్తి కేవలం అమరవీరుల కుటుంబాలకే ఉందని అందుకే కామారెడ్డి నుండి రేవంత్ రెడ్డి, గజ్వేల్ నుంచి ఈటల రాజేందర్ తప్పుకోవాలని ఆయన కోరారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ .. 1386 మంది తెలంగాణ అమరవీరుల చావులకు కారణమైన కేసీఆర్, ఉద్యమంలో అగ్గిపెట్టె నాటకం ఆడిన హరీష్‌రావు, ఉద్యమకారులను రెచ్చగొట్టిన కేటీఆర్‌లకు ఈ ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామన్నారు. అమరుల ఆశయ సాధన యాత్ర ద్వారా గత 20 రోజులుగా గజ్వేల్ నియోజకవర్గంలో గడపగడపకు తిరుగుతూ కల్వకుంట్ల కుటుంబ అరాచకాలను ప్రజలకు వివరిస్తున్నట్లు తెలిపారు. వెంటనే 1386 మంది అమరుల కుటుంబాలను గుర్తించి వారికి రూ.50 లక్షల ఆర్థికసాయం అందజేయాలని, గ్రూప్ టూ స్థాయికి తగ్గకుండా ప్రభుత్వ ఉద్యోగం, అర్హత లేకపోతే 10 ఎకరాల వ్యవసాయ భూమి, జిల్లా కేంద్రాల్లో అమరవీరుల కుటుంబాల కాలనీలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 9వ తేదీ మధ్యాహ్నం లోపు తమ డిమాండ్లపై స్పష్టమైన హామీ ఇవ్వాలన్నారు. రేపటి నుండి అమరుల కుటుంబాలు, ఉద్యమకారులు ప్రతి నియోజకవర్గంలో 200 మందినామినేషన్లు వేస్తున్నామని, ఈ నెల 9లోగా హామీ ఇస్తే నామినేషన్లు విరమించుకుంటామని తెలిపారు. లేని పక్షంలో పోటీలో ఉంటామన్నారు. సమావేశంలో అమరవీరుల కుటుంబ సభ్యులు మమత, ధనలక్ష్మి, భార్గవి, సరిత, ఉద్యమకారులు శంకర్, గౌతం, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ కార్పొరేటర్ హంజా బిన్ ఒమర్ అరెస్ట్

పాతబస్తీలో కొనసాగుతున్న అరెస్టుల పర్వం..



హంజా బిన్ ఒమర్‌ను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

చార్మినార్: పాతబస్తీలో అరెస్టుల పర్వం కొనసాగుతోంది. ఎన్నికలు ప్రశాంతంగా సజావుగా జరిగేందుకు పోలీసులు అవసరమైన ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే ఛావుని డివిజన్ మజ్లిస్ పార్టీ కార్పొరేటర్‌తో పాటు మరో ముగ్గురిని మాదన్నపేట్ పోలీసులు అరెస్టు చేయగా... శనివారం రాత్రి చార్మినార్ సిట్టింగ్ ఎమ్మెల్యే ముంతాజ్ అహ్మద్ ఖాన్ కుమారుడి అరెస్టు, విడుదల మరువకముందే సోమవారం రెయిన్‌బజార్ పోలీస్ స్టేషన్ పరిధిలో మాజీ కార్పొరేటర్, రౌడీషీటర్ హంజా బిన్ ఒమర్ ఎలియాస్ జాఫర్ పహిల్వాన్‌ను దక్షిణ మండలం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇటీవల ఎల్బీ స్టేడియంలో జరిగిన కుస్తీ పోటీల సందర్భంగా తలెత్తిన ఘర్షణలో జాఫర్ పహిల్వాన్‌పై ఫిర్యాదు అందడంతో సైఫాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ విషయంపై దక్షిణ మండలం పోలీసులు సోమవారం జాఫర్ పహిల్వాన్‌ను అదుపులోకి తీసుకునేందుకు వెళ్లగా ప్రతిఘటించారు. విధినిర్వహణలో ఉన్న పోలీసులకు సహకరించకపోగా ఎదురు తిరిగారు. దీంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది.అతి కష్టంపై అతడిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విధి నిర్వహణను అడ్డుకున్నందుకు రెయిన్‌బజార్ పోలీసులు మరో కేసు నమోదు చేశారు. 41 ఏ సీఆర్‌పీసీ నోటీసులు జారీ చేశామని..అతడిని బైండోవర్ చేయనున్నట్లు దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్య తెలిపారు.

గ్యాస్ పైపులైన్ పగిలి.. మంటలు చెలరేగి



గాయపడిన సాయినాథ్, రాజు..

కుత్బుల్లాపూర్: గ్యాస్ పైపులైన్ పగిలి మంటలు చెలరేగిన ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలు కాగా, స్థానికులు భయంతో పరుగులు తీసిన సంఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది.. సీఐ ప్రశాంత్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సుచిత్ర సమీపంలో రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా సోమవారం మధ్యాహ్నం జేసీబీతో తవ్వకాలు చేపడుతుండగా భాగ్యనగర్ గ్యాస్ ఏజెన్సీకి చెందిన పైపులైన్ పగిలింది.దీనిని గుర్తించిన సమీపంలోని దుకాణదారులు అక్కడినుంచి పరుగులు తీశారు. అదే సమయంలో జీడిమెట్ల గ్రామం, అలెన్ సోలీ షోరూమ్‌లో పనిచేసే సాయినాథ్, రాజు(27) టీ తాగేందుకు వెళ్లి తిరిగి వస్తున్నారు. వారిలో ఒకరు సిగరెట్ ముట్టించడంతో ఒక్కసారిగా మంటలు అంటుకున్నాయి. దీంతో వారు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. భాగ్యనగర్ గ్యాస్ ఏజెన్సీ అధికారులకు పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టి లీకేజీని అరికట్టారు. క్షతగాత్రులను సమీపంలోని రష్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్న కాంట్రాక్టర్‌తో పాటు, గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.



ఎగిసి పడుతున్న మంటలు..

టీఎస్‌సెట్-2023 ప్రాథమిక కీ విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: టీఎస్‌సెట్-2023 (తెలంగాణ స్టేట్ ఎలిజబిలిటి టెస్ట్) ప్రాథమిక కీ ని సోమవారం విడుదల చేశారు. గత నెల 28 నుంచి 30 వరకు జరిగిన టీఎస్‌సెట్‌కు హాజరైన విద్యార్థులు ప్రాథమిక కీ ని పరిశీలించి తాము రాసిన సబ్జెక్టుల ప్రశ్నల్లో తప్పులు దొర్లితే ఈ నెల 7 నుంచి 9 వరకు అభ్యంతరాలను తెలంగాణసెట్.ఓర్‌జీ అనే వెబ్‌సైట్ ద్వారా పంపించాలన్నారు.

బీసీలను మోసం చేసిన బీఆర్ఎస్‌ను ఓడించాలి

తొలగించబడిన 26 కులాల పోరాట సమితి



అభివాదం చేస్తున్న సమితి నాయకులు

హిమాయత్‌నగర్: రాష్ట్రంలోని బీసీల హక్కులను కాలరాసి, వారిని దగా చేసిన బీఆర్ఎస్ పార్టీని ఈ ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని తెలంగాణ రాష్ట్ర తొలగించబడిన 26 కులాల పోరాట సమితి అధ్యక్షులు ఆళ్ల రామకృష్ణ అన్నారు. ఈ మేరకు సోమవారం బషీర్ బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... నిజాం పాలనా కాలం నుంచి రాష్ట్రంలో కొన్ని అణగారిన బీసీ కులాలు జీవనం కొనసాగిస్తున్నాయన్నారు. రాష్ట్ర విభజన అనంతరం తరతరాలుగా తెలంగాణలో నివసిస్తున్న ఆంధ్ర ప్రాంతానికి చెందిన అత్యంత వెనుకబడిన 26 బీసీ కులాలను ముఖ్యమంత్రి కేసీఆర్ వివక్షపూరితంగా బీసీ కుల జాబితా నుండి తొలగించి అన్యాయం చేశారని ఆరోపించారు. తొలగించిన 26 బీసీ కులాల ప్రజలు గత పదేళ్లుగా విద్య, ఉపాధి, ఉద్యోగ రంగాల్లో తీవ్రంగా నష్టపోయారన్నారు. బీసీ జాబితా నుంచి తొలగించిన 26 కులాలను తాము అధికారంలోకి వచ్చిన వెంటనే తిరిగి జాబితాలో చేరుస్తామని స్పష్టమైన హామీ ఇవ్వడమేగాక మేనిఫెస్టోలో పొందుపరిస్తేనే ఆ పార్టీలకు ఓటు వేసి గెలిపిస్తామన్నారు. 26 కులాలను తిరిగి బీసీ జాబితాలో చేరుస్తామని ఇప్పటికే పలువురు నేతలు ప్రకటించారన్నారు. జనాభా లెక్కల్లో కులగణన చేస్తామని హామీ ఇచ్చిన పార్టీని ప్రతి నియోజకవర్గంలో గెలిపిస్తామన్నారు. కార్యక్రమంలో సమితి ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, ఉపాధ్యక్షులు చొల్లంగి ప్రసాద్, ఎం.ఆర్.కె.రెడ్డి, జాయింట్ సెక్రటరీ చిత్తూరి వేణు, కార్యవర్గ సభ్యులు ఎస్.వెంకటేశ్వర్ రావు, మురళిధర్, కె.రామకష్ణ, జల్లు హేమసుందర్ రావు, కె.వెంకట్ నాయుడు, టి.శ్రీనివాస్ రావు, జి.విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్లూలో లైంగిక వేధింపుల రగడ

- విద్యార్థులపై కేసులు, పలువురి అరెస్ట్
- వీసీ ప్రొ.సురేష్ కుమార్‌ను తొలగించాలని డిమాండ్



ఇఫ్లూ గేటు వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులు

ఉస్మానియా యూనివర్సిటీ: ద ఇంగ్లిష్ అండ్ ఫారేన్ లాంగ్వేజస్ సెంట్రల్ యూనివర్సిటీ (ఇఫ్లూ) క్యాంపస్‌లో గత నెల 18న పీజీ విద్యార్థిని పై లైంగిక వేధింపులకు పాల్పడిన వ్యక్తులను అరెస్ట్ చేయాలని విద్యార్థులు ఆందోళన చేపట్టారు. సోమవారం ఇఫ్లూ విద్యార్థులతో పాటు ఎన్ఎస్‌యూఐ, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ(హెచ్‌సీయూ), ఏబీడీఎస్‌వో, ఓయూ విద్యార్థి నేతలు క్యాంపస్‌లోని ప్రవేశించేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో ఇఫ్లూ గేటు వద్ద విద్యార్థులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ పెద్ద పెట్టున నినాదాలు చేస్తూ ధర్నా చేపట్టారు. ఎన్నకల కోడ్ నేపథ్యంలో ర్యాలీలకు అనుమతి లేకపోవడంతో నిబంధనలకు విరుద్ధంగా ర్యాలీ నిర్వహించిన 31 మంది హెచ్‌సీయూ విద్యార్థుల పై కేసు నమోదు చేశారు. వారిని అరెస్ట్ చేసి నల్లకుంట, అంబర్‌పేట పోలీస్ స్టేషన్లకు తరలించినట్లు ఓయూ సీఐ ఆంజనేయులు తెలిపారు. ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షులు బలమూరి వెంకట్ అతడి అనుచరులను వర్సిటీకి రాకుండ ముందస్తుగా అదుపులోకి తీసుకున్నామన్నారు. లైంగిక వేధింపులకు పాల్పడిన వ్యక్తులను అరెస్ట్ చేయాలని, ఇఫ్లూలో ఇంటర్నల్ కంప్లెయిట్ కమిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు రక్షణ కల్పించలేని వీసీ ప్రొ.సురేష్ కుమార్‌ను పదవి నుంచి తొలగించి కొత్త వీసీని నియమించాలని డిమాండ్ చేశారు. పదవీ కాలం ముగిసినా పైరవీలతో వీసీగా కొనసాగుతున్నారని ఆరోపించారు.

జూబ్లీహిల్స్ ఎంఐఎం అభ్యర్థిగా రషీద్ ఫరాజుద్దీన్



నియోజకవర్గం: జూబ్లీహిల్స్
పేరు: మొహమ్మద్ రషీద్ ఫరాజుద్దీన్
వయసు: 36
విద్యార్హత: బీకాం
రాజకీయ నేపథ్యం: షేక్‌పేట డివిజన్ కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ మెంబర్ జీహెచ్ఎంసీ, వరుసగా రెండుసార్లు షేక్‌పేట డివిజన్ కార్పొరేటర్‌గా పనిచేశారు.

శ్రీనగర్‌కాలనీ: జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఎంఐఎం అభ్యర్థిగా షేక్‌పేట డివిజన్ కార్పొరేటర్ మొహమ్మద్ రషీద్ ఫరాజుద్దీన్‌ను ఆ పార్టీ అధిష్టానం సోమవారం ఖరారు చేసింది. 2014లో ఎంఐఎం పార్టీ తరఫున పోటీచేసి తక్కువ మెజారిటీతో ఓటమి పాలైన నవీన్‌యాదవ్ వైపు మొగ్గు చూపుతుందనుకున్నా రషీద్‌కు టికెట్‌ను ఖరారు చేసింది. నియోజకవర్గంలో మైనార్టీల ఓట్లు సుమారు లక్ష 30 వేల ఉన్నాయి. యువనేతగా మైనార్టీలను ముందుండి నడిపిస్తాడనే నమ్మకంతో పార్టీ టికెట్‌ను ఖరారు చేసింది. మైనార్టీల ఓట్లే కీలకంగా మారనున్న నేపథ్యంలో షేక్‌పేటతో మైనార్టీ ఓట్లు గణనీయంగా ఉన్న ఎర్రగడ్డ, రహమత్‌నగర్, బోరబండ ప్రాంతాలపై ఎక్కువ దృష్టి పెట్టనుంది.

విస్తృతంగా పోలీసుల తనిఖీలు



బంజారాహిల్స్ రోడ్ నెం.12లో వాహన తనిఖీలు చేస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం

బంజారాహిల్స్: ఎన్నికలు సమీపిస్తున్న వేళ రాత్రి, పగలు అన్న తేడా లేకుండా ప్రధాన రోడ్లతో పాటు అంతర్గత రోడ్లలో అటు ఎన్నికలు అధికారులు, ఇటు లా అండ్ ఆర్డర్ పోలీసులు విస్తృతంగా వాహనాలు తనిఖీ చేస్తున్నారు. అక్రమంగా మద్యం రవాణాతో పాటు డబ్బులు రవాణా కాకుండా చేసేచర్యల్లో భాగంగా అధికారులు కఠినంగా వ్యవహరిస్తున్నారు. సోమవారం ఫిలింనగర్, బంజారాహిల్స్‌తో పాటు ఖైరతాబాద్, సోమాజిగూడ, హిమాయత్‌నగర్ ప్రాంతాల్లో తొమ్మిది ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు విస్తృత తనిఖీలు చేశాయి.

బీఆర్ఎస్‌తోనే పేదల సంక్షేమం

ఫిలింనగర్: ఖైరతాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి దానం నాగేందర్‌కు మద్దతుగా సోమవారం జూబ్లీహిల్స్ డివిజన్ బీఆర్ఎస్ సీనియర్ నేత మామిడి నర్సింగ్‌రావు జూబ్లీహిల్స్ రోడ్ నెం. 46లోని అంబేడ్కర్ నగర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ స్థానిక నేతలు అశోక్, వెంకటేష్, మారుతి, పోలమ్మ తదితరులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరించారు. ఎమ్మెల్యే దానం నాగేందర్ చొరవతోనే ఇక్కడ ప్రతి ఒక్కరూ వ్యక్తి గత ఇళ్లు నిర్మించుకుంటున్నారని ఆయన మళ్లీ వస్తేనే గృహలక్ష్మి, సౌభాగ్యలక్ష్మి పథకాలతో ఈ బస్తీలు ఇంకా బాగుపడతాయన్నారు.



అంబేద్కర్‌నగర్‌లో ప్రచారం చేస్తున్న మామిడి నర్సింగ్‌రావు

9 బాగుంది!

ముహూర్త బలం చూసుకున్న ప్రధాన పార్టీల అభ్యర్థులు

- మహంకాళికి పూజలు.. బడా గణేష్ సాక్షిగా సభలు
- ఖైరతాబాద్ నియోజకవర్గంలో ముగ్గురిదీ ఒకే సెంటిమెంట్
- నామినేషన్ల దాఖలుకు సర్వం సిద్ధం చేసుకున్న అభ్యర్థులు



దానం నాగేందర్, బీఆర్ఎస్



పి.విజయారెడ్డి, కాంగ్రెస్



చింతల రామచంద్రారెడ్డి, బీజేపీ

బంజారాహిల్స్: ఖైరతాబాద్ నియోజకవర్గంలో నువ్వా.. నేనా అన్నట్లు పోటీ పడుతున్న ముగ్గురు ప్రధాన పార్టీల అభ్యర్థుల్లో బీఆర్ఎస్ అభ్యర్థి దానం నాగేందర్ ఈ నెల 8వ తేదీన నామినేషన్ వేయనుండగా కాంగ్రెస్ అభ్యర్థి పి.విజయారెడ్డి, బీజేపీ అభ్యర్థి చింతల రామచంద్రారెడ్డి 9న నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఇప్పటికే జ్యోతిష్యులను సంప్రదించి ముహూర్త బలాలు పెట్టుకున్న ఈ ముగ్గురు అభ్యర్థులు నామినేషన్ రోజున జన సమీకరణలతో సత్తా చాటాలని నిశ్చయించుకున్నారు.

- నామినేషన్ రోజున ఖైరతాబాద్ మహంకాళి అమ్మవారికి పూజలు నిర్వహించి సమీపంలోని బడా గణేష్ సాక్షిగా భారీ సభను ఏర్పాటు చేసి అక్కడి నుంచి ర్యాలీగా ఖైరతాబాద్ వరకు నామినేషన్ కేంద్రానికి తరలి వెళ్లాలని ప్రణాళికలు రూపొందించుకుంటున్నారు.
- సెంటిమెంట్‌కు ఎక్కువ ప్రాధాన్యతనిచ్చే ఈ ముగ్గురు అభ్యర్థులు తమతమ జాతకాల ప్రకారమే నామినేషన్లు వేయడానికి ముహూర్తం కుదుర్చుకున్నట్లు తెలుస్తున్నది.
- ఇప్పటికే న్యాయనిపుణులు వీరి నామినేషన్ పత్రాలను సిద్ధం చేసి రెడీగా ఉంచారు.
- మరోవైపు బీఆర్ఎస్ అభ్యర్థి దానం నాగేందర్ అయిదు రోజుల క్రితమే తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు.
- తాజాగా బీజేపీ అభ్యర్థి చింతల రామచంద్రారెడ్డి సోమవారం తిరుమల శ్రీవారి దర్శనం చేసుకున్నారు.

జంగ్ 2023 తెలంగాణ

ముమ్మరంగా దానం ప్రచారం

వెంకటేశ్వరకాలనీ: ఎన్నికల ప్రచారంలో భాగంగా ఖైరతాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి దానం నాగేందర్ సోమవారం వెంకటేశ్వరకాలనీ డివిజన్ పరిధిలోని నందినగర్, వెంకటేశ్వరనగర్, ఇబ్రహీంనగర్, గురుబ్రహ్మనగర్, నూర్‌నగర్ బస్తీల్లో గడపగడపకు పాదయాత్ర నిర్వహించారు. డివిజన్ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి, మాజీ కార్పొరేటర్ బి. భారతినాయక్, డివిజన్ అధ్యక్షుడు రాములు చౌహాన్, సీనియర్ నాయులు బాబానాయక్‌తో కలిసి ఆయన ఇంటింటికీ వెళ్లి కేసీఆర్ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు వివరిస్తూ చేసిన అభివృద్ధి పనులు తెలియజేశారు. బస్తీలన్నీ ఆయనకు నీరాజనాలు పట్టాయి. ఈ ఎన్నికల్లో మరోసారి కారు గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని ఆయన కోరారు. కేసీఆర్‌ను ముఖ్యమంత్రిగా గెలిపించుకోకపోతే బడుగు బతుకులు ఆగమవుతాయని పథకాలు నిలిచిపోతాయని వెల్లడించారు.

కొండలు ఎక్కుడెట్లా.. దిగుడెట్లా...



ఫిలింనగర్‌లో బండారు బాల్‌రెడ్డినగర్‌లో అలసి కూర్చుండిపోయిన మహిళాకార్యకర్తలు

ఫిలింనగర్: ఈ ప్రచారమేంటోగానీ పెద్దోళ్లకు సచ్చేసావొచ్చింది.. ఎక్కలేక దిగలేక ఆయాసపడుతూ నానా అవస్థలు పడుతున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పలుపార్టీలు మహిళలు, పురుషులను ప్రచారానికి వినియోగిస్తున్నారు. రోజు ఖర్చులు వస్తాయి కదా అని వారు కూడా పడుతూ లేస్తూ ఈ ప్రచారాలకు వస్తున్నారు. అయితే కొండలకు కేరాఫ్‌గా నిలిచే ఫిలింనగర్, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్‌లలో మాత్రం బండలు ఎక్కలేక, కొండలు దిగలేక నానా అవస్థలు పడుతున్నారు. ముందుకు సాగకపోతే పైసలు ఇవ్వరేమోనని బాధను దిగమింగుతూ వీరు పడుతున్న పాట్లు వర్ణణాతీతంగా ఉంటున్నాయి. ఈ నాలుగు గంటలు గడిచేదెట్లా దేవుడా అంటూ కూర్చుంటూ... లేస్తూ మమ అనిపిస్తున్నారు. సోమవారం ఓ పార్టీ అభ్యర్థి ఎన్నికల ప్రచారంలో ఫిలింనగర్‌లో కనిపించిన దృశ్యమిది.

ఖైరతాబాద్‌లో విజయం కాంగ్రెస్‌దే: విజయారెడ్డి



విజయారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన వివిధ పార్టీల నాయకులు

పంజగుట్ట: ఎవరు ఎన్ని ఎత్తుగడలు వేసినా ఖైరతాబాద్‌లో ఎగిరేది కాంగ్రెస్ జెండానే అని ఖైరతాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి పి.విజయారెడ్డి అన్నారు. ఖైరతాబాద్ డివిజన్ పరిధిలోని వెంకటరమణ కాలనీ కూడలిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వివిధ పార్టీల నుంచి నాయకులు, మహిళలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. బీఆర్ఎస్ నాయకుడు రవీందర్ రెడ్డి, గంగు, సాయి, సరళతో పాటు వందలాది మంది కాంగ్రెస్ కండువా కప్పుకుని కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా విజయారెడ్డి మాట్లాడుతూ... బీఆర్ఎస్ పాలనతో ప్రజలు విసిగిపోయారని ఇప్పటికే ఇక ఈ పాలనకు చమరగీతం పాడాలని ప్రజలు నిర్ణయించుకున్నారని రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే అన్నారు. కాంగ్రెస్ పార్టీ పేదల పార్టీ అని బీఆర్ఎస్ కుటుంబ పార్టీ అన్నారు. ఇంకా ఒక్క నెలలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి పేదల కష్టాలు అన్ని తీరుతాయని తెలిపారు. తన తండ్రి పీజేఆర్‌ను ఆశయంగా తీసుకుని నిత్యం ప్రజల్లోనే ఉంటూ ప్రజా సేవచేస్తానని హామీ ఇచ్చారు. ప్రజలు ఇతర పార్టీల వారు చెప్పే కల్లబొల్లి మాటలు నమ్మరాదని కాంగ్రెస్ వస్తేనే పేదల కష్టాలు తీరుతాయన్నారు. ప్రస్తుత ఖైరతాబాద్ ఎమ్మెల్యే ఎన్నికలు అవగానే నాలుగున్నర సంవత్సరాలు ఎవ్వరికీ కనిపించకుండా పోతాడని ఎన్నికల సమయంలో వచ్చి ప్రజలను మభ్యపెట్టేందుకు చూస్తాడని ఆగ్రహంవ్యక్తం చేశారు.

ఖైరతాబాద్‌లో ఇద్దరు నామినేషన్

బంజారాహిల్స్: ఖైరతాబాద్ నియోజకవర్గం నుంచి నవరంగ్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పాల్ సత్యానందన్ డేవిడ్ సోమవారం ఖైరతాబాద్‌లోని ఆర్‌వో కేంద్రంలో నామినేషన్ దాఖలు చేశారు. సోమాజిగూడ రాజ్‌భవన్ రోడ్డులో నివసించే సత్యానందన్ డేవిడ్ నామినేషన్ దాఖలు చేయగా సోమాజిగూడ డివిజన్ రాజ్‌నగర్‌కు చెందిన డి.నాగరాజు యుగతులసి పార్టీ తరఫున నామినేషన్ వేశారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్ నెం.3లోని ఇంటి నెంబర్ 8-2-326/సిలో కొంత కాలంగా నిబంధనలు ఉల్లంఘించి నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాలను సోమవారం జీహెచ్ఎంసీ సర్కిల్-18 టౌన్ ప్లానింగ్ అధికారులు కూల్చివేశారు. అనుమతులు లేకుండా సెట్‌బ్యాక్‌లను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టగా పలుమార్లు టౌన్‌ప్లానింగ్ అధికారులు హెచ్చరించి నోటీసులు జారీచేశారు. అయితే భవన యజమాని మాత్రం నిబంధనలు తుంగలో తొక్కుతూ నిర్మాణాలు చేపట్టగా పోలీసుల బందోబస్తులో టౌన్‌ప్లానింగ్ ఏసీపీ సంపత్ ఆధ్వర్యంలో సిబ్బంది వీటిని నేలమట్టం చేశారు.

కంకటాల చీరల షోరూంలో చోరీ

బంజారాహిల్స్: చీరలు కొనుగోలు చేయడానికి వచ్చినట్లు నటించిన కొందరు మహిళలు సేల్స్‌మెన్స్ కళ్లుగప్పి ఖరీదైన పట్టుచీరలు దొంగిలించిన ఘటన జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... జూబ్లీహిల్స్ రోడ్ నెం. 36లోని కంకటాల స్టోర్‌కు గత నెల 29వ తేదీన మధ్యాహ్నం నలుగురు మహిళలు కస్టమర్ల మాదిరిగా వచ్చి చీరలు చూస్తున్నట్లు నటించి మూడు పటాన్ పటోలా చీరలు దొంగిలించారు. సీసీ ఫుటేజీల్లో ఈ నలుగురు మహిళలు చోరీ చేసిన దృశ్యాలు నమోదయ్యాయని వీరిపై చర్యలు తీసుకోవాల్సిందిగా స్టోర్ మేనేజర్ నిమ్మల రవితేజ పోలీసులకు ఫిర్యాదు చేశారు. జూబ్లీహిల్స్ డీఎస్ఐ వి. రాజశేఖర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్ని కుట్రలు చేసినా విజయం బీఆర్ఎస్‌దే

రహమత్‌నగర్: ప్రతిపక్ష పార్టీలు ఎన్ని కుట్రలు చేసినా... వాటన్నింటినీ పటాపంచలు చేసి తప్పక విజయం సాధిస్తామని బీఆర్ఎస్ పార్టీ జూబ్లీహిల్స్ అభ్యర్థి మాగంటి గోపీనాథ్, మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. బోరబండ డివిజన్ రాజ్‌నగర్, వినాయకనగర్ బస్తీలో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే బస్తీలు అభివృద్ధి చెందాయన్నారు. పార్టీ డివిజన్ అధ్యక్షుడు కృష్ణమోహన్, కో ఆర్డినేటర్ విజయసింహ, ఇన్‌చార్జ్ సిరాజ్, విజయ్‌కుమార్, లక్ష్మణ్ గౌడ్, షరీఫ్, ఖదీర్, ధన్వీర్, రమేశ్‌యాదవ్, వేముల వీరేశం, ఆనంద్, బాబానాయక్, సర్దార్ పాల్గొన్నారు.

డాక్టర్ సూర్యనారాయణకు ఏఎన్ఆర్ నంది పురస్కారం

శ్రీనగర్‌కాలనీ: ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ తెలంగాణ స్టేట్ చైర్మన్ డాక్టర్ కుర్రా సూర్యనారాయణకు ఏఎన్ఆర్ సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో ఏఎన్ఆర్ నంది పురస్కారం దక్కింది. త్యాగరాజ గానసభలో అక్కినేని నాగేశ్వరరావు శతజయంతి వేడుకల్లో భాగంగా కళానిలయం సాంస్కృతిక సంఘ సేవాసంస్థ ఈ పురష్కారాన్ని డాక్టర్ కుర్రా సూర్యనారాయణకు అందజేసింది. కార్యక్రమంలో త్యాగరాజగానసభ అధ్యక్షులు రాజు, కమెడియన్ అప్పారావు, కళానిలయం ప్రతినిధులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కే ప్రజాదరణ



మాట్లాడుతున్న దానం నాగేందర్

- బీఆర్ఎస్ వస్తే రూ. 400కే గ్యాస్
- అన్ని సంక్షేమ పథకాలు కొనసాగుతాయి
- ఖైరతాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి దానం నాగేందర్

పంజగుట్ట: తెలంగాణ అభివృద్ధి, సంక్షేమ పథకాలు చూసి మరోమారు ప్రజలు బీఆర్ఎస్‌ను గెలిపించాలని ఖైరతాబాద్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి దానం నాగేందర్ అన్నారు. సోమవారం సోమాజిగూడ లోని జయాగార్డెన్స్‌లో ఖైరతాబాద్ డివిజన్ బూత్‌స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ముఖ్యమంత్రి వీజన్ ఉన్న నాయకుడని ఆయన ఉంటేనే తెలంగాణ మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. కేసీఆర్ ప్రవేశపెట్టిన మేనిఫెస్టోను ప్రతి గడపకూ తీసుకెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రాగానే 400కే గ్యాస్ సిలిండర్ ఇస్తామనే విషయాన్ని మహిళలందరికీ వివరించాలన్నారు. ఖైరతాబాద్ నియోజకవర్గంలో 2700 మందికి డబుల్ బెడ్‌రూం ఇచ్చామని మరో 1400 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అవికూడా తిరిగి మన ప్రభుత్వం రాగానే వెంటనే మంజూరు చేయిస్తానని తెలిపారు. ఎన్నికల సమయంలో బీజేపీ, కాంగ్రెస్ వారు కల్లబొల్లి మాటలు చెప్పి మాయచేసేందుకు చూస్తారని వారి మాటలు నమ్మరాదని బీఆర్ఎస్ ప్రభుత్వానికి హ్యాట్రిక్ విజయం అందించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఖైరతాబాద్ నియోజకవర్గం ఎన్నికల ఇన్‌చార్జి కోలేటి దామోదర్, డివిజన్ అధ్యక్షుడు అరుణ్‌కుమార్, నగర గ్రంథాలయ చైర్మన్ ప్రసన్న, మహేష్ యాదవ్, మహేందర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఫిలింనగర్‌లో విజయారెడ్డి ప్రచారం



ఫిలింనగర్ బాల్‌రెడ్డినగర్‌లో ప్రచారం చేస్తున్న విజయారెడ్డి

ఫిలింనగర్: ఎన్నికల ప్రచారంలో భాగంగా ఖైరతాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి పి.విజయారెడ్డి సోమవారం ఫిలింనగర్‌లోని బండారు బాల్‌రెడ్డి నగర్, వినాయకనగర్ బస్తీల్లో పాదయాత్ర నిర్వహించారు. స్థానికులు ఆమెకు ఘనస్వాగతం పలికారు. సమస్యలతో సతమతమవుతున్న స్థానిక బస్తీలు బాగుపడాలంటే కాంగ్రెస్ అధికారంలోకి రావాల్సిందేనని తనకు ఓటు వేసి గెలిపిస్తే అభివృద్ధి పనులు ముందుకు సాగుతాయని స్పష్టం చేశారు. ఫిలింనగర్ బస్తీల్లో అడుగడుగునా సమస్యలు రాజ్యమేలుతున్నాయని ఎవరిని కదిపినా తమ గోడు వెల్లబోసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. 2014లో గెలిచిన బీజేపీ అభ్యర్థి చింతల, 2018లో గెలిచిన బీఆర్ఎస్ అభ్యర్థి దానం నాగేందర్ హయాంలో బస్తీలకు ఒరిగిందేమి లేదని దుయ్యబట్టారు. పర్యటనలో జూబ్లీహిల్స్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాటూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు అడగొద్దు అన్నా.. గెలిపించే బాధ్యత మాదే...



నందినగర్‌లో కూరగాయల బండి వద్ద ప్రచారం చేస్తున్న దానం

వెంకటేశ్వరకాలనీ: ఎక్కడైనా గుక్కతిప్పకుండా వారు చేస్తున్న, చేసిన పథకాల గురించి నేతలు మాట్లాడతారు... కానీ విచిత్రంగా ఖైరతాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి దానం నాగేందర్ సోమవారం నందినగర్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఓ మహిళ గుక్కతిప్పుకోకుండా ప్రభుత్వం పథకాలు అన్నీ చెప్పి మీరు మమ్మల్ని ఓటు అడగొద్దు అన్నా మేమే వేస్తాం అంటూ చెప్పడంతో ఆయన శభాష్ అంటూ ముందుకు సాగాడు.

అజహరుద్దీన్‌కు మద్దతుగా వెరైటీగా ప్రచారం



ద్విచక్ర వాహనంపై ప్రచారం నిర్వహిస్తున్న యాదయ్య

రహమత్‌నగర్: తెలంగాణ వడ్డెర ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు, ఇందిరానగర్ ఫేజ్-2 బస్తీ అధ్యక్షుడు వేముల యాదయ్య వినూత్న ప్రచారానికి శ్రీకారం చుట్టారు. జూబ్లీహిల్స్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అజహరుద్దీన్‌కు మద్దతుగా తన ద్విచక్ర వాహనానికి మైకు బిగించుకుని వీధివీధి తిరిగి ప్రచారం నిర్వహించడం ఆకట్టుకుంటుంది. ఇందుకు రూ. 5 వేల వరకు ఆయన ఖర్చు చేశాడు. అజహరుద్దీన్ గెలుపే ధ్యేయంగా నియోజకవర్గవ్యాప్తంగా తాను ప్రచారం నిర్వహిస్తానని వేముల యాదయ్య స్పష్టం చేశారు.

బీఆర్ఎస్ ఓటమి తథ్యం: అజహరుద్దీన్



షేక్‌పేటలో ప్రచారం నిర్వహిస్తున్న అజహరుద్దీన్ తదితరులు

శ్రీనగర్‌కాలనీ: బీఆర్ఎస్ పార్టీని ప్రజలు నమ్మే పరిస్థితి లేదని, తెలంగాణా అంతా కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతున్నారని, జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని మహమ్మద్ అజహరుద్దీన్ ధీమా వ్యక్తం చేశారు. సోమవారం షేక్‌పేట డివిజన్‌లోని పలు బస్తీల్లో పర్యటించి ప్రచారాన్ని చేపట్టారు. కాంగ్రెస్ పార్టీతోనే అన్ని వర్గాల అభ్యున్నతి, ప్రజా సంక్షేమం సాధ్యమన్నారు. కార్యక్రమంలో నేతలు ప్రీతి, ఉపేందర్‌రెడ్డి, సత్యనారాయణ, ముజీబ్, జ్యోతి, గీతమ్మ, స్వారూప పాల్గొన్నారు.

నిరంతరం ప్రజలకు అండగా ఉంటా...

వెంగళరావునగర్: జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని, తనను గెలిపిస్తే ప్రతి సమస్యనూ పరిష్కరిస్తానని జూబ్లీహిల్స్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి అజహరుద్దీన్ తెలిపారు. యూసుఫ్‌గూడ డివిజన్ పరిధిలోని హైలాం కాలనీలో సోమవారం సాయంత్రం పాదయాత్ర చేపట్టారు. ఇందులో భాగంగా ప్రజలను పలకరిస్తూ తనకు ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా అజహరుద్దీన్ మాట్లాడుతూ... నిరంతరం తాను ప్రజలకు అండగా ఉంటూ సేవ చేసుకుంటానని పేర్కొన్నారు. తొలిసారిగా రాష్ట్రంలోనే జూబ్లీహిల్స్ నుంచి పోటీ చేస్తున్నానని తనకు ఓటు వేసి శాసనసభ్యుడిగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు టి.ఉపేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో డబుల్ ఇంజిన్ సర్కార్ ఖాయం

గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్

హిమాయత్‌నగర్: తెలంగాణలో డబుల్ ఇంజిన్ సర్కార్ రావడం ఖాయమని గోవా రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ అన్నారు. ఖైరతాబాద్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి చింతల రాంచందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీ హిమాయత్ నగర్ డివిజన్ ముఖ్య కార్యకర్తల సమావేశం కింగ్ కోఠిలోని జైన్ భవన్‌లో సోమవారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ప్రమోద్ సావంత్ మాట్లాడుతూ... ప్రధాని మోదీ దేశాన్ని అభివద్ధి పథంలో తీసుకెళ్తున్నారని, పేదల కోసం అనేక సంక్షేమ పథకాలను తీసుకొచ్చారని గుర్తుచేశారు. దేశ ప్రజలకు కాంగ్రెస్ పార్టీ చేసిందేమీ లేదని, కేవలం ఓట్లు మత్రామే దండుకుందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మాయమాటలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని ఆయన స్పష్టం చేశారు. అనంతరం గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్‌ని హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి కేశబోయిన శ్రీధర్, నర్సింగ్ ముదిరాజ్, ప్రసాద్ శాలువాతో ఘనంగా సన్మానించారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల మధ్య చీకటి ఒప్పందం...

రహమత్‌నగర్: కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్య లోపాయికార ఒప్పందం కుదిరిందని, ఆ రెండు పార్టీలు నాణేనికి రెండు వైపులాంటివారని గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ బీజేపీ అభ్యర్థి లంకల దీపక్ రెడ్డి తరుపున సోమవారం ఎస్పీఆర్ హిల్స్‌లో నిర్వహించిన ప్రచారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. శ్రీరాముని ఆశీర్వాదంతో తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ సర్కారు ఏర్పాటు చేయడం ఖాయమన్నారు. బీజేపీ అభ్యర్థి లంకల దీపక్ రెడ్డి మాట్లాడుతూ... జూబ్లీహిల్స్‌లో బీజేపీని గెలిపించుకునేందుకు నాయకులు, కార్యకర్తలు శ్రమించాలని విజ్ఞప్తి చేశారు. అంతకుముందు ప్రతిభానగర్ ఆలయంలో గోమాతకు పూజ చేసి ప్రచారాన్ని ఆయన ప్రారంభించారు. సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గౌతంరావు, నాయకులు కుంభాల గంగారాజు, బంగారు ప్రశాంత్, ప్రేమ్, కిలారి మనోహర్, కొలన్ సత్యనారాయణ, చిన్న శ్రీను, ఆనంతలక్ష్మీ, కళావతి, ప్రమీల, నీలం రతన్‌కుమార్, షర్మిల, రూప, డివిజన్ అధ్యక్షులు కొత్త వెంకటేశ్, రాకేష్, కనకరాజు, చంద్రమోహన్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.



గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్‌ను సన్మానిస్తున్న బీజేపీ నేతలు

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లో ల్యాప్‌టాప్‌లు చోరీ

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్ నెం. 1లోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లో మూడు ల్యాప్‌టాప్‌లో చోరీకి గురయ్యాయని బ్యాంకు ఉద్యోగి జి. ఉమాపతి జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాలివీ... ఆగస్టులో మూడు ల్యాప్‌టాప్‌లను కొనుగోలు చేసి బ్యాంక్ స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచారు. గత నెల 2న వీటిని స్ట్రాంగ్ రూమ్ మరమ్మతుల సందర్భంగా ప్యాంటీ రూమ్‌లోకి షిఫ్ట్ చేశారు. అదే నెల 28న ఈ ల్యాప్‌టాప్ బాక్సులు తెరిచి ఉండటంతో పాటు అందులో ల్యాప్‌టాప్‌లు మూడు కనిపించలేదు. వీటి విలువ రూ. 2 లక్షలు ఉంటుందని నిందితులపై చర్యలు తీసుకోవాలంటూ ఉద్యోగి ఇచ్చిన పిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

30 నుంచి తైక్వాండో ప్రీమియర్ లీగ్

సాక్షి, సిటీబ్యూరో: యువ క్రీడాకారుల కోసం నగరంలో తైక్వాండో ప్రీమియర్ లీగ్ పోటీ డిసెంబర్ 19 నుంచి 3 రోజుల పాటు జరుగనుంది. బంజారాహిల్స్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో లీగ్ వ్యవస్థాపకుడు డైరెక్టర్ దువ్వూరి గణేష్ ఈ విషయాన్ని తెలిపారు. ఇనీల్ స్పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్, బ్లాక్ బెల్ట్ వరల్డ్ (అమెరికా), ప్రో తైక్వాండో కార్పొరేషన్, జేఆర్ ఇంటర్నేషనల్ తైక్వాండో అకాడమీలు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ పోటీలో పాల్గొనాలంటే కుక్కివాన్ వరల్డ్ తైక్వాండో బ్లాక్ బెల్ట్ సర్టిఫికెట్ ఉండాలన్నారు. ఇంటర్నేషనల్ తైక్వాండో అకాడమీ చైర్మన్, గ్రాండ్ మాస్టర్ జయంత్ రెడ్డి మాట్లాడుతూ ఈ క్రీడ పట్ల ఆసక్తి కలిగిన వారికి శిక్షణ ఇచ్చి ప్రోత్సహించనున్నట్లు వెల్లడించారు. దక్షిణ కొరియాకు చెందిన గ్రాండ్ మాస్టర్ జున్ లీ మాట్లాడుతూ... తైక్వాండో ఒక క్రీడ మాత్రమే కాదని, ప్రతి టీనేజర్ నేర్చుకోవాల్సిన అత్యుత్తమ రక్షణ విధానమన్నారు.

స్నేహితుడిని కలిసి వస్తానని.. వ్యక్తి అదృశ్యం

రహమత్‌నగర్: స్నేహితుడిని కలిసి వస్తానని బయటికి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన సంఘటన బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. డీఐ భూపాల్‌గౌడ్ సమాచారం మేరకు... బాపట్లకు చెందిన జిలానీ(41) ప్రైవేటు ఉద్యోగి. శుభకార్యం నిమిత్తం ఈ నెల 4 తెల్లవారు జామున బోరబండలోని తన తోడల్లుడు శివకుమార్ ఇంటికి వచ్చాడు. అదే రోజు ఉదయం 10 గంటల ప్రాంతంలో తన స్నేహితుడైన బాబు నుంచి ఫోన్‌రాగా తన వదిన ద్విచక్ర వాహనం తీసుకుని ఎర్రగడ్డకు వెళ్లి వస్తానని వెళ్లాడు. ఇంటికి రాక పోవడంతో జిలానీ తోడల్లుడు శివకుమార్ బోరబండ పోలీసులు ఫిర్యాదు చేశాడు.

అన్ని కులాలు, మతాల నిలయం హైదరాబాద్

వెంగళరావునగర్: హైదరాబాద్ మహానగరం అన్ని కులాలు, మతాలకు పుట్టినిల్లు లాంటిదని, అందువల్లనే ప్రతి ఒక్కరూ అన్నదమ్ముల్లా కలిసిమెలిసి ఉంటున్నారని నవ్‌యువ నిర్మాణ సేవా సంస్థ వ్యవస్థాపక చైర్మన్ వి.నవీన్‌యాదవ్ అన్నారు.

గురు రాందాస్ జీ మహరాజ్ 489 జయంతి వేడుకలు ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని గురుద్వార్ నుంచి ర్యాలీ ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన నవీన్‌యాదవ్ మాట్లాడుతూ జయంతి వేడుకలు పండుగ వాతావరణంలో నిర్వహించుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఇందులో భాగంగా ఆయన వారికి వివిధ రకాల పండ్లు, స్వీట్లు, బిస్కెట్లు, మంచి నీటి బాటిల్స్ అందజేశారు. అనంతరం జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని రహమత్‌నగర్, వెంగళరావునగర్, యూసుఫ్‌గూడ, శ్రీనగర్‌కాలనీ డివిజన్లలో ఉన్న అనేక ప్రాంతాల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో భక్తులు, సిక్కు మత పెద్దలు, సిక్కు యువతీయువకులు పెద్ద సంఖ్యలో ర్యాలీలో పాల్గొన్నారు. వివిధ రకాల విన్యాసాలు ఆకట్టుకున్నాయి.

క్లుప్తంగా...



19న తిరుమలలో పుష్పయాగం

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో ఈ నెల 19వ తేదీ పుష్పయాగ మహోత్సవం శాస్త్రోక్తంగా జరుగనుంది. 18న సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు పుష్పయాగానికి అంకురార్పణ నిర్వహించనున్నారు. ఈ కారణంగా కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, బ్రహ్మోత్సవం ఆర్జిత సేవలను టీటీడీ రద్దు చేసింది. కాగా, తిరుమలలో సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. దీంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

దక్షిణ కోస్తా, రాయలసీమలో వర్షాలు

సాక్షి, అమరావతి: ఆవర్తనం, ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఏపీలో తేలికపాటి వర్షాలు కురుస్తున్నాయి. రాయలసీమ జిల్లాల్లో ఓ మోస్తరు వర్షాలు పడుతుండగా దక్షిణ కోస్తా జిల్లాల్లో తేలికపాటి జల్లులు పడుతున్నాయి. లక్షద్వీప్ నుంచి బంగాళాఖాతం మీదుగా ఏపీ వరకు విస్తరించి ఉన్న ఒక ఆవర్తనం, తమిళనాడులో కొనసాగుతున్న మరో ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఈ వర్షాలు కురుస్తున్నాయి. అరేబియా సముద్రంలో ఒకటి, రెండురోజుల్లో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉండడంతో దాని ప్రభావం కూడా రాష్ట్రంపై ఉన్నట్లు వాతావరణశాఖ అధికారులు తెలిపారు. సోమవారం శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, తిరుపతి జిల్లాల్లో పలుచోట్ల భారీ వర్షాలు కురిశాయి. తూర్పుగోదావరి నుంచి సముద్రతీరం వెంబడి నెల్లూరు జిల్లా వరకు పలుప్రాంతాల్లో వర్షాలు పడ్డాయి. ఈ నెల 15వ తేదీ వరకు ఇలాగే వర్షాలు పడతాయని వాతావరణశాఖ తెలిపింది. రాయలసీమలో ఈ నెల 22వ తేదీ వరకు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఉత్తరాంధ్ర జిల్లాల్లోను ఉష్ణోగ్రతలు తగ్గి చలి పెరుగుతుందని తెలిపింది. మంగళవారం కూడా ప్రకాశం, నెల్లూరు, బాపట్ల జిల్లాల్లో పలుచోట్ల భారీవర్షాలు పడతాయని పేర్కొంది.

బీఫాం ఇచ్చేటప్పుడే బాండ్ తీసుకోవాలి

జస్టిస్ చంద్రకుమార్ సూచన



పంజగుట్ట (హైదరాబాద్): గత ఎన్నికల్లో కాంగ్రెస్, ఇతర పార్టీల నుంచి గెలిచిన వారిని బీఆర్ఎస్ లాక్కుందని, ఇది ప్రజలను, పార్టీని మోసం చెయ్యడమే అని తెలంగాణ ప్రజల పార్టీ వ్యవస్థాపకుడు జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. ఒక పార్టీ నచ్చకపోతే ఇతర పార్టీల్లోకి వెళ్లే స్వేచ్ఛ ప్రజాప్రతినిధులకు ఉంటుందని, కానీ వెళ్లే ముందు ఏ పార్టీ గుర్తుపై గెలిచారో.. ఆ పార్టీ సభ్యత్వంతో పాటు పదవికి కూడా రాజీనామా చేయాలని ఆయన సూచించారు. 'ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీని హెచ్చరిస్తున్నా, బీఫాం ఇచ్చే ప్రతీ అభ్యర్థి నుంచి తాను పార్టీ మారను, మారితే తన ఎమ్మెల్యే పదవిని రద్దుచేసే అధికారం పార్టీకి ఉంటుందని బాండ్ రాయించుకోవాలి'అని ఆయన సూచించారు. సోమవారం సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ ప్రజల పార్టీ, ఓట్ నీడ్ గ్యారంటీ ఆధ్వర్యంలో రాబోయే ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు ఏం చెయ్యాలి, వచ్చే ఎన్నికల్లో ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా ఏ విషయాలకు ప్రాధాన్యం ఇవ్వాలి అనే అంశాలతో కూడిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ .. తాము ఏ పార్టీకి మద్దతుగా లేమని, కొన్ని అనివార్య కారణాల వల్ల ఎన్నికల్లో పోటీ చేయడంలేదని ప్రకటించారు. సమావేశంలో ఓట్ నీడ్ గ్యారంటీ సంస్థ అధ్యక్షురాలు సోగరా బేగం, మన్నారం నాగరాజు, షేక్ సత్తార్ తదితరులు పాల్గొన్నారు.

పవన్‌కు ఓట్లడిగే హక్కు లేదు: మేచినేని



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ వస్తే 11 రోజులు అన్నం ముట్టలేదని చెప్పిన సినీ నటుడు పవన్‌కల్యాణ్ తెలంగాణ ఎన్నికల్లో ఎలా పోటీ చేస్తారని 1969 తెలంగాణ ఉద్యమకారుల సమితి అధ్యక్షుడు, మాజీ మంత్రి మేచినేని కిషన్‌రావు ప్రశ్నించారు. సోమవారం హైదరాబాద్‌లో జరిగిన తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమకారుల సదస్సులో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత దేశం నలుమూలల నుంచి వచ్చి ఇక్కడ స్థిరపడ్డ వారందరూ తెలంగాణ బిడ్డలేనని పేర్కొన్నారు. పవన్ వంటి వారు ఉద్యమ సమయంలో అస్తిత్వాన్ని దెబ్బతీసే ప్రయత్నం చేసినా తెలంగాణ ప్రజలు ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించారన్నారు. సెటిలర్స్‌పేరుతో ఓట్లు అడిగే కుట్ర చేస్తున్న పవన్ పార్టీని తెలంగాణ ప్రజలు తిరస్కరించాలని కోరారు. పవన్ కళ్యాణ్‌తో పొత్తు పెట్టుకోవడంపై బీజేపీ పునరాలోచన చేయాలని కోరారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌నిర్లక్ష్యంతోనే మేడిగడ్డ బ్యారేజీకి ప్రమాదం ఏర్పడిందని కిషన్‌రావు అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కేంద్ర ప్రభుత్వం సీబీఐ విచారణ జరిపించాలని ఆయన కోరారు.



గాజువాకలో నిర్వహించిన సామాజిక సాధికార యాత్ర సభకు హాజరైన అశేష జనసందోహంలో ఓ భాగం

సామాజిక న్యాయానికి ప్రతీక

ఎన్నికలకు ముందు ఇచ్చిన అన్ని హామీలను సీఎం జగన్ అమలు చేశారు: మంత్రి ధర్మాన

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

నేడే మోదీ బీసీ గర్జన సభ

- హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో సాయంత్రం 5.30కు కార్యక్రమం
- బీజేపీ తరఫున బీసీ సీఎం అభ్యర్థిని ప్రకటిస్తారనే అంచనాలు
- ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ, ఎస్టీల రిజర్వేషన్ల పెంపుపైనా ప్రకటన చేసే అవకాశం
- కేవలం గంటన్నర సేపట్లోనే ముగియనున్న ప్రధాని పర్యటన



ఎల్‌బీ స్టేడియంలో సభ ఏర్పాట్ల దృశ్యం

సాక్షి, హైదరాబాద్: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మంగళవారం హైదరాబాద్‌లో జరిగే బీజేపీ బీసీ గర్జన సభలో పాల్గొననున్నారు. సాయంత్రం 5.30 గంటలకు ఎల్‌బీ స్టేడియంలో ఈ సభ ప్రారంభం కానుంది. దీనికి సంబంధించి బీజేపీ నేతలు ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేశారు. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ బీసీ ఎజెండాను ఎత్తుకోవడం, బీజేపీ అధికారానికి వస్తే బీసీ నేతను సీఎంను చేస్తామని ఇప్పటికే ప్రకటించడం నేపథ్యంలో.. మరో అడుగు ముందుకేసి సదరు బీసీ సీఎం అభ్యర్థి ఎవరనేది ప్రధాని మోదీ ప్రకటించే అవకాశాలు ఉన్నాయని పార్టీ నేతలు చెప్తున్నారు. బీసీలతోపాటు ఎస్సీ, ఎస్టీ, ఇతర సామాజిక వర్గాలను ఆకట్టుకునే చర్యలనూ పేర్కొనవచ్చని అంటున్నారు.

బీసీలను ఆకట్టుకునేందుకు..


నిజానికి గతంలో ఎప్పుడు కూడా ఏ వర్గం నుంచి, ఎవరు సీఎం అవుతారని ముందే ప్రకటించే ఆనవాయితీ బీజేపీలో లేదని.. తెలంగాణ జనాభాలో 54శాతందాకా ఉన్న బీసీలను ఆకట్టుకునేందుకు సీఎం అభ్యర్థిని ప్రకటించనున్నారని పార్టీ నేతలు చెప్తున్నారు. ఉమ్మడి ఏపీలో, తెలంగాణలో ఇప్పటివరకు బీసీ వర్గానికి చెందిన వారెవరూ ముఖ్యమంత్రి కాలేదని.. ఈ క్రమంలో బీసీ ఎజెండా, బీసీ సీఎం నినాదాన్ని ఎత్తుకోవడం ద్వారా మంచి ఫలితాలను సాధించవచ్చని అధిష్టానం పెద్దలు భావిస్తున్నారని అంటున్నారు. ఇక దక్షిణాది రాష్ట్రాల్లో కీలకంగా మారిన ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు మద్దతుగా ప్రధాని మోదీ ప్రకటన చేసే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తే ఇక్కడ ఎస్టీల రిజర్వేషన్లను 10–12 శాతానికి పెంచుతామన్న హామీ ఇవ్వొచ్చని అంటున్నారు.

గంటన్నర పాటు పర్యటన

ప్రధాని మోదీ యూపీలోని ప్రయాగ్‌రాజ్ నుంచి వైమానిక దళ ప్రత్యేక విమానంలో బయలుదేరి సాయంత్రం 5 గంటలకు బేగంపేట ఎయిర్‌పోర్టులో దిగుతారు. అక్కడి నుంచి రోడ్డుమార్గంలో 5.30 గంటలకు ఎల్‌బీ స్టేడియానికి చేరుకుంటారు. 6.10 గంటల వరకు బహిరంగ సభలో పాల్గొంటారు. 6.30 గంటలకు బేగంపేట ఎయిర్‌పోర్టు నుంచి ప్రత్యేక విమానంలో ఢిల్లీకి తిరుగు ప్రయాణమవుతారు.

మేడిగడ్డలో 400 మీ. కాఫర్ డ్యామ్

- నిర్మాణానికి నీటిపారుదల శాఖ కసరత్తు.. బ్యారేజీలోని 7వ బ్లాక్ చుట్టూ కాఫర్ డ్యామ్
- పియర్ల కుంగుబాటుకు కారణాల అన్వేషణ, మరమ్మతులకు ప్రణాళిక
- డిజైన్ల రూపకల్పన బాధ్యత సీడీఓకు అప్పగింత



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన మేడిగడ్డ బ్యారేజీకి మరమ్మతుల కోసం తాత్కాలికంగా 400 మీటర్ల పొడవునా కాఫర్ డ్యామ్ నిర్మించాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ ప్రాథమికంగా అంచనా వేసింది. గోదావరిలో ఎగువ నుంచి కొనసాగుతున్న ప్రవాహం.. బ్యారేజీ 7వ బ్లాక్ పియర్ల కుంగుబాటుకు కారణాల పరిశీలన, మరమ్మతుల నిర్వహణకు అడ్డంకిగా మారింది. ఈ నేపథ్యంలో 7వ బ్లాకు చుట్టూ కాఫర్ డ్యామ్ నిర్మించి నీటి ప్రవాహాన్ని దారిమళ్లించాలని.. తర్వాత బ్లాక్ వద్ద నిలిచి ఉండే నీటిని మోటార్లతో తోడేయాలని అధికారులు నిర్ణయించారు. నీళ్లు తొలగించాక 7వ బ్లాకు పునాది (ర్యాఫ్ట్)కు రెండు వైపులా ఇసుకను తవ్వి.. బ్యారేజీ కుంగడానికి కారణాలను నిర్ధారించనున్నారు. ఈ మేరకు వేగంగా కాఫర్ డ్యామ్ నిర్మాణం చేపట్టేందుకు నీటిపారుదల శాఖ కసరత్తు ప్రారంభించింది.

సీడీఓకు బాధ్యతలు

కాఫర్ డ్యామ్‌కు సంబంధించిన డిజైన్ల రూపకల్పన బాధ్యతను శాఖలోని సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్(సీడీఓ)కు అధికారులు అప్పగించినట్టు తెలిసింది. ప్రాథమిక అంచనా ప్రకారం కాఫర్ డ్యామ్ నిర్మాణానికి రూ.300 కోట్ల వరకు ఖర్చు కావచ్చని అంచనా వేస్తున్నారు. కాఫర్ డ్యామ్ నిర్మాణంతోపాటు కుంగిన మేడిగడ్డ బ్యారేజీ మరమ్మతు పనులను సొంత ఖర్చుతో నిర్వహిస్తామని నిర్మాణ సంస్థ ఎల్ అండ్‌టీ ఇప్పటికే ప్రకటించింది కూడా. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో గోదావరిపై రూ.3,661 కోట్ల వ్యయంతో 16.17 టీఎంసీల సామర్థ్యంతో మేడిగడ్డ బ్యారేజీని నిర్మించారు. 2016 మే 2న పనులు ప్రారంభించి 2019 జూన్ 21 నాటికి పూర్తిచేశారు. అయితే ఇటీవల బ్యారేజీలోని 7వ బ్లాకులో కొన్ని పియర్లు కుంగిపోయాయి. పునాది (ర్యాఫ్ట్) కింద నుంచి ఇసుక కొట్టుకుపోవడమే దీనికి కారణమని ప్రాథమికంగా నిర్ధారించారు. దీనికి కారణాలను తేల్చి, మరమ్మతులు చేసేందుకు చర్యలు చేపట్టారు. ఇప్పటికే బ్యారేజీలోని నీటిని ఖాళీ చేశారు. కాఫర్ డ్యామ్‌ను నిర్మించి, మరమ్మతులు పూర్తయ్యాక తొలగిస్తారు.

'మేడిగడ్డ'పై శ్వేతపత్రం విడుదల చేయాలి

టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాం



మహదేవపూర్: మేడిగడ్డ (లక్ష్మీబ్యారేజీ) కుంగిపోయిన ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే శ్వేతపత్రం విడుదల చేయాలని టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం డిమాండ్ చేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్ మండలంలోని మేడిగడ్డను సోమవారం ఆయన సందర్శించారు. కుంగిన ప్రాంతాన్ని పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, దేశంలో జరిగిన స్కాంలలో కాళేశ్వరం ప్రాజెక్టు ఒకటని, నిపుణుల కమిటీ చెప్పిన విషయాలు తప్పని చెబుతున్న రాష్ట్ర ప్రభుత్వం, అసలు తప్పు జరగకపోతే ప్రజలకు వివరాలు ఎందుకు వెల్లడించడం లేదని ప్రశ్నించారు. ప్రాజెక్టు కుంగిన ప్రాంతాన్ని పరిశీలించినప్పుడు 7వ బ్లాకులో 20వ పియర్ కుంగిపోయి కనిపించిందని, ఇంజనీర్లు తెలిపిన వివరాల ప్రకారం సరైన లోతులో పునాదులు నిర్మించలేదని, పైపైనే పియర్స్ నిర్మించడం వల్ల పగుళ్లు ఏర్పడ్డాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి మాత్రం జాతీయ డ్యాం సేఫ్టీ అథారిటీ సభ్యులు ఏమీ చూడకుండానే నష్టం వాటిల్లిందని చెప్తారంటున్నారని, స్వయంగా బ్యారేజీని పరిశీలిస్తే డ్యామ్‌కున్న రెండు పలకల మధ్య ఖాళీ స్థలమే డ్యాం కుంగుబాటును తెలుపుతుందన్నారు.

కొత్తగూడెం సీటు.. రెండు ఎమ్మెల్సీలు

- కాంగ్రెస్, సీపీఐ మధ్య పొత్తు ఖరారు
- టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ప్రకటన
- సీపీఐ నేతలతో మఖ్దూం భవన్‌లో భేటీ
- సీపీఎంతో చర్చలు కొనసాగుతున్నాయని వెల్లడి
- 8న కూనంనేని నామినేషన్



సీపీఐ నేతలు అజీజ్ పాషా, నారాయణ, కూనంనేని, చాడ వెంకట్‌రెడ్డిలతో రేవంత్, దీపాదాస్ మున్షీ

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికలలో సీపీఐ, కాంగ్రెస్ పార్టీల మధ్య పొత్తు ఖరారైంది. కొత్తగూడెం శాసనసభ నియోజకవర్గంలో సీపీఐ అభ్యర్థికి సంపూర్ణ మద్దతునివ్వడంతోపాటు, రెండు ఎమ్మెల్సీ స్థానాలను సీపీఐకి ఇస్తామని టీపీసీసీ అధ్యక్షుడు ఎ.రేవంత్‌రెడ్డి తెలిపారు. సీపీఐ, కాంగ్రెస్ పార్టీల జాతీయ నాయకత్వాలను సంప్రదించిన తర్వాత ఈ మేరకు ఒప్పందానికి వచ్చామని చెప్పారు. రేవంత్ సోమవారం హైదరాబాద్‌లోని సీపీఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూం భవన్‌కు వెళ్లారు. ఏఐసీసీ పరిశీలకులు దీపాదాస్ మున్షీ, కార్యదర్శి విష్ణుదాస్ ఆయన వెంట ఉన్నారు. సీపీఐ జాతీయ కార్యదర్శులు డాక్టర్ కె.నారాయణ, సయ్యద్ అజీజ్ పాషా, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి తదితరులతో పొత్తుపై చర్చించారు. అనంతరం రేవంత్ రెడ్డి మీడియాతో మాట్లాడారు.

మోదీ, కేసీఆర్‌లతో ప్రమాదంలో ప్రజాస్వామ్యం

తమపై ఉన్న రాజకీయ ఒత్తిడి, తాజా పరిణామాలు, పరిస్థితులను సీపీఐ నేతలకు వివరించామని రేవంత్ తెలిపారు. పేదల తరఫున నిలబడేందుకు, పెద్ద మనసుతో ముందుకు రావాల్సిందిగా తాము చేసిన విజ్ఞప్తికి సీపీఐ అంగీకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. దేశంలో మోదీ, రాష్ట్రంలో కేసీఆర్ వల్ల ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని అన్నారు. ఎన్‌డీఏ కూటమిని ఇండియా కూటమి ఓడించాల్సిన పరిస్థితి వచ్చిందని చెప్పారు. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్, సీపీఐల మధ్య స్పష్టమైన పొత్తు ఖరారైందన్నారు. కొత్తగూడెం నియోజకవర్గంలో సీపీఐని గెలిపించేందుకు కాంగ్రెస్ శ్రేణులు సహకరించాలని, కలిసి పని చేయాలని కోరారు. సెక్యులర్ శక్తులకు విశ్వాసాన్ని కల్పించేందుకు, పేద, సామాన్యుల సమస్యలు చట్ట సభలలో ప్రస్తావనకు వచ్చేలా.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే శాసనమండలిలో సీపీఐకి చెందిన ఇద్దరు సభ్యులకు అవకాశం ఇస్తామని చెప్పారు. మునుగోడు సీటుపైనా చర్చ జరిగిందని, అక్కడ స్నేహ పూర్వక పోటీ వద్దని సీపీఐని కోరామన్నారు. సమస్యలపై కలిసి పోరాటం, ఎన్నికల ప్రచారం, ఓటు బదిలీపై సమన్వయ కమిటీని ఏర్పాటు చేస్తామని, భవిష్యత్ కార్యాచరణను నిర్ణయిస్తామని చెప్పారు. సీపీఎంతో చర్చలు కొనసాగుతున్నాయని తెలిపారు.

దగా పడిన ప్రజల విముక్తే లక్ష్యం: నారాయణ

బీఆర్ఎస్ చేతిలో దగాపడిన ప్రజానీకానికి విముక్తి కల్పించడమే తమ లక్ష్యమని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ చెప్పారు. ఇందుకోసమే సీపీఐ, కాంగ్రెస్ ఐక్యంగా నిలబడ్డాయని తెలిపారు. రాజకీయ, భౌతిక, అనివార్య పరిస్థితుల్లో ఒక్క కొత్తగూడెం స్థానం నుంచే పోటీకి అంగీకరించామని కూనంనేని చెప్పారు. తమ స్నేహ బంధంతో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే పరిస్థితులే కనిపిస్తున్నాయని చెప్పారు. ఇలావుండగా తాను ఈ నెల 8న నామినేషన్ దాఖలు చేయనున్నట్టు కూనంనేని ఖమ్మంలో చెప్పారు. ప్రజలు అన్ని విషయాలను గమనించి ప్రజాతంత్ర, లౌకిక శక్తులను గెలిపించాలని, ప్రజలను మరిచి పాలన చేస్తున్న పాలకులను ఓడించాలని పిలుపునిచ్చారు.

కూనంనేని కార్యదర్శిగా కొనసాగేనా?

కొత్తగూడెం నుంచి కూనంనేని పోటీ చేయనుండటంతో పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా ఆయన కొనసాగుతారా లేదా అన్న చర్చ మొదలైంది. ఎన్నికల్లో ఆయన పూర్తి బిజీగా ఉంటే పార్టీ బాధ్యతలు ఎవరు చూస్తారని అంటున్నారు. అలాగే కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రెండు ఎమ్మెల్సీలు ఎవరెవరికి దక్కవచ్చనే చర్చ కూడా జరుగుతోంది. మరోవైపు సీపీఐ ఎన్నికల కన్వీనర్‌గా చాడ వెంకట్‌రెడ్డిని నియమించాలని పార్టీ భావిస్తున్నట్టు సమాచారం.

'ఫైబర్‌నెట్' నిందితుల ఆస్తుల అటాచ్‌కు అనుమతివ్వండి

సాక్షి, అమరావతి: టీడీపీ హయాంలో జరిగిన ఫైబర్‌నెట్ కుంభకోణం కేసు దర్యాప్తులో భాగంగా నిందితులకు చెందిన ఆస్తుల అటాచ్‌మెంట్‌కు అనుమతి కోరుతూ విజయవాడ ఏసీబీ న్యాయస్థానంలో సీఐడీ సోమవారం పిటిషన్ దాఖలు చేసింది. ఏపీ, తెలంగాణలో ఉన్న మొత్తం ఏడు స్థిరాస్తుల అటాచ్‌మెంట్‌కు అనుమతివ్వాలని ఆ పిటిషన్‌లో కోరింది. టీడీపీ ప్రభుత్వ హయాంలో కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టిన రూ.330 కోట్ల ఫైబర్‌నెట్ మొదటి దశ ప్రాజెక్ట్ కాంట్రాక్టును అప్పటి సీఎం చంద్రబాబు నిబంధనలకు విరుద్ధంగా తన సన్నిహితుడు వేమూరి హరికృష్ణకు చెందిన టెరాసాఫ్ట్ కంపెనీకి కేటాయించారు. దీనిపై కేసు నమోదు చేసిన సీఐడీ ఏ–1గా వేమూరి హరికృష్ణ,

విజయవాడ ఏసీబీ కోర్టులో సీఐడీ పిటిషన్

ఏ–11గా టెరాసాఫ్ట్ కంపెనీ ఎండీ తుమ్మల గోపీచంద్, ఏ–25గా చంద్రబాబును పేర్కొంటూ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఈ నేపథ్యంలో టెరాసాఫ్ట్ కంపెనీతో పాటు ఈ కేసులోని నిందితులకు ఏపీ, తెలంగాణలో ఉన్న ఏడు స్థిరాస్తులను అటాచ్ చేయాలన్న సీఐడీ ప్రతిపాదనను రాష్ట్ర హోం శాఖ ఆమోదిస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో వాటి అటాచ్‌మెంట్‌కు అనుమతి కోరుతూ విజయవాడ ఏసీబీ కోర్టులో సీఐడీ పిటిషన్ దాఖలు చేసింది. కోర్టు అనుమతి వచ్చిన తర్వాత ఆ ఆస్తుల అటాచ్‌మెంట్‌కు సీఐడీ చర్యలు చేపట్టనుంది.

ఫైబర్‌నెట్ కేసులో అటాచ్‌కు నిర్ణయించిన ఆస్తులు..

- నిందితుడు కనుమూరి కోటేశ్వరరావు పేరిట గుంటూరులో ఉన్న 797 చ.అడుగుల ఇంటి స్థలం, ఆయన డైరెక్టర్‌గా ఉన్న నెప్‌టాప్స్ ఫైబర్ సొల్యూషన్స్‌కు విశాఖపట్నం కిర్లంపూడి లేఅవుట్‌లో ఉన్న ఓ ఫ్లాట్.
- మరో నిందితుడు టెరాసాఫ్ట్ కంపెనీ ఎండీ టి.గోపీచంద్ పేరిట హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో ఉన్న ఫ్లాట్, శ్రీనగర్ కాలనీలో ఉన్న రెండు ఫ్లాట్‌లు, యూసఫ్‌గూడలో ఉన్న ఫ్లాట్, ఆయన భార్య పవనదేవి పేరిట తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లో ఉన్న వ్యవసాయ భూమి.

ప్లాట్‌ఫాంపైకి దూసుకెళ్లిన బస్సు

విజయవాడ బస్టాండ్‌లో తీవ్ర ప్రమాదం • 6 నెలల బాలుడితో సహా ముగ్గురి మృతి



బస్టాండ్‌లో ప్రయాణికుల పైకి దూసుకెళ్లిన బస్సు

సాక్షి, అమరావతి/బస్టాండ్/కృష్ణలంక/సత్యనారాయణపురం (విజయవాడ సెంట్రల్): విజయవాడ పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్‌లో విషాదం చోటుచేసుకుంది. సోమవారం ఉదయం బస్టాండ్‌లో ప్రయాణికులను ఎక్కించుకుని వెనక్కి వెళ్లాల్సిన బస్సు ఒక్కసారిగా ప్లాట్‌ఫాంపైకి దూసుకెళ్లింది. ఈ దుర్ఘటనలో ఆరు నెలల చిన్నారితో పాటు ముగ్గురు మృత్యు ఒడికి చేరుకున్నారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద ఘటన తెలిసి వెంటనే స్పందించిన సీఎం వైఎస్ జగన్.. బాధితులకు వెంటనే సహాయం అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం తరఫున మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు. ఘటనపై విచారణకు ఆదేశించి బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటామని ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు ప్రకటించారు. సంస్థ తరఫున మృతుల కుటుంబాలకు రూ. 5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు.

మనుమడిని ఇంటికి తీసుకెళ్తూ..

బాపట్ల జిల్లా జె.పంగులూరుకు చెందిన కారు డ్రైవర్ యలమంద, భార్య ఝాన్సీరాణి, ఇద్దరు పిల్లలతో కలిసి కొంతకాలంగా గుంటూరు జిల్లా వడ్డేశ్వరంలో నివాసం ఉంటున్నాడు. ఆరు నెలల వయసున్న చిన్న కుమారుడికి మరో నాలుగు రోజుల్లో తన స్వగ్రామం జె.పంగులూరులో నామకరణ కార్యక్రమాన్ని నిర్వహించడానికి ఏర్పాట్లు చేసుకున్నాడు. ఈ నేపథ్యంలో ఝాన్సీరాణి తల్లి మోటాని కుమారి (50) తన కుమార్తె, మనుమలను ముందస్తుగా ఊరికి తీసుకెళ్లే ఉద్దేశంతో ఆమె స్వగ్రామం బాపట్ల జిల్లా, చీరాల ఉజిలిపేట నుంచి కోడలు సుకన్యను తీసుకుని వడ్డేశ్వరం వచ్చింది. సోమవారం ఉదయం కుమారి, ఆమె కూతురు, మనుమలు, కోడలు, మరో నలుగురు బంధువులతో కలసి పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. ఉదయం 8.25 గంటల సమయంలో 11, 12 నంబర్ ప్లాట్‌ఫాంల వద్ద చీరాల బస్సు కోసం ప్లాట్‌ఫాంపై కుర్చీలలో కూర్చున్నారు. అక్కడ విజయవాడ ఆటోనగర్ డిపోకు చెందిన గుంటూరు–విజయవాడ నాన్‌స్టాప్ బస్సు అదే ప్లాట్‌ఫాం వద్దకు వచ్చింది. డ్రైవర్ వి.ప్రకాశం ప్రయాణికులను ఎక్కించుకుని బయలుదేరే క్రమంలో ఒక్కసారిగా బస్సు ముందుకు దూసుకొచ్చి ప్లాట్‌ఫాంపైకి ఎక్కింది. ప్రయాణికులు కూర్చున్న కుర్చీలు, రెయిలింగ్‌లను ఢీకొట్టుకుంటూ ముందుకెళ్లింది. ఈ ఘటనతో ఉలిక్కిపడ్డ కొందరు ప్రయాణికులు తప్పించుకునే ప్రయత్నం చేయగా చిన్న మనవడిని ఒళ్లో కుర్చోపెట్టుకున్న కుమారి తప్పించుకోలేకపోయింది. దీంతో మనవడితో సహా బస్సు ముందు చక్రాల కింద పడి నలిగిపోయింది. వీరితో పాటు అక్కడే విధులు నిర్వర్తిస్తున్న గుంటూరు డిపో–2కు చెందిన అవుట్‌సోర్సింగ్ కండక్టర్ పెదనందిపాడు మండలం రావిపూడికి చెందిన యడ్లపల్లి వీరయ్య (23) కూడా మృత్యువాత పడ్డాడు. తీవ్రంగా గాయపడ్డ చిన్నారిని ఆసుపత్రికి తరలించేలోపు మృత్యువాత పడ్డాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ గుంటూరుకు చెందిన ప్రయాణికుడు సురేష్‌కు విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు.

బీజేపీ 'స్టార్ క్యాంపెయినర్లు' వీరే..

- ప్రధాని మోదీసహా ప్రచారానికి 40 మంది నాయకులు
- తెలంగాణ ఎన్నికల కోసం జాబితా ప్రకటించిన అధిష్టానం
- విజయశాంతి, రఘునందనరావు పేర్లతో రాష్ట్ర బీజేపీ ప్రత్యేక ప్రకటన

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి బీజేపీ సిద్ధమైంది. రాష్ట్రవ్యాప్తంగా ప్రచారం చేసేందుకు 40 మంది నాయకులతో బీజేపీ అధిష్టానం జాబితాను ప్రకటించింది. ప్రధాని నరేంద్రమోదీ, పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, రాజ్‌నాథ్‌సింగ్, అమిత్ షా సహా పలువురు కేంద్రమంత్రులు, ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి తదితరులు స్టార్ క్యాంపెయినర్ల జాబితాలో ఉన్నారు.

40 మందితో జాబితా

స్టార్ క్యాంపెయినర్లుగా నరేంద్ర మోదీ, జగత్‌ప్రకాష్ నడ్డా, రాజ్‌నాథ్‌సింగ్, అమిత్ షా, నితిన్ గడ్కరీ, బి.ఎస్.యడియూరప్ప, డాక్టర్ కె.లక్ష్మణ్, యోగి ఆదిత్యనాథ్, పీయూష్ గోయల్, నిర్మలా సీతారామన్, స్మృతి జుబిన్ ఇరానీ, పురుషోత్తం రూపాలా, అర్జున్ ముండా, భూపేంద్ర యాదవ్, జి.కిషన్‌రెడ్డి, సాధ్వి నిరంజన్ జ్యోతి, ఎల్.మురుగన్, ప్రకాశ్ జవదేకర్, తరుణ్ చుగ్, సునీల్ బన్సల్, బండి సంజయ్‌కుమార్, అరవింద్ మీనన్, డి.కె.అరుణ, పి.మురళీధర్ రావు, డి.పురందేశ్వరి, రవికిషన్, పొంగులేటి సుధాకర్‌రెడ్డి, ఎ.పి.జితేందర్‌రెడ్డి, గరికపాటి మోహన్‌రావు, ఈటల రాజేందర్, ధర్మపురి అరవింద్, సోయం బాపురావు, టి.రాజాసింగ్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, డాక్టర్ బూర నర్సయ్యగౌడ్, జి.ప్రేమేందర్‌రెడ్డి, దుగ్యాల ప్రదీప్‌కుమార్, బంగారు శృతి, డాక్టర్ కాసం వెంకటేశ్వర్లుయాదవ్, టి.కృష్ణప్రసాద్ పేర్లను బీజేపీ ప్రకటించింది.

ఆ ఇద్దరి పేర్లతో రాష్ట్ర బీజేపీ ప్రకటన

తెలంగాణలో ప్రచారం చేసేందుకు కేంద్ర ఎన్నికల సంఘానికి బీజేపీ కేంద్ర కార్యాలయం సమర్పించిన జాబితాలో పార్టీ నేత విజయశాంతి పేరు లేకపోవడంతో సోమవారం సోషల్ మీడియాతో దుమారం రేగింది. దీంతో తెలంగాణలో బీజేపీ స్టార్ క్యాంపెయినర్లుగా ప్రచారం చేసేందుకు విజయశాంతితో పాటు దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్ రావులను రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి నియమించారు. ఈ మేరకు సోమవారం రాత్రి బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు.

'బీసీ బిల్లుపై ప్రధాని విధాన ప్రకటన చేయాలి'



కాచిగూడ (హైదరాబాద్)/హిమాయత్‌నగర్: బీజేపీ ఆధ్వర్యంలో ఈనెల 7న ఎల్‌బీ స్టేడియంలో నిర్వహించనున్న బీసీ సదస్సులో ప్రధాని నరేంద్రమోదీ బీసీ బిల్లు, బీసీ కులగణనపై విధాన ప్రకటన చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. కాచిగూడలోని అభినందన్ గ్రాండ్‌లో సోమవారం బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టి చట్ట సభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, జనగణనలో కులగణన చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బీసీలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో సముచిత స్థానం కల్పించి వారి ఆదరాభిమానాలు చూరగొన్నారని తెలిపారు. అన్ని రాజకీయ పార్టీలు బీసీ బిల్లుపై స్పష్టమైన వైఖరి తెలియజేయాలని, లేనిపక్షంలో ఆయా రాజకీయ పార్టీలను అడ్డుకుంటామని కృష్ణయ్య హెచ్చరించారు. బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో సోమవారం 14 బీసీ సంఘాల సమావేశాన్ని రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడారు.

అన్నారం బ్యారేజీ గేట్ల మూసివేత!

కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని అన్నారం(సరస్వతీ) బ్యారేజీలో గేట్లను ఇంజనీరింగ్ అధికారులు సోమవారం మూసివేశారు. మూడు రోజులుగా గేట్లు ఎత్తి నీటిని పూర్తిగా ఖాళీ చేస్తున్న విషయం తెలిసిందే. సోమవారం బ్యారేజీలో మొత్తం 66 గేట్లను పూర్తిగా మూసివేయగా, ఎగువ నుంచి 2 వేలకుపైగా ఇన్‌ఫ్లో వస్తోంది. దీంతో వచ్చిన నీరంతా బ్యారేజీలో నిల్వ అవుతోంది. నాలుగు రోజుల క్రితం బ్యారేజీలోని సీపేజ్ లీకేజీ(బుంగలు) ఏర్పడిన విషయం తెలిసిందే. ఇలానే కొనసాగితే బ్యారేజీకి ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందని తెలిసింది. ఎగువన అప్ స్ట్రీమ్‌లో మరమ్మతులు చేయకుండా గేట్లు మూసి నీరు నింపితే మేడిగడ్డ బ్యారేజీ మాదిరిగా ప్రమాదపుటంచుల్లోకి వెళుతుందని సమాచారం.

క్లుప్తంగా...

80 స్థానాల్లో గెలుపు మాదే: భట్టి విక్రమార్క



ఎర్రుపాలెం: అసెంబ్లీ ఎన్నికల్లో 80 స్థానాల్లో గెలుపొంది కాంగ్రెస్ అధికారంలోకి రాబోతోందని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క ధీమా వ్యక్తంచేశారు. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం మీనవోలులో సోమవారం ఆయన మాట్లాడారు. గత నెలలో 74–78 సీట్లలో గెలిచే అవకాశాలు కనిపించగా, తాజా పరిస్థితుల్లో మరింత పెరిగాయన్నారు. సీపీఎంతో పొత్తు విషయంలో కేంద్ర నాయకత్వం పరిశీలిస్తోందని భట్టి తెలిపారు. వైఎస్ షర్మిలమ్మ మద్దతు ఏ మేరకు లాభిస్తుందనే అంశంపై స్పందిస్తూ ఇప్పటికే తాను స్వాగతించానని, ఆమెతో సోనియా, రాహుల్‌గాంధీలు టచ్‌లో ఉన్నారని చెప్పారు. టీడీపీ పరోక్షంగా కాంగ్రెస్‌కే మద్దతు తెలిపినట్లుగా ఉందన్నారు. అందుకు చంద్రబాబుకు ధన్యవాదాలు చెప్పలేదని భట్టిని ప్రశ్నించగా, సమయం వచ్చినప్పుడు స్పందిస్తామని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీలతో ప్రజలకు సంక్షేమ ఫలాలు అందుతాయని వివరించారు. ఢిల్లీకి గులాంలు అవుతారా? అని సీఎం కేసీఆర్ అనడాన్ని ఆయన తప్పుబట్టారు. జాతీయ పార్టీల నిర్ణయాలు కేంద్రస్థాయిలోనే జరుగుతాయనే సోయి ఆయనకు లేదని విమర్శించారు.

ఫార్మా పరిశ్రమలను ఎప్పుడు తరలిస్తారు?

వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

సాక్షి, హైదరాబాద్: జీడిమెట్లలోని ఫార్మా కంపెనీలను ఔటర్ రింగ్ రోడ్డు బయటకు ఎప్పుడు తరలిస్తారని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది. కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ కార్యదర్శి, కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ) ఐజీ, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టీఎస్‌పీసీబీ)తో పాటు పలువురు అధికారులు, పలు ఫార్మా కంపెనీలకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణలోగా కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ, 4 వారాలకు వాయిదా వేసింది. హైదరాబాద్ నడిబొడ్డున జీడిమెట్లలో ఉన్న 70 ఫార్మాస్యూటికల్, కెమికల్ పరిశ్రమలపై కాలుష్య నియంత్రణ మండలి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని హైకోర్టులో సామాజిక కార్యకర్త పీఎల్ఎన్ రావు ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ పిల్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. జీడిమెట్ల ప్రాంతంలో 300 పరిశ్రమలు ఉన్నాయని, ఇందులో 70కి పైగా ఫార్మాస్యూటికల్, కెమికల్ పరిశ్రమలున్నాయని చెప్పారు. వాదనలు విన్న ధర్మాసనం.. ప్రతివాదులకు నోటీసులు జారీ చేస్తూ, విచారణ వాయిదా వేసింది.

కోమటికుంట చెరువుభూముల్లో అక్రమ నిర్మాణాలు ఆపండి

రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

సాక్షి, హైదరాబాద్: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా నిజాంపేట్‌లోని కోమటికుంట చెరువు భూముల్లో అక్రమ నిర్మాణాలను వెంటనే నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ప్రభుత్వ ప్రధానకార్యదర్శి, జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్, మరికొందరు అధికారులతోపాటు వాసవీ ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్‌కు నోటీసులు జారీచేసింది. పిటిషనర్ అభ్యంతరంపై కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ, విచారణను 4 వారాలకు వాయిదా వేసింది. ప్రైవేట్ బిల్డర్లతో చేతులు కలిపిన అధికారులు సర్వే నంబర్ 127, 137లోని చెరువు భూములు అన్యాక్రాంతం అవుతున్నా పట్టించుకోవడం లేదంటూ, అక్కడ అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారంటూ సామాజిక కార్యకర్త ఆకుల సతీశ్ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ పిల్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. వాదనలు విన్న ధర్మాసనం.. ప్రతివాదులకు నోటీసులు జారీ చేస్తూ, విచారణను 4 వారాలకు వాయిదా వేసింది.

దొంగలు సీఎంలు కాకూడదు: షర్మిల



సాక్షి, హైదరాబాద్: వచ్చే ఎన్నికల్లో దొంగలకు ఓటు వేయొద్దని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ప్రజలకు సూచించారు. అన్ని పార్టీల్లో దొంగలుంటారని.. కానీ దొంగలు ముఖ్యమంత్రి కాకూడదని అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ.. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ పై కీలక వ్యాఖ్యలు చేశారు. ఆయన దోషి అని సుప్రీంకోర్టే తేల్చిందన్నారు. సుప్రీం కోర్టులో కేసు కొట్టేయాలని పిటిషన్ వేస్తే.. వీళ్లు దోషులే అని న్యాయస్థానం చెప్పిందన్నారు. ఇటీవల రేవంత్‌ని రేటెంతరెడ్డి అని ఆరోపిస్తున్నది తాను కాదని, వాళ్లు వేరే ఉన్నారని అన్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటు వేయవద్దని, ప్రభుత్వం మారాలని తాము కోరుకుంటున్నామని తెలిపారు. కాంగ్రెస్‌తో పొత్తు అంశంపై స్పందిస్తూ.. ఎవరికున్న ఇన్‌సెక్యూరిటీలు వాళ్లకుంటాయన్నారు. గడ్డాలు పెంచుకుని దొంగ దీక్షలు చేసిన వారే అసలైన తెలంగాణ ద్రోహులన్నారు. దమ్ముంటే కాళేశ్వరంపై సీబీఐ విచారణకు ఆదేశాలు ఇవ్వాలని ప్రధాని మోదీని షర్మిల డిమాండ్ చేశారు.

16 మందితో కాంగ్రెస్ మూడో జాబితా

- కామారెడ్డి నుంచి రేవంత్‌రెడ్డి, చెన్నూరు నుంచి వివేక్
- షబ్బీర్ అలీ, సురేష్ షెట్కార్, ఏనుగు రవీందర్‌రెడ్డి, నీలం మధుకూ చాన్స్
- రెండు స్థానాల్లో అభ్యర్థులను మార్చిన అధిష్టానం
- వనపర్తిలో చిన్నారెడ్డి ఔట్.. మేఘారెడ్డి ఇన్
- బోథ్ నుంచి అశోక్ స్థానంలో ఆదె గజేందర్
- సీపీఐకి కొత్తగూడెం..పెండింగ్‌లో 4 స్థానాలు

చెన్నూరు (ఎస్సీ)	జి. వివేకానంద
బోథ్ (ఎస్టీ)	ఆదె గజేందర్
జుక్కల్ (ఎస్సీ)	తోట లక్ష్మీకాంతరావు
బాన్సువాడ	ఏనుగు రవీందర్‌రెడ్డి
కామారెడ్డి	రేవంత్‌రెడ్డి
నిజామాబాద్ అర్బన్	మహ్మద్ షబ్బీర్ అలీ
కరీంనగర్	పురుమళ్ల శ్రీనివాస్
సిరిసిల్ల	కేకే మహేందర్‌రెడ్డి
నారాయణఖేడ్	సురేష్‌కుమార్ షెట్కార్
పటాన్‌చెరు	నీలం మధు ముదిరాజ్
వనపర్తి	తుడి మేఘారెడ్డి
డోర్నకల్ (ఎస్టీ)	జాటోత్ రామచంద్రు నాయక్
ఇల్లందు (ఎస్టీ)	కోరం కనకయ్య
వైరా (ఎస్టీ)	రాందాస్ మాలోత్
సత్తుపల్లి (ఎస్సీ)	మట్టా రాగమయి
అశ్వారావుపేట (ఎస్టీ)	జారే ఆదినారాయణ

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే కాంగ్రెస్ అభ్యర్థుల మూడో జాబితా విడుదలైంది. 16 స్థానాలకు కాంగ్రెస్ అధిష్టానం అభ్యర్థులను ప్రకటించింది. ఇందులో మూడు ఎస్సీ, ఐదు ఎస్టీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ సోమవారం రాత్రి ఈ మేరకు ఉత్తర్వులను జారీ చేశారు. ఇప్పటికే కొడంగల్ నుంచి నామినేషన్ దాఖలు చేసిన టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని కామారెడ్డి నుంచీ సీఎం కేసీఆర్‌పై బరిలో దింపారు. ఇటీవల బీజేపీకి రాజీనామా చేసి పార్టీలో చేరిన జి.వివేకానందకు చెన్నూరు టికెట్ ఇచ్చారు. ఏనుగు రవీందర్ రెడ్డి బాన్సువాడ నుంచి, షబ్బీర్ అలీ నిజామాబాద్ అర్బన్ నుంచి, మాజీ ఎంపీ సురేష్ షెట్కార్ నారాయణ్‌ఖేడ్ నుంచి, నీలం మధు ముదిరాజ్ పటాన్‌చెరు నుంచి పోటీ చేయనున్నారు. తాజా జాబితాలో 14 స్థానాలకు కొత్తగా అభ్యర్థులను ప్రకటించగా, వరో రెండు స్థానాలకు గతంలో ప్రకటించిన అభ్యర్థులను మార్చారు. గతంలో బోథ్ నియోజకవర్గానికి వన్నెల అశోక్ పేరును ప్రకటించగా, తాజాగా ఆయన స్థానంలో ఆదె గజేందర్‌కు అవకాశం ఇచ్చింది. అలాగే వనపర్తికి గతంలో జిల్లెల చిన్నారెడ్డి పేరును ప్రకటించిన కాంగ్రెస్ అధిష్టానం.. అనేక కసరత్తుల తర్వాత ఆయన స్థానంలో తుడి మేఘారెడ్డిని బరిలోకి దింపుతోంది. ఇప్పటివరకు విడుదల చేసిన మూడు జాబితాల్లో కలిపి మొత్తం 114 స్థానాలకు కాంగ్రెస్ అభ్యర్థులను ప్రకటించింది. సీపీఐకి కొత్తగూడెం కేటాయించగా.. తుంగతుర్తి, సూర్యాపేట, మిర్యాలగూడ, చార్మినార్ సీట్లను పెండింగ్‌లో ఉంచింది. ఒకవేళ సీపీఎంతో చర్చలు సఫలం అయితే వారికి మిర్యాలగూడ స్థానాన్ని కేటాయించే అవకాశాలున్నాయని పార్టీ వర్గాలు తెలిపాయి.

ముమ్ముందు మంచి అవకాశాలు



కొడంగల్ ఎన్నికల ప్రచార ర్యాలీలో మాట్లాడుతున్న రేవంత్

- కొడంగల్‌లో రేవంత్ వ్యాఖ్యలు
- కొడంగల్ ప్రజలకు ఇప్పుడు గొప్ప అవకాశం వచ్చింది
- డీకే శివకుమార్‌కన్నా ఎక్కువ మెజారిటీ అందించాలి
- కాంగ్రెస్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు

కొడంగల్: ఈ ఎన్నికలు కేసీఆర్‌కు, కొడంగల్ ప్రజల ఆత్మ గౌరవానికి మధ్య జరుగుతున్నాయని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అన్నారు. కేసీఆర్, కేటీఆర్‌ను బంగాళాఖాతంలో కలిపేలా తీర్పు ఇవ్వాలని కోరారు. సోమవారం పెద్దసంఖ్యలో కార్యకర్తలు, అభిమానులతో తరలివెళ్లిన రేవంత్, కొడంగల్ నియోజకవర్గానికి కాంగ్రెస్ పార్టీ తరఫున నామినేషన్ వేశారు. మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు మహ్మద్ యూసుఫ్‌తో కలసి రిటర్నింగ్ అధికారి లింగ్యానాయక్‌కు నామినేషన్ పత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ అధ్యక్ష పదవి తనది మాత్రమే కాదని, కొడంగల్‌లోని ప్రతి బిడ్డా తనను తాను పీసీసీ అధ్యక్షుడిగా భావించాలని పిలుపునిచ్చారు. మీ ఆశీర్వాదంతోనే తాను ఈ స్థాయికి చేరుకున్నానని, కొడంగల్ గల్లీ నుంచి ఢిల్లీ వరకు ఈ ప్రాంతం పేరు నిలబెట్టానని అన్నారు. సోనియా మనకు మంచి అవకాశాలు ఇస్తున్నారని, ఇప్పుడు కూడా తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లోనే గొప్ప అవకాశం కొడంగల్ ప్రజలకు వచ్చిందని చెప్పారు. భవిష్యత్తులోనూ మంచి అవకాశాలు రావచ్చు అని పేర్కొన్నారు. కాంగ్రెస్‌ను అధికారంలోకి తెచ్చే బాధ్యత మీదేనని అన్నారు. కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు వచ్చిన మెజార్టీకన్నా ఎక్కువ మెజార్టీ అందించి చూపించాలని కోరారు.

రెండేళ్లలో దశ, దిశ మారుస్తాం

రాష్ట్రంలో సిరిసిల్ల, సిద్దిపేట, గజ్వేల్‌ల మాదిరిగా కొడంగల్‌ను ఎందుకు అభివృద్ధి చేయలేదని కేసీఆర్‌ను రేవంత్ నిలదీశారు. దత్తత కాదు.. ధైర్యం ఉంటే కొడంగల్‌లో పోటీ చేయాలని సవాల్ విసిరినా స్వీకరించలేదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రెండేళ్లలో రాష్ట్రం దశ, దిశ మారుతుందని చెప్పారు. హెలికాప్టర్ ద్వారా కొడంగల్‌కు చేరుకున్న ఆయన ముందుగా గాడిబాయి శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తన నివాసంలో సర్వమత ప్రార్థనలు చేశారు.

కేసుల్లేవు..ఎఫ్ఐఆర్‌లున్నాయి

రిటర్నింగ్ అధికారికి సమర్పించిన ఎన్నికల అఫిడవిట్‌లో రేవంత్‌రెడ్డి తన ఆస్తులు అప్పులతో పాటు తనపై ఉన్న కేసుల వివరాలను వెల్లడించారు. క్రిమినల్ కేసులు లేవని, రాష్ట్రంలోని పలు పీఎస్‌లలో తనపై ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయని పేర్కొన్నారు. 2022–23 ఆర్థిక సంవత్సరానికి తన ఆదాయం రూ.13,76,700, తన సతీమణి గీతారెడ్డి ఆదాయం రూ.11,13,490 అని తెలిపారు. వ్యవసాయం ద్వారా రూ.3,15,000 ఆదాయం వస్తుందని వివరించారు. సెక్రటేరియేట్ బ్రాంచ్‌లో రూ.3,08,954 డిపాజిట్, ఢిల్లీ పార్లమెంట్ ఎస్‌బీఐ బ్రాంచ్‌లో రూ.17,17,461 డిపాజిట్ ఉన్నట్లు తెలిపారు. హోండా సిటీ కారు, మెర్సిడెస్ బెంజ్ కారు, 1,235 గ్రాముల బంగారం, 9,700 గ్రాముల వెండి ఉన్నట్లు వెల్లడించారు.

పారాచూట్లపైనే ప్యార్!

- కాంగ్రెస్ మూడో జాబితాలో వలస నేతలకు పెద్దపీట
- ఎస్సీ, ఎస్టీలకు 8, రెడ్డి సామాజిక వర్గానికి మరో 4, బీసీలకు 3 చోట్ల చాన్స్
- నిజామాబాద్ అర్బన్‌లో మైనార్టీ వర్గానికి టికెట్
- సర్వేల ఆధారంగా రెండుచోట్ల అభ్యర్థుల మార్పు
- కామారెడ్డిలో కేసీఆర్‌తో రేవంత్ అమీతుమీ

సాక్షి, హైదరాబాద్: మూడో జాబితాలో మళ్లీ పారాచూట్లకే కాంగ్రెస్ పార్టీ పెద్దపీట వేసింది. సోమవారం రాత్రి విడుదల చేసిన 16 మందిలో ఏడుగురు వలస నేతలే ఉండటం గమనార్హం. జి. వివేక్ (చెన్నూరు), ఏనుగు రవీందర్ రెడ్డి (బాన్సువాడ), నీలం మధు (పటాన్‌చెరు), మేఘారెడ్డి (వనపర్తి), కోరం కనకయ్య (ఇల్లెందు), జారె ఆదినారాయణ (అశ్వారావుపేట), మట్టా రాగమయి (సత్తుపల్లి) ఈ జాబితాలో ఉన్నారు. ఇక సర్వేల ప్రాతిపదికన కూడా అభ్యర్థుల ఖరారు జరిగినట్టు అర్థమవుతోంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని నాలుగు స్థానాలకు ప్రకటించిన అభ్యర్థులతో పాటు రెండుచోట్ల (వనపర్తి, బోథ్) అభ్యర్థుల మార్పు కూడా సర్వేల ఆధారంగానే జరిగినట్టు తెలుస్తోంది. సామాజిక వర్గాల వారీగా పరిశీలిస్తే రెడ్డి సామాజిక వర్గానికి చెందిన మరో నలుగురికి అవకాశం దక్కింది. ఇక 8 ఎస్సీ, ఎస్టీ రిజర్వుడు నియోజకవర్గాలు పోను ముగ్గురు బీసీ నేతలకు, ఒక మైనార్టీ నాయకుడికి టికెట్లు లభించాయి.

తగ్గేదే లే..

కామారెడ్డి నుంచి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి పేరును కాంగ్రెస్ అధిష్టానం ప్రకటించింది. గత 15 రోజులుగా చర్చ జరుగుతున్న విధంగానే అక్కడ బీఆర్ఎస్ తరఫున పోటీ చేస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌పై రేవంత్‌ను బరిలోకి దించింది. కేసీఆర్ రెండు స్థానాల్లో పోటీ చేస్తుండగా.. గజ్వేల్ నుంచి బీజేపీ బలమైన అభ్యర్థి ఈటల రాజేందర్‌ను పోటీకి పెట్టింది. ఈ నేపథ్యంలో తాము కూడా బలమైన నేతను రంగంలోకి దించామని, బీఆర్ఎస్‌ను ఎదుర్కోవడంలో కాంగ్రెస్ వెనక్కు తగ్గబోదనే సంకేతాలను పంపేందుకే ఈ నిర్ణయం తీసుకున్నారనే చర్చ జరుగుతోంది. బీఆర్ఎస్, బీజేపీలకు చెందిన ఇద్దరు నేతలు రెండు స్థానాల్లో పోటీకి దిగిన నేపథ్యంలో కాంగ్రెస్ నుంచి కూడా ఒక చరిష్మా ఉన్న నేత రెండు స్థానాల్లో పోటీకి సిద్ధంగా ఉన్నాడని చెప్పేందుకు కూడా కాంగ్రెస్ ఈ వ్యూహాన్ని ఎంచుకున్నట్టు తెలుస్తోంది. ఇక కామారెడ్డి లో రేవంత్ బరిలోకి దిగుతున్నందున ఆ టికెట్ ఆశించిన మైనార్టీ నేత షబ్బీర్ అలీని నిజామాబాద్ అర్బన్ స్థానానికి మార్చింది. అక్కడ టికెట్ ఆశించిన పీసీసీ మాజీ అధ్యక్షుడు డీఎస్ కుమారుడు సంజయ్, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్ గౌడ్‌ల రాజకీయ భవితవ్యానికి అధిష్టానం హామీ ఇచ్చినట్టు తెలుస్తోంది. మరోవైపు జుక్కల్ (ఎస్సీ)లో టికెట్ ఆశించిన మాజీ ఎమ్మెల్యే గంగారాంను కాకుండా తోట లక్ష్మీకాంతరావును బరిలోకి దింపడం గమనార్హం.

3 జాబితాల్లో బీసీలకు 23

మూడో జాబితాలో ముగ్గురు బీసీ నేతలకు అవకాశం దక్కింది. పురుమళ్ల శ్రీనివాస్ (మున్నూరు కాపు), నీలం మధు (ముదిరాజ్), సురేష్ షెట్కార్ (లింగాయత్)ల పేర్లను ఖరారు చేసింది. మూడు జాబితాల్లో కలిపి బీసీలకు 23 స్థానాలు కేటాయించింది. సామాజిక వర్గాల వారీగా పరిశీలిస్తే ..యాదవులకు 4, మున్నూరు కాపులకు 4, ముదిరాజ్‌లకు 4, గౌడలకు 3, పద్మశాలీ, ఆరె మరాఠీ, వాల్మీకి, మేరు, వంజర, చాకలి, బొందిలి, లింగాయత్ కులాలకు ఒక్కొక్కటి చొప్పున కేటాయించింది. ఇంకా ప్రకటించాల్సిన నాలుగు స్థానాల్లో ఎక్కడా బీసీలకు కేటాయించే అవకాశం లేని నేపథ్యంలో ఈసారికి కాంగ్రెస్ బీసీ నేతలు 23 స్థానాలతోనే సరిపెట్టుకోవాల్సి రానుంది.

నల్లగొండలోనే 3 పెండింగ్

పెండింగ్ జాబితాలో ఉన్న నాలుగింటిలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలోనే మూడు ఉండడం గమనార్హం. సూర్యాపేట, తుంగతుర్తి స్థానాల్లో కాంగ్రెస్ పార్టీనే పోటీకి దిగనుంది. సీపీఎంతో పొత్తు కోసమే మిర్యాలగూడ అభ్యర్థిని ప్రకటించలేదని, పొత్తు ఖరారైతే ఆ స్థానాన్ని సీపీఎంకు కేటాయించే అవకాశం ఉందని, ఒకవేళ కాంగ్రెస్ పోటీ చేయాల్సి వస్తే బత్తుల లక్ష్మారెడ్డి (బీఎల్లార్) బరిలోకి దిగుతారని తెలుస్తోంది. ఇక ఎంఐఎం ఎమ్మెల్యే ముంతాజ్ ఖాన్ పార్టీలోకి వస్తారన్న అంచనాతోనే చార్మినార్ స్థానానికి అభ్యర్థిని ప్రకటించలేదని తెలుస్తోంది.

బీఆర్ఎస్‌ను బంగాళాఖాతంలో కలిపేయాలి : పవన్ ఖేరా



సాక్షి, హైదరాబాద్: ఎన్నో హామీలిచ్చి రాష్ట్ర ప్రజలను మోసం చేసిన బీఆర్ఎస్ పార్టీని బంగాళాఖాతంలో కలిపేయాలని ఏఐసీసీ అధికార ప్రతినిధి పవన్ ఖేరా వ్యాఖ్యానించారు. సోమవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏఐసీసీ పరిశీలకుడు అజయ్‌కుమార్, టీపీసీసీ మీడియా ఇన్‌చార్జ్ కుసుమ కుమార్, మీడియా కమిటీ చైర్మన్ చామల కిరణ్‌కుమార్‌రెడ్డితో కలిసి ఆయన మాట్లాడుతూ, సీఎం హోదాలో కేసీఆర్ తన ఫామ్‌హౌజ్‌లో రాజభోగాలను అనుభవిస్తుంటే ప్రజలు కష్టాలు పడుతున్నారని విమర్శించారు. ఈ ఎన్నికల తర్వాత కేసీఆర్ శాశ్వతంగా ఫాంహౌజ్‌లో విశ్రాంతి తీసుకోవాల్సిందేనని, ప్రజలు సరైన మీట నొక్కి కేసీఆర్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని, సరైన ప్రభుత్వాన్ని ఎన్నుకోవాలని కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఉద్యోగాలు రాక నిరుద్యోగులు ఆత్మహత్యల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ హయాంలో ఒక్క పరీక్ష కూడా సరిగా నిర్వహించలేదని, 3,600 మంది తెలంగాణ యువత ఆత్మహత్యలు చేసుకున్నారని ఎన్‌సీఆర్‌బీ లెక్కలే చెపుతున్నాయని పవన్‌ఖేరా విమర్శించారు.

12 స్థానాలకు ప్రజాశాంతి పార్టీ అభ్యర్థుల ఖరారు

సనత్‌నగర్: ప్రజాశాంతి పార్టీ 12 అసెంబ్లీ స్థానాలకు సోమవారం అభ్యర్థులను ప్రకటించింది. అమీర్‌పేట అపరాజిత కాలనీలోని ఆ పార్టీ కార్యాలయంలో అధ్యక్షుడు కేఏ పాల్ అభ్యర్థుల జాబితా విడుదల చేశారు. మొయ్య రాంబాబు(చెన్నూరు), కర్రోళ్ల మోహన్(జుక్కల్), బంగారు కనకరాజు(రామగుండం), అజ్మీరా రమేశ్‌బాబు(వేములవాడ), సిరిపురం బాబు(నర్సాపూర్), బేగరి దశరథ్ (జహీరాబాద్), పాండు(గజ్వేల్), కందూరి అనిల్‌కుమార్(ఉప్పల్), సిలివేరు నరేశ్(యాకుత్‌పురా), కట్టా జంగయ్య(కల్వకుర్తి), కదిర కిరణ్‌కుమార్(నకిరేకల్), కొప్పుల శ్రీనివాస్‌రావు(మధిర)లను పోటీలో నిలబెడుతున్నట్లు తెలిపారు. రెండో జాబితాను మంగళవారం విడుదల చేయనున్నట్లు చెప్పారు.

ఐటీ వాళ్లే నాకు డబ్బులిచ్చిపోవాలి

- ఐటీ దాడులపై ఎమ్మెల్యే జగ్గారెడ్డి
- ముస్లింలు కాంగ్రెస్‌కు ఓటేసి ఎంఐఎంకు బుద్ధి చెప్పాలి




సాక్షి, హైదరాబాద్: కాంగ్రెసోళ్ల దగ్గర ఏముందని ఐటీ దాడులు చేస్తున్నారని సంగారెడ్డి ఎమ్మెల్యే టి.జగ్గారెడ్డి ప్రశ్నించారు. బీజేపీ ఆడుతున్న ఆటలో బీఆర్ఎస్, ఎంఐఎంలు పావులుగా ఉన్నాయన్న విషయాన్ని ప్రజలు అర్థం చేసుకోవాలని, ఈ మూడు పార్టీలు కలసి కాంగ్రెస్ అధికారంలోకి రాకుండా కుట్రకు పాల్పడుతున్నాయని విమర్శించారు. గత పదేళ్లుగా అధికారానికి దూరమై, కార్యకర్తలను కాపాడుకునేందుకే నానా కష్టాలు పడుతున్న కాంగ్రెస్ నేతలపై ఐటీ దాడులు.. వారిని భయాందోళనలకు గురిచేయడంలో భాగమేనని అన్నారు. ఒకవేళ తనపై ఐటీ అధికారులు దాడులు చేస్తే మాత్రం తనకే డబ్బులిచ్చి పోవాల్సి వస్తుందని, తన అప్పులన్నీ లెక్క కట్టి చెపితే వారు తప్పకుండా తనకు డబ్బులిచ్చి వెళ్తారని చమత్కరించారు. సంగారెడ్డి కాంగ్రెస్ అభ్యర్థిగా సోమవారం గాంధీభవన్‌లో ఆయన బీఫారం తీసుకున్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అంటేనే బీఆర్ఎస్‌కు భయం పట్టుకుందని, అందుకే పదే పదే కర్ణాటక గురించి మాట్లాడుతున్నారని అన్నారు. ప్రజల కోసం ఎన్నో సాగునీటి ప్రాజెక్టులు కట్టిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదయితే, కట్టిన ప్రాజెక్టులు కుంగిపోయిన చరిత్ర బీఆర్ఎస్‌దని అన్నారు.

హరీశ్‌కు నిద్ర కరువైంది

రాష్ట్రం ఏర్పాటయిన పదేళ్ల తర్వాత కూడా సంగారెడ్డిలో కొత్తగా తెలంగాణ వాదాన్ని తెరపైకి తెస్తున్నారని, మళ్లీ ప్రభుత్వం రాదనే కారణంతో బీఆర్ఎస్ నేతలకు పిచ్చెక్కి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. సంగారెడ్డిలో గెలవలేమని తెలిసి మంత్రి హరీశ్‌రావుకు నిద్ర కరువైందని అన్నారు. ఎంఐఎం సినిమా హైదరాబాద్ వరకే పరిమితమని వ్యాఖ్యానించిన జగ్గారెడ్డి.. బీజేపీ కూటమిలో ఎంఐఎం సైనికుడి పాత్రను పోషిస్తోందని, ఈ విషయాన్ని గమనించి రాష్ట్రంలోని ముస్లింలు కాంగ్రెస్‌కు ఓటేసి ఎంఐఎంకు బుద్ధి చెప్పాలని కోరారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ సునామీ ఖాయమని, 70 స్థానాలకు పైగా గెలిచి కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని, సీఎం ఎవరన్నది సోనియా, రాహుల్ గాంధీలు నిర్ణయిస్తారని పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి, తాను అన్నదమ్ములం లాంటి వాళ్లమని, తమ పంచాయితీ అయిపోయిందని చెప్పారు.

కమ్యూనిస్టులకు పట్టం కట్టండి



ఇబ్రహీంపట్నం: వచ్చే ఎన్నికల్లో కమ్యూనిస్టులకు పట్టం కట్టాలని సీపీఐ (ఎం) పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు రాష్ట్ర ప్రజలకు పిలుపునిచ్చారు. ఇబ్రహీంపట్నంలోని పాషనరహరి స్మారక కేంద్రంలో సోమవారం పార్టీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలను ఓడించాలని పిలుపునిచ్చారు. తెలంగాణలో బీజేపీకి ఒక్క సీటు కూడా దక్కనీయమని స్పష్టంచేశారు. దేశంలోని ఐదు రాష్ట్రాల్లో జరుగుతున్న ఎన్నికల్లో ఇండియా కూటమిలోని పార్టీలను సీట్ల సర్దుబాటు వ్యవహారంలో కాంగ్రెస్ మోసం చేసిందని రాఘవులు ఆరోపించారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం మరోసారి అధికారంలోకి రాకుండా అడ్డుకుంటామన్నారు. ఎస్సీ వర్గీకరణ పేరుతో మాదిగల ఓట్లు దండుకునేందుకు బీజేపీ యత్నిస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆయా రాష్ట్రాల్లో బలమైన, అనుకూల శక్తులను కూడగట్టుకుని 2024 ఎన్నికల్లో బీజేపీని ఓడించేందుకు అన్ని అస్త్రాలను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో బీజేపీకి ఒక్క సీటు దక్కకున్నా ప్రాంతీయ పార్టీలు మద్దతునిచ్చే పరిస్థితులున్నాయని, దీన్ని తిప్పికొట్టేందుకు ఒక వ్యూహం ప్రకారం ముందుకెళ్లాలని ఆయన సూచించారు.

కాంగ్రెస్ మరో 32 బీఫారాల పంపిణీ

- మొత్తం 92 మందికి అందజేత.. పెండింగ్‌లో మూడు

సాక్షి, హైదరాబాద్: ఇప్పటివరకు ప్రకటించిన 100 మంది అభ్యర్థుల్లో మొత్తం 92 మందికి కాంగ్రెస్ పార్టీ బీఫారాలు పంపిణీ చేసింది. మరో మూడు నియోజకవర్గాల అభ్యర్థులకు బీ ఫారాలు ఇవ్వకుండా పెండింగ్‌లో పెట్టింది. ఆదివారం ఇచ్చిన 60 మందికితోడు సోమవారం గాంధీభవన్‌లో మరో 32 మందికి బీఫారాలు అందజేసింది. ఏఐసీసీ కార్యదర్శులు రోహిత్ చౌదరి, విష్ణునాథ్, టీపీసీసీ ముఖ్యనేతలు కుమార్‌రావు, నిరంజన్ చేతుల మీదుగా అభ్యర్థులు, వారి కుటుంబసభ్యులు, సన్నిహితులు బీఫారాలను తీసుకెళ్లారు. సోమవారం బీఫారాలు తీసుకెళ్లినవారిలో సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి, మాజీ మంత్రి వినోద్, మాజీఎమ్మెల్యే వేముల వీరేశం తదితరులున్నారు. కాగా, వనపర్తి, బోథ్, చేవెళ్ల నియోజకవర్గాల అభ్యర్థిత్వాలను ఏఐసీసీ సమీక్షిస్తోన్న నేపథ్యంలో ఆ మూడింటిని పెండింగ్‌లో ఉంచారు. మరో ఐదుగురు అభ్యర్థులు బీఫారాలు తీసుకెళ్లలేదని, సమయం చూసుకుని వచ్చి తీసుకెళ్తామని చెప్పారని గాంధీభవన్ వర్గాలు తెలిపాయి.

పొత్తుల కోసం వెంపర్లాడలేదు: తమ్మినేని



ఖమ్మంమయూరిసెంటర్: రాష్ట్రంలో పొత్తుల కోసం తామెప్పుడూ వెంపర్లాడలేదని, పొత్తు కోసం బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలే తమ వద్దకు వచ్చాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం చెప్పారు. ఖమ్మంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రెండు రోజులుగా కాంగ్రెస్ పార్టీ నేతలు తనకు ఫోన్ చేస్తున్నా, మాట మార్చే వాళ్లతో పొత్తు సాధ్యం కాదని తేల్చిచెప్పినట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ వ్యవహరిస్తున్న తీరు సరిగా లేదని అన్నారు. అందుకే బలమున్న 17 స్థానాల్లో పోటీ చేయాలని నిర్ణయించుకున్నామని తమ్మినేని తెలిపారు. హుజూర్‌నగర్‌లో మల్లు లక్ష్మి, నల్లగొండ స్థానంలో ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి అభ్యర్థిత్వాన్ని ఖరారు చేశామని చెప్పారు.

సబ్‌ప్లాన్ .. జనగణన

- బీసీలను ఆకట్టుకునేందుకు కాంగ్రెస్ వ్యూహం!
- కీలక హామీలతో 10న బీసీ డిక్లరేషన్ ప్రకటన
- బీసీ విద్యార్థులందరికీ ఫీజు రీయింబర్స్‌మెంట్
- బీఆర్ఎస్ బీసీబంధు తరహాలో కొత్త పథకం
- 9న మైనార్టీ డిక్లరేషన్ ప్రకటించనున్న రేవంత్



సాక్షి, హైదరాబాద్: ప్రస్తుతం రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు అమలవుతున్న సబ్‌ప్లాన్‌ను బీసీలకు కూడా వర్తింపజేయాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. తాము అధికారంలోకి వస్తే బీసీ సబ్‌ప్లాన్‌ను ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వనుంది. ఈ సబ్‌ప్లాన్ కింద ప్రత్యేకంగా నిధులను కేటాయించి అన్ని ప్రభుత్వ శాఖల ద్వారా ఈ నిధులను ఖర్చు చేయించడం ద్వారా రాష్ట్రంలోని బడుగు, బలహీనవర్గాల సమగ్రాభివృద్ధికి కృషి చేస్తామని వివరించనుంది. ఈ నెల 10వ తేదీన కామారెడ్డిలో జరగనున్న 'బీసీ గర్జన'సభలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రకటించే బీసీ డిక్లరేషన్‌లో సబ్‌ప్లాన్‌ను పొందుపరచాలని నిర్ణయించింది. దీనితోపాటు బీసీ వర్గాల గణన చేపడతామని కూడా హామీ ఇవ్వనుంది. ఈ రెండు ప్రధాన హామీల ద్వారా రాష్ట్రంలో 50 శాతానికి పైగా ఉన్న బీసీ వర్గాలకు చెందిన ఓటర్లను ఆకట్టుకోవాలని కాంగ్రెస్ భావిస్తోంది. ఇదే వ్యూహంలో భాగంగా బీసీ విద్యార్థులందరికీ ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని అమలు చేస్తామని కూడా ప్రకటించనుంది. ప్రస్తుతం బీసీ విద్యార్థులకు ర్యాంకుల వారీగా ఫీజును ప్రభుత్వం చెల్లిస్తోంది. అలా కాకుండా డిగ్రీ నుంచి పై స్థాయిలో ఉండే ఏ కోర్సులో అడ్మిషన్ పొందిన బీసీ విద్యార్థికైనా పూర్తి ఫీజు చెల్లిస్తామని హామీ ఇవ్వనుంది.

ఎంబీసీ కార్పొరేషన్‌కు ప్రత్యేక నిధులు

బీఆర్ఎస్ పార్టీ ఇప్పటికే బీసీ బంధు పేరుతో అమలు చేస్తున్న రూ.లక్ష నగదు సాయం పథకానికి కౌంటర్‌గా బీసీ డిక్లరేషన్ సభ వేదికగానే కొత్త పథకాన్ని ప్రకటించాలని కాంగ్రెస్ పార్టీ యోచిస్తోంది. అయితే నగదు మొత్తాన్ని పెంచి ఇవ్వాలా? నగదు కాకుండా బీసీల అభివృద్ధి, ఉపాధి కల్పన లక్ష్యంగా ప్రత్యేకంగా మరో పథకాన్ని రూపొందించాలా? అన్న దానిపై టీపీసీసీ నాయకత్వం ఇప్పటికే కసరత్తు పూర్తి చేసిందని, ఈ రెండింటిలో ఏదో ఒక దాన్ని కామారెడ్డి సభలో సిద్ధరామయ్య ప్రకటిస్తారని చెబుతున్నారు. దీంతోపాటు కుల కార్పొరేషన్ల ఏర్పాటు, వాటికి నిధుల కేటాయింపు, అత్యంత వెనుకబడిన వర్గాల (ఎంబీసీ) కార్పొరేషన్‌కు ప్రత్యేకంగా నిధుల కేటాయింపు లాంటివి కూడా ప్రకటించనుంది. బీసీలతో పాటు మైనార్టీల కోసం కూడా ప్రత్యేక డిక్లరేషన్ ప్రకటించాలని ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ నిర్ణయించగా, ఈనెల 9న ఆ డిక్లరేషన్‌ను ప్రకటించనున్నట్లు గాంధీభవన్ వర్గాలు వెల్లడించాయి.

నేటి నుంచి రేవంత్ రాష్ట్ర పర్యటన

టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి మంగళవారం నుంచి ఐదు రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించనున్నారు. హెలికాప్టర్‌లో ప్రయాణించడం ద్వారా రోజుకు మూడు నియోజకవర్గాల్లో ప్రచారం చేయనున్నారు. 7వ తేదీన ఆలంపూర్ జోగుళాంబ దేవాలయాన్ని దర్శించుకున్న అనంతరం అక్కడ జరిగే బహిరంగ సభతో ప్రచారం ప్రారంభం కానుంది. అదే రోజు గద్వాల, మక్తల్ నియోజకవర్గాల్లోనూ రేవంత్ పర్యటించనున్నారు. ఈ నెల 8వ తేదీన ఖానాపూర్, ఆదిలాబాద్, జహీరాబాద్ నియోజకవర్గాల్లో, 9వ తేదీన పాలకుర్తిలో, హైదరాబాద్‌లో మైనార్టీ డిక్లరేషన్ ప్రకటించి సికింద్రాబాద్, సనత్‌నగర్ నియోజకవర్గాల్లో ప్రచారం చేయనున్నారు.10వ తేదీన కామారెడ్డిలో జరిగే బీసీ గర్జన సభకు హాజరవుతారు. అదే రోజున కామారెడ్డి నియోజకవర్గ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తారు. హైదరాబాద్‌లో మైనార్టీ ముఖ్యులతో డిన్నర్ కార్యక్రమానికి హాజరవుతారు. ఇక ఈనెల 11వ తేదీన బెల్లంపల్లి, రామగుండం, ధర్మపురి నియోజకవర్గాల్లో పర్యటిస్తారని గాంధీభవన్ వర్గాలు తెలిపాయి.



పారిస్ ఒలింపిక్స్ హాకీ క్వాలిఫయింగ్ టోర్నీ: భారత్‌కు కఠిన సవాలు

వచ్చే ఏడాది జరిగే పారిస్ ఒలింపిక్స్ క్రీడలకు అర్హత సాధించేందుకు భారత మహిళల హాకీ జట్టు శ్రమించాల్సి ఉంటుంది. జనవరి 13 నుంచి 19 వరకు రాంచీలో జరిగే ఒలింపిక్స్ క్వాలిఫయింగ్ టోర్నీ-1కు సంబంధించిన వివరాలను అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) సోమవారం విడుదల చేసింది. ప్రపంచ ఆరో ర్యాంకర్ భారత్‌తోపాటు ఈ టోర్నీలో ప్రపంచ ఐదో ర్యాంకర్ జర్మనీ, న్యూజిలాండ్ (9), జపాన్ (11), చిలీ (14), అమెరికా (15), ఇటలీ (19), చెక్ రిపబ్లిక్ (25) జట్లు బరిలో ఉన్నాయి. ఈ టోర్నీలో స్వర్ణ, రజత, కాంస్య పతకాలు నెగ్గిన మూడు జట్లు పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధిస్తాయి. జనవరి 13 నుంచి 20 వరకు స్పెయిన్‌లోని వాలెన్సియాలో ఎనిమిది జట్ల (బెల్జియం, కెనడా, బ్రిటన్, ఐర్లాండ్, మలేసియా, దక్షిణ కొరియా, స్పెయిన్, ఉక్రెయిన్) మధ్య క్వాలిఫయింగ్-2 టోర్నీ జరుగుతుంది. ఈ టోర్నీ ద్వారా మరో మూడు జట్లు పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత పొందుతాయి.

డబుల్ ధమాకా...





- స్విస్ గ్రాండ్ చెస్ టోర్నీలో విజేతలుగా నిలిచిన వైశాలి, విదిత్
- ఇద్దరూ క్యాండిడేట్స్ టోర్నీకి అర్హత

ఐల్ ఆఫ్ మ్యాన్ (యూకే): అంతర్జాతీయ వేదికపై భారత చెస్ క్రీడాకారులు ఆర్. వైశాలి, విదిత్ సంతోష్ గుజరాతి సత్తా చాటుకున్నారు. అంతర్జాతీయ చెస్ సమాఖ్య (ఫిడే) ఆధ్వర్యంలో ఐల్ ఆఫ్ మ్యాన్ దీవిలో జరిగిన స్విస్ గ్రాండ్ టోర్నీలో ఓపెన్ విభాగంలో విదిత్ (మహారాష్ట్ర), మహిళల విభాగంలో వైశాలి (తమిళనాడు) చాంపియన్స్‌గా అవతరించారు. ఈ టోర్నీలో టైటిల్ సాధించిన తొలి భారతీయ క్రీడాకారులుగా వీరిద్దరు గుర్తింపు పొందారు. నిర్ణీత 11 రౌండ్ల తర్వాత విదిత్ 8.5 పాయింట్లతో... వైశాలి కూడా 8.5 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచారు. విదిత్ ఏడు గేముల్లో గెలిచి, మూడు గేమ్‌లను 'డ్రా' చేసుకొని, మరో గేమ్‌లో ఓడిపోయాడు. వైశాలి ఆరు గేముల్లో నెగ్గి, ఐదు గేమ్‌లను 'డ్రా' చేసుకొని అజేయంగా నిలిచింది. చాంపియన్స్‌గా నిలిచిన విదిత్‌కు ట్రోఫీలతో పాటు 80 వేల డాలర్లు (రూ. 66 లక్షల 57 వేలు), వైశాలికి ట్రోఫీలతో పాటు 25 వేల డాలర్లు (రూ. 20 లక్షల 80 వేలు) ప్రైజ్‌మనీగా లభించాయి. ఈ టైటిల్స్‌తో ఓపెన్ విభాగంలో విదిత్... మహిళల విభాగంలో వైశాలి క్యాండిడేట్స్ టోర్నీకి అర్హత సాధించారు. ఓపెన్, మహిళల విభాగాల్లో వేర్వేరుగా ఎనిమిది మంది ప్లేయర్ల మధ్య క్యాండిడేట్స్ టోర్నీ వచ్చే ఏడాది ఏప్రిల్‌లో 2 నుంచి 25 వరకు కెనడాలోని టొరంటోలో జరుగుతుంది. క్యాండిడేట్స్ టోర్నీలో విజేతగా నిలిచిన వారు ఓపెన్ విభాగంలో ప్రస్తుత ప్రపంచ చాంపియన్ డింగ్ లిరెన్ (చైనా)తో... మహిళల విభాగంలో ప్రస్తుత వరల్డ్ చాంపియన్ జు వెన్‌జున్ (చైనా)తో ప్రపంచ చాంపియన్‌షిప్ టైటిల్ కోసం తలపడతారు.

వెర్‌స్టాపెన్‌కు 17వ విజయం

బ్రెజిల్ గ్రాండ్‌ప్రి టైటిల్ సొంతం



సావ్‌పాలో (బ్రెజిల్): మరోసారి తన ఆధిపత్యాన్ని చాటుకున్న రెడ్‌బుల్ జట్టు డ్రైవర్ మాక్స్ వెర్‌స్టాపెన్ ఈ ఏడాది ఫార్ములావన్ సీజన్‌లో 17వ విజయాన్ని నమోదు చేశాడు. సీజన్‌లోని 20వ రేసు బ్రెజిల్ గ్రాండ్‌ప్రిలో వెర్‌స్టాపెన్ అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. 71 ల్యాప్‌ల ప్రధాన రేసును 'పోల్ పొజిషన్'తో ప్రారంభించిన అతను చివరిదాకా తన ఆధిక్యాన్ని కాపాడుకొని విజేతగా నిలిచాడు. వెర్‌స్టాపెన్ అందరికంటే వేగంగా ఒక గంట 56 నిమిషాల 48.894 సెకన్లలో రేసును ముగించి టైటిల్ దక్కించుకున్నాడు. మొత్తం 20 మంది డ్రైవర్లలో 14 మంది మాత్రమే రేసును పూర్తి చేశారు. ఈ ఏడాది మొత్తం 22 రేసులు ఉండగా.. ఇప్పటికి 20 రేసులు ముగిశాయి. 17 రేసుల్లో వెర్‌స్టాపెన్ నెగ్గగా... రెండు రేసుల్లో సెర్గియో పెరెజ్ (రెడ్‌బుల్), ఒక రేసులో కార్లోస్ సెయింజ్ (ఫెరారీ) గెలిచారు. ఈ సీజన్‌లోని తదుపరి రేసు లాస్‌వేగస్ గ్రాండ్‌ప్రి ఈనెల 19న జరుగుతుంది.

షణ్ముఖ్ గురికి కాంస్య పతకం



సాక్షి, హైదరాబాద్: ప్రపంచ క్రాస్‌బౌ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిన హైదరాబాద్ క్రీడాకారుడు మేడి షణ్ముఖ్ కాంస్య పతకం గెలిచాడు. ఇటీవల ఆగ్రాలో జరిగిన ఈ చాంపియన్‌షిప్‌లో షణ్ముఖ్ ఫైనల్లో 60 పాయింట్లకుగాను 54 పాయింట్లు స్కోరు చేసి మూడో స్థానంలో నిలిచాడు. ఆస్ట్రేలియా, రష్యా, ఎస్తోనియా, స్వీడన్, అమెరికా, ఫిలిప్పీన్స్ తదితర దేశాలు పాల్గొన్న ఈ చాంపియన్‌షిప్‌లో ఓవరాల్‌గా భారత్‌కు 38 పతకాలు లభించాయి.

గట్టెక్కిన బంగ్లాదేశ్

- వరుస ఆరు పరాజయాల తర్వాత మరో విజయం
- ప్రపంచకప్‌లో తొలిసారి శ్రీలంకపై గెలుపు
- కెప్టెన్ షకీబ్ ఆల్‌రౌండ్ ప్రదర్శన
- అసలంక సెంచరీ వృథా





న్యూఢిల్లీ: ప్రపంచకప్‌లో అద్భుతం సాధిద్దామనే లక్ష్యంతో భారత గడ్డపై అడుగుపెట్టిన బంగ్లాదేశ్ తొలి మ్యాచ్‌లో గెలిచి శుభారంభం చేసింది. ఆ తర్వాత ఒకటి కాదు.. రెండు కాదు.. మూడు కాదు.. వరుసగా ఆరు పరాజయాలను చవిచూసి సెమీఫైనల్ రేసు నుంచి నిష్క్రమించింది. ఈ ప్రపంచకప్‌లో టాప్-7లో నిలిస్తేనే 2025 చాంపియన్స్ ట్రోఫీకి అర్హత సాధించే అవకాశం ఉండటంతో బంగ్లాదేశ్‌కు ఎనిమిదో మ్యాచ్ కీలకంగా మారింది. మాజీ విశ్వవిజేత శ్రీలంకతో జరిగిన ఈ పోరులో బంగ్లాదేశ్ మూడు వికెట్ల తేడాతో నెగ్గి మళ్లీ గెలుపు బాట పట్టింది. గెలుపుదారిలో వికెట్లను చేజార్చుకోవడం కలవరపెట్టినా... చివరకు బంగ్లాదేశ్ నుంచి విజయం మాత్రం చేజారలేదు. ప్రపంచకప్ చరిత్రలో శ్రీలంకపై బంగ్లాదేశ్‌కిదే తొలి విజయం కావడం విశేషం. 280 పరుగుల లక్ష్య ఛేదనలో నజ్ముల్ హొస్సేన్ షాంతో (101 బంతుల్లో 90; 12 ఫోర్లు), 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' షకీబుల్ హసన్ (65 బంతుల్లో 82; 12 ఫోర్లు, 2 సిక్సర్లు) కీలకపాత్ర పోషించారు. చివర్లో తౌహిద్ హ్రిదయ్ (7 బంతుల్లో 15 నాటౌట్; 2 సిక్సర్లు) నిలబడి బంగ్లాదేశ్ విజయాన్ని ఖాయం చేశారు. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక 49.3 ఓవర్లలో 279 పరుగుల వద్ద ఆలౌటైంది. చరిత్ అసలంక (105 బంతుల్లో 108; 6 ఫోర్లు, 5 సిక్సర్లు) సెంచరీ సాధించాడు. ప్రత్యర్థి బౌలర్లు తంజీమ్ హసన్ (3/80), షోరిఫుల్ (2/51), షకీబుల్ హసన్ (2/57) సమష్టిగా వికెట్లు పడగొట్టారు. అనంతరం బంగ్లాదేశ్ 41 పరుగులకే ఓపెనర్లు తంజీద్ హసన్ (9), లిటన్ దాస్ (23) వికెట్లను కోల్పోయింది. ఈ దశలో నజ్ముల్, షకీబ్ అర్ధసెంచరీలతో ఆదుకున్నారు. మూడో వికెట్‌కు 169 పరుగులు జోడించారు. 210 వద్ద షకీబ్, మరో పరుగు తర్వాత నజ్ముల్ నిష్క్రమించారు. మహ్మదుల్లా (22), ముష్ఫికర్ (10), మిరాజ్ (3) స్వల్ప వ్యవధిలో అవుటవ్వడంతో బంగ్లాదేశ్‌కు ఇబ్బంది ఎదురైంది. అయితే తౌహిద్, తంజీమ్ జట్టును విజయతీరానికి చేర్చారు.

స్కోరు వివరాలు

శ్రీలంక ఇన్నింగ్స్: నిసాంక (బి) తంజీమ్ 41; పెరీరా (సి) ముష్ఫికర్ (బి) షోరిఫుల్ 4; మెండిస్ (సి) షోరిఫుల్ (బి) షకీబ్ 19; సమరవిక్రమ (సి) మహ్మదుల్లా (బి) షకీబ్ 41; అసలంక (సి) లిటన్ (బి) తంజీమ్ 108; మాథ్యూస్ (టైమ్డ్ అవుట్) 0; ధనంజయ (స్టంప్డ్) ముష్ఫికర్ (బి) మిరాజ్ 34; తీక్షణ (సి) సబ్-అహ్మద్ (బి) షోరిఫుల్ 21; చమీర (రనౌట్) 4; రజిత (సి) లిటన్ (బి) తంజీమ్ 0; మదుషంక (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (49.3 ఓవర్లలో ఆలౌట్) 279. వికెట్ల పతనం:** 1-5, 2-66, 3-72, 4-135, 5-135, 6-213, 7-258, 8-278, 9-278, 10-279. **బౌలింగ్:** షోరిఫుల్ 9.3-0-51-2, టస్కిన్ 10-1-39-0, తంజీమ్ హసన్ 10-0-80-3, షకీబ్ 10-0-57-2, మిరాజ్ 10-0-49-1. **బంగ్లాదేశ్ ఇన్నింగ్స్:** తంజీద్ (సి) నిసాంక (బి) మదుషంక 9; లిటన్ దాస్ (ఎల్బీడబ్ల్యూ) (బి) మదుషంక 23; నజ్ముల్ (బి) మాథ్యూస్ 90; షకీబ్ (సి) అసలంక (బి) మాథ్యూస్ 82; మహ్మదుల్లా (బి) తీక్షణ 22; ముష్ఫికర్ (బి) మదుషంక 10; తౌహిద్ (నాటౌట్) 15; మిరాజ్ (సి) అసలంక (బి) తీక్షణ 3; తంజీమ్ (నాటౌట్) 5; ఎక్స్‌ట్రాలు 23; **మొత్తం (41.1 ఓవర్లలో 7 వికెట్లకు) 282. వికెట్ల పతనం:** 1-17, 2-41, 3-210, 4-211, 5-249, 6-255, 7-269. **బౌలింగ్:** మదుషంక 10-1-69-3, తీక్షణ 9-0-44-2, కసున్ రజిత 4-0-47-0, చమీర 8-0-54-0, మాథ్యూస్ 7.1-1-35-2, ధనంజయ డిసిల్వా 3-0-20-0.

మాథ్యూస్ 'టైమ్డ్ అవుట్'

తొలి క్రికెటర్‌గా గుర్తింపు



శ్రీలంక క్రికెటర్ ఏంజెలో మాథ్యూస్ అనూహ్య, అరుదైన రీతిలో అవుటై క్రికెట్ చరిత్రలో తన పేరును లిఖించుకున్నాడు. 146 ఏళ్ల అంతర్జాతీయ క్రికెట్‌లో 'టైమ్డ్ అవుట్' ద్వారా అవుట్ అయిన తొలి క్రికెటర్‌గా అతను నిలిచాడు. సోమవారం బంగ్లాదేశ్‌తో న్యూఢిల్లీలో జరిగిన మ్యాచ్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. లంక ఇన్నింగ్స్ 25వ ఓవర్ రెండో బంతికి సమరవిక్రమ అవుటయ్యాడు. నిబంధనల ప్రకారం తర్వాతి బ్యాటర్ 2 నిమిషాల్లోగా బంతిని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి. క్రీజ్‌లోకి మాథ్యూస్ సరైన సమయానికే వచ్చినా బంతిని ఎదుర్కోవడంలో ఆలస్యం చేశాడు. తన హెల్మెట్‌ను సరి చేసుకుంటుండగా దాని స్ట్రాప్ తెగింది. దాంతో మరో హెల్మెట్ కోసం సైగ చేయగా, చమిక మైదానంలోకి పరుగెత్తుకుంటూ వచ్చాడు. అప్పటికే సమయం మించిపోవడంతో బౌలర్, బంగ్లాదేశ్ కెప్టెన్ షకీబ్ 'టైమ్డ్ అవుట్' కోసం అప్పీల్ చేశాడు. దాంతో అప్పీల్‌ను పరిగణనలోకి తీసుకున్న అంపైర్లు చర్చించి నిబంధనల ప్రకారం మాథ్యూస్‌ను 'అవుట్'గా ప్రకటించారు. తన హెల్మెట్ సమస్యను బ్యాటర్ అంపైర్లకు వివరించినా వారు స్పందించలేదు. ఆ తర్వాత అప్పీల్ వెనక్కి తీసుకోమని షకీబ్‌ను కూడా కోరినా అతను ససేమిరా అనడంతో మాథ్యూస్ వెనుదిరగక తప్పలేదు. అనంతరం ఫోర్త్ అంపైర్ ఏడ్రియన్ హోల్డ్‌స్టాక్ దీనిపై మరింత స్పష్టతనిచ్చారు. 'మాథ్యూస్‌కు హెల్మెట్ సమస్య కూడా రెండు నిమిషాల తర్వాత వచ్చింది. అప్పటికీ అతను బంతిని ఎదుర్కోకుండా ఆలస్యం చేశాడు. క్రీజ్‌లోకి వచ్చే ముందు ఎక్విప్‌మెంట్‌లో అన్నింటినీ సరిగ్గా చూసుకోవడం కూడా బ్యాటర్‌దే బాధ్యత' అని ఆయన చెప్పారు. దాంతో షకీబ్ క్రీడా స్ఫూర్తి అంశాన్ని పక్కన పెడితే నిబంధనల ప్రకారం మాథ్యూస్‌ను అవుట్‌గా ప్రకటించడం సరైందే.

ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే.
భారత్	8	8	0	16	2.456
దక్షిణాఫ్రికా	8	6	2	12	1.376
ఆస్ట్రేలియా	7	5	2	10	0.924
న్యూజిలాండ్	8	4	4	8	0.398
పాకిస్తాన్	8	4	4	8	0.036
అఫ్గానిస్తాన్	7	4	3	8	-0.330
బంగ్లాదేశ్	8	2	6	4	-1.142
శ్రీలంక	8	2	6	4	-1.160
నెదర్లాండ్స్	7	2	5	4	-1.398
ఇంగ్లండ్	7	1	6	2	-1.504

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

ప్రపంచకప్‌లో నేడు

ఆస్ట్రేలియా X అఫ్గానిస్తాన్
వేదిక: ముంబై
మధ్యాహ్నం 2 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, హాట్‌స్టార్ యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

పంజాబ్ ఎట్టకేలకు...

మొహాలి: దేశవాళీ టి20 క్రికెట్ టోర్నమెంట్ సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో పంజాబ్ జట్టు తొలిసారి చాంపియన్‌గా అవతరించింది. బరోడా జట్టుతో జరిగిన ఫైనల్లో పంజాబ్ 20 పరుగుల తేడాతో గెలిచింది. గతంలో పంజాబ్ నాలుగుసార్లు (2007, 2012, 2013, 2015) పంజాబ్ జట్టు రన్నరప్‌తో సరిపెట్టుకుంది. మొదట బ్యాటింగ్ కు దిగిన పంజాబ్ 20 ఓవర్లలో 4 వికెట్లకు 223 పరుగులు సాధించింది. అన్‌మోల్‌ప్రీత్ సింగ్ (61 బంతుల్లో 113; 10 ఫోర్లు, 6 సిక్స్‌లు) మెరుపు సెంచరీ చేశాడు. అనంతరం బరోడా 20 ఓవర్లలో 7 వికెట్లకు 203 పరుగులు చేసి ఓడిపోయింది. బౌలర్ అర్‌్షదీప్ సింగ్ (4/23) పంజాబ్ విజయంలో కీలక పాత్ర పోషించాడు.

సినిమా



● రవితేజ

కనిపించడు.. వ్యాపించి ఉంటాడు!

''కొండలో లావాని కిందకి పిలవకు... ఊరు ఉండదు.. నీ ఉనికి ఉండదు'' అంటూ రవితేజ వాయిస్ ఓవర్‌తో మొదలవుతుంది 'ఈగల్' సినిమా టీజర్. రవితేజ హీరోగా కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ థ్రిల్లర్ చిత్రం ఇది. కావ్యా థాపర్, అనుపమా పరమేశ్వరన్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ చిత్రం టీజర్‌ను సోమవారం విడుదల చేశారు మేకర్స్. ''ఎక్కడుంటాడు?(అనుపమా పరమేశ్వరన్).. అడవిలో ఉంటాడు.. నీడై తిరుగుతుంటాడు.. కనిపించడు. కానీ వ్యాపించి ఉంటాడు ('అవసరాల' శ్రీనివాస్) వంటి డైలాగ్స్ టీజర్‌లో ఉన్నాయి. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఈ చిత్రం సంక్రాంతి సందర్భంగా జనవరి 13న విడుదల కానుంది. ఈ చిత్రానికి సంగీతం: దావ్ జాంద్, సహ-నిర్మాత: వివేక్ కూచిభొట్ల.



● అనుష్క

అనుష్క @ 50

'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి' వంటి హిట్ మూవీ తర్వాత అనుష్క నటించనున్న తెలుగు చిత్రం ఏంటి? అనే ప్రశ్నకు సోమవారం సమాధానం దొరికింది. నేడు (నవంబర్ 7) అనుష్క పుట్టినరోజు. ఈ సందర్భంగా ఆమె నటించనున్న తాజా సినిమా ప్రకటన వచ్చింది. అనుష్క లీడ్ రోల్‌లో జి.అశోక్ దర్శకత్వంలో 'భాగమతి'ని నిర్మించిన యూవీ క్రియేషన్స్ అధినేతలు వంశీ, ప్రమోద్ తాజాగా 'భాగమతి 2'ని ప్రకటించారు. అనుష్క నటించనున్న 50వ చిత్రం ఇది. ఇక 'భాగమతి' చిత్రం 2018 జనవరి 26న విడుదలై, మంచి విజయం సాధించిన విషయం తెలిసిందే. దాదాపు ఆరేళ్లకి 'భాగమతి 2' సినిమా ప్రకటించారు వంశీ, ప్రమోద్. ఈ సినిమాని భారీ స్థాయిలో నిర్మించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ చిత్ర దర్శకుడు, నటీనటులు, ఇతర సాంకేతిక నిపుణుల వివరాలను త్వరలోనే ప్రకటించనున్నారు. కాగా అనుష్క నటించిన తాజా మలయాళ చిత్రం 'కథనార్' విడుదలకు సిద్ధమవుతోంది.



● కమల్ హాసన్

రంగరాయ శక్తివేల్ నాయకర్.. థగ్‌లైఫ్

'నాయగన్'(1987) చిత్రం తర్వాత హీరో కమల్‌హాసన్, దర్శకుడు మణిరత్నం కాంబినేషన్‌లో రూపొందుతున్న తాజా చిత్రానికి 'థగ్ లైఫ్' టైటిల్‌ని ఖరారు చేసి, టైటిల్ అనౌన్స్‌మెంట్ వీడియోను సోమవారం రిలీజ్ చేశారు మేకర్స్. అలాగే ఈ చిత్రంలో త్రిష, దుల్కర్ సల్మాన్, 'జయం' రవి కీలక పాత్రలు పోషించనున్నట్లు కూడా వెల్లడించారు. 'రంగరాయ శక్తివేల్ నాయకర్.. నాది కాయల్ పట్టినమ్', 'రంగరాయ శక్తివేల్ నాయకర్ అంటే క్రిమినల్, గూండా, యాకుజా. యాకుజా అంటే జపనీస్‌లో గ్యాంగ్‌స్టర్ అని అర్థం', 'చావు నా కోసం ఎదురుచూడటం ఇదేం తొలిసారి కాదు. చివరిసారి కూడా కాదు', 'నా పేరు రంగరాయ శక్తివేల్ నాయకర్.. మర్చిపోవద్దు' అని కమల్‌హాసన్ చెప్పే డైలాగ్స్ 'థగ్స్ లైఫ్' టైటిల్ అనౌన్స్‌మెంట్ వీడియోలో ఉన్నాయి. కమల్‌హాసన్, మణిరత్నం, ఆర్ మహేంద్రన్, శివ అనంత్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. నేడు కమల్ బర్త్ డే సందర్భంగా 'థగ్ లైఫ్'కి సంబంధించిన విశేషాలను సోమవారం వెల్లడించారు మేకర్స్. ఈ చిత్రానికి సంగీతం: ఏఆర్ రెహమాన్, కెమెరా: రవి కె.చంద్రన్.

నన్ను కొత్తగా చూస్తారు

- రాఘవా లారెన్స్

రాఘవా లారెన్స్, ఎస్‌జే సూర్య ప్రధాన పాత్రల్లో నటించిన పీరియాడికల్ యాక్షన్ డ్రామా 'జిగర్ తండ డబుల్ ఎక్స్'. కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వంలో కార్తికేయన్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 10న తెలుగు, తమిళం, హిందీ భాషల్లో విడుదల కానుంది. ఈ సందర్భంగా రాఘవా లారెన్స్, ఎస్‌జే సూర్య హైదరాబాద్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో చెప్పిన విశేషాలు.



● ఎస్‌జే సూర్య, రాఘవా లారెన్స్

లారెన్స్ మాట్లాడుతూ – ''జిగర్ తండ' సినిమాలోని గ్యాంగ్‌స్టర్ పాత్రలో నటించే తొలి అవకాశం నాకే వచ్చింది. కానీ అప్పుడు ఇతర ప్రాజెక్ట్స్‌తో బిజీగా ఉండటం వల్ల చేయడం కుదర్లేదు. ఆ తర్వాత 'జిగర్ తండ'కు రెండు జాతీయ అవార్డులు వచ్చాయి. దీంతో 'జిగర్ తండ' కు సీక్వెల్ ఉన్నట్లయితే అందులో నేను నటిస్తానని కార్తీక్ సుబ్బరాజుకి చెప్పాను. ఈ సీక్వెల్ 'జిగర్ తండ: డబుల్ ఎక్స్' కథ సిద్ధమైన ఏడాది తర్వాత కార్తీక్ సుబ్బరాజు ఫోన్ చేసి చెప్పారు. కథ నచ్చడంతో ఈ సినిమాలో నటించాను. ● ఈ సినిమా విషయంలో దర్శకుడు కార్తీక్ చెప్పినట్లు చేశాను. ప్రేక్షకులు కొత్త రాఘవా లారెన్స్‌ని చూస్తారు. సినిమా ఫస్టాఫ్‌లో యాక్షన్, సెకండాఫ్‌లో భావోద్వేగాల సన్నివేశాలు ఉంటాయి. ముఖ్యంగా చివరి 20 నిమిషాలు ప్రేక్షకుల హృదయాలను హత్తుకునేలా ఉంటుంది. సినిమా చూసిన తర్వాత ప్రేక్షకుల హృదయం కూడా బరువెక్కుతుంది. ● త్వరలో 'కాంచన 4' స్టార్ట్ చేస్తాను. ఇక సూపర్ స్టార్ రజనీకాంత్‌గారి కోసమే కాదు.. సూపర్ స్టార్, మెగాస్టార్ (చిరంజీవిని ఉద్దేశిస్తూ..) కలిసి యాక్ట్ చేసే ఓ మల్టీస్టారర్ స్క్రిప్ట్ నా దగ్గర ఉంది. కానీ వారు యాక్ట్ చేయాలి కదా'' అన్నారు.

నటుడు- దర్శకుడు ఎస్‌జే సూర్య మాట్లాడుతూ– ''దర్శకత్వం-నటన..ఈ రెండింటిలో నాకు నటన అంటేనే ఇష్టం. అయితే నా కెరీర్ ప్రారంభంలో యాక్టింగ్ అవకాశాల కోసం డైరెక్షన్‌ని వారధిగా వినియోగించుకున్నాను. ఇక 'జిగర్ తండ: డబుల్‌ఎక్స్'లో లారెన్స్‌గారిది గ్యాంగ్‌స్టర్ రోల్. నాదేమో దర్శకుడు కావాలనుకునే పాత్ర. నా పాత్రలో సత్యజిత్ రేగారి సినిమాల రిఫరెన్స్ ఉండటంతో ఇదొక బహుమతిగా భావించి ఈ మూవీ చేశాను. మంచి మాస్ కమర్షియల్ అంశాలు ఉన్న సందేశాత్మక చిత్రం ఇది. ఈ సినిమా షూటింగ్ కోసం ఓ విలేజ్ సెట్ వేయాల్సి వచ్చింది. ఇందులో భాగంగా ఓ రోడ్, బ్రిడ్జ్ వేశాం. అప్పటికే రోడ్, బ్రిడ్జ్ సౌకర్యాలు లేక ఇబ్బందిపడుతున్న ఆ గ్రామస్తులకు ఇవి ఇప్పుడు ఉపయోగపడుతున్నాయి. నేను నటిస్తూ, నా దర్శకత్వంలో ఓ సినిమా రానుంది'' అని చెప్పుకొచ్చారు.



● బన్నీ వాసు, తేజా మార్ని, అల్లు అరవింద్, అనిల్ రావిపూడి, శివానీ, రాహుల్ విజయ్, విద్య

ఈ కథ చాలా సంతృప్తినిచ్చింది

- నిర్మాత అల్లు అరవింద్

రాహుల్ విజయ్, శివానీ రాజశేఖర్ లీడ్ రోల్స్‌లో శ్రీకాంత్, వరలక్ష్మీ శరత్‌కుమార్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'కోట బొమ్మాళి పీఎస్'. తేజా మార్ని దర్శకత్వంలో 'బన్నీ' వాసు, విద్యా కొప్పినీడి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 24న విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్‌కి దర్శకుడు అనిల్ రావిపూడి, నిర్మాత అల్లు అరవింద్ అతిథులుగా హాజరయ్యారు. అల్లు అరవింద్ మాట్లాడుతూ– ''పోలీసులను రాజకీయ నాయకులు ఏ విధంగా వాడుకున్నారనే అంశంపై ఈ సినిమా ఉంటుంది. చాలా సంతృప్తినిచ్చిన కథ ఇది. పోలీసులు పడే బాధలు, ఇబ్బందులు ఈ సినిమాలో ఉంటాయి'' అన్నారు. ''ఈ సినిమా ఒరిజినల్ (మలయాళ చిత్రం 'నాయట్టు') చూశాను. 'కోట బొమ్మాళి'లో చాలా మార్పులు చేశారు. టీజర్ చాలా ఆసక్తిగా ఉంది. ఇప్పుడు నిర్మాతగా వస్తున్న విద్యాగారు సక్సెస్ కావాలని కోరుకుంటున్నాను'' అన్నారు అనిల్ రావిపూడి. ''తేజా మార్ని డైరెక్షన్, కాశీ నాగేంద్ర డైలాగ్స్ ప్రేక్షకులను ఆలోచింపజేస్తాయి. సిటీల్లో జరిగే ఎన్నికల గురించి నాకు పెద్దగా తెలియదు. ఊర్లలో ఉన్న, అక్కడి ఎలక్షన్స్‌లో పాల్గొంటున్న వారికి ఈ సినిమాలోని కొన్ని సన్నివేశాలు గట్టిగా తగుల్తాయి. కొంతమంది రాజకీయ నాయకులకు కూడా తగలొచ్చు. ఏ పార్టీకీ కొమ్ము కాసేలా ఈ సినిమా ఉండదు'' అన్నారు 'బన్నీ' వాసు. ''నేరస్తులను పట్టుకోవాల్సిన పోలీసులే ఓ కేసులో ఇరుక్కుని ఎలా అవస్థలు పడ్డారనేది ఈ సినిమా కాన్సెప్ట్'' అన్నారు తేజా మార్ని. ''ఈ సినిమా కోసం అందరూ చాలా కష్టపడ్డారు'' అన్నారు విద్యా. ఈ కార్యక్రమంలో చిత్ర కో ప్రొడ్యూసర్స్ భాను-రియాజ్, రైటర్ కాశీ నాగేంద్ర, ఆర్ట్ డైరెక్టర్ గాంధీ, నిర్మాతలు ధీరజ్, వంశీ నందిపాటి, ఎస్‌కేఎన్ పాల్గొన్నారు.



● గౌరీకృష్ణ

ఈ విజయం కొత్తగా ఉంది

- నిర్మాత గౌరీకృష్ణ

''నేను గతంలో పలు సినిమాలు నిర్మించినా అనుకున్నంత విజయం సాధించలేదు. 'మా ఊరి పొలిమేర 2' చిత్రంతో తొలి హిట్ అందుకున్నా.. ఈ విజయం చాలా కొత్తగా ఉంది. మా సినిమాని ఆదరిస్తున్న ప్రేక్షకులకు కృతజ్ఞతలు'' అని నిర్మాత గౌరీకృష్ణ అన్నారు. 'సత్యం' రాజేశ్, కామాక్షీ భాస్కర్ల జంటగా డా. అనిల్ విశ్వనాథ్ దర్శకత్వం వహించిన చిత్రం 'మా ఊరి పొలిమేర 2'. గౌరీకృష్ణ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 3న విడుదలైంది. ఈ సందర్భంగా గౌరీకృష్ణ మాట్లాడుతూ– ''మా ఊరి పొలిమేర' తొలి భాగం విజయం సాధించిందని సీక్వెల్ తీయలేదు. అనిల్ విశ్వనాథ్‌పై నమ్మకంతోనే 'మా ఊరి పొలిమేర 2' తీశాం. గీతా ఆర్ట్స్ సంస్థకు చెందిన వంశీ నందిపాటిగారు విడుదల చేయడం వల్ల సినిమాకు ప్లస్ అయ్యింది. నిర్మాతగా నా తర్వాతి చిత్రానికి కథా చర్చలు జరుగుతున్నాయి'' అన్నారు.

అన్నదమ్ముల అనుబంధం



● సంపూర్ణేష్ బాబు, సంజోష్

సంపూర్ణేష్ బాబు, సంజోష్, ప్రాచీ బన్సాల్, ఆర్తీ గుప్తా కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'సోదరా'. మన్‌మోహన్ మేనంపల్లి దర్శకత్వం వహించారు. చంద్ర చంగళ్ల నిర్మించిన ఈ సినిమా ఫస్ట్ లుక్‌ని నిర్మాత వివేక్ కూచిభొట్ల రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా దర్శక-నిర్మాతలు మాట్లాడుతూ– ''అన్నదమ్ముల అనుబంధం నేపథ్యంలో వినోదాత్మకంగా 'సోదరా'ను రూపొందించాం. ఇటీవలే విడుదలైన మోషన్ పోస్టర్‌కి మంచి స్పందన వచ్చింది. ఈ సినిమాని త్వరలోనే విడుదల చేయనున్నాం'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: సునీల్ కశ్యప్, కెమెరా: జాన్.

ఇది మనందరి కథ

- దర్శకుడు మారేష్ శివన్



''ప్రేమ, లక్ష్యం.. ఈ రెండింటినీ ఒకేసారి ఎంచుకోవాల్సి వస్తే ఏం చేస్తారు? ఏం చేయాలి? అనే సందేశంతో 'అలా నిన్ను చేరి' సినిమా తీశా. ప్రతి మనిషిలో జరిగే కథ ఇది. యువతరంతో పాటు కుటుంబ సమేతంగా చూడదగ్గ చిత్రం ఇది. మా చిత్రాన్ని చూసిన తర్వాత కొంత మందైనా మారతారనే నమ్మకం ఉంది'' అని దర్శకుడు మారేష్ శివన్ అన్నారు. దినేష్ తేజ్, హెబ్బా పటేల్, పాయల్ రాధాకృష్ణ ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన చిత్రం 'అలా నిన్ను చేరి'. కొమ్మాలపాటి శ్రీధర్ సమర్పణలో కొమ్మాలపాటి సాయి సుధాకర్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 10న విడుదలవుతోంది. మారేష్ శివన్ విలేకరులతో మాట్లాడుతూ–''ఈ చిత్ర కథ 2012 నేపథ్యంలో జరుగుతుంది. 2012లో రాసుకున్న కథే అయినా ఇందులోని ప్రేమ, భావోద్వేగాలు ఇప్పటి వారికి కూడా నచ్చుతాయి. సుభాష్ ఆనంద్ సంగీతం ఓ ప్లస్. ఈ సినిమా ప్రీమియర్ చూసిన డైరెక్టర్ త్రినాథరావు, నిర్మాతలు బెక్కెం వేణుగోపాల్, బెల్లంకొండ సురేష్‌వంటి వారు మంచి సినిమా తీశానని అభినందించారు. ప్రేక్షకులు థియేటర్స్ నుంచి అదే భావోద్వేగంతో బయటికొస్తారు'' అన్నారు.

సాక్షి బిజినెస్
మంగళవారం
7-11-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	595	64,959
నిఫ్టీ ▲	181	19,412

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	13,506	▲	27
డోజోన్స్	34,120	▲	50
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,418	▲	1
డాక్స్	15,137	▼	53
షాంఘై	3,058	▲	28
నికాయ్	32,708	▲	759

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	61,053
బంగారం (99.5 స్వచ్ఛత)	60,808
వెండి (కేజీ)	72,037

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	82.78	84.15
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	100.20	103.36
€	యూరో	ఒకటి	87.05	90.13
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	54.45	56.55
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	52.45	55.82
S$	సింగపూర్ డాలర్	ఒకటి	60.19	62.45
SAR	సౌదీ రియాల్	భారతీయకరెన్సీ	21.23	22.86
UAE D	యూఏఈ దిర్హామ్	భారతీయకరెన్సీ	21.76	23.55
¥	చైనా యువాన్	భారతీయకరెన్సీ	10.33	12.40

ఎల్‌అండ్‌టీకి భోగాపురం ఎయిర్‌పోర్ట్ కాంట్రాక్ట్

న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ ప్రాజెక్టు నిర్మాణ పనులకు సంబంధించి భారీ ఆర్డరు దక్కించుకున్నట్లు లార్సన్ అండ్ టూబ్రో (ఎల్‌అండ్‌టీ) ఒక ప్రకటనలో వెల్లడించింది. జీఎంఆర్ విశాఖపట్నం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు నుంచి విమానాశ్రయ ఇంజినీరింగ్, ప్రొక్యూర్‌మెంట్, నిర్మాణ (ఈపీసీ) కాంట్రాక్టు తమ అనుబంధ సంస్థ ఎల్‌అండ్‌టీ కన్‌స్ట్రక్షన్‌కి లభించినట్లు వివరించింది. అయితే, కాంట్రాక్టు విలువ మాత్రం వెల్లడించలేదు. సాధారణంగా రూ. 2,500 కోట్ల నుంచి రూ. 5,000 కోట్ల శ్రేణిలోని కాంట్రాక్టులను కంపెనీ భారీ ఆర్డర్లుగా పరిగణిస్తుంది. ప్రాథమికంగా ఏటా 60 లక్షల మంది ప్రయాణికుల (ఎంపీపీఏ) హ్యాండ్లింగ్ సామర్థ్యంతో ప్రాజెక్టు నిర్మాణం ఉంటుందని, తర్వాత ఇది 12 ఎంపీపీఏకి పెరుగుతుందని సంస్థ తెలిపింది. కాంట్రాక్టు ప్రకారం ఏటీసీ టవర్, ఎయిర్‌ఫీల్డ్ అభివృద్ధి (3,800 మీటర్ల దక్షిణ రన్‌వే, ట్యాక్సీవే, యాప్రాన్, ఎయిర్‌ఫీల్డ్ గ్రౌండ్ లైటింగ్) మొదలైన పనులు చేయాల్సి ఉంటుందని ఎల్‌అండ్‌టీ పేర్కొంది. కంపెనీ ప్రస్తుతం హైదరాబాద్‌తో పాటు ఢిల్లీ, బెంగళూరు, చెన్నై వంటి నగరాల్లో భారీ విమానాశ్రయాల్లో నిర్మాణ పనులను నిర్వహిస్తోంది.



మార్కెట్ మూడోరోజూ ముందడుగు

- సెన్సెక్స్ 595 పాయింట్లు ప్లస్
- 19400 పాయింట్లపైకి నిఫ్టీ
- ప్రపంచ మార్కెట్లలో సానుకూలతలు
- ప్రైవేట్ బ్యాంకులు, ఐటీ, క్యాపిటల్ గూడ్స్ షేర్లకు డిమాండ్

ముంబై: ప్రైవేట్ రంగ బ్యాంకులు, ఐటీ, క్యాపిటల్ గూడ్స్ షేర్లు రాణించడంతో స్టాక్ సూచీలు సోమవారం ఒకశాతం లాభపడ్డాయి. సెన్సెక్స్ 595 పాయింట్లు బలపడి 64,959 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 181 పాయింట్లు పెరిగి 19,412 వద్ద నిలిచింది. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలోని సానుకూల సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయం లాభాలతో మొదలయ్యాయి. ఇన్వెస్టర్లు కొనుగోళ్లకే ఆసక్తి చూపడంతో సూచీలు రోజంతా స్థిరంగా ముందుకు కదిలాయి. ఒక దశలో సెన్సెక్స్ 629 పాయింట్లు పెరిగి 64,993 వద్ద, నిఫ్టీ 192 పాయింట్లు బలపడి 19,423 వద్ద ఇంట్రాడే గరిష్టాలను తాకాయి. ప్రభుత్వరంగ బ్యాంకులు, కన్జూమర్ డ్యూరబుల్స్ షేర్లు మాత్రమే అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. బీఎస్‌ఈ మిడ్ స్మాల్ క్యాప్ సూచీలు ఒకశాతం చొప్పున రాణించాయి. విదేశీ ఇన్వెస్టర్ల రూ.549 కోట్ల షేర్లు అమ్మేశారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.596 కోట్ల షేర్లు కొన్నారు. అమెరికా ఉద్యోగ గణాంకాలు అంచనాలకు తగ్గట్లు నమోదు కావడంతో ఫెడ్ రిజర్వ్ వడ్డీరేట్ల పెంపు ఉండకపోవచ్చనే ఆశలతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు లాభాల్లో ట్రేడవుతున్నాయి.

- 3 రోజుల్లో సెన్సెక్స్ 1,367 పాయింట్ల ర్యాలీతో రూ.7.95 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది. బీఎస్‌ఈ కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.318 లక్షల కోట్లకు చేరింది. సోమవారం ఒక్కరోజే రూ.2.95 లక్షల కోట్లు పెరిగింది.
- సెన్సెక్స్‌లోని 30 షేర్లలో ఎస్‌బీఐ (0.65%), హెచ్‌యూఎల్ (0.29%), టాటా మోటార్స్ (0.29%), టైటాన్ (0.19%) షేర్లు మాత్రమే నష్టపోయాయి. ఎల్‌అండ్‌టీ, యాక్సిస్ బ్యాంక్, పవర్ గ్రిడ్, బజాజ్‌ఫైనాన్స్, టాటా స్టీల్ షేర్లు 2% రాణించి టాప్ 5 గెయినర్లుగా నిలిచాయి.



బిగ్'సి'లో దీపావళి ధమాకా



హైదరాబాద్: దీపావళి సందర్భంగా బిగ్'సి' ధమాకా ఆఫర్లు ప్రకటించింది. ప్రతి స్మార్ట్‌ఫోన్ కొనుగోలుపై రూ.10వేల వరకు తక్షణ క్యాష్‌బ్యాక్‌తో పాటు రూ.4వేల వరకు కచ్చితమైన బహుమతి ఇస్తామని సంస్థ సీఎండీ బాలు చౌదరి తెలిపారు. బజాజ్ ఫైనాన్స్ ద్వారా మొబైల్స్ కొనుగోలుపై రూ.9వేల వరకు తక్షణ క్యాష్‌బ్యాక్ ఇస్తామన్నారు. మొబైల్/స్మార్ట్‌టీవీ/ల్యాప్‌టాప్‌ల కొనుగోలుపై ఎస్‌బీఐ కార్డు ద్వారా రూ.3వేల వరకు, ఐడీఎఫ్‌సీ ద్వారా రూ.7,500 వరకు తక్షణ క్యాష్‌బ్యాక్ లభిస్తుందన్నారు. బ్రాండెడ్ యాక్సెసరీస్‌పై 51% వరకు రాయితీ అందిస్తామన్నారు. ఏటీఎం కార్డుపై ఎలాంటి వడ్డీ, డౌన్ పేమెంట్ లేకుండానే మొబైల్, స్మార్ట్ టీవీ, ల్యాప్‌టాప్, ఏసీలను కొనుగోలు చేయొచ్చని బాలు వివరించారు.

అదానీ ఎనర్జీ లాభం భళా



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ కంపెనీ అదానీ ఎనర్జీ సొల్యూషన్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023–24) రెండో త్రైమాసికంలో ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. జూలై-సెప్టెంబర్(క్యూ2)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 46 శాతం జంప్‌చేసి దాదాపు రూ. 284 కోట్లకు చేరింది. గతేడాది (2022–23) ఇదే కాలంలో కేవలం రూ. 194 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 3,032 కోట్ల నుంచి రూ. 3,421 కోట్లకు ఎగసింది.

పదేళ్లలో ఎలక్ట్రిక్ బ్రాండ్‌గా మారతాం

జపాన్ లగ్జరీ కార్ల సంస్థ లెక్సస్ ఇండియా ఎండీ నవీన్ సోనీ



- 2035 నాటికి పూర్తిగా ఎలక్ట్రిక్ కార్ల విక్రయాలే కంపెనీ లక్ష్యం
- భారత్‌లో లగ్జరీ కార్ల అమ్మకాలు భారీగా పెరుగుతున్నాయి
- మొత్తం కార్ల అమ్మకాల్లో ఇది ఒక శాతం మాత్రమే..
- అభివృద్ధి చెందిన దేశాల్లో ఇది 15 శాతం వరకు ఉంది
- ఒకసారి చార్జి చేస్తే 1000 కి.మీ. ప్రయాణించే ఎలక్ట్రిక్ కార్లు త్వరలో

సాక్షి, అమరావతి

స్థానిక సంప్రదాయాలు, కళలతో మమేకం అవడం ద్వారా భారతీయ మార్కెట్లో వేగంగా విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు జపాన్‌కు చెందిన లగ్జరీ కార్ల తయారీ సంస్థ లెక్సస్ ప్రకటించింది. ఇందుకోసం కారు కొనుగోలుదారులను అతిథులుగా గౌరవిస్తూ స్థానిక కళలకు ప్రాచుర్యం కల్పించే విధంగా విశాలమైన ప్రాంగణాలను మెరాకీ పేరుతో ఏర్పాటు చేస్తోంది. దేశంలో అయిదో లెక్సస్ మెరాకీని విజయవాడ సమీపంలో మంగళగిరి వద్ద ఏర్పాటు చేసింది. దేశీయ లగ్జరీ కార్ల మార్కెట్ వేగంగా విస్తరిస్తోందని, ఇప్పటి వరకు ఈ రంగంలో ఆధిపత్యం ఉన్న జర్మనీ బ్రాండ్‌లకు జపాన్ బ్రాండ్ గట్టి పోటీనివ్వనుందని లెక్సస్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ నవీన్ సోనీ తెలిపారు. ఈ సందర్భంగా 'సాక్షి'తో ఆయన మాటామంతీ...

అభివృద్ధి చెందిన దేశాలతో పోలిస్తే దేశీయంగా లగ్జరీ కార్ల అమ్మకాలు ఏ విధంగా ఉన్నాయి?

దేశవ్యాప్తంగా ఏటా జరుగుతున్న కార్ల అమ్మకాల్లో కేవలం ఒక శాతం మాత్రమే లగ్జరీ కార్లు ఉంటున్నాయి. ఏటా సుమారుగా 40 లక్షలకు పైగా కార్లు అమ్ముడవుతుంటే అన్ని లగ్జరీ బ్రాండ్‌లు కలిసి ఏటా 40,000 కార్లను విక్రయిస్తున్నాయి. అదే చైనాలో మొత్తం కార్ల అమ్మకాల్లో 15 నుంచి 16 శాతం, యూరప్‌లో 17 శాతం, అమెరికాలో 14 నుంచి 15 శాతం, జపాన్‌లో 3 నుంచి 5 శాతం అమ్మకాలు జరుగుతున్నాయి. దీని ప్రకారం చూస్తే వేగంగా అభివృద్ధి చెందుతున్న భారత్‌లో లగ్జరీ కార్ల అమ్మకాలు భారీగా పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం 3 ట్రిలియన్ డాలర్లుగా ఉన్న స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)ని 5 ట్రిలియన్ డాలర్లకు పెంచాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇది జరిగితే తలసరి ఆదాయం ప్రస్తుత స్థాయి నుంచి 6 రెట్లు పెరుగుతుంది. ఇదే దేశీయ లగ్జరీ కార్ల మార్కెట్‌ను శాసించే ప్రధానాంశం.

కోవిడ్ తర్వాత పడిపోయిన లగ్జరీ కార్ల అమ్మకాల పరిస్థితి ఇప్పుడు ఎలా ఉంది?

లాక్‌డౌన్‌కు ముందు ఏటా 40 నుంచి 42 వేల లగ్జరీ కార్లు అమ్ముడవుతుంటే అది కోవిడ్ సమయంలో 18,000 యూనిట్లకు పడిపోయింది. ఆ తర్వాత సాధారణ కార్ల అమ్మకాలు పెరిగినంత వేగంగా లగ్జరీ కార్ల అమ్మకాలు పెరగలేదు. 2021లో 26,000కు, 2022లో 36,000కు చేరిన లగ్జరీ కార్ల అమ్మకాలు ఈఏడాది 43,000 మార్కును దాటుతాయని అంచనా వేస్తున్నాం. ఇక ఇక్కడ నుంచి ఈ రంగం కూడా వేగంగా వృద్ధి చెందే అవకాశాలున్నాయి.

దేశీయ లగ్జరీ కార్ల మార్కెట్లోకి ఆలస్యంగా ప్రవేశించిన లెక్సస్ మార్కెట్ అమ్మకాలను పెంచుకోవడానికి ఎటువంటి ప్రణాళికలతో ముందుకు వెళుతోంది?

రెండేళ్ల క్రితం కేవలం 4 నగరాల్లో ఉన్న లెక్సస్‌కు ఇప్పుడు 19 నగరాల్లో 26 షోరూమ్‌లు ఉన్నాయి. అమ్మకాల సంఖ్యను చెప్పలేను కానీ, దేశీయ మార్కెట్లో లెక్సస్ వేగంగా విస్తరిస్తోందని మాత్రం చెప్పగలను. కేవలం కొనుగోలుదారులుగా కాకుండా వారిని అతిథులుగా గౌరవిస్తూ దానికి అనుగుణంగా కార్ల డిజైన్లను రూపొందించి విక్రయించనున్నాం. ఇందుకోసం వేగంగా విస్తరించడం కంటే వినియోగదారు, షోరూమ్ భాగస్వాములు ప్రయోజనం పొందే విధంగా అడుగులు వేస్తున్నాం. గతంలో హైదరాబాద్‌కు పరిమితమైన లెక్సస్ ఇప్పుడు విజయవాడలో అడుగుపెడుతోంది. రానున్న కాలంలో విశాఖ, నెల్లూరు వంటి నగరాలకు విస్తరణ అవకాశాలను పరిశీలిస్తాం.

వేగంగా విస్తరిస్తున్న ఎలక్ట్రిక్ కార్ల రంగంలో లెక్సస్ భవిష్యత్తు ప్రణాళికలేంటి?

ప్రస్తుతం హైబ్రీడ్ మోడల్స్‌లో ఎలక్ట్రిక్ కార్లను అందిస్తున్నాం. ఇప్పటికే సింగిల్ చార్జితో 1000 కి.మీ ప్రయాణించే విధంగా కాన్సెప్ట్ కారును విడుదల చేశాం. వాణిజ్యపరంగా ఈ కారును 2026 నాటికి విడుదల చేయనున్నాం. 2035 నాటికి లెక్సస్‌ను పూర్తి ఎలక్ట్రిక్ కార్ల బ్రాండ్‌గా మార్చాలని లక్ష్యంగా పెట్టుకున్నాం.

లాభాల్లోకి హెచ్‌పీసీఎల్

క్యూ2లో రూ. 5,827 కోట్లు



న్యూఢిల్లీ: ఇంధన రంగ ప్రభుత్వ దిగ్గజం హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్(హెచ్‌పీసీఎల్) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) రెండో త్రైమాసికంలో టర్న్‌అరౌండ్ ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జూలై-సెప్టెంబర్‌లో నష్టాలను వీడి రూ. 5,827 కోట్ల నికర లాభం ఆర్జించింది. గతేడాది(2022–23) ఇదే కాలంలో రూ. 2,476 కోట్ల నికర నష్టం ప్రకటించింది. తాజా సమీక్షా కాలంలో మార్కెటింగ్ మార్జిన్లు మెరుగుపడటంతో లాభదాయకత పుంజుకుంది. ముడిచమురు ధరలు క్షీణించినప్పటికీ పెట్రోల్, డీజిల్ ధరల సవరణను నిలిపివేయడం ఇందుకు సహకరించింది.

ఆదాయం డౌన్

ఈ ఏడాది క్యూ2లో హెచ్‌పీసీఎల్ మొత్తం ఆదాయం రూ. 1.13 లక్షల కోట్ల నుంచి రూ. 1.02 లక్షల కోట్లకు క్షీణించింది. క్యూ2లో ఇంధనాల ఉత్పత్తి 4.49 మిలియన్ టన్నుల నుంచి 5.75 ఎంటీకి బలపడింది. ఈ ఏడాది తొలి అర్ధభాగం(ఏప్రిల్-సెప్టెంబర్)లో ఒక్కో బ్యారల్‌పై స్థూల చమురు శుద్ధి మార్జిన్లు(జీఆర్ఎం) 10.49 డాలర్లుగా నమోదయ్యాయి. గతేడాది ఇదే కాలంలో 12.62 డాలర్ల చొప్పున జీఆర్ఎం సాధించింది.

ఫలితాల నేపథ్యంలో హెచ్‌పీసీఎల్ షేరు 1.6 శాతం బలపడి రూ. 262 వద్ద ముగిసింది.

భవిత

విద్య, ఉద్యోగ సమాచారం

సీఎస్ఐఆర్-యూజీసీ నెట్ డిసెంబర్-2023

సీఎస్ఐఆర్-యూజీసీ నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్(నెట్) డిసెంబర్–2023కు నోటిఫికేషన్ విడుదలైంది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) ఈ పరీక్షను నిర్వహించనుంది.

» **సబ్జెక్టులు:** పరీక్షను ఐదు సబ్జెక్టుల్లో నిర్వహిస్తారు. కెమికల్ సైన్సెస్, ఎర్త్, అట్మాస్ఫియరిక్, ఓషన్ అండ్ ప్లానెటరీ సైన్సెస్, లైఫ్ సైన్సెస్, మ్యాథమేటికల్ సైన్సెస్, ఫిజికల్ సైన్సెస్.

» **అర్హత:** కనీసం 55 శాతం మార్కులతో ఎమ్మెస్సీ తత్సమాన ఉత్తీర్ణులు/నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ బీఎస్ ఎంఎస్/బీఈ/బీటెక్/బీఫార్మసీ/ఎంబీబీఎస్ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఓబీసీ(ఎన్‌సీఎల్), ఎస్సీ, ఎస్టీ, థర్డ్‌జెండర్, దివ్యాంగ అభ్యర్థులు అర్హత పరీక్షలో కనీసం 50 శాతం మార్కులు పొందాలి.

» **వయసు:** జేఆర్ఎఫ్‌కు అర్హతకు సంబంధించి జనరల్ కేటగిరీ అభ్యర్థులకు 01.07.2023 నాటికి 28 ఏళ్లు మించకుండా ఉండాలి. రిజర్వేషన్ అభ్యర్థులకు వయో సడలింపు వర్తిస్తుంది.

» **పరీక్ష విధానం:** పరీక్ష 200 మార్కులకు నిర్వహిస్తారు. కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ విధానంలో పరీక్ష జరుగుతుంది. మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నల పద్ధతిలో పరీక్ష ఉంటుంది. పరీక్ష వ్యవధి మూడు గంటలు. ప్రశ్నపత్రంలో మొత్తం మూడు విభాగాలు ఉంటాయి.

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.

» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 30.11.2023

» **దరఖాస్తు సవరణ తేదీలు:** 02.12.2023 నుంచి 04.12.2023 వరకు.

» **పరీక్ష తేదీలు:** 26.12.2023, 27.12.2023, 28,12.2023.

» **వెబ్‌సైట్:** https://csirnet.nta.nic.in/ www.nta.ac.in

జేఈఈ(మెయిన్స్)-2024

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ).. జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్(జేఈఈ) మెయిన్–2024 నోటిఫికేషన్ విడుదల చేసింది. దేశవ్యాప్తంగా ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీల్లో బీటెక్ సీట్లను జేఈఈ మెయిన్ ర్యాంకుల ఆధారంగానే భర్తీ చేస్తారు. ఐఐటీల్లో చేరాలంటే జేఈఈ అడ్వాన్స్ రాయాలి. అందుకు జేఈఈ మెయిన్‌లో టాప్‌లో నిలిచిన 2.50 లక్షల మందికి మాత్రమే అడ్వాన్స్‌డ్ పరీక్ష రాసేందుకు అవకాశం లభిస్తుంది.

» **అర్హత:** అభ్యర్థులకు వయోపరిమితి నిబంధన లేదు. 2022, 2023లో 12వ తరగతి/తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణులైన అభ్యర్థులు లేదా 2024లో 12వ తరగతి పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు జేఈఈ(మెయిన్)–2024కు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటర్‌లో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 65 శాతం, మిగతా అభ్యర్థులకు 75 శాతం మార్కులు తప్పనిసరిగా రావాలని ఎన్‌టీఏ స్పష్టంచేసింది.

ముఖ్యమైన తేదీలు

సెషన్–1: జేఈఈ(మెయిన్)–జనవరి 2024.

» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 30.11.2023

» **పరీక్ష తేదీలు:** 2024 జనవరి నుంచి ఫిబ్రవరి 1 వరకు.

సెషన్–2: జేఈఈ(మెయిన్)–ఏప్రిల్ 2024

» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 02.02.2024

» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**02.03.2024

» **పరీక్ష తేదీలు:**2024 ఏప్రిల్ 1 నుంచి 14 వరకు

» **వెబ్‌సైట్:** https://jeemain.nta.ac.in

ఎన్ఎఫ్ఎల్, నోయిడాలో 74 మేనేజ్‌మెంట్ ట్రైనీ పోస్టులు

నోయిడాలోని నేషనల్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్(ఎన్ఎఫ్ఎల్).. దేశవ్యాప్తంగా ఉన్న వివిధ ఎన్ఎఫ్ఎల్ యూనిట్లు/కార్యాలయాల్లో మేనేజ్‌మెంట్ ట్రైనీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 74

» **పోస్టుల వివరాలు:** మేనేజ్‌మెంట్ ట్రైనీ(మార్కెటింగ్)–60, మేనేజ్‌మెంట్ ట్రైనీ(ఎఫ్–ఏ)–10, మేనేజ్‌మెంట్ ట్రైనీ(లా)–04.

» **అర్హత:** పోస్టును అనుసరించి ఎంఎస్సీ, ఎంబీఏ, పీజీడీబీఎం, పీజీడీఎం, సీఏ/ఐసీడబ్ల్యూఏ/సీఎంఏ, ఎల్ఎల్‌బీ, బీఎల్ ఉత్తీర్ణులై ఉండాలి.

» **వయసు:** 18 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి.

» **పే స్కేల్:** నెలకు రూ.40,000 నుంచి1,40,000.

» **ఎంపిక విధానం:** రాతపరీక్ష,ఇంటర్వ్యూ ఆధారంగా

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.

» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 01.12.2023

» **దరఖాస్తు సవరణ తేదీలు:** 03.12.2023, 04.112.2023

» **వెబ్‌సైట్:** www.nationalfertilizers.com

కొచ్చి మెట్రోలో అసిస్టెంట్ మేనేజర్(సేఫ్టీ) పోస్టులు

కొచ్చి(కేరళ)లోని కొచ్చి మెట్రోరైల్ లిమిటెడ్(కేఎంఆర్ఎల్).. ఒప్పంద ప్రాతిపదికన అసిస్టెంట్ మేనేజర్(సేఫ్టీ) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 01

» **అర్హత:** ఎంటెక్/ఎంఈ(ఫైర్ అండ్ సేఫ్టీ) లేదా బీఈ, బీటెక్ (సివిల్/మెకానిక్ /ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్), పీజీ డిప్లొమా ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.

వయసు: 35 ఏళ్లు మించకూడదు.

» **వేతనం:** నెలకు రూ.50,000 నుంచి 1,60,000

» **దరఖాస్తులకు చివరితేది:** 15.11.2023.

» **వెబ్‌సైట్:** www.kochimetro.org

నీట్‌కు తుది సన్నద్ధత

నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్-యూజీ... నీట్-యూజీ! ఎంబీబీఎస్, బీడీఎస్, ఆయుష్ తదితర వైద్య కోర్సుల్లో ప్రవేశాలకు ప్రామాణిక పరీక్ష! నీట్‌లో ఉత్తమ స్కోర్ సొంతం చేసుకుంటేనే మెడికల్ కోర్సుల్లో అడుగు పెట్టే అవకాశం లభిస్తుంది! ఇందుకోసం బైపీసీ విద్యార్థులు ఇంటర్‌లో చేరిన రోజు నుంచే ప్రిపరేషన్‌ప్రారంభిస్తారు. వీరంతా ఇప్పుడు తమ ప్రిపరేషన్‌ను మరింత పదును పెట్టుకోవాలి! కారణం.. నీట్ 2024కు పరీక్ష తేదీ ఖరారు కావడమే!!! ఈ నేపథ్యంలో.. నీట్-యూజీ-2024 పరీక్ష విధానం, బెస్ట్ ర్యాంకు సాధించేందుకు ప్రిపరేషన్ గైడెన్స్...

» 2024, మే 5న నీట్ పరీక్ష నిర్వహణ
» వైద్య కోర్సుల్లో ప్రవేశానికి మార్గం..నీట్
» ఎంబీబీఎస్, బీడీఎస్, ఆయుష్ కోర్సులకు ప్రామాణికం
» పక్కా ప్రిపరేషన్‌తో మెరుగైన స్కోర్ సాధించే అవకాశం



మెడికల్ కోర్సులను లక్ష్యంగా చేసుకుంటూ నీట్‌కు హాజరయ్యే విద్యార్థుల సంఖ్య ఏటేటా పెరుగుతోంది. నీట్–యూజీ– 2023కి దేశ వ్యాప్తంగా 20,38,596 మంది హాజరు కాగా.. నీట్–యూజీ–2022కి 13,66,945 మంది హాజరయ్యారు. తెలుగు రాష్ట్రాలకు సంబంధించి 2023లో ఏపీ నుంచి 68,578; తెలంగాణ నుంచి 72,842 మంది నీట్ రాసారు. అదే విధంగా 2022లో ఏపీ నుంచి 65,305 మంది; తెలంగాణ నుంచి 50,392 మంది విద్యార్థులు హాజరయ్యారు. అంటే..మొత్తం నీట్ అభ్యర్థుల్లో తెలుగు రాష్ట్రాల నుంచి ఏటా దాదాపు 1.3 లక్షల మంది పోటీ పడుతున్నారు. గత కొన్నేళ్లుగా దేశంలో మెడికల్ సీట్లు పెరుగుతుండటంతో 450 నుంచి 500 స్కోర్ వరకు సీట్లు లభిస్తున్నాయి.

అన్ని ఇన్‌స్టిట్యూట్స్‌కి నీట్ స్కోర్

దేశంలోని అన్ని మెడికల్ ఇన్‌స్టిట్యూట్స్‌లో ప్రవేశానికి నీట్–యూజీ స్కోర్‌నే ప్రామాణికం. ఆల్ ఇండియా కోటా పేరిట దేశంలోని అన్ని వైద్య కళాశాలల్లో 15 శాతం సీట్లను; రాష్ట్రాల స్థాయిలో హెల్త్ యూనివర్సిటీల పరిధిలోని సీట్లను; డీమ్డ్ యూనివర్సిటీలు, ప్రైవేట్ వర్సిటీలు.. ఇలా అన్ని కేటగిరీల యూనివర్సిటీలు, ఇన్‌స్టిట్యూట్స్‌లో ఎంబీబీఎస్, బీడీఎస్‌లో నీట్ స్కోర్ ఆధారంగానే అడ్మిషన్ కల్పిస్తున్నారు. అదే విధంగా ఆయుష్ కోర్సులుగా పిలిచే బీహెచ్ఎంఎస్, బీఏఎంఎస్, బీయూఎంఎస్, బీఎన్‌వైఎస్ తదితర కోర్సులకు కూడా నీట్ స్కోర్‌నే ప్రామాణికంగా తీసుకుంటారు.

నీట్ యూజీ స్వరూపం

నీట్–యూజీ పరీక్ష మొత్తం నాలుగు సబ్జెక్ట్‌లలో 720 మార్కులకు నిర్వహిస్తారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ.. ఇలా ప్రతి సబ్జెక్టు నుంచి 45 ప్రశ్నలు–180 మార్కులకు చొప్పున పరీక్ష జరుగుతుంది. ప్రతి సబ్జెక్టులో రెండు సెక్షన్లు (సెక్షన్ ఏ– 35 ప్రశ్నలు, సెక్షన్ బి–15 ప్రశ్నలు) ఉంటాయి. ప్రతి సబ్జెక్ట్‌లోనూ సెక్షన్–బిలోని 15 ప్రశ్నలకు గాను పది ప్రశ్నలకు సమాధానాలిస్తే సరిపోతుంది. అంటే.. సెక్షన్–బిలో ఛాయిస్ వెసులుబాటు ఉంది. ప్రశ్నలన్నీ ఆబ్జెక్టివ్ విధానంలో బహుళైచ్ఛిక ప్రశ్నలుగా ఉంటాయి. పరీక్షను పెన్–పేపర్ విధానంలో ఓఎంఆర్ షీట్ ఆధారంగా నిర్వహిస్తారు. ప్రతి ప్రశ్నకు నాలుగు మార్కులు కేటాయిస్తారు. అదే విధంగా ప్రతి తప్పు సమాధానానికి ఒక మార్కు నెగెటివ్ మార్కింగ్ నిబంధన ఉంటుంది. పరీక్షకు అందుబాటులో ఉండే సమయం మూడు గంటలు.

సమయం సద్వినియోగం

నీట్ నిర్వాహక సంస్థ ఎన్‌టీఏ.. గత రెండేళ్లుగా పరీక్ష తేదీని దాదాపు ఏడెనిమిది నెలల ముందే ప్రకటిస్తోంది. తాజాగా నీట్ యూజీ–2024 తేదీని కూడా ముందుగానే ప్రకటించింది. 2024, మే 5న నీట్ నిర్వహించనున్నట్లు వెల్లడించింది. అంటే.. విద్యార్థులకు ఆరు నెలలకుపైగా సమయం అందుబాటులో ఉంది. ఈ సమయాన్ని సద్వినియోగం చేసుకుని.. సబ్జెక్ట్‌ల వారీగా పటిష్ట ప్రణాళికతో ప్రిపరేషన్ సాగిస్తే మంచి స్కోర్ సాధించే అవకాశం ఉంది. మార్చి చివరి నాటికి ఇంటర్మీడియెట్ పరీక్షలు పూర్తవుతాయి. ఆ తర్వాత నీట్ పరీక్ష తేదీకి దాదాపు నెల రోజుల సమయం అందుబాటులో ఉంటుంది. ఈ సమయంలో పూర్తిగా నీట్ ప్రిపరేషన్, రివిజన్, మాక్ టెస్ట్‌లకు హాజరు ద్వారా మెరుగైన స్కోర్ సాధించే వీలుంటుంది.

ప్రతి సబ్జెక్ట్‌లో 130 మార్కులు లక్ష్యంగా

నీట్‌లో మెరుగైన స్కోర్ కోసం విద్యార్థులు.. ప్రతి సబ్జెక్ట్‌లోనూ 180 మార్కులకు గాను కనీసం 130 మార్కులు సాధించేలా సిలబస్ అంశాలను ఔపోసన పట్టాలి. అప్పుడే మంచి ర్యాంకు సొంతమవుతుంది. మొత్తంగా 720 మార్కులకు గాను 450 మార్కుల నుంచి 500 మార్కులు సాధించేలా కృషి చేస్తే.. మెడికల్ కోర్సుల కల నెరవేర్చుకోవచ్చు.

బోర్డ్ పరీక్షలతో సమన్వయం

ప్రస్తుత సమయంలో నీట్–యూజీకి సన్నద్ధమయ్యే విద్యార్థులు బోర్డ్ పరీక్షలతో సమన్వయం చేసుకోవాలి. బోర్డ్ పరీక్షలకు నెల రోజుల ముందు వరకు ఇంటర్, నీట్ సిలబస్‌లను కలిపి చదువుకోవాలి. బోర్డ్ పరీక్షలు పూర్తయిన తర్వాత.. నీట్ సిలబస్‌కు అనుగుణంగా ఆయా సబ్జెక్ట్‌లకు సమయం కేటాయించుకోవాలి. ఈ సమయంలో వీలైనంత మేరకు రివిజన్ చేయాలి. ప్రతి సబ్జెక్టుకూ సమానంగా సమయం కేటాయించుకోవాలి. ప్రతి రోజు చదవాల్సిన టాపిక్స్‌ను ముందుగానే విభజించుకుని.. దానికి అనుగుణంగా అధ్యయనం చేయాలి. ప్రతి రోజు మాక్ టెస్టులకు హాజరవ్వాలి. మోడల్ కొశ్చన్స్‌ను ప్రాక్టీస్ చేయాలి. డైరెక్ట్ కొశ్చన్స్ కంటే ఇన్ డైరెక్ట్ కొశ్చన్స్‌నే ఎక్కువ అడుగుతున్న విషయాన్ని గుర్తించాలి. దీనికి అనుగుణంగా మోడల్ టెస్ట్‌లను వీలైనంత ఎక్కువగా ప్రాక్టీస్ చేయాలి. ప్రిపరేషన్ సమయంలోనే షార్ట్ నోట్స్ రూపొందించుకోవాలి.దీని ద్వారా రివిజన్ సమయంలో సమయం ఆదా అవుతుంది.

నీట్-యూజీ-2024 ముఖ్య సమాచారం

- 2024, మే 5న నీట్ యూజీ పరీక్ష.
- 2024 ఫిబ్రవరి చివరి వారం లేదా మార్చి రెండో వారంలో నోటిఫికేషన్.
- పెన్–పేపర్ విధానంలో మూడు గంటల వ్యవధిలో 720 మార్కులకు పరీక్ష.
- నీట్‌లో స్కోర్ ఆధారంగా ఎంబీబీఎస్, బీడీఎస్, ఆయుష్ కోర్సుల సీట్ల భర్తీ.
- 450 – 500 స్కోర్‌తో మెడికల్ సీట్లు పొందే అవకాశం.

సబ్జెక్ట్ వారీగా దృష్టి పెట్టాల్సిన అంశాలు

నీట్ పరీక్ష తేదీ ఖరారైన నేపథ్యంలో.. సబ్జెక్ట్ వారీగా సన్నద్ధతకు, ఆయా సబ్జెక్ట్‌లలో దృష్టి పెట్టాల్సిన అంశాల వివరాలు..

ప్రాక్టీస్‌తో ఫిజిక్స్‌లో బెస్ట్ స్కోర్

నీట్‌లో కొంత క్లిష్టమైన సబ్జెక్టుగా భావించే ఫిజిక్స్‌లో విద్యార్థులు ప్రాక్టీస్‌కు ప్రాధాన్యమిస్తూ ప్రిపరేషన్ సాగించాలి. ఆప్టిక్స్, మెకానిక్స్, హీట్ అండ్ థర్మోడైనమిక్స్, ఎలక్ట్రానిక్ డివైజెస్, కరెంట్ ఎలక్ట్రిసిటీ, మోడరన్ ఫిజిక్స్ చాప్టర్లపై ప్రత్యేక దృష్టిపెట్టాలి. ఇంటర్ రెండేళ్ల పాఠ్యాంశాలకు సమాన ప్రాధాన్యం ఇవ్వాలి. రొటేషనల్ డైనమిక్స్, సిగ్మా పార్టికల్స్‌పై ఎక్కువగా దృష్టిపెట్టాలి. అదేవిధంగా ఎలక్ట్రోమ్యాగ్నటిజం, ఇండక్షన్, కరెంట్ ఎలక్ట్రిసిటీ వంటి చాప్టర్లను చదవడంతోపాటు ప్రాక్టీస్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని నిపుణులు సూచిస్తున్నారు.

కెమిస్ట్రీ.. కాన్సెప్ట్స్, రివిజన్

కెమిస్ట్రీలో రాణించేందుకు విద్యార్థులు ఆయా టాపిక్స్‌కు సంబంధించిన కాన్సెప్ట్‌లపై పూర్తి అవగాహన ఏర్పరచుకోవాలి. అదే విధంగా రివిజన్‌కు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి. ముఖ్యంగా జనరల్ ఆర్గానిక్ కెమిస్ట్రీ, మోల్ కాన్సెప్ట్, కెమికల్ బాండింగ్, ఎలక్ట్రో కెమిస్ట్రీ, కోఆర్డినేషన్ కాంపౌండ్, ఈక్విలిబ్రియమ్, పాలిమర్‌లు, బయో మాలిక్యూల్స్, పరమాణు నిర్మాణం, సాలిడ్ స్టేట్, ద్రావణాలు, సర్ఫేజ్ కెమిస్ట్రీ; ఆర్గానిక్ కెమిస్ట్రీలో ఐసోమెరిసమ్, సమ్మేళనాల తయారీలకు వెయిటేజీ కొంత ఎక్కువగా ఉంటుంది. కెమిస్ట్రీలో విద్యార్థులు చర్యలు, సమీకరణాలను మర్చిపోతుంటారు. దీంతో నిరంతరం పునఃశ్చరణ చేయాలి. ఇనార్గానిక్ కెమిస్ట్రీలో వివిధ మూలకాలు, వాటి సమ్మేళనాల ధర్మాలను అధ్యయనం చేయాలి. ఫిజికల్, ఆర్గానిక్, ఇనార్గానిక్ కెమిస్ట్రీలను వాటి వాటి స్వభావాల ఆధారంగా ప్రిపేరవ్వాలి. ఫిజికల్ కెమిస్ట్రీలో ఫార్ములాలతో సొంత నోట్స్ రూపొందించుకోవాలి. పీరియాడిక్ టేబుల్‌పై పట్టు సాధిస్తే..ఇనార్గానిక్ కెమిస్ట్రీలో మంచి స్కోర్‌కు ఆస్కారం ఉంటుంది.

బోటనీకి ఇలా

నీట్‌లో కీలకంగా భావించే బోటనీలో బెస్ట్ స్కోర్ కోసం విద్యార్థులు కాన్సెప్ట్‌లపై పట్టు సాధించాలి. ఫిజియాలజీ ఆఫ్ ప్లాంట్స్ అండ్ యానిమల్స్, మార్ఫాలజీ, జెనిటిక్స్ అండ్ ఎవల్యూషన్,సెల్ బయాలజీ, బయోటెక్నాలజీ, హ్యూమన్ ఫిజియాలజీ, డైవర్సిటీ ఆఫ్ లివింగ్ ఆర్గానిజమ్‌లను ముఖ్య చాప్టర్లుగా భావించి చదవాలి. ఎకాలజీలో ఆర్గనైజేషన్స్ అండ్ పాపులేషన్, ఎకోసిస్టమ్‌పై ప్రశ్నలు వస్తున్నాయి. వీటితోపాటు బయోడైవర్సిటీ, ఎన్విరాన్‌మెంట్ ఇష్యూస్‌పై ఫోకస్ చేయడం లాభిస్తుంది. ప్లాంట్ ఫిజియాలజీలో ప్లాంట్ గ్రోత్ అండ్ డెవలప్‌మెంట్, మొక్కల హార్మోనులు, ట్రాన్స్‌పోర్ట్ ఇన్ ప్లాంట్స్, మినరల్ న్యూట్రిషన్ చాప్టర్లను ప్రిపేరవ్వాలి. సెల్ స్ట్రక్చర్స్ అండ్ ఫంక్షన్స్‌లో కణ విభజన(సమ విభజన,క్షయకరణ విభజన)లోని వివిధ దశల్లో జరిగే మార్పులు,కణచక్రం తదితరాలను అధ్యయనం చేయాలి.బయోమాలిక్యూల్స్ నుంచి కంటెంట్ సంబంధిత ప్రశ్నలు వస్తాయి. రీప్రొడక్షన్ నుంచి దాదాపు 10 ప్రశ్నల వరకు అడుగుతున్నారు. మాలిక్యులర్ బేసిస్ ఆఫ్ ఇన్‌హెరిటన్స్‌లో రెప్లికేషన్, ట్రాన్స్‌క్రిప్షన్,ట్రాన్స్‌లేషన్, రెగ్యులేషన్‌లపై దృష్టిపెట్టాలి.

జువాలజీ.. ఈ అంశాలు

జువాలజీ సబ్జెక్ట్‌లో రాణించేందుకు విద్యార్థులు హ్యూమన్ ఫిజియాలజీ, ఎకాలజీ, జెనిటిక్స్, ఎవల్యూషన్ టాపిక్స్‌పై ప్రత్యేక దృష్టిపెట్టాలి.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.


SAMSUNG
Epic starts here
Galaxy S23
Galaxy S23 FE
Nightography camera for epic shots
Powerful gaming processor with Ray Tracing
Data privacy with Knox Vault
Own at ₹ 2036 per month*
Samsung Upgrade
Additional upgrade bonus**
Samsung Finance+
HDFC BANK
BAJAJ FINSERV
samsung.com
Please dispose of e-waste and plastic waste responsibly. Customers can Whatsapp on 1800 5 7267864 for information on e-waste/plastic pick up.
Image simulated for representational purposes, actual may vary. Color as per availability. *EMI amount ₹ 2036 per month is computed on zero down payment, 30 months low cost EMI on the price of ₹ 59999 for 1 unit of Galaxy S23 FE 8GB|128GB. EMI provided by Bank/NBFCs and financers listed on Samsung Finance+ at their sole discretion and may vary model wise. Final price at dealer discretion. **Upgrade bonus provided by brand/dealer at its sole discretion upon exchange of select smartphones. Offer may be revised or withdrawn without prior notice. All third party logos/marks shown are registered/owned/licensed logos/ marks of respective brand owners.
Scan to buy now